


ప్రేమలేఖ

చిత్రలేఖకుడు :
ఎస్. ఎస్. కుమారస్వామిగారు.

[illegible]
[illegible]

భారతి.
ఆగస్టు - 1939 -

సంపుటము - 16
సంచిక - 8



౧౬. సంపుటం. ప్రమాది, శ్రావణమాసము (1939) ఆగస్టు సంఖ్య. ౮

ప్రాణప్రతిష్ఠ

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౧

ఏరు స్వదేశమందు జనయిత్రిని జూచిరో యేరు మృన్మయా
కారమునందుఁ జిత్కళిక గాంచిరొ యెవ్వరు రాలలో విరాట్
పూరుషుఁ జూపిరో యెవరు ముందటివారల కగ్రదూతలో
వారి వెలుంగుముందు తల వాలిచి పోదము ముందుముందుకున్.

౨

ఏరు తెలుంగునాడు వెలయించిరొ యెవ్వరు దాని యెల్లలన్
దూరముగా సుదూరముగఁ దోడ్కొనిపోయిరొ యెవ్వ రందు క
వ్వారిగఁ బోర నిల్వఁబడి ప్రాణము రక్తము ధారపోసిరో
వారి పదాలముందు తల వాలిచి పోదము ముందుముందుకున్.

౩

ఆర్యుల్ సూపిన త్రోవఁ బట్టి యెవ రిష్టయ్యాంధ్ర రాష్ట్రోద్యమా
చార్యత్వంబు వహించిరో యెవరు తత్సంగ్రామరంగస్థలిన్
హార్యక్షంబులుగా నటల్ దులిపిరో యవ్వారి పాదాలకుం
బర్యాప్తంబుగ మ్రొక్కిపోవుదము పైపైకి స్మరిం పై కినిన్.

౪

మనపూర్వుల్ బహుబాహుబుద్ధిబలసంపత్కాంపితారాతులై
కని స్వాతంత్ర్యము నోడ్ల కిచ్చిన మహాకల్యాణకాముల్ గదా
మన మారీతి వినీతిచాతురిని సంపాదించి స్వాతంత్ర్య ల
క్ష్మిని నెవ్వారికిఁ బంచిపెట్టవలదా? చెప్పండు తెల్గుంబ్రజల్.

౫

ఓ పురాతనశిల్పి! యీయున్న యమ్మ
తొల్లిరూ పెల్ల వ్రాసి మా కెల్లి యిమ్మ
నిష్ఠ గైకొని ప్రాణప్రతిష్ఠఁ జేయ
వలసియున్నటువంటి సువ్రతము కలదు.

౬

ఓ యధునాతనశిల్పీ!
యీయున్న తెలుంగుటమ్మ యిప్పటిరూపున్
వ్రాయుము దిగ్దేశంబుల
నాయమపట్టాభిషేక మని విన లేదో!

గౌరన కవిత్వము

శ్రీ వెంపటి శ్రీనివాసమూర్తి

కావ్యమునకు శ్లేషాదిభాషాచమత్కారములు గాని, వివిధ ఛందోబంధవిచిత్రములు గాని రమణీయత్వము నాపాదింపజాలవు. కావ్యమునకు ప్రధానమైనది రసమని మహాకవులందరును గుర్తించియున్నారు. రసము లేకున్న తక్కిన యలంకారము లెన్నియున్నను నీరసములై బొమ్మకు సొమ్ములు పెట్టినట్లుండగలవు. 'కిమివ హి మధురాణాం మణ్డనం నాకృతీనాం' అను కాళిదాసకవి సూక్తిననుసరించి గౌరన వ్యర్థమైన శబ్దాడంబరములపొంత బోక సులభమైన ద్విపదవృత్తమును గైకొని, దానిలోనే నిజశేముషీవిశేష మంతయు వెల్లడించినాడు.

గౌరన నవనాథచరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము, లక్షణదీపిక యను మూడు కావ్యములను రచించెను. ఇందు లక్షణదీపిక సంస్కృతము. తక్కిన రెంటియందు నవనాథచరిత్ర హరిశ్చంద్రోపాఖ్యానమునకు దీసిపోవుచున్నది. గౌరన కవితాప్రాగల్భ్యము హరిశ్చంద్రోపాఖ్యానములో సంపూర్ణముగా వికసించినది. వీనిలో నేది ముందు రచింపబడినదో స్పష్టముగా దెలియకున్నను కవిత్వమునుబట్టి నవనాథచరిత్ర ప్రథమమున రచింపబడినదని చెప్పవచ్చును.

గౌరన హరిశ్చంద్రకావ్యాదిని తన కవిత్వమును గురించి యిట్లు చెప్పికొనినాడు:

'వెలయు హరిశ్చంద్రవిభు పుణ్యచరిత
కవితాచమత్కృతి గాంచి హర్షించి
కవు లందఱును శిరః కంపంబు సేయఁ
ఒనరించి వీనుల పండువుగాగ
రచియింతు... ' (౧భా. ౩౦–౩౪)

'కవు లందఱును శిరఃకంపంబు సేయు' నట్లుగా రచింతునని ప్రతిజ్ఞచేసి, అవిధముగానే నిర్వహించుకొనినాడు. ఇతని కవిత్వము నాతికఠినమై పండితపామరులకు సువేద్యముగా నున్నది. మృదుమధురమైనశైలి. కవనము కదళీపాకము. భాష యందు సంస్కృతాంధ్రపదములు సరిసమానముగా నున్నవి. కొన్ని అచ్చతెనుగుపదములు మనవ్యవహారములో లేనందున త్వరగా నర్థము గాకపోవచ్చును. కాని అట్టిపదముల సంఖ్య చాల తక్కువ. సాధారణముగా తెనుగునందు మారుమూలపదముగాని సంస్కృతమునందు నిఘంటువు చూచి తెలియగలశబ్దముగాని కనుపడదు. ఒక్కొక్కచోట నితడు సంస్కృతాంధ్రపదములను కుప్పలు కుప్పలుగా కుమ్మరించినాడు. తెలుగు పదములకూర్పున కుదాహరణము చూడుడు:

'నెఱరంగు నీలాల నెలకట్టుమీద
గితికొన గాజు నిగిడ్చి పై నిల్పి
కలయంగ బట్టించి కాటుకరొంపి
వలికినగతి నొప్పె నంధకారంబు
నంతకంతకు దట్టమై చెట్టుగుట్ట

గుంత మీ జ్ఞానచుఁ గన్గొనరాక యపుడు
మున్ను తెప్పలు డాయ మూసిన మగుడ
గన్నులు విప్ప నొక్కటిగాఁగ నుండె...'

హరి. (౧భా. ౨౦౩౧-౩౭)

సంస్కృతపదము లిం దెంత మనోహర ముగా నేర్చికూర్చినాడో చూడుడు:

'భూసుతంబగు మత్తపోవనంబువను
మందార మంజరీ మంజుమరంద
నంద దిందిందిర నందనారామ
కమనీయ వికసిత కనకారవింద
కమలినీతటలతాగారలతాంత
రచిత శయ్యాతల రతిరయగళిత
కచభర సురపుర గణికాకపోల
కలిత ఘర్మోదక కణగణ మిళిత
మలయసమీర కోమల కంపితాగ్ర
మహిత చిత్రధ్వజమాలానవాగ్ర
సహిత చింతామణీ సౌధపాళికల...'

(౧భా. ౧౨౬౧-౬౦)

ఇతని కావ్యమంతయు నొకటే వృత్తమైనను, నీతని రచనాప్రభావమున నెచ్చటను విసుగు జనింపదు. ఇతని కిట్టి శక్తి యుండుట చేతనే తోడికవులవలె అన్యవృత్త శరణ్యమును బొందుటకాని, కేవలాలంకార మాత్రములగు శబ్దవైచిత్ర్యముల నుపయోగించుటగాని జరుగలేదు. ఒక్కచోట మాత్రము ముక్తపదగ్రస్తము వాడినాడు. కాశికావీధులందు హరిశ్చంద్రుడు భార్యతో నేగుచుండ చంద్రమతిని పౌరులు వర్ణించు సందర్భమున—

'సుందరి గాదిది సొబగురాయంచ
యంచ గాదిది నడపొరు క్రొమ్మించు
మించు గాదిది రాచమెచ్చుల ప్రతిమ
ప్రతిమ గాదిది పచ్చి పగడంబులతిక...'

(౨భా. ౩౫౯-౬౫)

పాత్రపోషణ :

సద్భావోన్మీలనము నందు గౌరన యారితేరిన చేయి. ఒకవ్యక్తిని వర్ణించునప్పుడా రూపము కన్నులకు పొడగట్టిన ట్లుండును. ఉన్నతమైన భావములు నిగూఢముగా నుండక స్పష్టముగా నుండును. శృంగారరసస్థలములందైనను ప్రబంధకవుల వలెనసభ్యవర్ణనలు చేసి సహృదయులమనస్సు నొప్పించడు. తిక్కనవలె నితడు కథలోని పాత్రలవర్ణనమును తక్కినవారిచే జేయించెను. లోహితుడు చంద్రమతితో కాలకౌశికు ననుసరించునప్పు డతనిని జూచి పుణ్యభామినులనుమాట లెంత హృద్యములుగా నున్నవో చూడుడు:

'వెన్నముద్దకు రూపు పెట్టినమాడ్కి
నన్నమెత్తని మేను నొప్పెడివాడు
రొన్నడు వెండి గన్నులుగని శిసువు
కన్నుల ముత్యాలు గారఁ జేడ్చెడిని
నే చెల్లనోయమ్మ యీ చక్కనన్న
రాజతేజముగల రత్నాలపెట్టె
నడవ నెట్లోర్చునే వాముద్దులొలుక
కడుపు జుఱుక్కనుఁ గన్నవారికిని...'

(౨భా. ౯౨౨-౯౨౯)

'వెన్నముద్దకు రూపువెట్టుట', 'కన్నుల ముత్యాలు గారఁ నేడ్చుట' నేటి భావకవుల కును మార్గదర్శకములు. ఈపంక్తులు చదివినంతనే ప్రతిమానవహృదయమును ద్రవించకమానదు. అట్టియెడ ప్రత్యక్షముగ లోహితుని జూచిన సహజకోమలులగు కామినులకు 'కడుపు చురుక్కన్న' దనిన నాశ్చర్య మేమున్నది! గౌరనకు బాలురపై నెక్కువ మక్కువ యున్నట్లున్నది. కావ్యమునందు లోహితు డెక్కడ వచ్చినను నతని శిశుక్రీడల నత్యంత సహజముగా వర్ణించినాడు. చంద్ర

మతి దావాగ్ని కాహుతి గాబోవునపుడు లోహితాస్యుడు వెంబడించుట చూడుడు:

'అమ్మమ్మ నీ విభు డగ్నిలో నుఱుక
సమ్మదం బొదవంగఁ జనియెదవేని
వత్తు నేనును నన్ను వదలక తిగిచి
యెత్తికొ మ్మనుచుఁ జెల్లెసగు దైన్యమునఁ
గిరుకుచుఁ జిన్ని కెంగేల నైకొంచు
గదియించి బుడి బుడి కన్నీరు దెచ్చి
మోహ మేర్పడఁ బదంబుల మోము రాచు
లోహితాస్యునిఁ జూచి లోలోన పొక్కి
యక్కున గదియించి యూదల నిమిరి
చెక్కిలి నొక్కి యూదిన్నారి బొజ్జ
బుడికి చక్కిలిగింత పుచ్చి కన్నీరు
దుడిచి ముద్దుల ముంచు దువ్వి యూరార్చుచు'

(౧ భా. ౨౨౩౬-౪౮)

అమాయకుడైన లోహితుడు తానును వచ్చెదనని మారాము చేయుటయు, తల్లి బుజ్జగించుటయు నిందు ముఖ్యాంశములు. ఇంతకంటె సహజముగా నేయిల్లాలును పుత్రుల బుజ్జగింపజాలదు. తల నిమురుట, చక్కిలిగింతపెట్టి కన్నీరుదుడుచుట సాధారణ దృశ్యములు. ఆధునికనారీమణు లెవరైన పిల్లల బుజ్జగించుట నెఱుగకపోయినయెడల గౌరనవద్ద పాఠము నేర్చుకొనవచ్చును.

హరిశ్చంద్రోపాఖ్యానమున ముఖ్యతమమైన పాత్ర హరిశ్చంద్రుడు. వీరరసప్రధానమైన ఈకావ్యమం దీతని ధర్మవీరత్వము చక్కగా బ్రకటింపబడినది. ఇతని శీలము వసిష్ఠుడు కొలదిమాటలలో వాక్రుచ్చినాడు.

'తను వెల్ల సత్యంబు తల పెల్లఁ గరుణ
పను లెల్ల ధర్మంబు పలు కెల్లఁ బ్రియము
బొంకు నాలుకకు జేర్పుట కానివాని...'

(౧ భా. ౨౩౩-౩౫)

ఇతడు రాజ్యమొనరించుకాలమున చౌర్యమనుమాట వినబడలేదు. చంద్రమతి నమ్మునందర్భమున కాలకౌశికుడు రాజు చంద్రమతి నపహరించి తెచ్చెనని బెదరించును. అప్పుడు రా జిట్లనెను:

'ఏ రాజ్య మొనరించు నీకాలమునకు
చోర శబ్దము వినిపోక నీచేత'

దీనివలన నితని రాజ్యపరిపాలనాదక్షత తెలియుటయేగాక రాజునకు ఆత్మస్తుతి దోషమంటలేదు. ఇట్లు రాజునోట చెప్పించుటలో గౌరనప్రతిభ వ్యక్తమగుచున్నది.

చంద్రమతి పాత్రపోషణ రాజునకు వన్నెతెచ్చినది. సత్యవాక్యపరిపాలనమందీమె చేదోడు వాదోడుగా సంచరించినది. విశ్వామిత్రునకు రాజ్యప్రదానము చేయునప్పుడును, భార్యను వధింపబోవునపుడును రాజు వెనుకముం దాడుచుండ చంద్రమతి ధైర్యము చెప్పి కార్యనిర్వహణమునందు రాజును ముందంజవేయించినది. ఈమె యిట్టి సతీమతల్లి కావుననే రాజ్యము పరహస్తంగతమైన నాడైన దుఃఖింపని రాజు చంద్రమతి నమ్మవలసివచ్చినప్పుడు 'జలజాక్షీ! నేడు నాసామ్రాజ్యలక్ష్మి తొలగిపోయినరీతి దోచుచున్న'దని దుఃఖించినాడు. పతిని బాయునప్పుడుకూడ 'మఱవకు నీ సత్యమహిమం' బని బోధించినది. గయ్యాళిగంపవైన కలహకంఠికి నీతి బోధించి చీవాట్లను తిన్నది. కాలకౌశికునింట నూడిగము చేయునప్పుడీమె 'రాహుముఖమున బడి కాంతి దప్పి జలదరించెడు బాలశశిరేఖబోలె' నున్నది. తుదకు వధ్యశిలపై నెక్కినప్పుడును 'చిఱునవ్వు సెలవిఁదళ్కొత్తుచు'నే యున్నది. ఆత్మ

ప్రాణేశ్వరుని చేతిలో మృతిబొందుచున్నానను సంతోషమేగాని ఆవంతయైన చింత లేదు. ఈమె పాతివ్రత్యమహిమచేత దనతపశ్శక్తి తిరస్కృతమగుట జూచి విశ్వామిత్రుడు 'వెరపింపఁబోయి తా వెరచినయట్టి తెరగైన' దని సిగ్గుపడినాడు. ఈ కావ్యమునందు చంద్రమతి పాత్రపోషణ సమగ్రముగను సర్వాంగసుందరముగను నున్నది.

హాస్యరసము :

కాలకౌశిక కలహాకంఠి పాత్రలచేత గౌరన కాలమునాటి సాంఘిక పరిస్థితులు మనకు దెలియవచ్చుటయేగాక గౌరనకు హాస్యరసముపైగల ప్రేమయు వ్యక్తమగుచున్నది. ఒక్కొక్కరికి అప్పు లిచ్చి ఎట్లు రాబట్టుకొనవలసినదియు, తా నప్పుదీసికొని ఎగ్గొట్ట వేయఁవలసినదియు కాలకౌశికుడు విపులముగా వర్ణించెను. ప్రపంచములోనున్న వికారమంతయు నితనిలో గౌరన మూర్తీభవింపజేసినాడు. కాలకౌశికుని యాకార మెట్లున్నదో పరికింపుడు:

'అడిగిన ధాన్యంబు లవి వేలువేలు
ముడిచిన బట్టలు మూపుపై వ్రేలఁ
దోలు నస్థులఁ జిక్కి తూగాడు మేనఁ
పేలు రాలెడుసిగ పెపతలఁ గణితి
పిల్లికన్నులఁ గుఱుచీయ మీసములు
మల్లిగడ్డంబు నత్యుగ్రదృష్టియును...'

(౨ భా. ౪౯౩-౫౦౨)

ఇప్పటి కప్పుడే కాలకౌశికుని యాకృతి మనమనఃఫలకమునందు జిత్రితమై కడుపులో వికారము గల్గించుచున్నది. ఇక నాల్గు పంక్తులు వ్రాసినచో వాంతిచేసికొనుట తప్పదు. ఇతడు దూరమున నుండగనే పురజనులు 'అదె వచ్చె నడపీనుగ'ని తొలగిపోవుదురు. రాజు 'అతని జన్నిదముల గనుగొని విప్రుడు గాబోలు' ననుకొనినాడు. నక్షత్రకుడు లంచముదీసికొని తనపక్షము తీర్పుజెప్పి నప్పుడు 'చెవటిగోతికి వీర్లశివమెత్తినట్లు' గంతులు వేసినాడు. ఇతడు చంద్రమతితో నిల్లు చేరగనే ఒక 'ఎండిపోయిన వాలహీన వానరు'డగుశిష్యు డెదురుగావచ్చి తుమ్మెను. ఇంటిలోనికి పోయినంతనే కలహాకంఠి భర్తను 'కుక్క లోబడ బట్టి కొట్టినరీతి' కొట్టుచు వారింపవచ్చిన చంద్రమతిని స్వీయపరాక్రమ కథనముచే నిట్లు బెదరించినది:

'నన్నెఱుంగరుగాక, నాపేరు తెలియ
విన్నవ్యాఖ్యవు నైన బరవేకిపన్నఁ
గడలి చోకలి నైకొన్నవలనఁ
గదలుదు రీవాడ గరిత లందరును
నా పాపె గాంచిన నగరంబు వడకు'

(౨ భా. ౧౧౯౧-౯౫)

ఈమె బుజ్జిముక్కు లొట్టపోయిన కన్నుతోనున్నను తన సౌందర్యమునుగూర్చి 'బాపురే యనుకొన బనిలేదుగాక, రూపింప నాకంటె రూపసి గలదె' యనిన ప్రగల్భ వాక్యములు హాస్యరసమును గురిపించుచున్నవి. శంకరకవి మొదలగు తరువాతి కవులు హాస్యరసమును జిత్రింపలేక ఈఘట్టమును కొలదిగామాత్రమే పట్టిచూచి, శిష్యుని వృత్తాంతము పూర్తిగా వదిలిపెట్టిరి.

శైలి:

గౌరనశైలియం దొకవిశేషము గలదు. ఇత డుపయోగించు పదజాలము భావానుగుణ్యమైయుండి కేవలము శబ్దధ్వనులచేతనే ఆయాభావములను స్ఫురింపజేయుచుండును. ఈ విషయమున నితడు తిక్కన ననుసరించి

నాడు. కొన్నిపట్టులనుండి యుదాహరణములను జూపెదను. రాజు చంద్రమతిని దెగవ్రేయ నుంకించునప్పుడు ఖడ్గమున దీయు పద్ధతి:

'చండ మార్తాండ దుస్సహ దుర్నిరీక్ష
మండల ప్రభలతో మార్కొని మండు
మెఱుగు లుగ్రంబుగా మిన్నుల జర్వ
నొరవాయఁ జెరిచె మహోగ్రత బూని'
(౨ భా. ౨౫౨౦-౨౩)

ఇందులో మొదట నుపయోగించిన బిందుపూర్వక డకారము కత్తియొక్క తీక్ష్ణత్వమును, తరువాతి రేఫము కర్మయొక్క క్రూరత్వమును దెలియజేయుచున్నవి. ఇంకొకచోట విశ్వామిత్రుని కోప మెట్లు ప్రత్యక్షమగుచున్నదో చూడుడు.

ముఱముఱ మని బొమల్ ముడిపాటు గదురఁ
జుఱచుఱ నిప్పు లక్షుల జప్పరిల్ల
చిటచిట చెమట పైఁ బొడమ నాసికయుఁ
బుటపుట గటములుఁ బొరి బొరి వదర...'
(౧ భా. ౧౦౫౫-౫౭.)

ఇందు మొదట నుపయోగించిన శకట రేఫము కోపమును, తరువాతి 'ట'కార ము ద్వేగరభసములను దెలియజేయుచున్నవి.

గౌరన కవిత్వమం దింకొకవింత గలదు. ఎవనైన నొకనికి వెక్కిరించు పేరొకటి చెప్ప వలసివచ్చిన నాంధ్రభాషలో నున్న నామము లన్నిటిని నేకరువుపెట్టును. కాలకౌశిక, కలహకంఠీవర్ణనలలో నీ విషయము జూడ వచ్చును. వీరబాహుడు హరిశ్చంద్రుడు పని చేయలేడని చెప్పుసందర్భమున—

'ఒక విచారము మాకు నొదవె నీరాజు
సుకవాసి పనిపంద చూపుగుజ్జుంబు
మామిడిక్రింద సోమరి పేదకుండు
భూమి కంటకి యెనుపోతుపై వాన
మొండికి చల్ల చప్పకు గోడచేర్పు
చండి పోతమవట్టి జాడ మన్నాడు.'
(౨ భా. ౧౪౯౩-౯౭)

ఇందలి మాట లన్నియు కొంచె మించుమించుగా నొకేయర్థము గలవైనను నివి అర్థబాహుళ్యమునకుగాక కేవలము కావ్యాలంకారముకొరకే యుపయోగింపబడినవి. ఈ విషయమునం దితనికి నరకములోని రాక్షసులపే ర్లన్నియు నేకరువుపెట్టు ఆంగ్ల కవి సార్వభౌముడగు (Paradise Lost) మిల్టనుతో బోలికగలదు.

గౌరనకవిత్వమందు ప్రత్యక్షత (Realism) ఎక్కువగా నున్నది. అతిశయోక్త్యలంకారములకు దావులేదు. స్వభావోక్తి ఎక్కువ. ఉన్నవాటినే సమృద్ధిగా వర్ణించుటచేత ఉదాత్తాలంకారప్రసక్తి గలదు. స్మశానమును వర్ణించునప్పు డచ్చటి భయంకరస్థితి మనకు గోచరించును. కాలకౌశికుడు పెంగ వేయుపద్ధతులను జెప్పునప్పుడు ప్రస్తుతము జరుగుచుండు మోసములు వెంటనే స్ఫురించ గలవు. కలహకంఠి కలహావృత్తి చూచినంతనే మనవీధిలోని గయ్యాళిగంప జ్ఞప్తికివచ్చును. లోహితునికై తల్లి యేడ్చుట చదివినప్పుడు పుత్రవియోగినియైన యువతి వలవల నేడ్వకమానదు. ఈ ప్రత్యక్షతను గౌరన భావద్యోతకములైన శబ్దములచేతను, చక్కని ఉపమాలంకారములచేతను ఇనుమడించినాడు. ఇతని యుపమ కీ యుదాహరణములను పరిశీలింపుడు:

'అనిన విశ్వామిత్రు డంబుదధ్వనికి
గనలి సింహము మాఱు గర్జించినట్లు'
'బలు రాహు ముఖమున బడి కాంతి దప్పి

జలదరించెడు బాల శశిరేఖవోలె
'మెఱుగు ముత్యంబుల గ్రమ్ము మీనమ్ము
లఱుగక వెస గ్రక్కవట్టి చందమున
బలుమాఱు గ్రమ్మెడి బాష్పబిందువులు'

ఈ యుపమానము లెంత ముచ్చటగా నున్నవి. రెండవది కాలకౌశికునింట ఊడిగము చేయుచున్న చంద్రమతిస్థితిని సూచించునది (ఈ యుపమానమునున్న అసంగతమును కవితావేశములో గౌరన గుర్తింపలేదు. గ్రహణము పూర్ణచంద్రునకేగాని బాలచంద్రునకు సంభవింపదు). మూడవది చంద్రమతి యేడ్పుపద్ధతి: ఆమెకంటినుండి బాష్పములు దొరగుట మీనములు ముత్యములను గ్రక్కినట్లున్నదట! ఇందు ముత్యబాష్పసాదృశ్యము మాత్రమేగాక మీననేత్రసామ్యమును, సామాన్య సౌకుమార్యత్వమును వ్యక్తమగుచున్నవి. ఈ యుపమానములలోని భావౌన్నత్యమును గ్రహింపవలెనేగాని వ్రాయుట కలవిగాదు.

జాతీయోక్తుల నుపయోగించుటయందు గౌరన మొనగాడు. మన యిండ్లయందు వాడుకొను జాతీయము లావిధముననే కావ్యమునందు వాడినాడు, చూడుడు:

'ఉడుగక ముక్కున నుండు కోపంబు'
'పరగంగ చిలుకకు బలె బుద్ధి శెప్పి'
'ఎన్నడు నెండగ న్నెఱుగని శిశువు'
'వాపోవునే పిల్లి వడి చిన్నకోడి'
'గాలంపు దప్పినయట్టి కోతిచందమున'

జాతియోక్తులందు గౌరన వ్యావహారిక భాషనే వాడినాడు కాని పరిష్కర్తలు గ్రాంథికీకరణమొనర్చి ముద్రింపించినారు. వారిదృష్టిదోషము పొందనివి కొన్ని వ్యావహారికమునందే యున్నవి.

'కట్టిన దోకబట్ట కప్పింది తోలు'
'కడగి పీనుగమీదఁ గంచంబు వెట్టి
కుడువగా జూచెఁ గకూర్తిగా డితడు'

సమయస్ఫూర్తిగా అర్థమతుకునట్లు వ్యవహారమందున్న లోకోక్తుల నుపయోగించుట గౌరనకు వెన్నతో బెట్టినవిద్య. మచ్చునకు రెండు దాహరణములను మాత్రము పరికింపుడు:

* 'లెక్కింప నపకీర్తి లేనిజీవనము
నిక్కంబుగా నొక్కనిమిషంబె చాలు'
'పల్లెత్తి యెలుకల బట్ట నోపినను
పిల్లి శౌర్యమె మంటిపిల్లికే చాలు'
'ఆకలి ఘనమైన నదరి సింహంబు
మేకల జొరివున్నె మెసవునే...'

హరిశ్చంద్రోపాఖ్యానము జాతీయోక్తులకును, లోకోక్తులకును బెట్టనిపుట్ట. వ్యాసవిస్తరభీతిచే కొద్దియుదాహరణములను మాత్రము వ్రాసినాను. ఇతడు 'బరాబరి' 'జోహారు' మొదలగు అన్యదేశ్యపదములను గూడ వాడెను.

కావ్యమునందు గౌరన తిక్కనకవిత్వమును మార్గదర్శకముగా నిడుకొనినాడు. పద్యప్రయోగమునందును, నాటకోచితరచనలందును గౌరన తిక్కన యడుగులకు మడుగు లొత్తినాడు. ఒకచోట అస్తమయవర్ణనము చేయునపుడు తిక్కనభావము నల్లే యనుసరించినాడు. భారతమునందు—

క. పెనుమిఱ్ఱిది పల్లం బిది
యనఁ బొడగ నోలమును బయలు నొక్కటిగా
గనుబిచ్చుటయును మాడ్చుట
యును సరిగా దమము పర్వె సర్వం దిక్కో.
(విరాట. ౨ ఆ. ౩౭)

హరిశ్చంద్రోపాఖ్యానమందు—

అంతకంతకు దట్టమై చెట్టు గుట్ట
గుంలే మిట్టముచుఁ గన్గొనరాక యప్పుడు
మున్న కెప్పలు డాయమూసిన మనసెఁ
గన్నులు విప్ప నొక్కటిగాగ నుండె.

(౧ భా. ౨౦౩౫-౩౭)

గౌరనమంత్రి తరువాత హరిశ్చంద్రుని కథను రచించినవారిలో నితని ననుకరింపని వారు లేరు. శంకరకవి, శరభకవి, రామ రాజభూషణుడు, మల్లారెడ్డికవులు గౌరన ద్విపదను ముందుంచుకొని, కొన్నిచోట్ల నభివృద్ధి గావించుచు స్వీయపద్యకావ్యము లను రచించిన ట్లీ పోలికలవలన స్పష్టముగా దెలియగలదు. ఇంద్రసభలో వసిష్ఠు నెదిరించి విశ్వామిత్రుడు మాట్లాడిన సందర్భమున—

గౌరన:

అక్కజంబుగ నబ్ధి నాపోశనముగ
గ్రుక్కకొన్నట్టి యా కుంభజు డుండఁ
బన్నగధరున కొర్వడ నలికాలఁ
గన్న జూపినయట్టి గౌతము డుండ...
దృష్టించి బ్రహ్మాది దేవత లెఱుగ
సృష్టికిఁ బ్రతిసృష్టి జేసినయట్టి
యే నుండఁ దక్కిన యీ మును లుండఁ
బూని నీ వెంతయు, బ్రోడయపోలె
వాకఁతోడ మున్నాడి పల్కితివి...

(౧ఆ. ౨౦౮-౨౧౭)

శంకరకవి:

ఎవ్వాడు వింధ్యాచలేంద్రంబుగర్వంబు
సర్వంబు నడచె నిర్జరులు మెచ్చ
నెవ్వాడు హైమవతీశుతో నెదిరించి
గర్వించి యఱకాలఁ గన్న జూపె...
... ...
అట్టికుంభజ గౌతమ వ్యాస భృగువు
లుండ బ్రహ్మర్షివించిఁ యఖండగరిమ
దనరు నే నుండ వెంకిరియుఁ దక్కనట్టి
యిమ్మునీశ్వరు లుండ నీకేల పెనగ. (౧ఆ. ౧౫౩)
... ...

రామరాజభూషణుడు:

తఱలక యబ్జారిధరుని పైఁ బాదంబు
సంఘటించిన ద్విజస్వామి యుండ
... ...
నర్మవిలసితసృష్టిచే నలినభవు కె
నకిన యే నుండఁ దా నొక్కనరునిఁ బ్రపద
బుద్ధి నెట్లు సత్యస్వరూపు డని యెన్న
టని యొదవ కౌద్రగతి దీపితాత్ము డగుచు.

(హరి. నలో. ౧ఆ. ౨౬)

బలిజేపల్లి లక్ష్మీకాంతముగారి నాటకములో:

బడబానలముతోడఁ బాథోధు లొక్కగ్రు
క్కన గొన్న ఘను డీ యగస్త్యకన్న
... ...
సృష్టికిం బ్రతిసృష్టిజేసి నీతలదన్ని
బ్రహ్మర్షవించి సుప్రథితుడైన
ఈ కుశికనందనుని కన్న నెందు నీవు
పెద్దవో ముందు జెప్పు మీ పద్దులేల
వేల్పు పేరోలగమున మై విఱిచికొనుచు
పద్దులాడఁగనే నీవు పెద్దవైతె. (ప్ర. అం.)

పురాణములలో నొకదాని కొకటి సంబంధములేక చిందరవందరగానున్న కథను గ్రహించి గౌరన రసవంతమైన కావ్యమును సృష్టించెను. ఇతని రచనచేతనే హరిశ్చంద్రుని కథకు ప్రాముఖ్యముగలిగి పలువు రాంధ్రకవుల నాకర్షించినది. ఆంధ్రవాఙ్మయమందు గౌరనకుగల అసాధారణ స్థానమును అతని కవితాశేముషిని రసపిపాసువులు గ్రహింతురని నమ్ముచు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి వాక్యములతో వ్యాసము ముగించుచున్నాను.

"హరిశ్చంద్ర ద్విపదలోఁ బూర్వ ప్రబంధరచనా సంప్రదాయములు పాటింపఁ

బడకున్నను, అందలి రచనాశక్తి, సంభా నొక ప్రౌఢప్రబంధముగఁ జేయుటయే కాక, వర్ణనాశైలి, స్వభావోన్మీలనశక్తి, జాతీయ గౌరవనామాత్యునికిఁ గల 'సరస సాహిత్య ప్రయోగనైపుణి, రసావిష్కరణదృష్టి, లక్షణవిచక్షణుఁ'డను బిరుదును సార్థకము భావౌచిత్య పోషణము మొదలగునవి దీని చేయుచున్నవి" (నవనాథ చరిత్రము-పీఠిక).

వే డి కో లు

శ్రీ ఊటుకూరు ఆంజనేయ శర్మ

వెన్నెలపూలలో చిటిలి పేరెము వారు పరాగసంతతుల్
కన్నులు గప్పె చీకటులు గ్రమ్ముకొనెన్ వెరవేదిలిన్ కృపా
స్కన్నము నీ కనుంగవ చకచ్చకితద్యుతు లీన, వానిచా
యన్ నవరత్న హేమమయ మా మహనీయపథంబుఁ గాంచెదన్.

ఇదె సుఖవాసనాలహరు లీమెడలన్ నినదించుచున్న వ
ల్లదిగో పురాత్త దుఃఖములు హైన్యమునన్ విడి వ్రేలు చున్న వీ
యదనున నీదునార్ద్రకర మల్లన నూత యొసంగుమా మహో
పదవి గమించెదన్ ప్రమదవార్నిధి జేరెద మున్కలాడెదన్.

హృదయము వేయిరేకులును నెప్పుడొ విచ్చుకొనెన్ మనంబునన్
ప్రిదిలిన కోర్కెతో వెరుగువెట్టుట మానిన దింక నీ కృపా
స్పదము సరాగమున్ దరహసచ్ఛతపత్రసుశోభితంబు లై
గదరెడి కన్నుదోయి నవకంపు నిగారములన్ వెలార్చుతన్.

ప్రిదిలిన నవ్వులన్ తఱపివెన్నెలపుల్గు లదెట్లు గొన్నవో
పదిలముగాగ దాచుకొనె వన్నెలు గ్రక్కెడి వెండిరెక్కలం
దిదె కనుసైగసేయుము చెలీ! కనుమూసిన యంతలోనె కేల్
గదుపుచు వ్రాలి నీ పెదవులన్ చిఱుపోతల గ్రుమ్మరించెదన్.

పున్నమనాటి వెన్నెలల పొంగులలో వడదేరు మీగడల్
చన్నదినాల దుఃఖపుతెఱల్ తెగఁగోసి యనన్యమోద సం
పన్నతఁ గూర్చె దుఃఖములపాటిక దేవు డెఱుంగు నీదు క
న్సన్నలలో మదీయ సుఖసంతతు లుయ్యెల లూగుచుండెడిన్.

సాహిత్యజిజ్ఞాస

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ఆధునికాంధ్రసాహిత్యం గురించి గర్వంగా చెప్పుకునేటందు కేమీ లేకుండా ఉన్నమాట చాలామంది ఒప్పుకుంటారు; కాని ఈదుస్థితిని చాలామంది స్పష్టంగా అర్థం చేసుకున్నట్టు కనిపించదు. అర్థం చేసుకోక చవుకబారు సాహిత్యం రాస్తున్నందుకు రచయితలనూ, ప్రకటిస్తున్నందులకు పత్రికాధిపతులనూ, పైకి వస్తున్నందుకు సాహిత్యాన్నీ తెగనాడుతారు.

నాకేం తోస్తుందంటే, మన సాహిత్యం కంటెకూడా సాహిత్యంగురించి మన అభిప్రాయాలు చాలా తప్పుడుతోవలో ఉన్నై. మనకు సరిఅయిన సాహిత్యజిజ్ఞాస లేదు.

సాహిత్యమూ, దానివల్ల ప్రయోజనమూ, దానికి మానవజీవనంలో ఉండదగిన స్థానమూ మొదలైనవాటినిగురించి కొద్దిగా చర్చించి ఆవెనక నా అభిప్రాయాలు చెబుతాను.

దేన్నిగురించి మాట్లాడేటప్పుడు అదే సర్వోత్కృష్టమైన దనే అభిప్రాయం ప్రకటించటం మనకు సంప్రదాయసిద్ధంగా వస్తున్నది. ప్రకృతయుగంలో ఈ దురభ్యాసంవల్ల ప్రయోజనం కించిత్తుకూడా లేదు. బుద్ధిమంతుడు దేనికికూడా సర్వోత్కృష్టత ఆపాదించడు.

మానవజీవితంలో అనేకవిషయాలకు అనేకరకాల ప్రాముఖ్యత ఉన్నది. అటువంటివాటిల్లో సాహిత్యం ఒకటి. సాహిత్యస్పర్శ ఎరగని జీవితం పరిపూర్ణం కాదని అంటే అనవచ్చును. కాని జీవితానికి సాహిత్యం ఒకటి ఉంటే మరేమీ అక్కర్లేదని చెప్పటానికి బుద్ధిమంతుడు పూనుకోడు.

సాహిత్యానికి పరిమితమైన ప్రాముఖ్యత ఉందని గుర్తించినమీదట, దానివల్ల సాధించదగిన ప్రయోజనం ఏమిటో తేల్చుకుని, ఆతరవాత సాహిత్యానికి జీవితంలో ఎంత అగ్రస్థానం ఇవ్వవచ్చునో తెలుసుకోవటం అట్టే కష్టం కాదు.

సాహిత్యంకోసం జీవితాలు అర్పించినవారూ, పుస్తకాలకోసం తిండి మానుకున్నవారూ లేరని కాదు. కాని వారి ప్రవర్తనలనుబట్టి సాహిత్యంయొక్క విలవ నిర్ణయించటం పొరపాటు. ఇతరులకు సాధనాలుగా ఉండేవాటిని కొందరు పరమార్థాలుగా భావించటం ఎప్పుడూ ఉంది. ఒకదాన్ని పరమార్థంగా భావించిన తరవాత దానికోసం మనం ఎంత త్యాగమైనా చేస్తాం. స్వేచ్ఛ ఒకసాధనం; దానికోసం తమ స్వేచ్ఛను శాశ్వతంగా కోల్పోయినవారున్నారు. వారిని ఆదర్శంగా పెట్టుకుని మానవజాతి యావత్తూ స్వేచ్ఛను కోల్పోవటంకంటె హాస్యాస్పదమైన సంగతి మరొకటి ఉండదు.

సాహిత్యం చతుర్విధఫలప్రాప్తి నిస్తుందన్నారు. కాదు, సాహిత్యం లోకసంగ్రహం

చేస్తుం దన్నారు. ఇటువంటిమాటలను అనటంగాని, విశ్వసించటంగాని అమిత సులభమైన విషయం; ఏమంటే వాటిని అనేవారు కాని వినేవారుకాని ఏమాత్రమూ మెదడు ఉపయోగించ నవసరం లేదు. ఒక ఉదాహరణ ఇమ్మంటే కాని, భవభూతి "ఉత్తరరామ చరిత్ర" వల్ల కలగగల లోకసంగ్రహం ఏమిటని అడిగినప్పుడు కాని వస్తుంది చిక్కు! గొప్పవిషయాలనుగురించి గంభీరంగా మాట్లాడటానికి విశేషం మెదడు అవసరం లేదనేమాట ఎవరూ మరచిపోకూడదు.

మరికొందరు సాహిత్యం ఒక స్త్రీమాదిరిగా, ఒక మధుర పదార్థమల్లే, ఒక సువాసనలాగా, ఒక ప్రత్యేకమైన ఆనందం ఇచ్చి మనస్సుకు ఉత్తేజనం కలిగిస్తుం దన్నారు. అట్లా అయినట్టయితే ఒక చక్కని స్త్రీకీ, తియ్యని పండుకూ, కమ్మని వాసనకూ ఎంత ప్రాముఖ్యత ఇస్తామో సాహిత్యానికి అంతకంటె ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వవలసిన అగత్యం కనిపించదు.

సాహిత్యం ఉపదేశిస్తుంది; మత, ధర్మ, నీతి విషయికమైన ప్రబోధం కలిగిస్తుం దన్నారు కొందరు. అటువంటి సాహిత్యం అతిపరిమితంగా మాత్రమే ఉండగలదు. రామాయణం రాయటంలో వాల్మీకి ఉద్దేశం రెండు మూడు నీతులు చెప్పటమే అయినట్టయితే వాల్మీకికన్న మూర్ఖు డుండబోడు. నాలుగు నీతిశ్లోకాలు చాటువులుమోస్తరుగా రాసి పారవేసేదాని కింత చాటభారతం రాయటమెందుకూ?

రహస్య మేమంటే సాహిత్యానికి ఇటువంటి ప్రయోజనాలు ఆపాదించేవారు ముందూ వెనక చూసుకుని మాట్లాడరు; తమమాటలలోనించి ఏయేఅర్థాలు వచ్చేదీ ఆలోచించరు.

మనవాళ్లు చేసే మరొక పొరపా టేమంటే ఈనాడు సాహిత్యంవల్ల ఏమిప్రయోజనం ఉందో నిర్ధారణ చెయ్యటానికి ప్రాచీన సారస్వతాలు తణిఖీ చేస్తారు. ఈనాటి జీవితంయొక్క మూలసూత్రాలు అర్థం అయితేకాని ఈనాడు సాహిత్యంవల్ల మనకెటువంటి ప్రయోజనం ఉండదగినదీ బోధపడదు. అవి తెలుసుకునేటంత ఓపిక మనకు లేదు.

మరొకవిషయం. సాహిత్యంవల్ల ప్రయోజనం ఇదీ అని మనం ఒక నిర్ణయానికి వచ్చినప్పుడు ఆప్రయోజనం మరొకదానివల్ల సాధ్య మయేదిగా ఉండరాదు. ఒక కథయొక్క ప్రయోజనం ఒక గంటసేపు కాలక్షేపం జరగటమే ననేటట్టయితే అందుకు గుర్రపుపందాలూ, టెన్నిస్ పందాలూ, సినిమాలూ, హరికథలూ మొదలైనవి ఎన్ని లేవు? అందుకుగాను సృష్టిఅయే సాహిత్యంలో ప్రత్యేకత ఎట్లా ఉంటుంది?

సాహిత్యం దేనికో తేల్చుకునేలోపల, సాహిత్యం దేనికి కాదో తేల్చుకోవటం మంచిది.

సాహిత్యంద్వారా మతాన్ని, ధర్మాన్ని ప్రచారం చెయ్యటం నిరర్థకం; ఏమంటే ఇప్పటికాలపు జీవితానికి అవి మూలసూత్రాలు కావు. క్రిమినల్ సివిల్ ప్రొసీజరు కోడ్స్‌కు సాహిత్యం ప్రచారం ఇవ్వటం కూడా నిరర్థకమే. నీతి, సత్ప్రవర్తనా, వీటిని గురించి సాహిత్యం ప్రచారం చెయ్యటంలో

అర్థం లేకపోలేదు, కాని ఆ ప్రచారం సఫల మవుతుం దనేది చాలా అనుమానాస్పద మైనవిషయం. వేశ్యాజాతికి ప్రతికూలంగా ప్రచారం ఇవ్వటానికి ఉద్దేశించబడిన చింతామణీనాటకం కుర్రకారుకు వేశ్యలయందు అభిరుచి పుట్టించినట్టు కనిపిస్తుంది. ఏ సాహిత్యంలోకాని మానవుల ప్రవర్తనను మార్చిన నైతిక గ్రంథం ఒకటికూడా ఉండనుకోను. ప్రవర్తన లోపలి సంస్కారాన్ని బట్టి ఉంటుంది. ఆ సంస్కారాన్ని కలిగించటానికి వట్టి నీతిప్రచారం చాలదు. విజ్ఞానాన్ని పెంపొందించటం కూడా సాహిత్యం పని కాదు. దానికోసం వ్యక్తి ప్రత్యేకించి కృషి చెయ్యాలి. సాహిత్యం ద్వారా విజ్ఞానం పెంపొందించటం అసాధ్యం కానప్పటికీ, అట్లా పెంపొందే విజ్ఞానం చెప్పుకోదగినంతగా ఉండదు. సాహిత్యం మన అనుభవాన్ని వృద్ధి చెయ్యటానికి కూడా విశేషం పాటు పడలేదు. మనం స్వయంగా తెలుసుకోలేని విషయాలు పుస్తకాలద్వారా తెలుసుకోవటంలో కొంత ప్రయోజనం లేదు. కాని నిజమైన అనుభవానికి సాహిత్యం ప్రత్యామ్నాయం కాదు—కాలేదు. ఎన్ని ప్రణయ కథలు చదివితే ప్రేమించటం ఏమిటో తెలుస్తుంది ?

కాని ఒకటిమాత్రం ఒప్పుకోవాలి. ఈ పైన చెప్పిన ఆశయాలతో కూడుకున్న రచనలకు సారస్వతంలో స్థానం లేకపోలేదు. ఇప్పటి పాశ్చాత్య సాహిత్యంలో విజ్ఞాన గ్రంథాలూ, రాజకీయ గ్రంథాలూ, వివిధ దేశాలూ వాటి తాలూకు జాతులూ, వారి ఆచారాలూ మొదలైనవి చిత్రించే గ్రంథాలూ వెలువడుతూ ఉన్నై. అయితే, సాహిత్యానికి జీవితంలో ఉన్న ఉత్కృష్ట స్థానాన్ని నిర్ణయించే పుస్తకాలు ఇవి కావు.

నా అభిప్రాయంలో సాహిత్యంయొక్క ఉత్కృష్టాశయం మన అనుభవాన్ని మానసికంగా జీర్ణింపచేసి అరుగుదలకు తీసుకు రావటం.

ఆహారంతో శరీరం దార్ఢ్యం పొందినట్టు అనుభవంమీద మనసు దార్ఢ్యం పొందుతుంది. మనం పొందే అనుభవ మంతా మనం జీర్ణించుకుంటున్నామని చెప్పలేం. అనుభవసారం గ్రహించేటందుకు మామూలు తెలివితేటలు చాలవు. ఒక్కొక్కరకమైన అనుభవం అర్థం చేసుకునేటందుకు ఒక్కొకవిధమైన విజ్ఞానమూ, బుద్ధిసూక్ష్మతా అవసరం. ఇవి అందరికీ అందుబాటులో ఉండవు. అవి ఉన్నవాడు జీవితాన్నీ వ్యక్తులనూ సామాన్యమానవులు చూసినట్టుకాక విశేషమైన దృష్టితో చూడగలుగుతాడు. ఒకచిన్న ఉదాహరణ: మామూలు మనిషి వ్యక్తులలో గాని విషయాలలోగాని మంచో చెడో చూడగలుగుతాడు. కాని సామాన్యసాహిత్యమే అతనికి మంచిలో చెడూ, చెడులో మంచీ చూపిస్తుంది. ఈధోరణిలో నడిచే సాహిత్యం మానవుడికి తననుగురించీ, తన మనస్తత్వాన్ని గురించీ సూక్ష్మమైన జ్ఞానం కలిగించటమే కాక ప్రతి పరిణామానికి మూల కారణం ఏమిటో తెలుసుకునేటట్టు చేస్తుంది.

పైన చెప్పిన విషయాలు ప్రత్యేకించి గద్యరచనకే వర్తించుత వనుకో నవసరం లేదు. కవిత్వంకూడా అటువంటిదే. జీవితంలో జరిగే అనేక సంఘటనలకు మన హృదయాలు చైతన్యం పొందవు. ముఖ్యం

గా సూక్ష్మమైన, నాజూకైన చైతన్యం పొం
దట మనేది చాలామందికి అనుభవంలో
ఉండదు. అది కవి మనకు సాధించి పెడ
తాడు. అయోమయంగా ఉన్న కీకారణ్యం
లో కథకుడు దారులూ వాటి కలయికలూ
చూపిస్తే, కవి అందులో సౌందర్యమూ
అంతరంగులూ చూపిస్తాడు.

సాహిత్యంతో పరిచయం ఉన్నవాడికి
జీవితం అర్థ మయినట్టుగా, నిరక్షరుడికి
అర్థం చేసుకునే అవకాశాలు లేవు. సరి
అయిన కవిత్వంతో పరిచయం ఉన్నవాడికి
జీవితం ఇచ్చే సూక్ష్మానుభవం కవిత్వం చెవికి
ఎట్టనివాడికి కలగదు.

చారిత్రక కారణాలవల్ల ఈనాడు దాదాపు
మానవజాతి కంతటికీ ఒకేవిధమైన జీవిత
సూత్రాలు ఏర్పడినై. ఒకప్పు డుండినట్టుగా
ఈనాడు భాషలనుబట్టి సాహిత్యాలు వేరు
వేరుమార్గాల పోవలసిన ఆవశ్యకత లేదు.
సాహిత్యస్వరూపం ప్రపంచమంతటా ఒక
తీగా పరిణమించుచున్నది. గడిచిన పాతిక
సంవత్సరాలకాలంలోనూ తెలుగుసాహిత్యం
పాత సంప్రదాయాలను అతిక్రమించి ఏవిధం
గా పాశ్చాత్యపద్ధతులు అవలంబించినదీ
అందరికీ తెలుసు.

ఈ మార్పు రుచించనివారు కొందరు
ఆంధ్రసాహిత్యం అధోగతిపా లయిపోతున్న
దని గోలపెడుతున్నారు. కాని వారికి భావనా
శక్తి చాలటంలేదు. రచయితలు పాశ్చాత్య
పద్ధతులు మరిగి ఈ మార్పు తెచ్చారని
గోలపెడతారు. ఆ ముక్క నమ్మదగినట్టు
గానే వుంది. కాని పాతికసంవత్సరాల కంటె
ఈ నాడు ప్రచురణా పత్రికలు కొని చదవట
ము ఎన్నో ఇంతలయిందే, దాని కేమనాలి?
ఈ మార్పు కలిగిన తరవాత సాహిత్యానికి
ప్రజాసామాన్యం నుంచి ఎంతో ప్రోత్సాహం
వచ్చింది. ఆప్రజాసామాన్యంలో పాశ్చాత్య
పద్ధతులమీద వ్యామోహం కలవారు నూటి
కొకరు లేరు.

అంతమాత్రానికే ప్రజాసామాన్యం
యొక్క అభిరుచిని సమర్థించు తున్నాననీ,
ఇప్పటి సాహిత్యాన్ని విచక్షణ లేకుండా
ఆకాశాని కెత్తుతున్నాననీ అనుకోవద్దు.
కావ్యశిల్పంజోలి నే నిక్కడ ఎత్తటమే లేదు,
సాహిత్యం యొక్క పోకడను గురించిమాత్ర
మే చర్చిస్తున్నాను. అతి తెలివిగా కథ రాస్తే
చదివేవారూ, అర్థం చేసుకునేవారూ లేరు.
రచన ఇంకా చాలామటుకు చౌకబారుగా
ఉన్నది. ప్రజల అభిరుచికూడా దానిమీదికే
పోతున్నది. కాని ప్రస్తుతంలో సాహిత్యం
తొక్కుతున్న మార్గం సరి అయినదంటాను.
ఇది ఖండకావ్యాల యుగం. చిన్న కథల
యుగం. పాండిత్యం పరమార్థం కావటం మా
నుకున్నది. వెనకటిపద్ధతిలో కావ్యాలు ఎంత
సులభంగా రాసినా చదివేవా రుండరు.
ఎంత తప్పడుగా నైనా సరే మనస్తత్వం
చిత్రించితే చదివి ఆనందిస్తారు. తమ
రామాయణంలోనించి పద్యాలు చదువుతూ
శ్రీ విశ్వనాథసత్యనారాయణగారు విపులంగా
వ్యాఖ్యానంచేస్తూ అలంకారాలు విశదపరు
స్తూంటే ఆపఠనాన్ని ప్రేక్షకులు ఏవిధంగా
స్వీకరించిందీ నేను స్వయంగా చూశాను.
శ్రీరంగం శ్రీనివాసరావుగారూ శ్రీ
దేవులపల్లి కృష్ణశాస్త్రిగారూ ఏ వ్యాఖ్యా
నమూ లేకుండా పద్యాలు చదువుతుంటే

శ్రోతలు వింటూ ఎట్లా కంగారు పడ్డదీ — అదీ స్వయంగా చూశాను.

ఇప్పటి సాహిత్యం తాలూకు రచనల లోనించి కొన్ని ఏరి ఇవి మంచివి అని కాని చెడ్డవి అని కాని చెప్పటానికి ఇంకా ఏవిధమయిన ఆధారమూ ఏర్పడలేదు. దానికి కారణం సరిఅయిన సాహిత్యాశయం ఏమిటో మనం ఉమ్మడిగాగాని ఎవరికివారుగాగాని తేల్చుకోలేక పోవటమే— అంటే మనలో ఇంకా సాహిత్యజిజ్ఞాస తలయెత్తక పోవటమే.

ఆజిజ్ఞాస ప్రారంభమయేవరకూ మనకు సరిఅయిన సాహిత్యం ఏర్పడదు. కొన్ని మంచి రచనలు ఎప్పుడూ ఉంటై. ఎన్ని మంచి రచనలు కలిసికూడా ఒక సాహిత్యం కాకపోవచ్చును—ఆరచనలు ఒక సూత్రంలోనికి రానప్పుడు. మనకు సాహిత్యజిజ్ఞాస ఏర్పడ్డమీదట వచ్చే రచనలు అరడజను చేత పుచ్చుకుని "ఇది మా ఆధునిక సాహిత్యం!" అని చెప్పటానికి గరిష్టాం.

ఏకాదశి

శ్రీ జయంతి సీతారామశర్మ

[ఏకాదశి పదకొండేళ్ల పిల్ల. విశిష్టమైన బుద్ధి కుశలత లేకపోయినా ప్రాయానికి మించిన వ్యుత్పన్నత. గౌరవం తెలిసిన అమ్మాయి. మంచి అందం. అందానికి తగిన పోషణ. చాలా ఆనందం కలిగించే పిల్ల ఏకాదశి.

ఏకాదశికి వలపంటే కూడా తెలుసు. తనచేష్టలచేత భావాలచేత సంతోషం కలుగ చెయ్యడం ఏకాదశి వలపుకు ఆదర్శం. ఈక్రింద వ్రాసింది 'ఏకాదశి సౌందర్యం' అనేఘట్టంలో కొంత]

మినుకు మినుకూ చుక్క
నిలిచి చూసింది
నల్లచీరా రేయి
నవ్వి చూసింది
అప్పుడప్పుడు తెమ్మెరలు
ఆగిచూశాయి
పున్నమ్మి చంద్రుడు
సిగ్గెత్తిపోయి
మబ్బులో దాంకోని
కృష్ణలో దాగి
మరల మరలా మరల
తొంగి చూశాడు
మా ఏకాదశి సౌందర్యం.

మనువు పొరుగున
నిద్రపొయ్యే
తేనెపలుకుల
కీరశాబిక
నిద్రలోనే
పాటపాడింది
ఏకదేహపు
హేమరుచులకు
కృతిని వ్రాసింది.

ఏకాదశి చిరునవ్విది
లోకాలకు నెలవంక
ఏకాదశి చిరుముద్దిది
నెలవంకకు తలవంపు.

ఏకాదశి అందంలో
ఏకాదశి భావంలో
ప్రకృతి దహనంచేసిన
కళాకేళిక ఒకటుంది.

తావు తోడవులు
గాలి కిచ్చిన
నగ్న సుందరి
పారిజాతం
నేల వ్రాలీ
మోకరించింది
ఏకసౌందర్యాన్ని
పసిడిపూలతో
పూజచేసింది.

కవిత్రయమువారఖండయతిని పాటించినారు

శ్రీ గిడుగు వేంకటసీతాపతి

శ్రీవావిళ్లవారు ప్రకటించిన అప్పకవీయ విమర్శనము మా తండ్రిగారైన శ్రీరావుసాహెబు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారిదే అయినా దానికి ఉపోద్ఘాతముగా వ్రాసినదానిలో చెప్పినట్లు పీఠిక నేనే వ్రాసినాను గనుకను, ఛందోవిషయముల గూర్చి వ్రాసినదంతా కేవలము నా విమర్శనమే కనుకను, భారతి ౧౬-వ సంవత్సరం ౭-వ సంచికలో శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చేసిన ఆక్షేపమునకు నేనే సమాధాన మీయవలసి యున్నది. "సీ. సీలజీమూతంబు లీల నాక్షేపించి నల్లనై తోతెంచు నల్లగృహము" అనే సీసపద్యము సర్వత్ర ప్రాసయతినియమముగల పద్యమే కనుక ఇందులో అఖండవడి కలదా లేదా అనే తగవులాటకు అవకాశము లేదు. పాఠముల ప్రాశస్త్యములోని తారతమ్యము లెట్లున్నా ఇక్కడ ప్రాసయతి తప్పదు గనుక "...నల్లగృహము" అనే పాఠమే గ్రహించవలసియున్నది. గనుక ఇక్కడ నే నఖండవడి యున్నదని తలచుట కేవలము పొరపాటు. నన్నయరచించిన సీసపద్యములు ౨౫౧ న్నీ ఎటువంటి యతి ప్రాసయతినియమములతో ఉన్నవో విమర్శించి ౧౯౩౯ సం॥ అక్టోబరు నెల సంచిక ౨-"తెలుగు"పత్రికలో "నన్నయభట్టు సీసపద్యభేదములు" అన్న వ్యాసము రచించినవాడను నేనే. అందులో ఈ సీసపద్యము (VI-౨౧౧) సీసముల ప్రస్తారములో ౮-వ జాతి పద్యముగా, అనగా సర్వత్ర ప్రాసయతి నియమముగల పద్యముగా కనబరచినాను. ఈ నన్నయనియమములు మా తండ్రిగారెఱుగకపోలేదు. ఏవిమర్శనుండి శాస్త్రిగారు పైనిచెప్పిన విషయము ఎత్తుకొని విమర్శించినారో ఆ విమర్శలోనే నన్నయసీసభేదముల గురించి వ్రాసినభాగ మున్నది (చూ. పుటలు l, li, lii). ఈ నియమముల విషయము తెలిసియుండీన్ని పైపద్యము సర్వత్రప్రాసయతినియమముగల పద్యముగా గుర్తించియుండీన్ని అందులో అఖండవడిగలదని పొరపాటున వ్రాసినందుకు నాకు చాలా విచారముగానే యున్నది.

కాని, ఈ పద్యములో కాకపోయినా తక్కినపద్యాలలో అఖండవడి గలదని వ్రాసిన విషయము లిమ విమర్శకు విషయమే అయినా, శాస్త్రిగారు దానిని ఎత్తుకోక విడిచిపెట్టినారు. ఎందుచేతనో తెలియదు. కవిత్రయమువారి గ్రంథములలో ఒకొక్కరిగ్రంథమం దొకొక్క పద్యము చొప్పున మూడు పద్యములు మాత్రము ఎత్తుకొని "భారతములోని యఖండయతి పాఠము లెల్ల జాలవఱకు మనపరిష్కర్తలు సంస్కరించినవే యనియు, సఖండయతి

రహితపాఠములే ప్రాచీనపాఠములు కాఁదగి యున్నవనియు మనవి చేయుచున్నాను" అని శాస్త్రిగారు వ్రాయుట సబబుకాదు.

"తెలుగు" పత్రికలో (చూ. ౧౯-౨౦ సంచికలు ౯-౧౦) నేను రచించి ప్రకటించిన "అఖండవడి" వ్యాసమందు కవిత్రయమువారున్ను తరువాతి మహాకవులున్ను అఖండవడి పాటించినవారే అని నిరూపించియున్నాను. ఆ వ్యాసమందలి విషయములను అప్పకవీయ విమర్శనములో సైతము సంగ్రహించినాను (చూ. పుటలు (xlii-xlvi). ఆ విమర్శనము శాస్త్రిగారే పూర్తిగా చదివినట్లు కనబడదు గనుకను, చదవనివారు చాలామంది ఉండవచ్చును గనుకను ప్రస్తుత విషయమునకు సంబంధించిన వాక్యములు నావ్యాసమునుండి ఎత్తి వ్రాస్తున్నాను.

భారతంలో అఖండ వళ్లు లేవని కొందరి అభిప్రాయము గాని, లేకపోలేదు. అచ్చుపడ్డప్రతులలో చూస్తే కనబడవుగాని తాళపత్రప్రతులలో ఉన్నవి. భారతం వ్రాతప్రతులలో ఉన్న అఖండవళ్లు:—

1. కొడుకుం త్రిలోకవిజయుం
బడయుచు వని ఘోరమగు తపం బొనరింపం
దొడఁగె సురరాజు నెడలో
విడిపోని యేకాగ్రబుద్ధి । నిష్ఠాత్ముండై॥
ఆది. ౫-౧౨౦.

"నిష్ఠాత్ముండై" అనుటకు బదులుగా "నేకాంతమునన్" అని అచ్చులో మార్చినారు. "నిష్ఠాత్ముండై" అని కవిహృదయమైనట్లు దాని తర్వాతి వచనములో 'ఇట్లతి నిష్ఠ నేకపాదస్థితుండయి...' అని ఉండడము వల్ల స్పష్టము.

2. నీవ కడుఁ జేర్పఁ గాఁడవు
గావలవదు నీవిఁ గొన్ని గరచితి నేఁడున్
నీదివ్యలెల్లఁ జూపుడు
మీవీరలు చూచి మేలు । మేలని పొగడన్॥
ఆది. ౬-౩౩.

ఇందు 'చూపుడు మే వీరలు' అనిదిద్దినారు.

3. చూచె మనంబునఁ దలంచు । చుండుదు నేనున్॥
ఆది. ౬-౩౫.

ఇందు "సుందరి యెపుడున్" అని ఒకరున్ను, "తొలవక యేనున్ " అని ఒకరున్ను దిద్దినారు.

4. ఘో। పన్నరుషసదున్న వాని దిరి । జారిఁ గబంధుని
గాంచి రచ్చటన్॥ అర. ౭-౩౫౭.

5. అనుజపత్నుల్మ్రలేనిమ్మహోచలనువ
నాటఁగోలెను నెచటికి । నరుగనేర॥ అర. ౩-౨౧

'నాటఁగోలె నెచ్చటికిఁ జ । నంగనేర' అని ఒకరున్ను, 'నంతఁగోలెను నెచటికి । నరుగనేర' అనిమఱియొకరున్ను దిద్దినారు.

6. విను, లమతీ నీకొడుకు నట్టు । లవిచుంగఁజనున్॥
ఉద్యో. ౨ ౭౮

7. వతికి తోడన హరి చేను । వతనిరొుడలు॥
ద్రోణ. ౩-౫౯.

'నరునిరొుడలు' అని దిద్దినారు.

8. నామననూర దీని గని । నప్పుడె సంతసమయ్యె...
శాంతి. ౨-౯౬.

'గనినం గడు నంతసమయ్యె' అని దిద్దినారు.

9. నీవును దల్లులు బంధుజ
నావళి పురజనులు హస్తి । నాపురమునకున్॥
అశ్వ. ౮-౯౩.

'నావళియుం బరిజనములు । హస్తినగరికిన్' అని దిద్దినారు. ఇటువంటివి ఇంకా

ఉన్నవి. వీటిలో కొన్ని పూర్వపులాక్షణి కులు కొందరు అఖండవడిని పేర్కొని ఉదా హరించినారు.

అని మది నిశ్చయించి..........

..................మా

కొనరివసైన్యముల్ పదునొ। కొంటికి......

ఉద్యో. ౩-౨౧౧

ఇందులో "మూడవ పాదంబునందుఁ బదునొకొంటికినని యున్నచోట సంధిగూర్చి స్వరప్రధానవడిగాను సోమయాజులుగారు ప్రయోగించినారు" అని అప్పకవి వ్రాస్తే అందుకు తగినట్లుగా కూచిమంచి వేంకట రాయడు తన సుకవిమనోరంజనములో అప్పకవివాదము ఖండిస్తూ స్త్రీపర్వంలో "పాండవులవలనఁ గీడొ। క్కండును లేదధిప నీదు। కొడుకులు ధరణీ" అని ఉన్నదే, దీనికే మంటారు అప్పకవిగారు? అని ప్రశ్నించారు. అప్పకవిగారికి అఖండవడియుండదని ముఖ్యా భిప్రాయము. అందుకు అఖండవళ్లు లున్న చోట ౫౦—౬౦ చోట్ల దిద్ది పాఠములు వేరే కల్పించినారు. ఇక్కడ దిద్దడమునకు శక్యము కాలేదుగనుక, ముద్దరాజు రామన్నగారిని ఆక్షేపించుటకై పయ్యెద, ఉయ్యెల, తాయె తులు—వీటిలో పదద్వయవిభాగము లేనిది వ్రాసినటులనే అఖండవడిని ఖండించుటకై వ్రాసినారు అని ఆక్షేపించినారు.

కనబడ్డ అఖండవళ్లు వీలయినచోట్లను దిద్దివేసిన్ని, కొన్నిచోట్ల ఉభయవళ్ల సంఖ్య ఎక్కువచేసిన్ని అప్పకవి మొదలయినవారు అఖండవడి కూడదు అని అనుశాసనం చేసి నారు. అందుచేతను అచ్చుప్రతులలో నేటి కిన్ని నిల్చిఉన్నవే చూపించవలెను. పైని వెంకటరాయడు చూపించినట్లు ఒకే ప్రయో గం ఒకచోట వ్యంజనంతోను ఒకచోట స్వరం తోను మైత్రిగలది చూపించి, స్వరం విరుగు తుందా? విరగదా? విరుగుతుందంటే విర గనిచోటను, విరగదంటే విరిగినచోటను అఖండవడి ఉన్నదని ఒప్పుకోవలెను అని చెప్పవలసి వస్తుంది.

1. శీరలు దైవశక్తిఁ బ్రభ। వించినవారను చేమి సందియం
2. శీరమణీయకాంతి నుప। మింపఁగ......

ఆది. ౫-౧౫౫.

1. లక్ష్మియుత యిప్డు నిన్నునగ। మింపఁ ...

అర. ౨-౩౦౨.

ఇందులో 1. లేదా: 2. అఖండవడి గల దని చెప్పవలెను.

నన్నయ సర్వత్రయతి నియమముగా చెప్పిన "వేల్వంగ। నమకట్టి వెలువడ..." అనే పద్యంలో 'తిగిచి, కొనినాగపురమున। కొనరం గఁ జని' అని నాల్గన పాదమందు ఉన్నది. ప్రాస యతి కనబడుతూ ఉండడంచేత దిద్దలేదు. గాని నన్నయ ఉద్దేశించినది యతిగాని ప్రాసయతి గాదు. ఆయతి అఖండవడి అనకతప్పదు. ఇటు వంటిచోట్లనే దిద్దక విడిచిపెట్టడం సంభవిస్తుం ది గనుక ఇది ఎత్తి చూపించవలసివచ్చింది.

'తెలుగు' పత్రికలో నేను వ్రాసిన వ్యాస మందు వందలకొలదిగా అఖండవళ్లు గలవని చెప్పి పెద్దపెద్దకవుల గ్రంథములనుండి సైతము ప్రయోగాలు ఎత్తి చూపించాను. ఇప్పుడు ఇంతకంటె ఎక్కువగా వ్రాయనక్కర లేదు గనుక సంగ్రహించి వ్రాయడమైనది.

కేక

శ్రీరంగం శ్రీనివాసరావు

నిద్రకు వెలినై
నే నొంటరినై
నాగదిలోపల చీకటిలో
చీకటిలోపల నాగదిలో
నాగదిలో
చీకటిలో.

నే నొక్కడనై
నిద్రకు వెలినై
కన్నుల నిండిన కావిరితో
కావిరి నిండిన కన్నులతో
కన్నులలో
కావిరితో.

నిద్రకు వెలినై
నే నొక్కడనై
గుండెల కప్పిన కుంపటితో
కుంపటి కప్పిన గుండెలతో
గుండెలలో
కుంపటితో.

నా కనుగోనల
నా యెదగోడల
నాలుగు దిక్కుల బాకుల్తో
బాకుల తోటల బాటలలో
బాటలలో
బాకులతో.

భగభగ భుగభుగ
భగ భగ మండే
నా గది చీకటి నాలుకతో
నాలుక చీలిన నాగులతో
నాగదిలో
నాగులతో.

ఇనుపై కోరల
అరవై కొమ్ముల
క్రూరం ఘోర కర్కోటకులో
కోరకు కన్నూ
కొమ్ముకు కన్నూ
కర్కాటక కర్కోటకులో.

దారుణ మారణ దానవ భాషలు
ఫేరవ భైరవ భీకర ఘోషలు
ఘోషల భాషల
ఘంటల మంటల
కంటక కంఠపు గణ గణలో.

చిటికెల మెటికెల చిటపటలో
నే నొంటరినై
నిద్రకు వెలినై
చీకటిలోపల నాగదిలో
నా గదిలోపల చీకటిలో
చీకటిలో
ఆకటితో.

ఉడుత ఉసురు

శ్రీ కవికొండల వేంకటరావు

"వెలయంగ నశ్వమేధంబులు వేయును నొక్కసత్యమును దులనిడి —" అన్న పద్యములోనితూనిక జ్ఞాపకం వస్తుంది నాకు, రాజమహేంద్రవరనగరమునందు గొప్ప ప్రహరీమధ్యను నవీననాగరకచిహ్నముగ నెలకొల్పబడిన పురవనము దానియెట్ట యెదుట సనాతననిరూఢిని విలసిల్లే విశాల మైదానమ్మీది పురాతన వటవృక్షము — రెండింటినీ తలపున గొన్నప్పుడోహో! ఎన్ని పురవనములైతే నొక్క ఆవట వృక్షంతో సాటిరాగలవుఅని దాన్నిగురించే యోజిస్తూ వుంటాను.

పురాతన వటవృక్షమ్మీది చిన్నఉడుత! చిట్టిఉడుత! ముద్దొస్తూవున్న ఉడుత! ముచ్చటైన ఉడుత!మురిపెంపుకొర్కెలవుడుత! మోహనంపు చారల వుడుత! గుజ్జుతోక వుడుత ! లేలేత వుడుత! క్రొంగ్రొత్త వుడుత!— ధాత ఎప్పుడు ఆవుడుతను సృష్టించాడో గాని అప్పటికీ ఇప్పటికీ నాకేలాంటి అమాయకత్వము, అత్యంత నేవళీకము,అతిసున్నితమైన స్వేచ్ఛ, చలాకీ కనబరుస్తూ ఆ వృక్షాన్ని ఆశ్రయించుకునివుంది.

కాని ఆ ఉడుత ఆ వటవృక్షమ్మీదను వుంది అని ఎవరున్నూ అందాకా కనిపెట్టి యుండలేదు. వటవృక్షమ్మీది ఉడుతను కనిపెట్టడమనేది కష్టంకాదూ? అందులోనూ పురాతన వటవృక్షముమీది ఉడుతను తెలిసి

కోవడమనేది విశ్వరూపంలో "ఎలెక్ట్రాన్ యొక్కఉనికి ప్రతిష్ఠాపన చెయ్యడంలాంటి

చెట్టు "సువిశాల మిదం వృక్షం" అన్న విస్తరించుకొనివుంది, కొమ్మలు బాగా సా కొమ్మ లెక్కడి కక్కడికే ఊడలు ది ఆకులు బలిసి, పగడాల్లా పళ్లు పండి, ఈ క్షాని కెంతమాత్రమున్నూ ఏవిధమైనలోటు లేదు, దీన్ని ఆశ్రయించుకుని వస్తూ పోతు వున్న పాంథజనుల కంతకన్నా లోపంలేదు దీనిమీద గూళ్లుకట్టి కాపురాలుచేస్తూవున పక్షుల కసలే కొఅతలేదు అన్నట్టు హెచ భూప్రదేశాన్ని తన బాహుళ్యమైన నీ చేతను ఆవరించుకొనివుంది. అడ్డదారి నొక దానిక్రిందనుంచి జర్రిగొడ్డు ప్రాకుడుగీత లేటతెల్లంగా అగపిస్తూవుంటుంది. ఏనా గీతో అది, లేక రోజురోజూ పడుతూవున గీతో అది? కేటాయించడం కష్టం. పా అడుగుల్లో కొత్తఅడుగు లంత నమ్మకంగా పడి ఏనిమిషమున కానిమిషం స్నిగ్ధంగా జరి పోతూ వున్న బాట అది. ఆ చెట్టుయొక్క ఆకుల కలరవంలో ఎన్నికబుర్లు అ రహస్యంగా కలిసిమెలిసి గాలికి విడివడ్డా చెప్ప శక్యంగాదు.

పాలసముద్రమ్మీదను సృష్ట్యాదిని పవ చియున్న చిన్నారి పొన్నారి చిలుబో పాపని వీపుక్రింది మఱ్ఱిఆకు ఏమఱ్ఱిచెట్టు నుంచి కోయబడిందో ఆమఱ్ఱిచెట్టుపండు

కుతో కలిసి విడివడ్డదై, దారిలో ఆకూ ండూ ఊడడీయబడ్డ సమయాన ఆపండు స్థలమందు పడి క్రమక్రమంగా మొలకగా రిణమించి ప్రకాశిల్లింది అని ప్రతీతి. అటు ంటి అద్భుతమైన పుట్టుజ్ఞాన సాంప్రదాయం మహావృక్షమందు నిగూఢంగా వుండబట్టే టినేన్నీ దానిచివళ్లు తెల్లని మేఘశకలాల్లో లిసిపోవడానికి ప్రయత్నించడం; అవృక్షం నయొక్క ప్రప్రథమబీజావస్థలో తెలిసికొని ండాలి — వటపత్రశాయి ఏలా పాలక లియొక్క తెల్లని చిరుకరళ్లు ఎఱ్ఱటి పెదవుల ాదకు వచ్చి పడుతూవుంటే వెక్కస టున వెలలించాడో! అదృశ్యం! ఓహో ం మహాద్భాగ్యం ఆవృక్షాంది!

మార్కండేయాలయంమీాది ఋషుల ాపాలు అలా గచ్చూ వెల్లా ఆకారాలుగా ారకముందు, అసలు ఋషులు తమంత ాము వచ్చి ఆచెట్టుక్రిందనే ఆసనములు సికొని తపస్సుచేసి సమాధివిలయం పొంది రట. సీతారామలక్ష్మణు లౌత్తరేయ దేశం కడచి గోదావరీతీరానికి చేరుకొన్న ుడు ఆచెట్టుక్రిందనే కొంతకాలం గడిపి రని వదంతి. "ఏది నావఅదలకు నిలబడి ంటే అదే వృక్షం, పంచతంత్రకావ్యం "ని బూరుగుచెట్టు నాతొలివఅదకే చెల్లి యింది. ఇది ఎన్నివఅదలకైనా చెక్కు దరకుండా వుంది" అని గౌతమీస్రవంతి పురూపంగా చుట్టేసుకొని మొన్న మొన్న ాకా ఊడలసందుల్ని నృత్యాలాపం చేసిం ు!

మొన్న మొన్నటిదాకా, అనగా రాజ ాజనరేంద్రునికి ముందు ఎన్నో శతాబ్దాల తంమాట. అయితే రాజరాజనరేంద్రుడు తనయొక్క కోట నిర్మించడానిగ్గాను ఆలో చనచేసే సమయంలో యీ వృక్షం కొట్టి వేయబడివుండలేదా అని పాఠకులకు సంశ యం తట్టొచ్చు. నిజంగా తట్టదగ్గసంశయం కూడాను అది. అవితే చెట్టు కట్టెదుట కళ్లారా కనిపిస్తూ వున్నప్పుడు పాఠకు లలాంటి సంశ యం పొందడం మంచిది కాదని నావిన్నపము.

సారంగధరుడు కాళ్లాగజ్జెలు చేతికి చిర తలు అని రామభజన చేసికొన్న దా చెట్టు క్రిందేనట. మఱెన్ని పావురాల గుబాళింపులు తొల్త సారంగధరుడు వీనులవిందుగా విన్నది ఆ చెట్టుమీాదేనట, చిత్రాంగి చూపులు సారంగధరునిమీాది కప్రయత్నంగా వాలింది ఆ చెట్టుఆకుల సందుల్నించేనట, సారంగ ధరుడు మొండిగా తెగ్గొట్టబడ్డరాత్రి గాఢాం ధకారంలో రత్నాంగి తనకొడుకుని చూడ్డా నికి వెళ్లేసమయంలో "భద్రం తే" అని ఊర డిస్తూ మంచుకన్నీరు గార్చింది ఆవృక్షాం దేనట.

నన్నయ ఘంటము అప్పటప్పట ఆ మహా వృక్షమూలమునకు చేరమోపి ఆకాశము వంక ఆలోచనాదృష్టి సారించింది యీా చెట్టున బెరిగిన బదనికతీవెల వెంబణ్డేనట.

కోటగుమ్మాలు, కోటకొమ్మల్లూ, పెక లించబడినా, కందకం పూడ్చబడినా, ప్రాసా దాలు కూలద్రోయబడి వాటిమీాద బ్యాంకి బిల్డింగులు, కుళాయియంత్రాలు, కాలక్షే పపు క్లబ్బులూ నిర్మింపబడినా, ఎన్నెన్ని రూపాలు తారుమారైనా ఇమ్మహావృక్ష మాలాగ్గానే నిల్చివుంది.

ఎందుకు? కడచినసంవత్సరం చీరాల వాస్తవ్యు డొకడు రైలుదిగి యీా చెట్టు ప్రక్క

నుంచి పోతూ అనుకొన్నాట్ట — "ఇలాంటి మహావృక్షం ఓమఱ్ఱిచెట్టు మావూళ్లోనూ వుండేది. అది నిరిటి తుపానుగాలికి 'చార్ కోల్లా' మాడిపోయి వూరుకుంది. దీన్ని చూస్తే అది జ్ఞాపకంవస్తూవుంది" అని కళ్ల నీళ్లుకూడా కార్చాట్ట. ఈమఱ్ఱిచెట్టు కాసమ యాన్ని ఆమాట విన్నప్పుడు ప్రాణం ఝల్లుమన్నదట. కాని రాణ్మహేంద్రవ రాన్ని వుండడాన్నిబట్టి అట్టితుపానువిపత్తు తన కెన్నడూ కలగదని ఉత్తరక్షణమందే కుదుటబడిందట.

వారంరోజులుక్రిందట రిజెర్వు పోలీసు కవాతుచేస్తూ తమతమ తుపాకు లీచెట్టు చుట్టూ ఆన్చినప్పుడు తనకు గాడ్డుకూడా బ్రహ్మాండంగా ఏర్పాటు అయివుంది, మతి ఫరవాలేదని మిక్కిలి సంతోషించిందట కూడాను.

అయితే వోనాటిపుదయం ఇంకా తెల్లా అకుండానే వెయ్యిమంది కూలివాండ్రు వాడిగొడ్డళ్లు వోచేత, అన్నము మూటలు వోచేత పుచ్చుకుని ఆ బహిరంగ ప్రదేశం లోనికి వచ్చి చెట్టుకేసి చూచేరు. చెట్టుక్రింద బాటసారులు వందమంది విడిసి నిదరపోతూ వున్నారు నిశ్చింతగా. బాటసారుల్ని లేవ గొట్టలేకపోయినారు కూలివాళ్లు. బాట సార్లు అందఱూ లేచి వెళ్లిపోయేవరకు వాళ్లు ఆకూలివాళ్లు తమ తమ గొడ్డళ్లు అక్కడ పడవేసి తమతమ అన్నమ్మూటలు ఆ చెట్టు నీడను విప్పికొని హాయిగా భుజించేరు, ఆచెట్టు నుండి కోసి కుట్టుకున్న పచ్చని ఆకు దొప్పల్లో. తిరిగి గొడ్డళ్లు చేత బట్టేరు.

బాటసారి వొక్కడూ లేడక్కడ. చెట్టంక చూచేరు కూలీలు. లక్షలకొద్ది పక్షులు అపు రూపంగా వ్రాలి చెట్టుకు ఆభరణాలుగా కనిపిస్తూవున్నాయి. అందులోనూ పచ్చ చిలకలు, తెల్లని కొంగలు, నల్లని కో లలు రంగురంగులు చూపిస్తూ వికాసం వె యిస్తూ వున్నాయి. కూలీలు తమతమ గొడ్డళ్లు అక్కడ పడవేసి వచ్చినపని మరి పోయి చెట్టుమీద పక్షుల్ని చూడసాగేరు

అంతలో మధ్యాహ్నం పడిపోతూవుండ దూరాన్నుంచి చెట్టుమీదికి పేల్చినట్టు వ తుపాకిదెబ్బ ధాంమని వినిపించింది. లక్షపి లూ గభీమని ఆచెట్టు విడిచి దిక్కులేనట్టు ఎగిరిపోయినాయి. కూలివాళ్లు కళవళపడుతూ గొడ్డళ్లకోసం తడుముల్లాడుకోసాగారు పేల్చేసిన తుపాకీ చేత పూచుకుంటు దూరాన్నుంచి సార్జంటు తమకేసి వస్తు వుంటే కూలీ లందఱూ వణకిపోయినారు.

సార్జంటు కూలీలను సమీపించి "ఆ క్షులకు ఆచెట్టు ఆశ్రయంగా వుంది ఏల కొట్టమా అని కాదూ? మీా రాలోచిస్తు వున్నది ఈవఊకూను? ఇప్పుడు తీరింద మీాసంశయం? ఆచెట్టే ఆపక్షులకు ఆశ్రయ మైతే పక్షు లలా ఎగిరిపోవడానికి వీల్లేద దానిమీాదనే వుండి నాతుపాకీదెబ్బకు చచ్చి పోయివుండాలి చూచారా? లేవండి! కొ వేయండి చెట్టును" అన్నాడు. "మీా చెట్టు వెంటనే కొట్టివేయకపోతే యిక్క యిది పోలీసుబారక్కులు కట్టడానికి అడ్డ తెలిసిందా? వెంటనే కొట్టివేయండి" అ ఆజ్ఞాపించాడు.

సార్జంటు మాటలకు కూలీలు నిరుత్తరు గొడ్డళ్లు పైకెత్తారు, చెట్టును తెగనఱకడాని

వెయ్యిగోడ్డళ్లు! పడలే దింకా వొక్క- డ్డలిపెట్టా ఆవృక్షమ్మీద. పీపడం లేదు లికూాన ఏపక్కనించీని. ఊపడం లేదు. వరునూ ఆ చెట్టును — జలజల రాలిపో గినయి ఎండాకులు. గలగల రాలి కింద ాద సేయసాగినయి. కూలీలు నిర్విణ్ణులై ూచేరు. కారణం కనిపెట్టలేకపోయినారు.

"బాబో! బ్రహ్మరక్షస్సు" అని కేక శారు. "బ్రహ్మరక్షస్సు లేదు దిమ్మ క్షస్సు లేదు" అని బండీఫిరంగి వొకటి ప్పించాడు సార్జంటు. అందులోకి మందు ొప్పించాడు సార్జంటు. ఫిరంగి చెట్టుకు గురి ట్టాడు సార్జంటు. రంధ్రాని కగ్గి ముట్టించ ానికి సిద్ధంగా వున్నాడు సార్జంటు. చూచారు ారు మీారు ఆసమయాన్ని!

ఒకఉమత! చిన్నఉమత! చిట్టిఉమత! ుద్దొస్తూవున్న ఉమత! ముచ్చటైన డుత! మురిపెంపు గోక్కాల వుడుత! ాహాసంపు చారల వుడుత! గుజ్జ ోక ఉడుత! లేలేత వుడుత! క్రొంగ్రొత్త ుడుత! రెమ్మరెమ్మకు కొమ్మకొమ్మకు కు ఆకు పండుపండుకు తానే అన్నట్టు, టు ఫిరంగి తిప్పితే అటు దొరక్కుండా ెట్టంతా అలుముకుపోయినదానికి మల్లే హిగ్రమ్మి, తిరిగింది, పాకింది, ఉఱికింది, ోక తన పీపుమీాదికి నిక్కించి, ెవు లెక్కవెట్టి మెఱిసిపోయింది!

ఇసీ! ఉడుత! దయ తలచకండి, వెయ్యండి ొడ్డళ్లు చెట్టుమీాదను అంటూ సార్జంటు ఫిరంగి అంటించాడు. ఫిరంగిమ్రోత గొడ్డళ్ల వ్రేట్లు దిశలు పగల వినిపించినయి.

వినిపిస్తూ వున్నంతసేపూ చెట్టుమీాది వుడుత పూర్వోక్తప్రకారంగా క్రిందికీ మీాదికీ నెత్తురుపాఱుదల్లా సంచరిస్తూనేవుంది. ఎప్పు డెప్పుడు గొడ్డళ్లవ్రేట్లు ఆపీవారో, ఫిరంగి మోత ఎప్పు డెప్పుడు చాలించీవారో, అప్పు డప్పుడు అవుడుత ఆగిపోయి కనిపించేది కాదు ఎవరికిన్ని తా నెక్కడున్నదీ.

ఈ ఉడుత చావదర్రా అని సార్జంటు, ఈ ఉడుత మనల్ని కొట్టనివ్వదర్రా అని కూలీలు తమలో తాము అనుకొన్నట్టు ఒకరిమొగా లొకళ్లు చూచుకున్నారు. లేదు ఉడుత లేదంటే లేదు అని అనుకొసివారు. తిరిగి నరుకు అగ్గిముట్టింపు ప్రారంభించేవ. మళ్లీ ఎప్పటి ఆటే ఉడుత! మళ్లీ కూలీలు సార్జంటూ విరమించేరు.

అదేదో విడ్డూరంగా వుందనిఆ బాల గోపాలం ఊరందఱూ వచ్చి విరగబడి చూచేరు. చెట్టలా వుండవలసిందేకాని నరకబడవలసిందికా దన్నారు. జనవాక్యమే కర్తవ్యమై ఊూరుకుంది.

వెయ్యిగొడ్డళ్లూ మూలబడ్డాయి. ఫిరంగి చల్లారి తుప్పుపట్టింది. కాని చెట్టుమాత్రం ఏటేటా చిగుర్కొట్టి యింపుగొల్పుతూనే వుంది యిప్పటికిన్ని. దానిమీాది నేటి వుడుత—అదేనా? మరొకటా?

"...మక్కువ నిక్కమేని?"

శ్రీ పులివర్తి శరభాచారి

ఈ విశాలవసుంధర నెల్లయెడలఁ
బెళ్లఁబెళ్లను విఱచి చూపింపఁగలను
నాకళాదేవిచరణచిహ్నములు కొన్ని;
నా ప్రశంసనఫలకవర్ణములు కొన్ని.

* * *

కాలదండాగ్రవిలయవిఘాతములకు
వ్రయ్యలై పోయి చూర్ణచూర్ణమ్ములైన,
నామహాచార్యమణుల రత్నాలపేటు
లింక సంజీవినులఁ బునస్సృష్టియగునె?

బ్రాహ్మ, శైల్పిక సూత్రసారముల నాని
జ్ఞానవిజ్ఞానములు పండు 'ఖాండవ'ములు
'మయు' రసాయనశాలలు, మంటలంటి
నమసె, నిక బునర్జీవనసమయ మెపుడొ?

ఆ 'విమానాధికర'ణాద్యనర్ఘశాస్త్ర
ములను లేగులాబీల గుత్తులును నలిగి;
శిల్పదేవాలయద్వారసీమముందు
ఇంత పల్లేరు పెరిగెఁ దీయింపలేరొ?


శిల్పమన నోరులూర శంసించువార
లీయుదగ్రదారిద్ర్యవహ్నిశిఖలందుఁ
గుములుచుఁ గృశించుచును బూదికుప్పవై
శిల్పిఁ గని జాలిఁ గన్నీళ్లు చిందరో కొ-

'ఉలు'ల యంచుల ఆస్తిక్య ముద్ధరించి
'శ్రావణా'గ్రములం, గళాశ్మముల మెరపు
గొలిపి, శ్రుతిశిల్పసూత్రముల్ గలయఁ
నిదురలినవీని మేలుకొల్పుదురొ లేదొ?

కర్మశాలాహిరణ్యంబు, కావ్యశాస్త్ర
సౌరభము జిమ్మ నప్రతిష్ఠాతమస్సుఁ
జీల్చుఁజొచ్చెడి అరుణరోచిస్సులందుఁ;
గట్టుకొనరె, సేవావ్రతకంకణములు?

* * *

ఒకయెడ నవనవోన్మేష వికచసూన
మాధురీశ్రీలఁ గలల మైమఱచినారె?
పాకులోఁ దడియూతెఁ; దీవతల వాలె;
నీరు పట్టుదు మక్కువ నిక్కమేని?



వియోగరాధిక

శ్రీ పాలెపు వేంకటరత్నము


ఊకదిమి సీమలో
ఇరుపురము జతగూడి
పాలవెన్నెల, సీమ
లీల నుందామనుచు
జోడుగువ్వలవోలె జతగూడినామే!!
వాడిపోవనిపూల వాసించినామే!!

ప్రేయసీ! యని నన్ను
పలుకరించావాడె యెడ
బాయనని నాతోడ
బాసచేశాడే.
జోడుగువ్వలవోలె జతగూడినామే!!
వాడిపోవనిపూల వాసించినామే!!

చిఱునవ్వువెన్నెలలు
చిందించినాడే
మురళిపాటల నన్ను
మురిపించినాడే
జోడుగువ్వలవోలె జతగూడినామే!!
వాడిపోవనిపూల వాసించినామే!!

చందమామను జూచి
సైగ జేశాడే
కనులు తెరచెదు నేను
కలువ నన్నాడే.
జోడుగువ్వలవోలె జతగూడినామే!!
వాడిపోవనిపూల వాసించినామే!!

కాళిందితీరాన
కనుమఱిగినాడే
ఆలచాటున పోయి
మాయమయ్యాడే
జోడుగువ్వలవోలె జతగూడినామే!!
వాడిపోవనిపూల వాసించినామే!!



ఉర్దూభాష: వాఙ్మయం

శ్రీ యలమంచిలి వేంకటేశ్వరరావు

ప్రపంచంలోని ప్రతిభాషకు ఆయాదేశాన్నను సరించో, జాతి ననుసరించో పేరు వస్తుంది. ఈ నియమానికి అనువర్తించని ఉర్దూలాంటి భాషలకు రెండు జాతుల కలయికవల్ల పరస్పరం పేర్లు కలుగుతాయి. ఏ భాషయినా ఫలానా కాలంలో పుట్టిందనీ, ఫలానా కాలంలో వాడుకలోకి వచ్చిందనీ చెప్పడం కష్టం. అదివరకున్న భాషలే సంస్కారం పొంది మరో భాషగా తయారవుతాయి. ఆ సంస్కారంకూడ చాలనెమ్మదిగా జరుగుతుంది. అందుకనే ఒక భాషను గురించి అది ఫలానా భాషలోనుంచి వచ్చిందనీ, ఫలానా కాలంలో పుట్టిందనీ చెప్పడం భ్రమకు కారణమవుతుంది. కాని వేరువేరు భాషలు మాట్లాడే రెండుజాతుల కలయికవల్ల తయారయిన మిశ్రభాషను గురించి తేలికగా మనం ఒకనిర్ణయానికి రావచ్చు. అటువంటిభాషే ఉర్దూ. దానిని గురించి తెలుసుకోవడానికి పూర్వం మహమ్మదీయుల సంపర్కం ఎప్పుడు వచ్చిందో తెలుసుకోవడం అవసరం.

మొట్టమొదట క్రీ. శ. ౮౧౨లో సింధుదేశాన్ని మహమ్మదీయులు ఆక్రమించారు. కాని అది వారికింద చాలాకాలం ఉండలేదు. ఆకాలంలో హిందూదేశానికి వచ్చిన మొదటి అరబ్బీయాత్రికుడు సులేమాను. ఇతడు ౮౫౧లో వ్రాసిన వృత్తాంతాన్ని బట్టి హిందువులకు — మహమ్మదీయులకు పరస్పరం అన్యోన్యమైత్రి ఉండేదని తెలుస్తుంది. ఈమైత్రి — నడుమనడుమ ఆటంకాలు వచ్చినా — క్రమక్రమంగా వృద్ధి అయింది. అల్ బెరూని భారతవర్షాన్ని గురించి పదోశతాబ్దపు చివరభాగంలో వ్రాసిన పుస్తకంలోకూడ ఈ విషయాన్ని గురించి విపులంగా వ్రాస్తూ, ఈమైత్రి బాగా వృద్ధిపొందిందన్నాడు. మహమ్మదీయులు హిందూదేశానికి రావడమూ పోవడమేకాక, ఇక్కడ ప్రభుత్వంకూడా సాగించారు. ౧౧౯౨ లో ఉత్తరపశ్చిమప్రాంతాన్నుంచి వచ్చి మహమ్మదుగోరీ ఢిల్లీని తనవశం చేసుకున్నాడు. అటు తరువాత బానిసవంశమువార మహమ్మదీయసుల్తానులకు ఢిల్లీ రాజధాని అయింది. ఈ విధంగా ౮౦౦ నుంచి హిందువులకూ మహమ్మదీయులకూ అనుబంధం క్రమక్రమంగా హెచ్చి పోయింది. హిందువులు, మహమ్మదీయులు ఇరుగు పొరుగువారవడంచేతను, ఉభయులమధ్య వ్యాపారా కార్యాలు విరివిగా తరుచుగా సాగుతూ ఉండడంచేతన కూడా ఈ రెండు జాతులకు సంపర్కం అధికమైంది. అప్పుడే ఈవిధమైన వ్యాపారనిర్వహణములో ఒక భాషలు ఒకరు తెలుసుకునేందుకు ఒకమిశ్రభాష — హిందూ మహమ్మదీయభాషలమిశ్రము — వ్యవహా ములోకి వచ్చి ఉంటుంది. దానికి కాలానుగుణ్యంగా ఒకవిశిష్టరూపం ఏర్పడి ఉర్దూగా పరిణమించింది.

ఉర్దూభాష అసలు ఫారసీ మాట్లాడే సైనికు డేరాల్లోంచి బయలుదేరిందని చెప్పి, ఫారసీనుండి పుట్టి దంటారు కొందరు. కాని ఇది నిజం కాదు. నేడు వాడుకలో ఉన్న ఉర్దూలో హెచ్చుగా ఫారసీ అరబ్బీశబ్దాలు ఉండడం, దానికి ఫారసీలిపి ఉపయో గించడం, కవిత్వానికి ఫారసీఛందస్సులు వాడడంవల్ల కలిగిన భావం ఇది. ఉర్దూభాష పుట్టుపూర్వోత్తరా లనుగురించి జాగ్రత్తగా ఆలోచించేవారు మొదట ఆ భాష హిందువులు, మహమ్మదీయులు పరస్పరం వ్యాపారం నిర్వహించుకోవటానికే పుట్టిందని తెలుసు కుంటారు. సులభమయిన విషయాలే మనుష్యులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. ఫారసీ, తుర్కీ భాషలకంటె హిందీ ఎక్కువ సులభమయినభాష యగుటచే హిందువులు ఆ భాషలు నేర్చుకోవటానికి కొన్నిశతాబ్దాలకు పూర్వమే మహమ్మదీయులు హిందీలో చక్కగా మాటలాడటానికి అలవడ్డారు. అనేకుల మహమ్మదీయులు హిందీలో కవిత్వంకూడ వ్రాయటం ప్రారంభించినారు. ఈ హిందీ ఢిల్లీ, మేరఠ్ చుట్టు

పక్కలమాటలాడే భాష. దానినే "ఖడీబోలీ" అంటారు. దీనిలో చాలకాలమువరకు సాహిత్యం తయారు కాలేదు. అందుకనే ఖడీబోలీ నూరు, నూటపాతిక సంవత్సరాలకంటె పూర్వం లేదని కొంతమంది చెప్పనారంభించినారు. ఈ వాదం అబద్ధమనీ, ఖడీబోలీకూడా చాలా పురాతనమైనదనీ చెప్పటానికి ఆధారాలు కొంతమంది మహమ్మదీయులు హిందీలో రచించిన రచనలే. ఈ హిందీలోనే ఫారసీ మొదలయినభాషల శబ్దాలు కలిసినాయి. ఈ కలగాపులగపుభాషయే ఉర్దూ అనిపించుకుంది. ఇది పుట్టి ౫౦౦ సంవత్సరాలవరకు వ్యవహారభాషగానే ఉండిపోయింది. అంతవరకు దానిని కావ్యభాషగా వాడలేదు. బహుశా దక్కనుకు యాత్ర రాకపోతే దానికి వాఙ్మయత్వసిద్ధి లభించేది కాదేమో!

ప్రొఫెసరు ఆజాదుప్రభృతులు ఉర్దూ వ్రజభాషనుండి పుట్టిం దన్నారు. ఇలా అనుకోవటానికి కారణం ఇది: వెనుక రాజస్థాన్, పంజాబు, బిహార్, నాగపూరుల మధ్యగల ప్రదేశములోని కవు లందరు వ్రజభాషలోనే కవిత్వం వ్రాస్తూ ఉండేవారు. వ్రజభాష చాలా ప్రాంతాలకు కావ్యభాష కావడంచేత, అనేకులు మహమ్మదీయకవులు వ్రజభాషలో చక్కని కవిత్వం వ్రాయడంచేత, ఉర్దూకు వ్రజభాషా సంపర్కం కలిగింది. వ్రజభాషాశబ్దాలుకూడ అనేకం ఉర్దూలోకి దక్కనాయి. అయినా ఇంతమాత్రానికే ఉర్దూ వ్రజభాషనుంచి పుట్టినదని చెప్ప వీలు లేదు. ఎంచేతనంటే, అస లది కావ్యనిబంధనానికిగాక, వ్యవహారనిర్వహణానికే పుట్టింది. పఠానులు ఢిల్లీని రాజధాని చేసుకున్నప్పుడు వ్యవహారం జరుపుకోవటానికి అక్కడ మాట్లాడే భాషనే వారు ఉపయోగించుకోవలసి వచ్చింది. పఠాను సుల్తానులు నాణ్యాలమీద హిందీలిపిలో తమ పేర్లు చెక్కించుకునేవారు—"అయం మహమద్ బిన్ సామ్ సంవిరః." తరువాత మహమ్మదీయకవులు ఉర్దూలో కవిత్వం చెప్పడం ప్రారంభించినప్పటినుంచి—వారిదివరకు చాలాకాలంనుంచి వ్రజభాషలో కవిత్వం చెప్పడంచేత—ఆభాషలోని శబ్దాలు, పోకడలు మొదలయినవాటి ప్రాబల్యంనుంచి తప్పించుకోలేకపోయారు. ఈ వ్రజభాషాఛాయలు చూచే ఉర్దూ వాఙ్మయచరిత్రకారులు దానిపుట్టుకనుగూర్చి భ్రమలో పడ్డారు.

ఇదివరలో చెప్పినట్లు ఉర్దూ మాట్లాడుకోవటానికీ వ్యవహారం జరుపుకోవాటానికీ సృష్టించుకున్న భాష. ౫౦౦ సంవత్సరాలవరకు అది కావ్యాలకు ఎక్కలేదు. మహమ్మదీయులు హిందీశబ్దాలు నేర్చుకునేనిమిత్తం అల్లాఉద్దీనుఖిల్జీ అమీర్ ఖుస్రూద్వారా "ఖాలిక్ బారీ" అనేపుస్తకం వ్రాయించాడు. దానిని ఎన్నో ప్రతులు స్కూళ్లల్లో పంచిపెట్టించాడు. ఇందులో హిందీ, పంజాబీ, వ్రజభాషాశబ్దాలకు ఫారసీ, అరబ్బీభాషలలో అర్థాలున్నాయి. ఫారసీభాష విదేశీయము కావడంచేత భారతదేశపు మహమ్మదీయులు హిందీనే మాతృకగా స్వీకరించారు. ఈ హిందీలో ఫారసీశబ్దాలు క్రమంగా ఎక్కువగా కలిసిపోయినాయి. హిందీకావ్యాలలో కూడా ఫారసీశబ్దాలు వాడారు కవులు. పన్నెండవ శతాబ్దపు చందకవి తన "పృథ్వీరాజరాసో"లో ఫారసీశబ్దాలు చాలా వాడినాడు. కబీరు, నానక్, తులసీదాసు, సూరదాసు మొదలుకొని నేటివరకు హిందీ కవు లందరు అరబ్బీ — ఫారసీశబ్దాలను గ్రహించి తమ కవిత్వంలో ప్రయోగిస్తూవచ్చారు. ఖుస్రూ, జాయసీ, రహీమ్, రసఖాన్ మొదలైన మహమ్మదీయులు ప్రసిద్ధిచెందిన హిందీకవిపుంగవులు. దీనినిబట్టి, ఉర్దూ వ్యావహారికంగా ఉపయోగించుకోవడానికి చాలా అనువుగా తయారయిం దనిమాత్రం బోధపడుతుంది. దానిలో కావ్యభాషమాత్రం అప్పుడు వికాసాన్ని పొందలేదు. కొందరు ఆంగ్లవిద్వాంసులు చెప్పినట్లు ఉర్దూలో పెద్ద పెద్ద క్లిష్టమయిన ఫారసీశబ్దాలు వాడటానికి మూలకారకులు ఫారసీ బాగా చదువుకున్న హిందువులే కాని మహమ్మదీయులు కారు. అక్బరుకాలంలో రాజా తోడరుమల్ ఫారసీని రాజభాష చేసి, దానికి ఎక్కువ ప్రోత్సాహమిచ్చాడు. అంతకు పూర్వమే చాలామంది హిందువులు ఫారసీలో గొప్ప పాండిత్యం సంపాదించారు.

ఉర్దూలిపి - వ్యాకరణము

ఉర్దూ దేవనాగరిలిపిలో వ్రాస్తూవచ్చినంతవరకు దాని వాక్యరచన హిందీలోలాగే ఉండేది; అంతవరకూ

పేరుకుమాత్రమే అవి రెండుభాషలుగా వ్యవహరింప బడుతూవచ్చినవి. కాని ఫారసీలిపి వచ్చి వాక్యరచనను క్రొత్తమార్గంలోకి దింపింది. దానితో అది ఒక క్రొత్త భాష అయిపోయింది. ఫారసీలోలాగు విశేష్యములను ముందు, విశేషణములను తరువాత పెట్టుపద్ధతి ఉర్దూ లోకికూడా వచ్చింది. విదేశీ శబ్దాలుకూడా విశేషంగా క్రమక్రమంగా వచ్చినయి.

ఉర్దూ - హిందీ

"హిందీ, ఉర్దూ అని ఉత్తరదేశంలో రెండు పేర్లు బాగా వాడుకలో వచ్చినా, ఈరెంటికి మధ్య ఉన్న భేదాన్ని స్పష్టీకరించుట కష్టతరం. కొందరేమో రెండూ ఒకటేననీ, మరికొందరు రెండూ రెండనీ అంటూంటారు. మహమ్మదీయుల సంపర్కంచేత ఒక్క పశ్చిమోత్తరప్రాంతంలోనేకాదు; గుజరాత్, బెంగాల్ ప్రాంతాలభాష లన్నిటిలోనూకూడా కొన్ని మార్పులు కలిగినాయి. కాని అవి వచ్చింది ఒక్క మాటలాడేభాష లో మాత్రమే. ఉత్తరదేశంలోకూడా ఉర్దూచాలాకాలం వరకూ మాటలాడే భాషగానే ఉండిపోయింది. ఇప్పటికీ దానిలో కొంచెం అరబ్బీ, ఫారసీశబ్దాలు ఎక్కువగా ఉన్నా అక్కడ మామూలుగా మాటలాడుకునే ఉర్దూ హిందీయే నని ఘట్టిగా చెప్పవచ్చు. ఇతరభాషల లోని శబ్దాలు దానిలో ఎక్కువగా వాడబడినంత మాత్రాన భాషకు యింకొకపేరు రాదు. ఇతరభాషా పదాలతో తెలుగు ఎంత కల్తీ అయినా దానిని తెలుగనే అంటాము. కాని దానికి మరోపేరు పెట్టము. ఈవిధంగా చూస్తే ఉర్దూ - హిందీ అని పేర్లు వేరైనా భాష ఒకటే అని రుజావు అవుతుంది. మాట్లాడే భాషననుసరించి చెప్పవలసివస్తే భేదం ఉండ దనడానికి ఏమీ అభ్యంతర ముండకూడదు. కాని వాఙ్మయ విషయకంగా చూస్తే ఇవి రెండూ రెండు భాషలు. హిందీకి హిందీఛందశ్శాస్త్ర ముంది. ఉర్దూ ఈ దేశపుభాష అయినప్పటికీ, విదేశభాషాఛందస్సు లను గ్రహించి వేరైపోయింది. ఉర్దూ — హిందీ భేదం వాఙ్మయంలోనే కాని వేరే ఎక్కడా కనబడదు.

హిమాలయందగ్గరనుంచి వింధ్యవరకు, సింధునది దగ్గరనుంచి బీహారువరకు, హిందీ మాట్లాడుతారు. ప్రాంతాలనుబట్టి భాష కొంచెము భేదిస్తూవుంటుంది. ఈ విధంగా హిందీ చాలారకాలుగా వుంటుంది. అందులో ఒకరకం ఉర్దూ.

హిందువులు-మహమ్మదీయులు నిత్యము వ్యవహ రించే వ్యవహార హిందీభాషకు ఉర్దూ, రేఖ్తా దఖినీ, హిందుఏ, హిందూస్తానీ, అని వేరువేరు పే వచ్చినవి. మొదట మహమ్మదీయ సిపాయిలు మ దేశంలోకి వచ్చినప్పుడు, సేనానివేశాలలో గుడా రాలు వేసుకుని వసించేవారు. అక్కడే ఆ బజారుల్లో యీభాష పుట్టింది. తుర్కీభాషలో గుడార బజారును 'ఉర్దూ' అంటారు. కనుకనే 'ఉర్దూ'లలో మాట్లాడేభాష ఉర్దూ అయింది. మొదట ఉర్దూ అంటే బజారులో వాడేభాష యని అర్థము. కాని క్రమంగా ఆ అర్థం మారి, అది ఒకభాషకే, ఒక వాఙ్మయాని పేరయిపోయింది. అయినా యీపేరు అంత పురాత మయిందికాదు. ఇటీవలనే యీ పేరు వచ్చింది. మీ హసన్, మీరుతకీ మొదలైనవారు దీనికి 'రేఖ్తా' హిందుఏ అని నామకరణం చేశారు. రేఖ్తా అంటే కలగలుపు అని అర్థం, ఫారసీలోని 'గజల్ వంటి ఒకఛందస్సుపేరు రేఖ్తా. అందుకనే కవు ఈ భాషకు వాఙ్మయరూప మిచ్చి దీనిని 'రేఖ్తా' వ్యవహరించారు. ఈ భాష దక్షిణదేశములోనే మొద వాఙ్మయరూపము తాల్చింది. అందుకని 'దఖినీ' కూడా పేరువచ్చింది.

ఫారసీభాషలో హిందీ అంటే హిందూ ములో నివసించేవారు లేక భారతీయు లని అర్థమ కనుక ఆ శబ్దాన్ని బహిష్కరించి ఒకక్రొత్తపేరు హిందుఏ — హిందువుల లేక హిందూదేశములోవుం వారిభాష యని సృష్టించారు. ఇది హిందీకి పర్యా వాచి. చాలా పాతదికూడాను. పదమూడవశతాబ్దము వున్న అమీరుఖుస్రూ యీ రెండు శబ్దాలు వాడా

'హిందూస్తానీ, శబ్దము కలకత్తా యూనివ టీలో పనిచేసిన డాక్టర్ గిల్క్రాయిస్టుసృష్టి. దీని హిందీలో వాడుకలోనున్న దేశికపదములు ఉ లోని సాధారణముగా వ్యవహారమునకు పనికివ అరబ్బీ ఫారసీశబ్దములతో కలసివుంటాయి. ఈభా

ిందూమహమ్మదీయులు ఉభయులు మాట్లాడుతూ
ంటారు. ఎక్కువగా సంస్కృతశబ్దములుగాని,
ఎక్కువగా అరబ్బీ ఫారసీశబ్దములుగాని ఇందులో
వుండవు. ఇది గ్రంథభాష కాదు. గ్రంథం రచించవచ్చే
రికి ఇది హిందీగానో ఉర్దూగానో మారిపోతుంది.
ిందూస్తానీ వుత్తర దేశంలో సామాన్యప్రజలు మాట్లాడే
ాష. ఈ హిందూస్తానీ ప్రాబల్యము ప్రేమచందు
ుదలైన యేకొద్దిమంది రచయితలరచనలలోనో
నబడుతుంది. కొద్దిమంది హిందూస్తానీలో గ్రంథాలు
ాయ ప్రయత్నించినారు. కాని సాఫల్యము పొంద
ేదు. గాంధీ మొదలయిన నాయకులు ఈ హిందూ
్తానీనే మనదేశమునకు రాష్ట్రభాష లేక వాడుక
ాషగా చేయవలెనని నిర్ణయించినారు. ఉత్తరదేశ
ులో తరచుగా హిందూమహమ్మదీయుల వ్యవహారాలు
క్క చెట్టుకొనుటకు మాట్లాడేభాషను హిందీ అనిగాని,
ర్దూ అనిగాని విడదీసి చెప్పడంకష్టం. అచ్చట
ాట్లాడేభాషను పరికిస్తే హిందీ ఉర్దూ వేరుభాషలా
నే ఆశ్చర్యం కలుగుతుంది. హిందీవారు సంస్కృతము
ఎక్కువగా వాడుకుంటే, మహమ్మదీయులు అరబ్బీ
ారసీశబ్దాలను విరివిగా తీసుకుంటారు.

ఉర్దూకి 'రేఖ్తీ' అని ఇంకొకపేరు వున్నది.
ఈ పేరు రావటానికి ఒకతమాషా అయిన కారణం వుంది.
ారసీభాషలో ప్రేమపద్ధతి వేరు. అందులో పురుష
ునికే ప్రాధాన్యము. మన కావ్యాలలోలాగు స్త్రీలు
ురుషులకొరకు యేడ్వరు. హిందువుల కావ్యాలలో
ాయకుడికొరకు నాయిక విలపిస్తే ఫారసీకావ్యాలలో
ాయికకొరకు నాయకుడు వాపోతూ వుంటాడు. మన
ాఙ్మయములో ప్రేయసియేతనప్రియుణ్ణి రొత్తి పాడుస్తూ
ంటుంది. వియోగరాత్రులు చాల దుస్సహంగా గడుపు
ంది. పురుషుడు ఈ బాధలకు లోబడడు. ఒకవేళ
బడినా అతడు నిత్యవ్యవహారాలలో కలుగ జేసుకుని
ేవ్యక్తి గనుక ప్రేమ అనిచెప్పియేడుస్తూ కూర్చోడు.
రసీ కవులు స్త్రీలంటే ఎక్కువ ఔదార్యం
ూపుతారు. స్త్రీలకన్న పురుషులు బలంగా వుండి,
క్కువ అనుభవం పొందుతారని వారే తమవిరహదుః
న్ని ఎక్కువగా వెలిబుచ్చుతున్నట్లుగా వర్ణిస్తారు.

కాని మన భారతీయకవులు దీని కంగీకరింపరు. స్త్రీ మనస్సు, సహజంగా కోమలమైనదీ స్త్రీ అబలా అని, కావ్యాలలో విరహ దుఃఖానుభవము స్త్రీకే ఎక్కువగా పెట్టారు. వుర్దూలోని మొట్టమొదటి కవులు హిందీ కవులపద్ధతినేఅనుసరించి నాయికకే విరహ వర్ణన పెట్టారు. విరహం అనుభవించేది ఇక్కడ స్త్రీ గనుక, పుంలింగమైన 'రేఖ్ తా'శబ్దమును స్త్రీలింగముగ సూచించు 'రేఖ్తీ'గా మార్చారు.

దక్షిణదేశంలో మహమ్మదీయులు రాజ్యాలు స్థాపించినప్పుడు ఫారసీభాషయే దర్బారుల్లో వ్యవహరింపబడుతూ ఉండేది. ప్రజలుమాత్రం ఆర్యభాషలకు భిన్నమయిన ద్రావిడభాషలు- తెలుగు, కన్నడి మొదలయినవి మాట్లాడుతూ ఉండేవారు. ఉర్దూ అనే హిందీ ఈ దక్షిణదేశంలోకి వచ్చి వాఙ్మయరూపం పొందే కాలంలో దర్బారుకవులకు ద్రావిడభాషలు చాలా విలక్షణంగా కనుపించినయి అందుకని వారికి ఈదక్షిణ దేశభాషలతో పొత్తు కుదిరిందికాదు. ఇక మిగిలింది రాజకీయభాష ఫారసీ ఒక్కటే. అందుకనే ఈకవులు ఫారసీని ఇష్టమువచ్చినట్లుగా ఈ ఉర్దూ అనే హిందీలో వాడేశారు. కారణం ఫారసీకూడ ఆర్యభాష అవడమే అదీగాక కొన్ని శతాబ్దాలనుండి హిందీ - ఫారసీలు రెంటికి సంబంధబాంధవ్యాలు పెరిగినవి. ఈ విధంగా ఉత్తర దేశమునుంచి తీసుకువచ్చిన ఊర్దూ అనే హిందీ ఫారసీభాషతో నిండిపోయింది. దీనిలోనికి ఫారసీ ఛందస్సులు, ఫారసీలోని ఉపమాన ఉపమేయములు, భావపద్ధతి, కథలు అన్నీ ఇష్టంవచ్చినట్లుగా దిగుమతి అయినయి. ఇక ఇప్పుడు ఆ ఉర్దుపేరుగల హిందీ నిజంగా వేరుభాషే అయిపోయింది. ఉర్దూ - హిందీ భాషలమధ్యనున్న భేదాన్ని ఫారసీఛందస్సులు,ఫారసీ కుల వర్ణనపద్ధతులు వెంటనే సూచిస్తాయి. ఫారసీలిపి కూడ కొంతభేదాన్ని సూచిస్తుంది. కాని అది భాషను రెండుగా విడదీయలేదు.

ఉర్దూకవులకు కాలక్రమాన్ని ఫారసీ, అరబ్బీ భాషలమీద మోజుఎక్కువయి సంస్కృతం - హిందీ శబ్దాలను వారు బహిష్కరించటం ప్రారంభించారు. ౨౦-వ శతాబ్దంనాటికి ఉర్దూలో హిందీవి కొన్ని ప్రత్య

యాలు, క్రియలు మాత్రమే మిగిలిపోయినవి. మిగిలిన దంతా ఫారసీయే. ఆ మిగిలిపోయిన హిందీ ప్రత్యయాలు, క్రియలే ఉర్దూ వేరుభాష, ఫారసీ వేరుభాష అని తెలుపుతున్నాయి. అవి లేకపోతే ఫారసీకి, ఉర్దూకూ భేదమే లేదు.

ఉర్దూ వాఙ్మయం

భాషోత్పత్తిని గురించి కొంతవరకు తెలుసుకున్నాం. ఇప్పుడు వాఙ్మయసృష్టిని గురించి కొంత తెలుపుతాను. కొంతమంది ఉర్దూ — వాఙ్మయసృష్టి పదకొండో శతాబ్దపు చివర భాగంలోనే ప్రారంభమయిం దంటారు. ఇది రుజువుచేయటానికిని పదకొండవ శతాబ్దములో సాదుకొడుకు మసవూద్ "శేఖ్"లో వ్రాసినకావ్య సంపుటము, పద్మూడవ శతాబ్దాంతములో ఖుస్రూ వ్రాసిన కొన్నిపద్యాలు ఆధారంగా తీసుకుంటారు. కాని యిది సరియైనవాదం కాదు. ఈ యిద్దరి రచనలూ హిందీ ఛందశ్శాస్త్ర ప్రకారము హిందీ భాషలోనే రచింపబడ్డాయి. అందుకని యివి హిందీ రచనలే కాని, ఉర్దూ వాఙ్మయానికి చెందవు. జాతి, మతం భిన్నమైనంతమాత్రాన వారి కవిత్వానికి యింకొకపేరు పెట్ట వీలులేదు. ఫారసీ అరబ్బీ శబ్దాలు, వారి కవిత్వములో ఎక్కువగా వున్నాయని దానిని భిన్నభాషాకవిత్వముక్రింద పరిగణించకూడదు. భేదం దానివ్యాకరణం, ఛందశ్శాస్త్రమువల్ల వస్తుంది. కనుక ఫారసీశబ్దాలను, ఫారసీలిపిని ఆధారముచేసుకొని ఉర్దూవాఙ్మయపు పుట్టుకను నిర్ణయించలేము. ఫారసీ ఛందస్సులలో ఉర్దూకవిత్వము వ్రాసిననాటినుంచే, ఉర్దూవాఙ్మయం పుట్టిందని భావించాలి. ఇది జరిగింది పదహేడో శతాబ్దముచివర. మొట్టమొదట ఫారసీ ఛందస్సులను తీసికొని హిందీలో కవిత్వం వ్రాసినవాడు గోలుకొండ మహమ్మద్ కులీ కుతుబ్ షా. ఉర్దూవాఙ్మయం ఉత్తరభారతంలో గనక ప్రారంభమయితే అది ఈవిధంగా తయారయ్యేదికాదు.

అన్ని వాఙ్మయాలు సాధారణంగా రాజపోషణవల్లనే వర్ధిల్లుతాయి. ఉర్దూభాషను కూడ ఉత్తరదేశపు సుల్తానులు వ్యవహారంవరకే మన్నించి ఆదరించారు. కాని దానికి కావ్యగౌరవం అబ్బినది పైనచెప్పినట్లు దక్షిణదేశంలో. అక్బరు కాలంనాటికి ఉర్దూకు అయిదు వందల సంవత్సరాలు వచ్చాయి. కాని విద్వాంసుల ద్వారా అది దర్బారులో ప్రవేశించి సుల్తాను దర్శనం చేయలేకపోయింది. ప్రతి వాఙ్మయంలోను మొదట కవిత్వం బయలుదేరుతుంది. ఉర్దూ విషయంలో కూడా అంతే. కాని ఒక విశేషాన్నిమాత్రం పాఠకులు గమనించాలి. కావ్యశాస్త్రరీత్యా ప్రౌఢత సంపాదించడానికి ప్రతి వాఙ్మయానికీ కొంతకాలం పడుతుంది. నెమ్మదినెమ్మదిగా వికాసం కలుగుతుంది. కాని ఉర్దూలో ఒక్క సారిగానే - తొలుదొల్తనే - సర్వలక్షణ సంపన్నమయిన కావ్యత్వసిద్ధి లభించింది. అందువల్లనే క్రమపరిణామము, క్రమాభివృద్ధులు అందులో కనపించవు. ఉర్దూలో వచనంమాత్రం చాల ఇటీవల ప్రచారంలోకి వచ్చింది.

ఉర్దూవాఙ్మయం గోల్కొండ, బిజాపూరు సంస్థానాల్లో ప్రారంభమయింది. గోల్కొండ నవాబు మహమ్మదు కులీకుతుబుషా ఉర్దూలోని ప్రథమకవి. ఇక్కడి ఉర్దూకవులు వాడిన భాష హిందీయే. కాని వారు ఫారసీ, అరబ్బీ, తుర్కీ శబ్దాలు, దక్షిణదేశపు సామెతలు, భాషీయాలు, విశేషంగా వాడారు. తరువాత ఔరంగజేబు ఈ దక్షిణరాజ్యాలను నాశనం చేశాడు. వాటితోపాటు ఉర్దుసాహిత్యంకూడ ఇక్కడనుంచి ఢిల్లీకి వలసవెళ్లింది. వలీ అనే కవి ఢిల్లీలోమహమ్మదుషా కాలంలో ఉర్దూ సాహిత్యాన్ని ఎక్కువగా పోషించాడు. కొద్దికాలంలో ఢిల్లీకికూడ చెడురోజులు వచ్చాయి. లక్నోలో ఆసఫుద్దౌలాదానశీలతను విని ఉర్దూకవులంతా అక్కడకు చేరుకున్నారు. ఢిల్లీలోలాగ అక్కడకూడ ఉర్దూవాఙ్మయం బాగా వృద్ధిలోకి వచ్చింది. ౧౮౫౬ లో లక్నో నవాబు వాజిద్ అలీషా పదచ్యుతు డయ్యేవరికి ఉర్దూకుకూడ అక్కడ నిలువనీడ దొరికింది కాదు. తరువాత దక్కను హైదరాబాదు, రామపురపు నవాబులు దానికి కొంత ఆశ్రయ మిచ్చినా ఉర్దూవాఙ్మయానికి చెప్పదగిన పోషకస్థానము ఎక్కడా దొరకలేదు.

ఇప్పుడు రాజాశ్రయమే అవసరంలేదు. అనేకులు కవులు ఏ ఆశ్రయంలేకుండానే రాస్తున్నారు.

వచనవాఙ్మయం

ఢిల్లీ, లక్నోలలోనే ఉర్దూలో గద్యగ్రంథాలు కొన్ని ప్రారంభమయినాయి. కాని కలకత్తాలోనే ఉర్దూగద్యానికి ఎక్కువ వికాసం కలిగింది. ౧౯-వ శతాబ్దపు ప్రారంభములో కలకత్తాలో ఫోర్టు విలియమ్ కాలేజీ స్థాపించినతరువాత డాక్టరు గిల్క్రాయిస్ట మేనేజిమెంటులో హిందీవిద్వాంసులు — ఉర్దూ విద్వాంసులు కొంతమంది వ్యావహారికంగా ఉపయోగపడే వచనపుస్తకాలు రాయటానికి నియమింపబడ్డారు. ఆంగ్లాధికారులకు ప్రజల భావాలను తెలుసుకోవటానికి ఇక్కడి భాషలు నేర్చుకోవలసిన అవసరం కలిగింది. అందుకే పైకితిపుస్తకాలు వచ్చాయి. గిల్క్రాయిస్ట కాలంలో ఉర్దూభాష కోశనిఘంటువు, దాని కొక వ్యాకరణంకూడ తయారయినాయి. క్రీస్తుమతప్రచారకులుకూడా చినచిన్నపొత్తాలను ప్రచురించి ఉర్దూ వచనాన్ని చాలవరకు విస్తరింపజేశారు. హాలీ, శిబలీ, జకాఉల్లా, నజీర్ అహమద్, ఆజాద్ మొదలైన విద్వాంసులు ఉర్‌దూ వాఙ్మయానికి ఎక్కువ దోహద మిచ్చారు. ఇప్పుడు పాశ్చాత్యవిజ్ఞానంకూడ చాలవరకు ఉర్‌దూను ఆకర్షిస్తోంది. విమర్శలు, విజ్ఞానసంబంధమైన పుస్తకాలు ఉర్‌దూలో ఇప్పుడు విరివిగా బయలుదేరుతున్నాయి.

మొట్టమొదటి ఉర్దూకవిత్వ మంతా ఫారసీ సాహిత్యాన్ని అనుకరించి ప్రేమ—విరహం ఈ రెండు భావాలతో నిండిపోయింది. వర్ణ్యవిషయం ఇంచుమించు చర్వితచర్వణం కావడంచేత కవుల ప్రతిభ లుప్తమయిపోయి, కేవలం శైలిలోను, అలంకారాలలోను మాత్రమే విశిష్టత మిగిలింది. చెప్పినదానినే మరో విధంగా త్రిప్పిచెప్పటం, క్రొత్తక్రొత్తఉపమానాలు తేవటం, అనుప్రాసాది అలంకారాలు శ్లేషలు చూపించడం ఎక్కువయిపోయింది. ఒక్క చెప్పేపద్ధతిని మినహాయిస్తే ఆకవిత్వంలో ఎక్కడా ఏ విషయంలోను క్రొత్తదనం, కొత్తభావాలు కనుపించవు—అవ్వే కథలు, అవ్వే ఘట్టాలు, అదే నడతతీరు, అవే వర్ణనలు. వాటిని దాటి ముందుకు పోవటమనేదే లేదు. మొదటినుంచి ఇప్పటి దాక ఉర్దూకవులు ఫారసీనుండి అనుకరణమో లేక అపహరణమో చేస్తూనే వచ్చారు. ఇతర వాఙ్మయాల్లాగ క్రమంగా వృద్ధిపొందుతూ వచ్చిన వాఙ్మయం దుకా ఉర్దూ. దానికి సిద్ధంగా ఉన్న పాయసాన్నం ఫారసీ వాఙ్మయం దొరికింది. ఆపాయసాన్నం రుచి మూచి, ఇక అన్ని విషయాలకు దానినే అనుకరించింది. ఉర్దూ కవులకు మనకోకిల రుచించదు. వారికి కొహసాన్, లేక సాహసాన్ నడిబడ్డున పరో, నరగిస్, సొసన్‌తో నిండియున్న ఉద్యానవనంలో కూసే బుల్‌బుల్ కావాలి. వారికి మన హిమాలయంకంటే చేతసూన్ పర్వతం ఎక్కువ ఆనంద మిస్తుంది. రుస్తుమ్‌యొక్క శౌర్యం, నౌశేరవాఁ న్యాయం, హాతిమ్ చేసినదానం, లైలా మజ్‌నూ ప్రేమ—ఇవే ఉర్దూకవులకు ఆదర్శాలు. ఇక్కడి హిమాలయం, గంగ, యమున, గోదావరి, కృష్ణ, ఇక్కడి షడృతువులు, వేనకువేలు పక్షులు, ఇక్కడి మహాబల పరాక్రమ సంపన్నులగు వీరులు, ప్రేమకథలు మతద్వేషంవల్ల వారికి రుచించనేలేదు. ఇంతకూ చెప్పేది ఏమనగా, ఫారసీకవులు చెప్పగా విని రాసినవారేకాని దూః స్వయంగా అవి అనుభవించి రాసినవారు చాల తక్కువ. కళ్ల ఎదుటనున్న భారతదేశపు దృశ్యాలు వదలి పెట్టి ఫారసీకావ్యాలలో వర్ణించిన దృశ్యాలనే మాటి మాటికీ వర్ణించడంచేత పిష్టపేషణం జాస్తీఅయిపోయింది. ప్రకృతి—పర్యవేక్షణ లేకపోవటంవల్ల, ప్రతికవీ ఫారసీ దేశం వెళ్లిచూచి రావటం సాధ్యం కాకపోవడంవల్ల కవిత్వం ఒకేమార్గాన్ని పట్టింది. పోతే, ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. ఇతర వాఙ్మయపు కవులకంటె ఉర్దూకవులలో కావ్యచమత్కారం ఎక్కువ దొరుకుతుంది. కథలు, భావాలు ఒకేమాదిరిగా ఉండడం చేత చమత్కారంగా వర్ణించకపోతే పాఠకులకు హృదయాకర్షణ ఉండదనే భయం ఎక్కువయింది. భారతీయ ఆలంకారికులు నిర్ణయించిన నవరసాల్లో ఒక్క శృంగారరసమే తీసుకున్నారు ఉర్దూకవులు. అందులోనూ విరహాన్నీ, నిర్వేదాన్నీ వర్ణించటంలో వారిది అందె వేసిన చెయ్యి. విరహాన్ని ఇన్నివిధాలుగా, ఇంతలోతుగా వర్ణించిన కవులు ఇంక ఏ ఇతర భాషల్లోనూ కూడా లేరేమో బహుశా! ప్రేమ సంబంధమయిన భావాలకు ఇంత శబ్దజాలంకూడా ఇతర భాషల్లో లేదేమో అనిపిస్తుంది. కాని ఈ రసాన్ని వదలి అన్య

రసాలంబనం చేసినకవులు చాలా తక్కువని చెప్పవచ్చు. సహజమైన స్త్రీ-పురుష శృంగారవర్ణన వదలి పురుషులు నవయువకులమీద చూపించే శృంగార ప్రేమ వర్ణన చాలా అస్వాభావికంగా ఉంటుంది.

ఉర్దూ కవుల వియోగవర్ణనలో సూఫీకవుల (మహమ్మదీయ వేదాంతుల) ఆధ్యాత్మిక భావాలు కూడా కలిసి ఉంటాయి. వియోగశృంగారంలో, కరుణ భావాలు కూడా కలిసినప్పుడు అద్భుతంగా ఉంటుంది. పాశ్చాత్య వాఙ్మయ సంపర్కంవల్ల ఇప్పటి ఉర్దూ రచయితలు తమ మార్గాలను ప్రశస్తం చేసుకుంటున్నారు. ప్రకృతివైపుకు ఎక్కువగా మొగ్గుతున్నారు. ఏది ఎలా ఉన్నా వియోగప్రేమలోని అనేక భావాలను ఇంతచక్కగా అమితంగా వర్ణించిన వాఙ్మయాలు చాలా అరుదుగా ఉంటాయి. విరహకష్టం, నిరాశవటన కలిగేదుఃఖమును సరించిన వర్ణనలు నిజంగా గుండెను నీరుచేస్తయి. ఈ విషయంలో ఉర్దూకవుల వర్ణన పటుత్వం కొనియాడతగినది. ఉర్దూలో మృతులైన వారినిగూర్చి స్మృతిరూపంగా వ్రాసిన వాఙ్మయం కూడ చాలా ఉంది. ఈ మార్గంలో ఉర్దూ కవులు తమ ప్రతిభను ఎక్కువగా చూపించినారు.

ఆధారగ్రంథము:

ఉర్దూ సాహిత్యకా ఇతిహాస్.

వసంతతిలక

శ్రీ పిలకా గణపతిశాస్త్రి

౧

ఓ సుందరీ ! నవవికస్వరచారుతాజ్యా
లాశోభినీ! లలితకుంతలనీలఫాలా!
నీ వెవ్వరో కద! అహో! అమృతాంశులోక
మ్మావిర్భవించి, వికసించుమ నేడునాలో!

౨

ఏలో! అపూర్వ భవదాకృతిలో విలోల
విన్మోకుంకుమారుణహృదంతరజీవరేణు
జాలమ్ము, మెల్ల విరియు న్నవశోణమందా
రాకారమై, మృదుసుఖానిలచంచలమ్మై.

౩

నీ సుందరాకృతి మహోదయవేళ నాలో
సర్వేంద్రియమ్ములు విహంగమపాళిలీలన్
ఆశాంతరాళములలో విహరించు నెన్నో
నిస్వాణముల్ కలకలమ్ములలో ధ్వనింపన్.

౪

నీమోహనాకృతి యెదో కమనీయరాగ
మ్మై మ్రోయు నొక్కపుడు నా యెద లీనమౌ
నీ చారుతానిలము సోక తరంగితమ్మై [చున్
లేచున్ హృదంతర మొకంత మహోర్మివోలెన్

౫

నాజీవితమ్మున ప్రతీహృదయాంతరాళ
ధ్యానమ్ము నొక్కగతి నీవిధిఁ బ్రశ్న వేయున్:
ఓ జీవితైకనిధి! ఓతరుణీ ! త్వదంత
ర్లీనార్థ మేదో కద! నీ ప్రణయార్థ మేదో!

౬

ఓ కౌముదీమయి ! ఇదే గ్రహియించితి న్ని
న్నీ కౌగిలింత నని నే ననుకొందు గానీ,
నీవో! నిరంతరము నాకు లభింపరాని
శ్రీవై వసింతు వమరోపవనమ్మునందే!

౭

కర్పూరహారతివలెం గమనీయతేజో
నృత్యమ్ములన్ వెలుగుచుందువు కన్ను
[దోయిన్ ;
శ్రీ నీడనై వెలుగు ని న్నరయంగలేకే,
నిత్యమ్ము నీపదతలమ్మున దొర్లిపోదున్.

౮

ఈజీవయాత్ర యెదో! యీబ్రదుకేమొ గానీ,
సర్వమ్ము లోక మొక సంశయమై కలంచున్
ఏదో : మహార్ణవము ఘోష, మృగేంద్రగర్జా
సంకాశమై, భయదమై, యెదలో ధ్వనించున్.

౯

ఎవ్వారు నా హృదయవేదన దీర్పనే లే
రివ్వేళ నీ బ్రదుకు శాంతిసుఖాల దేల్చన్;!
నా జీవయాత్ర సఫలమ్మొనరింప నీవే
ఓ జీవనైకతరణీ! కరుణింపు దేవీ!

వ్రణకిణాంకాలు

శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి

అంకితం : శ్రీకళాభాయీ రుక్మిణీనాథశాస్త్రికి

(కథానికా కా దిది; వధూనికా కాదు. ఒక ఉద్విగ్న నగ్నజీవితపు దొహోచిత్రం మాత్రం.)

౧

అతనిపేరు చెప్పను. ఎందుకూ చెప్పడం? మీసంగతి నాకు తెలుసు.

అతని దుర్బలజీవితగాథలన్నీ విని అతడెప్పుడైనా కనిపిస్తే — తుపాకులకన్నా భయంకరములైన మీ చూపుడువేళ్లను అతని మీదకి గురిపెట్టి వికవిక వికృతహాసాలు చెయ్యారూ మీరు?

నాకు తెలుసునయ్యా —

'టీ' కప్పులు ఖాళీచెయ్యడానికీ — సిగరెట్టు 'టిన్నులు' వూదెయ్యడానికీ సినీమాలకు వెంటపడడానికీ — యావన్మందీ స్నేహితులే; - మనస్సును వ్రయ్యలుచేసే జీవనబాధలను సానుభూతితో విని ఒక్కసారి దగ్గరగా తీసుకోమంటే 'ఒక్కండుఁ నీమొర ఆలకింపడు కురుత్మనాథ!' గదూ —

అతని నిశిత తర్కశక్తిని మర్యాద మంచీ లేని దుష్పాండిత్యంగాను – స్వచ్ఛ సౌందర్యచింతను పోకిరీతనంగాను – తమ తమ ఖాతాల్లో జమకట్టి, బుర్ర లేకపోయినా- ఒకరినొకరి పొగుడుకుని పైకి వచ్చిన పెద్ద మనుషులంతా ఆఅతిలోక కళాశాలిని పొడిచి-హింసించి బ్రేవని త్రేన్చారు.

ఆదెబ్బతో అతడు ఒకటోరకం 'సినిక్' గా తయారయాడు.

ఈవేళ కొందరు 'కవితాప్రియులు' అతని కెదురుగా వెళ్లి "ఫలానావారు తమ రా? అబ్బ! మీపద్యాలు వజ్రాలండీ — అయితే ఈసదరుకథ ఎప్పుడు రాశారూ? ఆ 'అక్షయపాత్ర'పత్రికలోని వ్యాసం కేవలం విశ్వవిద్యాలయం బి. ఎ. కు పఠనీయం చెయ్యవలసింది సుమాండి" అంటే వారి మాటలన్నీ మీదపడ్డ నిప్పుబొగ్గులలాగ దులిపివేసి సందుల్లోకి తప్పుకుపోతాడు.

౨

డిశంబరునెలలో ఒకనాడు రాత్రి భోజనం చేసుకుని కొంచెం చలిగావున్నా—వీధరుగుమీద మంచం వాల్చుకుని 'శుచిర్భూతం'గా ఒకధూమకాష్ఠం వెలిగించి, చల్లగాలికి మెల్లగా తలలు కదిపే కొబ్బరి చెట్లనూ – శుద్ధదశమి వెన్నెలపాలవానలో తడిసిన పంపరపనాసచెట్ల ఆకులనూ - చూస్తూ, అసుఖనన్నివేశంలో కొంచెం కన్నుమూశాను.

అప్పుడతడు ఎక్కడినుంచో వూడి పడ్డాడు. తలఅంతా రోడ్డుబూడిద పడి చెల్లాచెదరుగా వ్రేలాడుతూంది. ముఖం బుగ్గలూ క్షయరోగంవాడిలాగ పీక్కుపోయాయి. చొక్కా, పంచ, వుత్తరీయం అన్నీ మాసి రైలుఇంజను పుక్కిలించి ఉమ్మినట్టున్నాడు.

వస్తూనే నన్ను కౌగలించుకొని పసివాడిలాగ నామెడకు చేతులు తగిలించి ఒడిలోకి వ్రేళ్లాడాడు.

నేను ఉలికిపడి చూచాను.

వెనక నేను ఒకసారి అతన్ని బెజవాడలో చూచాను. ఎంత వెలిగేకళ్లు — ఎంత సునిశితమైన ముక్కు - చక్కని ఎర్రరంగు ఖద్దరుబట్టలు — కళ్లజోడు — ముందు అతన్ని, నేను చూచికూడా అపోహపడ్డాను. మాట కొంచెం దుడుకు — ఎవ్వరినీ లక్ష్యం చేసేవాడు కాడు.

పాపం — చాలామంది అర్థంచేసుకో లేక తిట్టేవారు. రానురాను అక్కడే నాకు ప్రాణస్నేహితుడయాడు. నన్ను, ఏజన్మలోనో పోగొట్టుకున్న అప్తుడు దొరికినట్టు చూచేవాడు. అతని ప్రతిమాట ఒకరసవత్సందేశం —

నేను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని తల నిమురుతూ అన్నాను.

"నాయనా! నీవేనా ? ఏమి టీరూపు ? ఏమి టీపతనం ?

ఆనాడు ఎంత ఉజ్జ్వలంగా వెలిగేవాడవయ్యా — ఇంతమార్పు నీలో ఎలా వచ్చిపడింది?"

నాకళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

ఇంటిఎదుటి తోటలోని పంపరపనాస పువ్వుల మృదులవాసనలు ఏవో పూర్వజన్మ వాసనలను కదల్చుతున్నాయి.

ఆసువాసనాసుఖానికి అతడు కొంచెం తూలి నాముఖమల్ దిండును బలంగా ఆనుకుని, గ్రీష్మకాలపు నిప్పుటెండలకు కాలిన భూమి చల్లని తొలకరివర్షపు కౌగలింతకు విడిచే వెచ్చని ఆవిరివలె — పొడుగైన నిట్టూర్పు పుచ్చి అన్నాడు.

"అన్నా! 'విసిగినప్రాణుల పిలిచే దేమిటి — 'దుర్గతి — దుర్హతి — దుర్మతి — దుర్మృతి —' కదూ ?

ప్రపంచంలో కొంతమంది మనుష్యులు ఎంత అదృష్టవంతులయ్యా!

చేతికి దొరకిన డబ్బులతో — సమయానికి తటస్థపడ్డ భార్యతో — కంటికి అందిన త్రోవలో — జీవితాన్ని ఒంటెద్దుబండిలాగ గెంటుకుపోతారు, సురక్షితంగా.

ప్రయోజకులు — బాగుపడేవారు.

ప్రపంచపద్మవ్యూహంలో పడి నిరంతరం జీవనాన్ని — సంకుల యుద్ధరంగంగాను — తుఫానుసముద్రంగానూ — చేసుకుని, సమాజంలో — పురాణవిశ్వాసాల్లో - తిరుగుబాటును వ్యూహించి, తిట్లు తిని, ఆదర్శాలకో సం పోట్లాడే నావంటివాళ్లూ - నేనూ అప్రయోజకులం - అభాగ్యులం —

తినడానికి అన్నం - తిరగడానికి డబ్బు-శరీరానికి భార్యా - వున్నంతలో మమ్మల్ని దహించే అశాంతి చల్లారుతుందా ?

మనుషులు ఇనపముక్కలతో తరిమి పొడుస్తూవున్నా — మా అన్వేషణకు అంతు కనపడదు.

ఒక స్నేహితుడు డన్నాడూ: 'మానవ జీవితం అంటే — ఒకఅనుపలబ్ధవస్తువుకోసమైన మహాప్రస్థానం - దానిఛాయ జీవితం మీాద అంతటా కనపడుతుంది.'

ఔను నిజం —

మా కేం కావాలి ? — ఏమో మాకే తెలియదు. మా కోరికలే లోకాతీతాలు కాబోలు కవి అన్నట్టు —

We look before and after
And pine for what is not,

ఇంకోకవి 'వింతగా దోచు నాదు జీవితము నాకె' అన్నాడు.

శుద్ధశ్రోత్రియ హిందువుడికి 'ఖురానె షరీఫ్'వలె అప్పకవి స్కూలువాడికి భావకవి 'కృష్ణపక్షం'వలె సామాన్యసంసారికి మాజీవితధోరణి – వికృతంగానూ విద్రోహాకరంగాను కనపడుతుంది కాబోలు, మమ్మల్ని చూచి పెదవి విరిచి చక్కాపోతాడు.

"శాలిన ప్రేయసిదేహం కమురుకంపు ఈలోకం". మావాడు ఎన్నిహింసల్లో – ధిక్కారాల్లో కుమిలి అన్నాడో పాపం ఈమాటను –

మాకుకూడా చల్లని మంచువంటి జడబుద్ధిని ఈశ్వరుడు ప్రసాదించివుంటే – మేము మాత్రం దేన్నిగురించీ గాఢంగా ఆలోచించక – దేన్నీ నిశితంగా చూడక – దేన్నీ పూర్తిగా వినిపించుకోక సుఖపడేవాళ్లం కాదూ —

ఆ అదృష్టం మాకు లేదు—

ఏ బృహస్పతి – జాబాలి – చార్వాకుడు ఉపనిషదృషి - మమ్మల్ని సృష్టిచేసి - ఈతలలు పగలగొట్టే తర్కాన్నీ — బ్రదుకంతటినీ కాల్చే సౌందర్యచింతను - నూత్నసంస్కారంకోసం పడే తహతహను - నూరిపోశారోగాని, మామస్తిష్కం శాంతికి నోచుకోలేదు.

"ఏపువ్వు పూసినా ఏపాట పాడినా
ఏ కష్టజీవినెత్తురు పరదవారినా
ఏవలపుటెడద వెచ్చనియూర్పు కదలినా
ఏపేదవాని ఆకలిచిచ్చు రగిలినా
ఈ హృదయ మెందుకో ఇంత
కళవళపడును."

లేకపోతే — వెంకటచలాన్ని పగిల్చి అన్నికథ లెందుకు బయటపడ్డాయి ?

కృష్ణశాస్త్రిని దహించి అన్ని కావ్యాలు ఎట్లా పుట్టిపడ్డాయి.

శ్రీ. శ్రీ క్షోభించి ఎందు కన్ని 'గరంగరం' గేయాలు వ్రాస్తాడు.

అన్నా, నిన్ను నాతీవ్రధోరణిలో విసిగిస్తున్నానుకదూ. ఇంక చాలు –

ఒక్కసారి కళ్లు తుడుచుకొని నా హృదయం మీదికి చూడు –

దీనిమీద ఎన్నిపుండుమచ్చ లున్నాయో చూశావా ?

ఈ౩౦ఏండ్ల బ్రదుకులోనూ నాశ్రేయస్కాములైన ప్రియురాండ్రు-స్నేహితులు-బంధువులు అనుగ్రహించిన వరప్రసాదాలు సుమా - ఇవి. - ప్రతిగాయం వెనుకనూ ఒక హిందూదేశచరిత్ర అంత కథ వుంది. చూడు.

3

నా చదువు పూర్తిచేసుకుని పట్టణంలో అయాచితంగా దొరికిన ఆచిన్న నౌఖరీని అవలంబించి ఒకమారుమూలవీథినివాసంతో నాజీవితనాట్యానికి తెర తీశాను.

అదే మొదటిసారి ప్రపంచాన్ని చూడడం ప్రారంభించిన నాకు ప్రపంచంఅంతా ఒకబృందావనంలాగు కనపడింది.

ఓహో! విద్యుద్దీపాలు — ధూమశకటాలు — యంత్రాలయాలు — 'మోడరన్ కెఫే'లు - సినిమాలు - అనుకోని విచిత్రానుభవాల సుడిగుండాలలో పడి గిరగిర తిరగడం ప్రారంభించాను.

నాఎదుట ఏ ఇంద్రజాలికుని పింఛమో జరజర కదిలి ఇన్ని అద్భుత దృశ్యాలను మొలిపించిం దనుకున్నాను.

సీతాకోకచిలకల్లాగ ఎగురుతూ విద్యాలయాలకు వెళ్లే చిత్రాంగులు - అతిమేధాసంపత్తితో తలదించలేని ఇంగ్లీషువిద్యాధరులు - మీటింగులు - చిత్తుతీర్మానాలు - ఆదర్శవాదాలు నన్ను భూమిమీద, స్తిమితంగా నిలవనియ్యలేదు. భూమికి పదిగజాల ఎత్తునవే అప్పటి నావిహారం - నావ్యవహారం.

ఇంత మధురమైన మానవ జీవితాన్ని - కొందరు వృద్ధజంబుకాలూ — హతాశులూ - 'సంసారసాగరం దుఃఖం తస్మాజ్జాగృత - జాగృత' అని తిడతారు అనుభవించలేక - పిచ్చివారు అని నవ్వేవాడను.

వీరేశలింగాలూ - సమాజ సంస్కారాలూ, రామమోహనులూ - బ్రహ్మసమాజాలూ, గాంధీమహాత్ములూ - స్వాతంత్ర్యయుద్ధాలూ వేయిచేతులు విసరి నన్నే పిలిచారు, పిలిచినవి

అప్పుడు నాస్నేహితులంతా స్వార్థరహితులే — దేశదాస్యానికి విలపించేవారే - సంస్కారానికి నడుంకట్టి ముందుకు దూకేవారే -

వీరిమధ్య నాజీవితాన్ని ఎంత వున్నతం - ఎంత - ఉజ్జ్వలం చేసుకోవచ్చును.

ఈ మహావకాశాన్ని జారిపోనివ్వగూడదు అనుకున్నాను.

సరిగ్గా ఆ పుణ్యకాలంలోనే నరహరి నాకు ప్రాణస్నేహితు డయ్యాడు. ఎన్నో విధాల నా ఉత్తమాశయ పరిపూర్తికి తోడ్పడడానికి మాటఇచ్చాడు. ఎన్నో సంస్కారాలు వాడి వడపోసినవాడుట.

స్త్రీజనపక్షపాతంలో బలమైన బ్రహ్మసామాజికుడు - స్వపరభేదం ఎంతమాత్రం లేని పక్కాఅద్వైతి - 'ఋణం కృత్వా ఘృతం పిబేత్తు'లో ఖచ్చితమైన చార్వాకి.

తరచు నావిజ్ఞానాభివృద్ధికీ - ఏకాంతవాసక్లేశ నివృత్తికీ - సహాయపడుతూండేవాడు.

ఒకనాటిరాత్రి సుమారు పదిగంటలకు నాగదిలో దీపంముందు కూర్చుని 'న్యూస్ పేపర్' తిరగవేస్తున్నాను.

చటాలున నాగదితలుపులు తోసుకుని ఒకపదహారేండ్ల అమ్మాయి ప్రవేశించింది.

నల్లగలువపూవువంటి నాజూకైన ముఖం చామనచాయ - కొత్తఫక్కీలో చుట్టిన జడలో ఏవో రెండుపువ్వులు -

దీపపుకాంతికి మెరిసే అగాధమైన కళ్లలో ఏవోగాథలు -

ఉలికిపడి చూచాను. ఆమె అందుకుంది.

"క్షమించండి - మీకు తెలియకుండా - కథల్లో ప్రవేశించినట్లు - తలవనితలంపుగా ఇట్లా రావడం అపచారమని నాకు తెలుసు. మీ విశాలహృదయమును - పరోపకారదయాస్వభావములనుగూర్చి విని గత్యంతరం లేక ఇట్లా వచ్చాను.

పరిచయం లేనివాటికి అందులోను ఒక యువకుని దగ్గరకు - రాత్రి నావంటిది రావడానికి ఏవో అనివార్యపరిస్థితు లుండవచ్చునని మీవంటి బుద్ధిమంతులు వూహించుకోగలరు.

కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

స్త్రీజన్మ ఎంత క్షుద్రమైనదీ - ఎంత నిస్సహాయమైనదీ - ఇప్పుడు తెలియవచ్చింది నాకు. - నన్నిపుడు ఎవరు ఆదుకోగలరు? ఎవరు నా అంధజీవితానికి తోవ చూపించగలరు?"

"అసలు మాది కృష్ణాజిల్లా - సాతాని వైష్ణవుల ఇంటిబిడ్డను. నాపేరు వెంకటలక్ష్మి- నాకు ముసలితల్లీ - అయిదేండ్ల తమ్ముడూ తప్ప చెప్పదగ్గ ఆస్తి ఏమీ లేదు.

వివాహబంధంలో చిక్కుకుని ఆదీనులను విడిచిపెట్టలేక చదువుకుని మా బీదకుటుంబానికి సహాయపడదలచి, ఈవూరి హైస్కూలు అధికారులు స్త్రీ విద్యాభివృద్ధికి మంచి ప్రోత్సాహం ఇస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చాను. ఇంతవరకూ వారిసాహాయ్యంమీదనే ఆధారపడి ఈ సంవత్సరం స్కూలు ఫైనలు క్లాసులోకి వచ్చాను.

నేటికి నాకు శనిరోజులు వచ్చాయి. నా మీద పిడుగువంటి అపవాదు పుట్టించి.

నేటికి నాచరిత్ర 'అనుమా'నాస్పదం అయింది. కిట్టనివారు అధికారులతో ఏవేవో చెప్పారు. వారు నమ్మి నన్ను రేపటి నుంచి హాస్టలు విడిచి పొమ్మన్నారు. పబ్లికు పరీక్షలు ఇరవైరోజు లున్నాయి. తెల్లవారితే నాకు ఇక్కడ నిలవనీడ లేదు."

తెల్లని పైటచెరగుతో కళ్లు తుడుచుకుంటూ తల తిప్పుకుంది.

ఆమెమాటలు మెత్తని నాకొత్తహృదయంమీద గుచ్చుకున్నాయి.

స్త్రీజనోద్ధరణంమీద ఉపన్యాసాలు దంచడంతో ఆగే ఆరితేరిన పెద్దమనిషినైతే చాలా విచారాన్ని ఇంగ్లీషుతో తెలిపి పంపివేసి వుండును.

ఆదర్శ ఆశయాలను అమలుకూడా చెయ్యాలనే అవివేకినిగనుక ఒకనిశ్చయంతో లేచాను.

"అమ్మా! నీదురదృష్టకథవల్ల నాహృదయం కరిగింది. త్రికరణశుద్ధిగా నేను చెయ్యగలిగినంత సహాయం చేస్తాను.

ఈ రాత్రికి తిరిగిరాను - ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. ఇక్కడనే విశ్రమించు - బెంగపెట్టుకోకు" - అని ఊరిచివరవున్న ఒక బ్రహ్మసమాజ స్నేహితుడి ఇంటికి వెళ్లాను. సంగతంతా చెప్పి నెలరోజులు అతనిఇంట ఆమెకు ఆశ్రయం ఇమ్మని ప్రార్థించాను.

అతడు నవ్వుతూ ప్రేమతో వీలులేదని పంపివేశాడు.

శ్రీకేషబ్ చంద్రలూ - రామమోహనులూ స్థాపించిన విశ్వప్రేమమతంలో కొందరిలో ఇంత కుళ్లు వుందని నాకు తెలియలేదు.

ఆ రాత్రికి ఒక సత్రంఅరుగుమీద పడుకొని తెల్లవారేసరికి నాగదిప్రాంతానికి చేరుకున్నాను.

నాకళ్లు గిర్రున తిరిగాయి. నాగదిలో వింతదృశ్యం.

నరహరి నాగదిలో వున్నాడు. ఆమె పైటను ఒడిసిపట్టి సరసాలాపా లాడు

తున్నాడు. ఆమె ప్రణయకోపంలో గునుస్తూ పెనుగులాడుతున్నది. ఇద్దరూ నిద్రమత్తులో తూలుతున్నారు. నరహరి నన్ను చూచి మెల్లగా జారిపోయాడు. ఆమె గ్రహించి కళవళపాటుగా తలా - చీరా - సర్దుకుని ఒకపుస్తకం పేజీలు తిప్పుతూన్నది. వెళ్లాను. 'లక్ష్మీ! ఎంత నమ్మించావమ్మా — నన్ను — మోసం - అబద్ధాలచాటున ఈ కళ్ళల జీవితం ఇక్కడ ఇంకా ఎన్నాళ్లు గడపదల చావు? -

వాణ్ణి పెళ్లిచేసుకుని ఇకనైనా నిర్మలంగా బతుకు - విద్యాలయాధికారులు న్యాయంగానే ప్రవర్తించారు. వెళ్లు - దీనితో చిన్న ఖర్చులు తీర్చుకో - ఒకకవరు విసిరివేశాను.

తలవంచుకొని వెళ్లిపోయింది.

ఛీఛీ! నరహరీ - ఈమే - కలిసి నన్నెం తపశువును చేశారు - న న్నడ్డంచేసుకుని ఎంతక్షుద్రనాటకం ఆడదలు నారు.

నరహరి ఎంత సంస్కారవాడి! ఎన్ని పవిత్రోపన్యాసాలు - ఇంతనీచుడు నాకు ప్రాణమిత్రుడా - సిగ్గుతో కుంగిపోయాను. నరహరి మళ్లా కనపడలేదు. నేనే లక్ష్మిని దేరదీసి ఆమె బ్రదుకును భగ్నంచేసి తరిమివేశావనీ, - తాను - ఎంత బుద్ధిచెప్పినా వినలేదనీ నరహరి నామీద 'స్కాండల్సు' ప్రారంభించాడని తరవాత తెలిసింది. ప్రపంచంలో ఒకతట్టుదుర్వాసన అప్పుడు నాఘ్రాణేంద్రియానికి కొట్టింది. పిదప మనుష్యమాత్రుణ్ణల్లా నమ్మడానికి వీలులేదని గ్రహించి, సజ్జన సాంగత్యంకోసం తడుముకుంటూ వుండగా కొన్నాళ్లకు మాధవరావుగారితో నాకు మైత్రి ఏర్పడింది. నాగుణాలు ఏవి ఆయనను అంతగా ఆకర్షించినవోగాని నన్ను ఆయన ఎంతో ప్రేమించాడు.

తరచు తమఇంటికి వస్తూండమనీ చక్కని సాహిత్యచర్చలంటే తనకు చాలా ఇష్టమనీ అనేవాడు.

నాకు కొత్తవారిఇంటికి వెళ్లడమంటే ప్రాణాంతకం. వాయిదాలు వేస్తూ ఆఖరికి ఒకనాడు ఆయన బలవంతంమీాద వెళ్లాను.

చక్కని కొత్తమాదిరిఇల్లు - చుట్టూ పూలతోట. డ్రాయింగురూములో అందమైన రోజ్‌వుడ్డు కుర్చీలు - మధ్య టీపాయ్ మీాన చైనాగాజు కూజాలో రకరకాల పూలగుత్తులు.

అక్కడ కూర్చుని అప్పటి రాజకీయాల మీాద సాహిత్యధోరణిమీాద కొంతసేపు ప్రసంగం జరిగినమీాదట ఆయన ఇంట్లోకి చూచి 'సుభా! రెండుకప్పుల 'టీ' తెచ్చి పెట్టమ్మా' అన్నాడు.

పదినిమిషాల్లో ఆకుపచ్చపూల కర్టెన్ తొలగించి 'ట్రే'లో టీకప్పులు వుంచుకొని ఒకబంగారపుబొమ్మ ప్రవేశించి 'ట్రే' ఆయన ముందు వుంచింది. "చూడమ్మా! ఈయన ఫలానా నాస్నేహితులు ఇప్పటి తెనుగు రచయితల్లో మంచిచెయ్యి - పత్రికల్లో చాలా చదివివుంటావు." పరిచయంచేశాడు.

ఆమె ఈషత్తు తలయెత్తి మందహాసంతో గౌరవించింది. వేయిమొగలిపొట్టలలోని రేకులు నాచుట్టూ వికసించి తీవ్రంగా పరిమళించినట్టయింది.

తర్వాత ఆయన నావైపు చూచి 'ఈమె మాచెల్లెలు సుభద్ర - ఇంగ్లీషు వచ్చినా తెలుగురచనలంటే ప్రాణం. చిన్నప్పుడే

మంగళసూత్రం అమంగళపాత్రం అయిపోయింది, అన్నారు జాలిగా. -

ఆమె తలవంచుకుంది.

నేను ప్రసంగం మార్చాను. టీ సేవిస్తూ రుచిమైన మాటలలోకి దిగాం. కొంతసేపటిలోనే సుభద్ర అరమరిక లేకుండా చనవుగా సస్నేహముగా మాచర్చలలో పాలుపుచ్చుకుంది. ఎంత చురుకు - ఎంత చలాకీ - ఆ ఎర్రని కుంకుమపూవుపెదవులు కదలితే చాలు - కావ్యరహస్యాలు- విజ్ఞానకాంతులు నృత్యంచేస్తాయి.

వారితో చాలాసేపు గడిపి సెలవుతీసుకుని నాకూస్యగృహమార్గం పట్టాను.

కాళ్లు ముందుకు - హృదయం వెనకకు- ఏదో విచిత్రానుభవం.

"చెలివలపులేని యీబ్రతుకు కాల్పనె చెపుమ?"

"ప్రేమ కలుగక బ్రదుకు చీకటి" అనే కవివాక్కులు ఉపనయనమునాటి బ్రహ్మోపదేశంలాగు నాచెవులలో రింగుమని మ్రోగుతున్నాయి. ఆ 'ఆలివు' రంగు సిల్కుచీర-రసప్రపంచములను పుక్కిలించే నల్లనికళ్లు. 'సైగల్'కంఠమాధుర్యలోని సంగీతకళవంటి ఆమెతియ్యని కదలికలు - నన్ను విడువకుండా వెంటాడుతున్నాయి

మనస్సు మహాచెడ్డది - ప్రేమ బహుదొడ్డది. ఎన్నడూ ఎరగని వికారం ఒకటి నన్ను పట్టుకుంది.

నా అంతట నేనే వారి ఇంటికి ఎన్నోసార్లు వెళ్లాను. మాధవరావుగారు మిక్కిలి సంతోషంగా నన్ను ఆహ్వానించి - నాచేత పద్యాలు చదివించి ఎన్నో చర్చలు లేపెట్టేవారు.

ఎప్పుడూ సుభద్ర నాపక్షం -

క్రమంగా మాస్నేహం వదల లేనంత బలిసింది. మంచి పుస్తకాలూ - పత్రికలూ - వెదకి సుభద్ర కివ్వడం నాపని -

తనకు నచ్చిన గ్రంథభాగాలు - పద్యపు తునకలు నన్ను వెదకి వినిపించడం ఆమెకు నిత్యకృత్యం -

మామధ్య ఒక ఆనందసముద్రం పొంగి అమృతతరంగాలు విసరడం ప్రారంభించింది.

పద్మావతీదేవి జయదేవుని జీవితాన్ని మధురలాస్యం చేయించినట్టు - సుభద్ర నాబ్రదుకును ఎన్నడూ ఆరని దివ్యజ్యోతులతో వెలిగించుతుంది కాబోలు -

ఒకనాడు మామూలుగా కాలక్షేపానికి వారింటికి వెళ్లాను. మాధవ రావుగారు ఎక్కడికో వెళ్లారు. సుభద్ర ఎక్కడా కనపడలేదు. పెరట్లోకి వెళ్లాను.

అప్పుడే సూర్యాస్తమయం అయి, నరుగుడుచెట్ల సన్నని కొమ్మలవెనక చంద్రుడు లేచి వెలుగుతున్నాడు.

సుభద్ర పారిజాతపుచెట్టుకింద నించుని ఒకకొమ్మ నానుకుని, సబితాదేవి 'పోజు' లో లీలాదేశాయి ఒకనాట్యభంగిమపు వంపులో ఆవైపు తిరిగి ఏదో ఆలోచిస్తూన్నది. రెండుపువ్వులు ఆమెతలమీద పడి వెన్నెలకాంతిలో మెరుస్తున్నాయి.

అప్పుడు నాలో కోటిరసధునులు ఉప్పొంగిపోయినవి. ఆ మనోహర ప్రకృతిలో - నా మనస్సు బుద్ధి ఆత్మ అన్నీ ఏకమై పరవశంగా

నన్ను ఒకఆనందనిస్థకు గెంటినవి. నే నేమీ ఆలోచించలేక పోయాను.

నెమ్మదిగా సుభద్రదగ్గరకు వెళ్లి బుజం మీద చెయ్యివేసి 'పద్యాలు ఆలోచిస్తున్నావా సుభా?' అన్నాను.

ఆమె వేటువడ్డ అడుత్రాచువలె ఎగసిపడి నాచేతిని విదళించి దూరంగా జరిగి, 'ఏమి టీప్రవర్తన? మీరుగనక ఇప్పటికి... క్షమించాను. పురుషులకు లోబడడమంటే నాకు చాలా అసహ్యం'. వెళ్లిపోయింది.

నానోటమాట రాలేదు. ఏమి టీప్రళయం? పూలదండ ఇందుమతీదేవిని చంపినట్టు ఈ 'స్నేహమయి' నన్ను హింసించింది.

"విషమ ప్యమృతం క్వచి ద్భవేత్
అమృతంవా విష మీశ్వరేచ్ఛయా".

ఆ అవమానభారంతో కుంగిపోయి నరకపు లోతులకు అసూర్య నామలోకాలకూ ప్రాకిపోయాను.

ఔను, నేను గాఢంగా పొరబడి ప్రేమకోసం చేయిచాచడం తప్పుకాదూ?

ఏమో - ప్రేమించడం అపచారమా? ఒకరిని ప్రేమించడం ప్రేమించకపోవడం మన చేతుల్లో వున్నదా - అది హృదయధర్మం— దానిముందు అహంకారం అహంకర్తృత్వం నిలవలేవు. దానినలు -

ఈమె చూపిన స్నేహమంతా ప్రేమ పరిపాక మనుకున్నాను. ఈమెది ఇంత రసవిహీన ప్రకృతిగాబోలు -

చాలు. ఈమర్మోపఘాతం - దారుణ తిరస్కారం తిరుగులేని ఆశాభంగం - ఇదే మొదలూ తుదిగా జన్మాని కంతటికీ చాలు- అక్కణ్ణించి తలమెత్తకుండా వెళ్లిపోయాను. ఒకసంవత్సరం తిరిగిపోయింది.

౪

హఠాత్తుగా ఒకనాడు విశ్వనాథంగారు రోడ్డుమీద కనపడి ఎంతో ఆదరించి మాట్లాడాడు.

నా కెక్కడో దూరబంధువట - ఎంత బంధుప్రీతి - ఎంత మాటపొందిక - సాక్షాత్ బుద్ధదేవుల్లా కనిపించాడు.

నాతెలివిని - చదువును - భవిష్యత్తును నేను వద్దనేదాకా పొగిడాడు. ఎంత మంచి వాడు మంచితనం అంతా ఆయనలో పేరుకున్నట్టు కనబడ్డాడు.

ఒకవూహ—

ఈయనకు నావల్ల ఏమైనా అవసరం వుందా లేకపోతే ఎందు కింత 'సైరు'?

ఛా- స్వార్థరహితుడు - గాంధితరవాత గాంధీ అంతవాడు.

విశ్వనాథంగారి మాట నాకు యజుర్వేదంకన్న ప్రమాణంగా కనపడింది.

ఒకసారి ఆయనఇంటికి నన్ను తీసుకు వెళ్లారు. వారింట్లో అంతా అంతే - బహుసున్నితం - మర్యాదాలోనే పుట్టారు.

అందరూ అనర్గళంగా చదువుకున్నట్టు కనపడతారు. ఐదేళ్ల కుర్రవెధవకూడా కందిపప్పు బుక్కుతూ ఆరోగ్యసూత్రాలు మాటాడుతాడు

అప్పుడు నాకు వారింట్లో జరిగిన ప్రత్యుత్థానానికీ గౌరవానికీ మితిలేదు.

తత్ఫలితం వెంటనే నాకు కనిపించలేదు గాని - ఆరునెల్లకు ప్రత్యక్షం అయింది.

విశ్వనాథంగారి అన్నకూతురు ఒకగొం గళీపురుగు నాకు ధర్మపత్ని అయింది.

ఎన్నిప్రలోభనాలు—ఎన్నిఆకర్షణలు — నా ఉన్నతాదర్శాలను - నా భావనలోని మధుమూర్తులను - నాశనంచేశాయి.

అనవరతమూ అంబరవీథుల్లో — సౌందర్యకాంతుల్లో — మందాకినీ సువర్ణసైకత వేదికల్లో — విహరించే నామెడకు భూలో కంనుంచి ఒకఇనపగొలుసు వచ్చి తగిలి నేల మట్టానికంటా లాగివేసింది.

ఎంత వేదనపడ్డాను — ఎన్ని వెన్నెల రాత్రులను కన్నీళ్లతో గడిపాను. నాపతనా నికి ఎంత ఏడ్చాను.

తర్వాత విశ్వనాథంగారు నన్ను కూ ర్చోబెట్టి ఇప్పటి యువకుల బుద్ధిలోపాన్ని — సంఘసంస్కారవ్యాధినీ — సంధ్యావందన ప్రాశస్త్యాన్నీ — తద్దినప్రాధాన్యాన్నీ—సనా తన మతాభిమానాన్నీ — పురస్కరించుకొని వచ్చీరాని సంస్కృత కారికలను ఉదాహరి స్తూ లెక్చర్లు దంచడం మొదలుపెట్టాడు.

అసహ్యంవేసి ఆయన బూజుభావాల కింద నిలవలేక ఒకసారి లేచిపోయాను.

ఆసాత్త్వికమూర్తి కొరకొరలాడి 'వినాశ కాలే విపరీతబుద్ధిః' అని ఆశీర్వదించాడు.

లౌక్యులయ్యా — ప్రయోజకులు —

మాగౌతమబుద్ధుడు ౨౦ శతాబ్ది తగు మనిగా తయారయాడు.

ఇప్పు డెవరైనా నాప్రసంగం ఎత్తితే చప్పరించి పెదవి విరిచివేస్తాడు - బాధుసము ద్రుడు -

రామబంధువు —

రెక్కలు కాలి అధోలోకానికి జారిపో యిన సంపాతివలె నేను క్షుద్రులలో పడిపో యాను. నాభవిష్యత్తు అధోగతి పాలైపో యింది.

నామహోజ్జ్వల భావాలు ధూళిలోపడి పొరలుతున్నాయి. నాతరుణజీవితం పతితమై పోయింది.

కళ - రసికత్వం - చమత్కారం — ఉత్సాహం అన్నీ మోడుచెట్టునుంచి చిలు కల్లా నానుంచి ఎక్కడికో ఎగిరిపోయాయి.

ఇంక నాజీవితపరిధుల్లో ముఖ్యసామగ్రి గా ఏర్పడ్డవి - కుళ్లుమొహాలూ - డబ్బులూ — కాగితాలు - పిల్లలు - జమాఖర్చులు— అధికార్లూ - ఆశ్రయింపులూ - దొంగనవ్వు లూ స్వార్థాలూ —

అప్పటినుంచి శరత్కాలపు పాలవెన్నె లరాత్రులలో హంసరెక్కలమీద రివ్వున పరుగులెత్తే స్వచ్ఛ సౌందర్యరేఖాసందేశ ములు నాకు వినబడడంలేదు.

వసంతశ్రీ విశ్వవికాసమాధుర్యమూ వర్షాప్రభాత ఉషస్సువర్ణనదీకాంతిప్రపూర శోభాదర్శనం - ఇంక నా చర్మచక్షుస్సులకు లేవు.

నాకన్నులవెలుగు నష్టమయింది.

నాభావనలోని తీపి చచ్చింది.

నామస్తిష్కంలో ఏవో చిల్లులుపడ్డా యిగాబోలు—

తెలివి- యుక్తులు - చొరవ - అన్నిటి ఒకటే క్షామం.

ఈనాడు ఆరేండ్లకుర్రకుంక వస్నెడి ర్కాని నే నన్నదానినల్లా కాదని సునాయా సంగా ఓడించగలడు.

ఇప్పుడు ప్రతిచేటపెయ్యా నన్ను బెదిరించగలిగినదే —

ధిక్ - ధిక్ —

అన్నా! నిన్నింక బాధపెట్టను—

చాలా ఆయాసంగా బరువుగా అన్నాడీమాట —

నా ఎడారిబ్రతుకుకు 'ఒయాసిస్సు' వంటి నిన్నుఒక్కసారి చూచిపోదామని వచ్చాను.

వివిక్తహిమవత్సాంద్రారణ్యములలోకి పోయి ఘోరతపస్సు చెయ్యాలి. అంతవరకు చిచ్చువంటి నా ఆత్మకు శాంతిలేదు.

నేను పునర్జన్మమెత్తి నవ్యచైతన్యంతో తిరిగివచ్చి — ఈ జన్మలో పిరికితనంవల్ల వృద్ధజంబుకాలవల్ల — ఫలవంతములు కాని ఆదర్శభావాలను అప్పుడు ఫలింపించుకుంటాను. ఆచరణకురాని ఆశయాలను - నెరవేరని తీవ్రకాంక్షలను - నిర్వర్తించలేని ఉదాత్తకార్యములను-నిర్వహించితీరుతాను.

చటుక్కున ఉద్రేకంగా మరోప్రపంచపు పిలుపు విని ఉలికిపడ్డవాడిలాగు లేచి నిం మన్నాడు.

నే నతన్ని కౌగలించుకొని బాష్పములతో శిరస్సును తడుపుతూ తొట్రుపాటుగా ఏదో అంటున్నాను.

అతడు వినిపించుకోకుండా అప్రశాంత వీథిని దూసుకుంటూ వెళ్లిపోయాడు.

మైసూరు అగరువత్తివంటి ఆకళాతప్త జీవితం ఎన్ని చేతుల మీదుగా పోతుందో — పాపం!

—

భాస్కరాచార్యుడు

శ్రీ పిడపర్తి సుబ్బయ్యశాస్త్రి

౧

గణితశాస్త్రంలో మన హిందూదేశము యొక్క ఉత్కృష్టత దేశదేశాల చాటిన ఆచార్యుడు భాస్కరుడు. మన గణితగ్రంథాల్లో పశ్చిమదేశస్థులు ప్రథమమున అనువదించినవి భాస్కరుని గ్రంథాలు. ఇవి పందొమ్మిది, యిరవైశతాబ్దాల్లోని గణితశాస్త్ర గ్రంథాల కేమాత్రమూ తీసిపోవంటే అతిశయోక్తి కాదు. ఇంత ప్రసిద్ధు డగునితనిని గురించి రెండుమూడు విషయాలు మనం తెలుసుకుందాం.

భాస్కరుడు బ్రాహ్మణుడు, శాండిల్యగోత్రజుడు. మహేశ్వరుని తనయుడు, మనోరథుని మనుమడున్ను. ఇతని గ్రంథాల్లో యెక్కువగా వైష్ణవపరంగా ప్రార్థన లుండడం వల్లనైతేనేం, ఆచార్యశబ్దం నామాంతమందుండడంవల్లనైతేనేం కొంద రీతడు వైష్ణవుడన్నారు. కాని ఆచార్యశబ్దం కేవల మాతని పాండిత్యమునందలి ఉత్కృష్టతను తెలియజేసేదే ఐ ఉంటుంది. మహేశ్వరు డనుపేరు సాధారణంగా వైష్ణవుల్లో నాకరని నాఅనుమానం. అందువల్ల అతడు వైష్ణవుడు కాకపోవచ్చునని కూడా అనుకోడానికి వీలుంది. అత డేకులస్థుడైనా, ఏమతస్థుడైనా ఆకులానికీ మతానికీకూడా గర్వించదగిన కీర్తికి అర్హుడు. అందుకే అతణ్ని ఎవరిమట్టుకు వారు వారిలోనే చేర్చుకుందామని చూస్తున్నారు.

ఇతడు శా. శ. ౧౦౩౬-వ సంవత్సరంలో (అనగా క్రీ. శ. ౧౧౧౪) జన్మించాడనీ, తన ౩౬-వ యేట, అనగా క్రీ. శ. ౧౧౫౦ లో సిద్ధాంతశిరోమణి అనే గ్రంథాన్ని రాశాడనీ అతని ఈ క్రిందిశ్లోకంవల్ల తెలుసుకోవచ్చు.

శ్లో. 'రసగుణపూర్ణ మహీసమ
శకనృప సమయేఽ భవ న్మమోత్పత్తిః,
రసగుణవర్షేణ మయా
సిద్ధాంత శిరోమణీ రచితః'॥

అతని నివాసస్థాన మేది? అన్న విషయమై చాలా వాదోపవాదాలు జరుగుతున్నాయి. సూక్ష్మంగా ఆవిషయాన్ని క్రింద రాస్తున్నా. భాస్కరుని గోలాధ్యాయంలోని ఈ క్రింది శ్లోకాన్ని చిత్తగించండి.

శ్లో. 'ఆసీ త్సహ్యకులాచలాశ్రితపురే
త్రైవిద్యవిద్వజ్జనే
నానాసజ్జనధామ్ని విజ్జలబిడే
శాండిల్యగోత్రో ద్విజః
శ్రౌతస్మార్తవిచారసారచతురో
నిశ్శేషవిద్యానిధిః
సాధూనా మవధి ర్మహేశ్వరకృతీ
దైవజ్ఞచూడామణిః.'

ఈ శ్లోకంవల్ల భాస్కరుని నివాసస్థానము విజ్జలబిడ మనేనగర మని తెలుస్తుంది. కాని ఆ విజ్జలబిడ మిప్పు డేపేరుతో వ్యవహరింపబడు

తోంది? అనగా, ఇప్పటి ఏనగర మప్పటి విజ్జలబిడమూ తెలుసుకోవడం కొంచెం క్లిష్టమైన సమస్య. ఇప్పటికి మహారాష్ట్రదేశంలో బిడనగరమని ఒక ఊరుంది. ఈ బిడనగరమే భాస్కరాచార్యుని విజ్జలబిడనగర మగునా కాదా అన్నవిషయం చాలావరకు చర్చింపబడింది. వాసనావార్తికంలో నృసింహదైవజ్ఞులీక్రిందివిధంగా వ్రాసేరు.

"గోదావర్యాఅపి నాతిదూరేప్రదేశే జలబి
డగ్రామే అధునాపి బిడమితి తన్నగరనామాస్తి".

మునీశ్వరదైవజ్ఞులు మరీచిభాష్యంలో

"విజ్జలబిడం, బిడమితినామైకదేశే ప్రసిద్ధం"

అని సెలవిచ్చారు. ఈ పైప్రముఖుల అభిప్రాయాల్నిబట్టి ఇప్పటిబిడనగరమే భాస్కరుని విజ్జలబిడ మని విశద మౌతుంది. భాస్కరునికాలంనాటికి విజ్జలు డనేరాజు రాజ్యం చేస్తోండడంవల్ల బిడనగరమే విజ్జలబిడ మని వ్యవహరింపబడుతూండేదనీ, క్రమంగా వాడుకలో విజ్జలశబ్దము వదలివేయబడిందనీ కూడా కొంతమంది చెపుతారు. కాని నృసింహదైవజ్ఞులుమాత్రం జలబిడనగరమనే రాశాడు కాని విజ్జలబిడనగర మని సూచించలేదు.

ఇదికాక ఆధునిక శాస్త్రజ్ఞుల అభిప్రాయాలనుకూడా కొంచెం పరిశీలిద్దాం. సుధాకర ద్వివేదిపండితుడు ఇప్పటి విజాపురమే భాస్కరుని విజ్జలబిడ మని వ్రాశారు. కాని నృసింహుని "గోదావర్యా అపి నాతిదూరే ప్రదేశే" అన్నవాక్యం ప్రకారం విజాపురం బిజ్జలబిడ మెప్పటికీ కాదని స్థిరపరుపవచ్చు. ఇంక శంకర బాలకృష్ణ దీక్షితుగారు ఇప్పటి బిడనగరము భాస్కరుని విజ్జలబిడం కానేరదని రాస్తూ యిప్పటి బిడనగరము సహ్యపర్వతసమీపంలో లేదని చూపించారు. వాస్తవంగా చూస్తే సహ్యాద్రికి ౨౦౦ మైళ్ల దూరంలో నున్న బిడనగరాన్ని గురించి భాస్కరునంతటివాడు సహ్యకులాచలాశ్రితపుర మని రాస్తాడనుకోడం చాలాపొరపాటు. ఈవాదాన్ని వెంకటబాపుజీ కేతకరుగారు ఖండిస్తూ యీ క్రిందివిధంగా వ్రాశారు: "ఈభేద మూరక పైకేగాని వాస్తవముగ నుండదు. దీక్షితుగారు అచలకులాచలశబ్దముల అర్థాలకుగల తారతమ్యాన్ని గుర్తించకపోవడంవల్ల వచ్చిన అనర్థ మిది. ...భాస్కరు డసలు బిడనగరము సహ్యాద్రిశాఖకు సమీపస్థమైనదని సూచించుటకొరకే కులాచలశబ్దాన్నుపయోగించినట్లు తోస్తుంది. కాబట్టి అతనివాక్యాన్ని సంశయింప బనిలేదు."[1] ఈవాదము కొంతవరకు అంగీకరింపబడిందేకాని సహ్యపర్వతశ్రేణికి సహ్యకులాచల మని నాడటంలో కవి కింత ఉద్దేశ్య మారోపించడం కొంచెం ఎక్కువేనేమోనని కొందరి అభిప్రాయం. ఇదికాక పండిత బాపూదేవశాస్త్రిగారు పరిష్క-

"The discrepancy is merely apparent and not real. It is due to the failure on the part of Mr. Dixit to mark the broadd istinction between the meanings of the words achala and kulachala......Bhaskara seems to have specially used the word Kulachala to signify that bid was situated in the neighbourhood of an off - shoot or branch of Sahyadri and so he leaves noground for misunderstanding".

—Indian and Foreign Chronology Page, 165.

రించిన విల్కిన్సనుగారి శిరోమణి అనువాదంలో విజ్జల(డ)బిడమనేపదానికి అర్థం వ్రాస్తూ జలబిడమనిగాని, విజ్జలుని బిడ మనిగాని వ్రాయకుండా విత్, జడ, బిడమని విడదీసి, "పండితులచేత మూర్ఖులచేత నిండియున్న" (thickly inhabited by learned and dull persons) అని వ్రాశారు. బాపూదేవ శాస్త్రివంటి పండితుడు బిడనగరమనే పేరు నుపయోగింపకపోవడానికి తగినంత కారణముండే ఉంటుంది. ఏమైనా, యిప్పటి బిడ నగరమే అప్పటి విజ్జలబిడ మన్న వాదాన్ని బాపూదేవశాస్త్రి ఒప్పుకోలేదని తెలుసుకోవచ్చును.

భాస్కరాచార్యుడు మహారాష్ట్రుడని కేతకరుగారన్నారు. కర్ణాటుడని శంకర బాలకృష్ణ దీక్షితుగారన్నారు. సరే ఆంధ్రుడనికూడా కొందరనకపోలేదు. కాని ఈమూడింటికీకూడా సరియైన ఆధారాల్లేవు. పాటీ అన్న మహారాష్ట్ర పద ముపయోగించాడు కనుక ఇతడు మహారాష్ట్రుడన్నారు కేతకరుగారు. కాని యీ ఆధారం చాలదని నా ఉద్దేశ్యం. కుట్టకమనేపదం భాస్కరు డుపయోగించాడనీ, అది 'కుట్టి' అనే కన్నడపదంలోనుండి వచ్చిందనీ కనుక ఇతడు కర్ణాటుడనీ యింకొకవాదం. కాని భాస్కరుని పూర్వులైన బీజగణిత శాస్త్రజ్ఞులుకూడ కుట్టకమనే పదాన్నాఅర్థంలోనే ఉపయోగించారు. అందువల్ల భాస్కరుడు కర్ణాటుడన్న సిద్ధాంతంకన్నా బీజగణితం కర్ణాటదేశంలోనే పుట్టిం దన్నవాదం కొంతవరకు సమంజసంగా ఉంటుందేమో. మహారాష్ట్రులైన గణేశదైవజ్ఞ, కమలాకరులచే భాస్కరుని గ్రంథాలు సమూలంగా ఖండింపబడిన వవడంచేత భాస్కరుడు మహారాష్ట్రుడై యుండడనే సందేహాన్ని కొంతమంది తెలియపరుస్తున్నారు.

నాసికదగ్గర దొరికిన తామ్రశాసనంలోని శ్లోకాల్ని ఉదాహరిస్తూ శ్రీపిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రిగారు వారి ఆంధ్రలీలావతియందలి పీఠికలో భాస్కరుని వంశవృత్తాన్నిచ్చారు. అదే ఈ క్రింద చూపిస్తున్నాను.

త్రివిక్రమ
|
భాస్కరభట్ట
|
గోవింద
|
ప్రభాకర
|
మనోరథ
|
మహేశ్వర
|
భాస్కరాచార్య
|
లక్ష్మీధర

౨

భాస్కరాచార్యుని తండ్రి మహేశ్వరుడనీ తండ్రియొద్దనే భాస్కరుడు సర్వశాస్త్రాల్ని అభ్యసించాడనీ "ఆసీత్సహ్యకులాచలాశ్రితపురే" అనే శ్లోకంవల్లా "తజ్జస్తచ్చరణారవిందయుగల..." అనే శ్లోకంవల్లా బీజగణితాంతమందలి "ఆసీన్మహేశ్వర ఇతిప్రథితః..." అనే శ్లోకంవల్లా, యింతకన్న గురుస్తుతి యితడు చేయకపోవడంచేతా మనం సులభముగా గ్రహింపవచ్చు.

క్రీ. శ. ౧౧౧౪ లో జన్మించిన భాస్కరుడు తన ౩౬-వ యేట సిద్ధాంత శిరోమణిని

వ్రాశానని చెప్పుకున్నాడు; అనగా, క్రీ. శ. ౧౧౫౦ లో శిరోమణి వ్రాయబడింది. ఇది వ్యక్తగణితము, అవ్యక్తగణితము, గ్రహగణితము, గోలాధ్యాయము అని నాలుగు భాగములు. ఈ నాలుగున్ను కలిసిన గ్రంథం సిద్ధాంతశిరోమణి అనేపేరుతో వ్యవహరింపబడుతోంది. ఇతడు వ్రాసిన యితర గ్రంథాలలో ముఖ్యమైనది కరణకుతూహలము.

భాస్కరుడు తనశిరోమణియందలి వ్యక్తగణితాధ్యాయాన్ని లీలావతి అనే పేరిట వ్యవహరించాడు. ఈ లీలావతి యెవరూ అని శాస్త్రజ్ఞులు చాలా తికమికలు పడ్డారు. "అయే బాలే లీలావతీ" అనుటవల్లా "బాలే బాలకురంగలోలనయనే లీలావతీ" అను వాక్యంవల్లా లీలావతీసంబోధన గ్రంథంలో ఉంది. ఐతే, ఈలీలావతి భాస్కరుని భార్యయొక్క పేరని కొంతమందీ, వేశ్యయొక్క పేరని కొందరూ, కుమార్తెయొక్క పేరని కొందరూ సూచిస్తూ అంతటితో పోనీయక గ్రంథరచనావశ్యకతకు అవకాశం చూపిస్తూ యితిహాసాల్నికూడా చెప్పేరు. కాని గ్రంథంలోని మొదటిశ్లోకంలోని ఆఖరిపాదం గమనిస్తే "సంక్షిప్తాక్షరకోమలామలపదై ర్లాలిత్యలీలావతీమ్" అన్నవాక్యం కనపడుతుంది. దీన్నిబట్టి గ్రంథమంతాకూడా సంక్షిప్తాక్షరములనే కోమలామలపదములచే లలితమైన లీలలు గలిగినట్టి దవడంచేత లీలావతీనామానికి సార్థకత చూపిస్తే సమంజసంగాతోస్తోంది. గ్రంథాంతమందలి శ్లోకాన్నికూడాచూడండి.

శ్లో. యేషాం సుజాతిగుణవర్గవిభూషితాంగీ
శుద్ధాఖిలవ్యవహృతిః ఖలు కంఠసక్తా,
లీలావతీహ సరసోక్తి ముదాహరంతీ
తేషాం సదైవ సుఖసంప దుపైతి వృద్ధిమ్.

అన్నశ్లోకానికికూడా గణితగ్రంథపరంగా అర్థంచెప్పడమే బాగున్నదని నా ఉద్దేశం. లీలావతి అనే పేరుమీద సరసకవి కనుక కొంతవరకు ఉత్ప్రేక్షిస్తే ఉత్ప్రేక్షించవచ్చునుకాని అందుకొరకై అతనిభార్య గొడ్రాలనడం, అతడు వేశ్యాలోలుడనడం, అతని కుమార్తెకు వైధవ్యం కల్పించడం ఆట్టే సమంజసంగా లేవు.

ఏ మై నా గా ని, కవితాలాలిత్యానికి మట్టుకు లీలావతీనామము సార్థకమైనదే.

భాస్కరాచార్యునికి ప్రమాణము బ్రహ్మగుప్తసిద్ధాంతము. ఇతడు శిరోమణి రచనకు విషయాలను చాలావరకు శ్రీపతి గ్రంథాలనుండి గ్రహించాడు. శ్రీపతిగ్రంథమైన సిద్ధాంతశేఖరమునందలి కొన్ని శ్లోకాలే స్వల్పమార్పులతో శిరోమణియందు కనపడతాయి. ఈ శిరోమణియందు భాస్కరుని స్వతంత్రమైన సిద్ధాంతా లేవీ లేకపోయినా, పూర్వగ్రంథాలనుండి విషయాలనన్నిటిసీ గ్రహించి, కూర్చి సరళమైన కవిత్వంతో చక్కగా ఒకచోట పెట్టేడు. అవి సులభంగా అవగాహ నవడంకొరకై స్వయంగా ఉపపత్తులను వ్రాశాడు. అందువల్ల సిద్ధాంతశిరోమణికి ఎక్కువగా ప్రాముఖ్యత వచ్చింది. ఇతనితర్వాత గణితశాస్త్రంలో స్వతంత్రగ్రంథాలు చాలా తక్కువ. ఇతని గ్రంథాలమీద వ్యాఖ్యానాలూ, వివరణాలే ఎక్కువగా బయలుదేరేయి. ఇప్పటికికూడా శాస్త్రజ్ఞులు భాస్కరునికీ అతని గ్రంథానికీ కూడా చేతులు జోడించి జోహారు లర్పిస్తూనే ఉన్నారు.

కళాసౌధము

'హిమానీ'

ఇది సుప్రశాంతమ్ము, హృదయవాసంతమ్ము,
ఇది తలపుపువుఁదోఁట, ఇది వలపునును బాట,
ఇది కళాతీరమ్ము, ఇది కాంతిపూరమ్ము,
ఇది నా హృదయవీథి, ఇది శాశ్వతసమాధి.

ఎంత లావణ్యమ్ము, ఎంత సౌందర్యమ్ము,
అందములు పండి ఈ, చందాన విరిసెనో,
ఈ తపస్సు బ్రతుకులో, నీ కాంతి విశ్వమ్ము
కళలు పండిన తావు, వలపు పండిన రేవు;

నా హృదయ మొక రథము, నా విశ్వ మొక పథం
పరుషమ్ము వినబడదు, కలుషమ్ము కనబడదు
కాలమ్ము లేదు లో, కాల హద్దులు లేవు,
ఊహ కందని కాంతి, వాహినులు గల విచట.

సత్కళా పూజలే, సౌందర్యతత్త్వమ్ము
ప్రేమకు ప్రకాసమ్మె, హృదయసమ్మోదమ్ము
బ్రతుకుటాకలి తేనె, రాగాలపంటలే
మధురబ్రహ్మానంద, మహితమగు రససిద్ధి.

హాలాహలము దాటి, అమృత మందిన దిచట
ఏ యుగాంతమునైన, నిట వసంతము చెడదు
అచ్చంపు ప్రణయమున, కపటములే లేవు
జీవితాకాశాన, చీఁకటులు లే విచట.

ఎన్నెన్ని జన్మాలొ, ఎన్నెన్ని యుగములో
గడచినడచిన వెనుక, కాంతికాననములో
నా నిశ్చలాన్వేష, ణానంద మీ యవధి,
సత్కళాసౌందర్య, సర్వస్వ మీ సిద్ధి.

చలువ వెన్నెలలోని, సన్నతీగగ సాగి
వీణాస్వనమ్ములో, విమలగీతమ్మునై
ఏ కాంతి నెద నెంచి, యెల్లెడల వెదకితినో
హృదయముద్రిక్తహా, మృదుశాంతిలో నేఁడు.

కనరాని కనలేని, కాంతిపూరమ్ముకై
తలఁపులెంచిన మనసు కలలుగాంచిన కనులు,
అమృతవిశ్వమ్ములో ఆనందవీథిలో
మృదునిత్యకాంతిసం పదలోన వికసించె.

ఈ సుందరారామ, భాసురసృష్టిలో
ఆకు ఆకున నొక్క, ఆమని పిసాళించె ;
నా దేహరక్తోష్ణనాళాంతరములందు
అణువణువున నొక్క, ఆర్ద్రహృదయము గలదు.

నాకొఱకు పుట్టె నీ, నవ్యసౌందర్యమ్ము,
నాకొఱకు జనియించె, నాట్యకౌశల్యమ్ము,
ననుఁజూచి యామనులు, నవ్వు వెలుఁగులనించు
అనిలపథములపూలు ననుగాంచి చలియించు.

ఆకుకౌఁగిళ్లలో, నలరునలరులలోన
రేకురేకున రేగు, మృదుమధురపరిమళము
ననుఁ జూచి నను పోల్చి నా కలలు నా కథలు
అనిలమార్గమ్ములో, నవనియంతట జెప్పు.

ఏ పూలు పూసినా, ఏ తావు లెగసినా,
ఏ పికము పాడినా, ఏ తీగ లాడినా,
నా నవ్వు నా యూర్పు, నా పాట నా యాట,
ప్రకృతిలో కన్పించు, ప్రకృతిలో విన్పించు.

ఆనాటి యాపాట, ఆయడవి యాయాట,
ప్రారంభమధుకేళి, బాల్యజీవనలీల ;
ఈనాటి యనుభూతి, ఈజీవితవిభూతి,
తప్తహృదయోద్వేల, దివ్యభావజ్వాల.

సౌందర్య మెంతైన, చక్కదన మెంతైన
చూడగల వీకనులు, చూడగల వీ కనులు ;
ఏపాటలెన్నైన ఏయాట లెన్నైన
పాడగల దీ వీణ, ఆడగల దీ బ్రతుకు.

విశ్వమ్మె నాప్రియుఁడు, విశ్వమ్మె నాసఖుఁడు
విశ్వతమె నాప్రేమ, విశ్వతమె నాభూమి
విశ్వసౌందర్యమ్మె, వినుము నా జీవితము
విశ్వమ్మె నేను నా, విశ్వమ్మె విశ్వమ్మె.

ఏపాటమురువులో, ఈగుండె నిండునో
ఏయాటసిరులలో, ఈబ్రదుకు వెలుగునో,
పాడుమీ ఆపాట, ఆడుమీ ఆయాట
నాసఖా! నాప్రియా! నవోదయమ్మయ్యె.

తీవతీవకు వీణ, త్రెంపకుమి నీపాట,
ఆకుఆకున వీణ, ఆపకుమి నీపాట
పాడుమోయీప్రియా! పాడు మోయీసఖా!
త్రెంపకుమి ఈపాట, త్రెంపకుమి యీబ్రతుకు.

ఒకతీవ కదలినా, ఒకపూవు మెదలినా,
కోటివీణెలపైని, కోటితీగలు పాడు,
ఎన్నివీణెలనైన, నీగుండె భరియించు,
ఆపకుమి నీపాట, ఆపకుమి నీపాట.

అచ్చరలు గంధర్వు, లమరగణములపాట
వినిపించు నిపుడు నీ, విశ్వగానమ్ములో
వీణతీవలమీది, వ్రేళ్లు తీయకుమోయి
తీయకుమి యీగుండె, తెగిపోవునో యేమొ.

నీపాట లెన్నైన, నిపుడు వ్యర్థము గావు
పాటపాటకు తీపి, పలికింపుమా వీణ
కోటివీణలు నీవి, కోటివీనులు నావి
వినగ నే చాలనో, వినిపింప నేలేవొ.

ఆనందనందనో, ద్యానసీమలయందు,
సంతతానంతవా, సంతశోభలయందు,
క్రమకల్యాణార్ద్రకాంతికాననమందు,
వసియించునీకళా, వైభవాస్పదజీవి.

ఆత్మ మ్రోయఁగలేని, ఆనందభావమున [ల
హృదయమూఁపఁగలేని,మృదులాస్యగానము
కనులుకాంచఁగలేని, కాంతిప్రవాహముల
వసియించు నీ కళా వైభవాస్పదజీవి.

ఉభయసంధ్యాస్వర్ణ, విభవోత్సవమ్ములో,
పెదవి పవడపునవ్వు, కదలి కాల్వలు గట్టి,
వాసంతసౌరభ, స్వచ్ఛసంపదలోన,
జీవితాశయఫల, శ్రీపరీమళ మెగయు.

నేనె మలయా నిలము, నేనె ఆమనివెలుగు
నేనె సంజల పసిఁడి, నేనె వెన్నెలవెండి,
నేనె తావుల మృదువు, నేనె పూవులమధువు,
నేనె సౌందర్యమ్ము, నేనే కళావీథి.

రత్నావళి (కథ)—పరీక్ష

శ్రీ నే. రామదాసు

౨

౧౬. చిత్రఫలక ప్రయోజనము—చిత్రఫలకము రాజునకు దొరకి సాగరికపై వలపు పెంచును; దేవికి దొరకి రాజుపైకి 'వజ్రము' ('వజ్రం ప్రత్యక్షనిష్ఠురమ్ '- దశరూ.) అగును. అంతట సాగరికపై మఱింత యీర్ష్యచే దేవికి సాగరికకావున జాగ్రత్త ఎక్కువయగును. ఫలకపని ముగిసియును. అది దేవీ కాంచనమాలలచేతం బడును. ఇక మనకు దొరకదు; ఎవరికిం దొరకదు. ఏమగునో! అయినను దాని యీ యవసితి మనకు సరిగా జేయుచున్నది. తత్స్వభావానుగుణమే.

౧౭. చిత్రశాల, సంగీతశాల:—ఆ సంకేతమునివరము ఎట్లనఁగా, విదూషకుఁడు రాజును బండిసురివెంద మండపము చేర్పవలసినది. అక్కడ సాగరికరాజులకు కూటమి కలుగును. సుసంగతాసాగరికలు కాంచనమాలా వాసవదత్తల వేషములు వేసికొని యభిసరింతురు. వారికోసము దారిలో చిత్రశాలవాకిట విదూషకుఁడు కనుపెట్టుకొనియుండవలసినది. వారు రాఁగానే వారిని రాజుతో కలుపవలసినది.—అని: అట్లే చీఁకటిలో దారి తడవుకొనుచు రాజు బండిసురివెందమండపము చేరినాఁడు. విదూషకుఁడు చిత్రశాలవాకిటం గనుపెట్టుకొని కూర్చున్నాఁడు. నట్టెటింగి పరీక్షింపం బయలువెడలిన కాంచానమాలాసహాయయగు దేవి చిత్రశాలకడకు వచ్చినది. కాంచనమాల అనును.- 'భట్టినీ, ఇదె ఆ చిత్రశాల, ఇందులో ప్రవేశించి వుందము. నేనున్న వసంతకునికి సన్న చేస్తాను.' అని. అట్లే రాణి ప్రవేశింపదా? ఇప్పటికే చిత్రశాలలో సుసంగతాసాగరిక లిరువురుగాని, సాగరిక యొక్కతెగాని, ఉన్నదా? లేదు. ఉండియున్న వారు విదూషకునికై ఎదురుచూచుచు అచే దత్తేక్షణలై యుందురు కావున, విదూషకుఁడు కూర్చుండి ముసుఁగిడుకొని ప్రతీక్షించుచుండం బనిలేదు. కాంచనమాల వాసవదత్తలును వారెవరు అటనున్నను వారిని ఒకింత కంటబైచికొందురేమో. కాఁబట్టి వారు ఇట లేరు; ఇంకను ఇటు రాలేదు. తరువాత 'భావానుబంధ' పరీక్షయై దేవి మరలినయనంతరము, సాగరిక గృహీతదేవీవేష ఒంటరిగా వచ్చినది. సుసంగతకు చీవాట్లు అవమానము జరిగినది అనును. అది నిజమే కాఁబోలును. కావున్న తాను ఒంటరిగా ఎట్లు వచ్చును, ఏల వచ్చును? సంకేతము దేవికి తెలిసిపోయిన దనియూ ఎట్లు ఎఱుంగును? మఱి ఇదొకటి. దేవి మాధవిమండపమునుండి యలిగి వెళ్లినదికదా. అట్లు వెళ్లునప్పుడు అక్కడినుండి తనలోగిటికి ఏది దగ్గఱదారియో దాన వెళ్లియుండును. చిత్రశాలమీఁదుగా దారి ఒకింత చుట్టును కాఁబోలును. కాఁబట్టియే సంకేతార్థము వచ్చుటకు, దేవీప్రభృతులను ఏమరించుటకు, రహస్యమును రక్షించుటకు సుసంగత దానిని నిర్దేశించి యుండఁబోలును. ఏదారిని దేవి మరలి లోగిలి చేరినదో ఆదారినే ఆమెను అనునయింప రాజు తరలినాఁడు. అంత కనలి కలఁగిన దేవి అంతలో ప్రసాదముఁ గొని వెనుమరలువని సాగరిక శంకింపదు. ఇపుడు ఆదారిలో తాను గృహీతదేవీవేష. ఉద్బంధననిశ్చయముతో వెడలినది, ఉద్బంధనము చేసికొనుచుండినది, దేవియే పశ్చాత్తప్తయై రాజును మన్నింప మరలుచున్నదను భ్రమ కలిగించునట్లు రాజవిదూషకుల కంటంబడినది. కావున ఇట్లు సమకూరుటకు సంగీతశాల అది, చిత్రశాలకన్న వేఱు, కొన్నిపాతములం గలిగినది, అవశ్యముగా ఉపాదేయము. సంగీతశాలపాతము శ్రేయస్తరము. అప్పుడే ఈసంకేతేతివృత్తమున హృదయంగమము కౌటిల్యము సిద్ధించును. కవికి 'బళి' కలుగును. తరువాత నిజముగానే పశ్చాత్తప్త ప్రతినివర్తమాన వాసవదత్తకు రాజు ససాగరికుఁడు మరల పట్టువడును. సర్వమును అవదాత మగును.

౧౫. రత్నమాల:— (క) ఏటిది ఈరత్నమాల? రత్నభూషా మాలికలలో స్త్రీధార్యమునకును పురుష ధార్యమునకును భేద ముండదా? ఈ రత్నమాలను దాన మిచ్చుటేమి, బ్రాహ్మణునికి? మనుపు మణిమంత్రౌష ధులమహిమ తలంపఁబడెనే, ఈ మణిదానమున ఫల మహిమ భావింపఁబడినదా? అనర్ఘము ఇది హిరణ్యాది దానముంబోలినది దానవిశేషము రత్నాత్మకమా? (చ) రాజు మెడం దాల్పుమని యెట్లు చెప్పను; చెప్పినను దానిని విదూషకుఁడు ఎటువలె మెడం దాల్చును! తాల్చునెపో, దాని దర్శనమున రాజునకు ఆహ్లాదమన యెట్లు, తానే యెడం దాల్చుట సరియగుగాని? అట్లే, ఇటను హారము పంపినది అని వసంతకుఁడు అనఁగానే, కవిలోలిభావ ముగా మొదట రాజు దానిం గైకొని ఎదయం దుంచు కొని ఇట్లుగదా ఆహ్లాదమున పొందును...

"అహహా!
పరితుక కంఠాశ్లేషముఁ
బడసియు నీరత్నమాల ప్రభ్రష్టంబై
పడి సమదశలో సభవలెఁ
దడయక యొదార్చు నారు తనువుం గంటే!"

అని. సదృశ ప్రతికృతి స్వప్నదర్శన తదఙ్గస్పృష్ట స్పర్శములని నాలుగు, విరహులకు వినోదస్థానము లన్నారు మల్లినాథ సూరులవారు. 'తదఙ్గ స్పృష్టానా ముపనతవతాం స్పర్శనమపి ప్రతీకారో౽వఙ్గ వ్యథితమన సాం కో౽పి గదితః' అని ప్రమాణముం జెప్పినారు. సదృ శమునకును బ్రతికృతికిని సస్పర్శమో, కేవలమో దర్శ నముగాని, ఇట్టిదానికి స్పర్శము వలదా? ఇదె కనుఁడు, రసికచక్రవర్తి మహామాహేశ్వరాచార్య సూక్తిని.—

దయితయా గ్రథితా స్రగియం మయా
హృదయధామని నిత్యనివోజితా
గలతి శుష్కతయాపి సుధారసం
విరహదాహ రుజాం పరిహారకమ్

అని. (ట) ఈ హారముతో ఇంతపని యున్నదే, అరఁటియింటి సమాగమానఁగాని బండిసురిచెంద సంకేత సమాగమానఁగాని, రాజుచే ఒకతూరియైనను దీనిపై దృష్టి తగిలించియుండరాదా? అప్పుడెల్ల సాగరిక దీనిని ధరించియే యుండెనా, లేదా? ఇది యొక తీఱనిసందేహము. (ఠ) వసంతకకంఠమున దీనిని చూచి వసుంధర కాంచనమాల రాణి—ఎల్లవారును ఏమియు ననుకొనరా? వారికిం బూర్వపరిచితము అనునా కాదా ఇది? ఎక్కడిది సాగరికకు ఇది యని సుసంగతకు కుతూహలము పెరిఁగినది; విదూషకునికిం దెరిఁగినది; ఎవరికిం బూర్వపరిచితము కానుకాఁబోలు; అట్లేని అది కాంచనమాలావాసవదత్తలకును కుతూహలము పెంపవలసినదే. మఱి యెట్లు? సాగరిక కంఠమున స్పృష్టపూర్వమును, సంకేతమున నేని యదృచ్ఛగా నేని దృష్టపూర్వమును, కాదేని దీన రాజునకు ఎట్టి యూఱట? ఎందులకు ఈహారంపుచెడద? (డ) సాగరిక బ్రాహ్మణ దానము కోరినది. సుసంగత అందుకోసమే వసంతకునికి ఇచ్చినది. వసంతకుఁడు దానిచే రాజునకు విరహ వినోదము సాధింతు ననును. వినోదార్థము దానిని రాజే గ్రహించియున్న అది విదూషకునికి లేకయుం బోవును. అప్పుడు సాగరికకు ఆ బ్రాహ్మణదానఫలము చెందునా? అది తనకోసమే వసంతకునిచేత పంపఁబడి యుండు నని రాజు తలంచును. తానే ఎదయందు ధరించి 'చొక్కా'లో దాఁచుకొని నిజమును ఉచిత మును అయిన స్పర్శాహ్లాదమున పొందరాదా? అట్లే చేసియున్న దినమునకు ఒక సువర్ణ కటకమును ఇనాము 'కొట్టివేసి' బ్రాహ్మణికిం జూపఁగోరువాఁడు, స్వస్తివాచనమునకును ఆసగొను నుదరంభరి ఈ యపూ ర్వమణిహారముం గోలుపోయి యుండును గదా. అందు లకు ఇట్లు ఆతని మెడలోనే తగిలించిన బ్రాహ్మణ దానమును రాజవినోదమును తంత్రముచే రెండును ఘటిల్లు నుపాయ మగునని కవి తలంచెం గావలయు! (ఢ) నిర్వహణమునకు వలయు నొక్కయర్థమును ఇట్లు పాకముగా అనుచితముగా ఈడ్చి తెచ్చి నిలుపుట! అట్లును దీని ప్రయోజనము సున్నసమానమే. వసు భూతికి ఈ ప్రత్యభిజ్ఞానము ప్రత్యేక గల్పుటయు కథ కును రసమునకును ఏమి యుపకారము? (ణ) వసంత కుని మెడలో రత్నమాలనుగూర్చి వసుభూతి యడుగ జంకి సమాధానము వెదకుకొనును గాక. బాభ్రవ్యుఁ డేల యూరకుండవలయును? 'మహావిభవంపు రాచనగరున' అని వసుభూతి మాలకై ఎట్లో చిత్తమును కుదురు

పలుచు కొనునుగాక. (కాని, విదూషకమాత్రుని మెడలో అట్టి యనర్ఘమాలకు ఇకేమి సమాధానములే) వసంతకునితో బాభ్రవ్యుని కింకేని చనవు కలుగదా? అతని మెడ నట్టిమాలను మున్నెన్నఁడును చూడనివాఁడు ప్రవాసప్రతినివృత్తుఁడును అతేఁడేల యడుగరాదు? (డ) రత్నమాలమణి. మణిమంత్రౌషధుల మహిమను ఈనాటక మునందడబిన వాఁడు రాజును, కవియు. దాని మహిమయే కారాదా రత్నావళికి ఆ మరణనిమజ్జనము తప్పుట. అట్టి దానిని ఈ యక్కఱలేని యభిజ్ఞాన ప్రత్యాశాజననము లకై ఆమెకంఠమునుండి తివియుటయా? జయదేవుఁడు 'ప్రసన్న' రాఘవునికి, అడవికిం దరలుచున్న వానికి అమ్మమాటగా చెప్పించిన హితవుం గనుఁడు.—

"విముఞ్చాఙ్గ సకల మాభరణజాత మిర్థ మఖ్య త్తితః కౌసల్యాయా రామభద్రః—

హస్తావలమ్బదానాయ సీతామాఙ్గల్యసంపదః
ఇదం విముఞ్చ మా. వత్స రామ రత్నాఙ్గుళీయకమ్'

అని. ఇంతకును మాల అది యెటువలె ఇం దభి జ్ఞానముగా ఉపకరించినది, సరిగా ప్రత్యాశాజనక మేని కాలేదే? సాగరిక మెడలోనే యున్న నింతకన్నను అభిజ్ఞానము సులువును చెదరనిదియుం గాదా? వసు భూతిభాషితము—'వసంతకుని మెడలోని రత్నమాల అంతపోలికగా ఉన్నది. ఈమెయు సాగరమునుండి దొరకినది. అందువలన స్పష్టముగా ఈమె రత్నావ ళియే' అనుట ఏమి యీ యుపపత్త్యుపన్యాసము! సాగ రికమాల వసంతకుని మెడలో నగపడుట వసుభూతియీ నిశ్చయమునకు ఎట్లు దారి? ప్రకరణమున ఇది అనన్వి తమా సమన్వితమా? హారముంగూర్చి యింకను ఈరహ స్య మేమి? ప్రకటముగా రాజు నెదుటను రాణియెదు టను ఆ హారముమాట ఎత్తకపోవు టేమి? రత్నావళి సరత్నావళిగా విక్రమునిచే పంపఁబడినది అని యనక పోవు టేమి? ఉదయనుని కడకుం బంపుచు పుట్టినింటి జ్ఞాపకసర్వస్వముగా అనుంగుఁగూఁతునకు విక్రమబా హువు ఇచ్చిన దాయనే, ఇట్టిదా దానికి కడపట విని యోగము? ఈతత్త్వముం దెలిపియుండవలసినది వసు భూతి. అంతట వసంతకుఁడే, అపుడు సుసంగత కరుణ రసమున తన కన్నీటిం గలిపినవాఁడు ప్రొత్తదేవికి రత్నావళికి కానుకగా దానిని ప్రత్యర్పణము సేయఁ దగును. దేవిరాజులేని విదూషకునకి సువర్ణాది దానగ్రహణలంపటునికి ఆసతిఅ వెలయిచ్చి దానిం గొని యేని ప్రత్యర్పణము చేసియుండఁబోలును. తనకు వినోదసాధనముగా పంపినదేమో అనియు రాజనుకొనునే, అందుకోసమే అది ఆబాపని మెడలో వ్రేలుచుండెనే; దానింగూర్చి యీ మఱ్ఱ యేమి? నిజముగా రాజు వినోదముపొందెనా, వసుభూతికి చేకుఱని సుఖుకు నేకూర్చితినని కవి వినోదము పొందెనుగాని. అయ్యో, ఇటులా రత్నమాల పోవలసినది; సాగరిక సగౌరవముగా తనచేత నంపఁబడినది అంతకు మునుపు వాడుకగా ధరించుచుండినదే యగునేని అద్భుతావహము కంకా స్పదమునగు నా మాలను దేవియు తడవఁకుండుట! ధరింపని దగునేని అదెట్లు, అదెక్కడ, అదేల? అన్నియు సందేహములే, మాలంగూర్చి. తెచ్చు కొనాఁడు, కవి, దానిని; ఇట్లు బాపనికిం గోలుపోయినాఁడు! స్వప్నమున ఘోషవతి, కుంద మాలలో కుందమాల, శాకుంతలాన ఉంగరము అపరా జితము పెందలైనవి దొరకుట నాయకునియెదలో సుప్తప్రాయుఁడగు కాముని మేలుకొలుపుటకు, అభి జ్ఞానప్రాప్త్యాశలచే రసమున పెద్దయులను లేపుటకు. ఇక్కడ అట్టిప్రయోజనము అనపేక్షితము. వసుభూతికి ప్రత్యభిజ్ఞానమునకు సాధనము వలదు, జ్ఞాపకసాధనము మఱియు వలదు. ప్రత్యాశయోయన్న — అదియు అనావశ్యకము, ఇక్కడ రసమునం గలియదు.

౧౫. దేవి,లావాణకదాహము:—ఇది పూర్వము పరామృష్టము. అయినను మరలకొంత. (క) ఈలావాణ కదాహము స్వప్నతాపసములందుంబోలె ఇందును ఇట్లు నిర్దేశింపఁబడుచున్నదే, మఱి అది వానిలో ఒక విధముగా రాజు, ఒక విధముగా దేవి, ఒకవిధ ముగా వత్సావంతీమగధాది దేశముల జనులు ఎల్లవారును-కన్నదో, విన్నదో— ఎఱింగినది. దానిచే దేవిప్రవాస విప్రలంభము, రాజుకరుణ కరుణ విప్రలంభములు, పద్మా వతియనియోగసంభోగములు - ఇట్టివెల్ల వానియందు పుట్టి అల్లికగొన్నవి. ఈరత్నావళిలో అది వట్టిప్రవాదమాత్రము కాని, అందు పనిపడ్డ యౌగంధర బాభ్రవ్య లోక

రిరువురుతప్ప మఱి యెవ్వరును ఎఱుంగనిదిగాఁ గాన్పించుచున్నది. కాదా,

లావాణకమునఁ బుట్టెనో
యేవా దవలందు దేవి నేర్చి నటంచున్
ఆవాదు నిజము సేయఁగ
నా వెలసె నలందు దేవినగరం బెలుచన్ (iv)

అని యైంద్రజాలికొన్నింగూర్చి ఇట్లు నిర్దేశము చేయఁబడినందున ఆవాదు ఈకౌశాంబికి ఆదినాలలో అప్పుడే వ్యాపించి అప్పుడే మిథ్యయని దేవీ ప్రకాశతత్త్వముచే అణఁగిపోయెనని యూహింపఁదగునా? అట్లు క్షణోత్థశమితమని ఆదినములలో రాజు దేవి ప్రకృతులు పరిజనము అందఱును ఎఱింగియుండఁజాలరా? లేకున్న దానిని 'ఆవాదు నిజము సేయఁగ నా' అని ఇందుత్ప్రేక్షింప వలనుపడునా? ఆదినాలలో విని, నిజము ఎఱిఁగి అనంతరము మఱువలేనియు, అప్పుడు వినకయ యుండు లేనియు, ఇప్పుడు 'దేవి కాలిపోయినదని ప్రవాదపుట్టించి' అను వసుభూతిమాటలకు రాజును, రాజుకన్నను దేవియు తటకాపడియుండరా? 'ఇదేదో యౌగంధరుని పన్నకముగా నున్నది, నెమ్మదిగా ఆలోచింతము ఎఱుంగుదము' అని చిత్తమును పర్యవస్థాపించుకొనుట అన్యోన్యప్రాణులకు, రాజునకు అంతకన్నను దేవికి, కడింది కష్టము కాఁబోలు. అట్లుగాక ఒకవేళ ఒండొక లోచనాచార్యులవారు జ్ఞాపకముచేసిన తెఱంగున సాచివాయత్తసిద్ధిరాజ్యమున ప్రాయికముగా యౌగంధరాయణ నీతిమార్గసంస్కృతమతులు వారు పర్యవస్థాపించుకొన కలంకులే అని యనుకొందమా? పరమార్థము అదియు. అట్లే 'అనృతము పలుకుచున్నాఁడు' అని తానని ఎవరు పలుకుచున్నారో అన్న దేవితోఁగూడ రాజు నెమ్మది పూని, అపవారితముచే బాభ్రవ్యుని బోధపఱుపు మనుటయు అట్లే సూచించును. ఇపుడు యానభంగ రత్నావళీమజ్జన మరణములను వినఁగా దేవి 'అయ్యో భగినికా నేను పోయితినని నీవు వచ్చితివి, నేనే ఉన్నాను, నీవే పోయితివే, అయ్యో భగినికా, నారతనాల ఆవళీ, అయ్యో నాగుణరత్నాల ఆవళీ, అయ్యో నారూపరత్నాల ఆవళీ ఎక్కడ ఉన్నావు, బదులుపలుకవే- అని పెల్లుగా నాపోవఁదగును. (చ) మఱి వసుభూతి తనమాటలలోనే 'ప్రవాదపుట్టించి' అని మిథ్యమంత్రోక్తి చెప్పుట ఎట్లనఁ యానభంగానంతరము తాను తప్పించుకొని అట్లేతప్పించుకొన్న బాభ్రవ్యుంగలిసికొని యతనివలనను కోసలరాజ్య పరిసరమున మిళితులైన తక్కిన కౌశాంబికులవలనను తత్త్వమెఱుంగుటచేత. కావుననే ఇట్లు కౌశాంబికి పోవ నిశ్చయించుకొనుట. (ట) మఱి ఇట నీ యుత్ప్రేక్ష 'ఆవాదునిజము సేయఁగ నా' అనుట యెట్లు అనిన- నుడువునుగదా మంత్రి యనంతరము, ఈ యింద్రజాలప్రయోగము తన పన్నాగమే యని. కావున 'ఏవాదవలందు' ఇత్యాదియెల్ల మంత్రి రహస్యముగా పనిగొనుచున్న యాశంబరుఁడో తత్సమవేతుఁడు మంత్రి వేసు మఱి యెవఁడేని ఆ మంత్రప్రయోగమున నభ్యంతరుఁడో పఠించియుండునా? అట్లే యగును. (త) ఆవాదు ఇతరు లెవ్వరు నెఱింగినది కాకున్నను, దానిని మఱునిముసమున మంత్రియే ప్రకటింపఁబోవుటను ఇది సూచించును. వాదుంగూర్చిన తొలియుద్ఘోషణమే ఇది, ఈ యుత్ప్రేక్షలో ఇట్లు కావలయునని కూర్పఁబడినది. ఆవాదు నయితము ఈయింద్రజాలమునఁబోనిది అనియు ధ్వని. ఉభయమును ఏకప్రయోజనమును అపేక్షించినవే. ఇట నీయుత్ప్రేక్ష వినుటవలన ఎవరికిని సంభ్రమము పుట్టదు; మఱి ప్రకృతంపు నిప్పే సంభ్రమకారి, రాజునకును, దేవికిని, ఇతరులకును. ఈనాటకమున నిదియు నొకరహస్యము గావున శ్రీ శాస్త్రిలవారు తమ సొంత నాగరలిపిరత్నావళిలో దీనికడ 'ఎవరు పలికినది?' అనుజిజ్ఞాస కూర్చియుంచినారు. (ప) యౌగంధరాయణుండును తెలియఁజెప్పునుగదా— 'మందిరమున పుట్టిన నిప్పుచేత దేవి కాలిపోయినదని ప్రవాదపుట్టించి...బాభ్రవ్యుని పంపితిని' అని. ముందే 'స్వచ్ఛందచారి' నని స్పష్టముగా చెప్పుకొన్నాఁడు. దేవిని వశీకరం చేసికొనుటను చెప్పుకొనఁడు. రాజు నయితము దేవిని అపవారించి 'అంతయు అనృతముగా నున్నది' అనును. ఇట నెవ్వరికిం దెలియనీక, ఇం డెందును వ్యాపింపనీక ప్రవాదను, మఱి యసంభావనాస్పదముంగానీక, సింహళమునకు ఎటువలె చేర్చినాఁడో అం దెంతవ్యాప్తిరో, ఎట్లు నమ్మకముఁ గూర్చినాఁడో! (గ) కౌశాంబినెట్టి సింహళమునకు రాకపోకలు సేయు వాఁడు సింహళమునుండి, అందు అసిద్ధశవ్యాప్తమేని

ప్రవాదను మరల కౌశాంబికిం గొనిరాఁడా! ఒకవేళ ప్రవాదవ్యాప్తికి, విక్రమబాహుని యంతఃపురమందు మాత్రము మేనగోడలిచావుగా అంది ఆగోడలలోపల విశ్రాంత మనునట్లుగా యౌగంధరాయణుఁడు ఈ కోమటిని [కాని,(మఱి యితరులనేని)] పనిగొనియుండు నా? రత్నమాలశేరమువ్యాజమున ఆతఁడు నిపుణముగా దానిని నిర్వహించియుండునా? ఎట్లో! కవి అట్లట్లు రాల్చిన రాతిలనుకలను మనము ఇట్లు ఊహలసిమెంటు లో బిగించి యథేష్టాకారము కల్పించుట! (జ) ఏల! అట్లుగాదు. సర్వథా తత్త్వము ఇదే!

౨౦. బాభ్రవ్య గమనాగమనములు:—(క) ఈప్రవాద పుట్టించి బాభ్రవ్యుం బంపి చాల దినములైనది. 'చిరకాలమునకు ఇప్పుడు ఏలికను చూడనున్నాఁడట!' (iv-పు౫౨) ఎట్లు ఎన్నాళ్లకు సింహళము చేరినాఁడో. అందుప్రవాద ప్రసర్పణమును ఎట్లు కన్నాఁడో. ఎట్లు ధృతిం గొన్నాఁడో. కన్యాదానమును ఎట్లు ప్రస్తావించి నాఁడో, ఎట్లు ఒప్పించినాఁడో. (చ) నూపథంగానంతరము తప్పించుకొని కొన్నాళ్లకే కోసలరాజ్యప్రాంతముం జేరినను, తరువాత 'కొలఁదిదినములకే' అటనుండి కౌశాంబిం జేరినను, ఇట్లు 'చిరకాలమునకు' ఇపుడు ఏలికను చూడనున్నా ననుట. (ట) మఱి యితఁడు ఇటస్వనియోగమున ఇన్నాళ్లు 'గైర్హాజరే' ఎట్లు అని దేవియేని రాజేని విచారించుకొనరా? ఆనుసలివానిని కీఁపున నిము రుచు ప్రీతితో, 'చిరకాలమునకు' మరల నగపడిన వానిం బోలెనే, 'కూర్చుండఁబెట్టుకొమను' రాజు; ఈప్రస్తావముం జేయఁడే ఇదెట్లు? "అనేక కంచుకి సమాకులంబగు నావిధవోత్తరంపు రాచనగరులో ఏదొక్కని 'హాజరు గైర్హాజరుల'తో రాజునకుం బనియేమి, దేవికిం బనియేమి, ఉన్నవారిచే పనింగొనుటయె కాని, అందును విశేషముగా ఉదయనునికి, ఎవఁడు రాజ్యతంత్రము నెల్ల పచివాయత్తము చేసినాఁడో?!" అని సమాధానమా? తొలుత వసుంధర తెచ్చిన యౌగంధరుని విన్నపమునసే 'విక్రమబాహువు కంచుకి బాభ్రవ్యునితోఁ గూడ వసుభూతిని పంపించినాఁడు' అనుసే, అప్పుడే 'బాభ్రవ్యునితోడం బంపుట యెట్లు కలిగినది అని యనుకొనఁడా? ఆ భాషితమునుండి 'కంచుకి బాభ్రవ్యునితోఁ గూడ' అనుటను కత్తిరించివైచి యున్నను, తొలుతనుండి యీ సన్నకమున ప్రసక్తుఁబడిన వానినిఇప్పుడు నిర్వహణ ప్రయోజనమునకే లేఁబడిన వానిని ఎటువలె మానుట? ఇట్లు సమాధాన మనుసా, బాభ్రవ్యుని సింహళప్రయాణము దేవిరాజు లెఱింగినదే కాని, ఆ పెండ్లి సన్నకపు ప్రయోజన రహస్యము మాత్రము వారివలన రక్షితమయినది- అని? కూర్చుండు మనుటయు, కీఁపు నిమురుటయుం గూడ తన యెఱింగిన దూరప్రయాణ మోర్చినవానియెడ వాత్సల్య మనియు పరామర్శసర్వస్వ మనియు గ్రహింపంబోలును. ఈ ఘట్టములం దాఁకుచు ఆ విద్వత్కవి సహృదయ చక్రవర్తి శ్రీ॥ శే॥ వేదముశాస్త్రులవారు తమ సొంత నాగరిలిపి రత్నావళిలో సూచికయో, జ్ఞాపికయో ఇట్లు వ్రాసియుంచినారు.

'If Babhravya's matrimonial embassy was not known to Vatsaraja, how did the former leave the latter for Simhala? When Babhravya was about to solve this point, he was interrupted by the magician's conflagration" అని.

౨౧. విజయవర్మవృత్తాంతము—సాగరిక యుజ్జయిన్యపనయనాదిని విని చింతలో మ్రుంగిన రాజు విజయవర్మకు దర్శనమిచ్చుటయె కాక ఆయుద్ధముం గూర్చి వివరముగా వినంగోరుటయు, "తర్వాత తర్వాత" అనుచు దాని సాకల్యమును వినుటయు! దీనికి కథలో 'కథంచి దన్వయము' అనుచు, మహామహులు అభినవగుప్త హైమసూరులు 'అకాండచ్ఛేద' మను రసదోషమునకు ఇట్లు ఉదాహరించినారు. 'రత్నావళి నాలవయంకమున సాగరిక పేరైనను స్మరింపక రాజు విజయవర్మ వృత్తాంతమును వినుట' అని. ఈ దోషదర్శనము స్వరూప వివరణ గర్భితముగానే యున్నది. (క) ఇందలి రాజు 'స్వల్పకాలమునా'? విజయవర్మ 'కొలఁదిదినములను,' రుమణ్వంతుని 'మెల్లనిపయనములను' కథగడితయారమున కాలమును గుర్తింపన నిర్ణయింపను ఒకకొంత పనికివచ్చునేమో. (చ) ఈరెండు పుటల యుద్ధవిస్తరమును మాని రెండుబంతుల సమాచారమును ఎవనిచేతనేని యౌగంధరాయణుఁడు చెప్పించి

యుండవచ్చును. రంగాన రుమణ్వంతుఁడు ప్రవేశించి వేషింపనట్లే, ఈ విజయవర్మయు ప్రవేశింపక, రసధారం ద్రెంపక యుండవలెను. అట్లే గదా మాళవికలో ఇట్టిది వైతాళికగీతిలో అనుంపఁబడినది. (ట) మఱియొకటి. రుమణ్వంతుఁడు ఇంకను పెల్లవిపయనముల వచ్చుచు ఈ నాటకవస్తువున కొంకాంబిం జేరఁడు. వసుభూతి ఇప్పుడే వచ్చినాఁడు; మఱి విజయవర్మ తోడనే గదా? సింహళ ప్రధానమంత్రి రాజీమామ మంత్రి అట్లు తనతో కొంకాంబిం జేరఁగా,-ఆయనస్వయముగా యౌగంధరాయణునిచే తెలుపుకొని తర్వాతనే రాజ దర్శనము సేయునుగాక.- ఇపుడు ఇతఁడు ఆమాటను ఇటం బ్రస్తావింపఁడేమి? ఆశ్చర్యము! ప్రస్తావించియున్న నెట్లుండెడినో. తరువాత కోసలాగతులను వారిని రంగానం దూర్చుటకు సమయమరి సూచించుటకే కదా కవి యీ విజయవర్మ వృత్తాంతముం గూర్చుట? (త) విజయవర్మయు తొలుత యౌగంధరాయణుని, రాజ్యకార్యములెల్ల తనకు ఆయత్తముగానుంచుకొన్నవానిని, దర్శింపక ఇటు తిన్నగా రాజకడకే వచ్చినాఁడు! (ప) కొండలు లోచనమునం జూపనివారు, కావుననే సుట్టె అంగంజాలనివారు, దీనిని శాకుంతలము మాఁడవయంకాంతపు 'సాయంతనే సవనకర్మణి'తోను ఆఱవయంకాంతమందలి 'ఏవ తత్త్వమభినవకంఠశోణితార్థి'తోను పాటువరు ఎత్తినారు. ఆ రెండెడలను కవికులగురువు కూర్చిన సందర్భము అచిత్తత్త్వజ్ఞానము నాటకరచన శిల్పమున నాకృతిహస్తత అమహనీయుని కొక్కనికే తప్ప ఇతరులకు అందునది కాదు. ఆశాకుంతలాం (iii) (vi) కములలో సహృదయుల చిత్తములు ఆయంకముల పొడుగునను క్రమముగా రసపూర్ణములై ఔత్కట్యము పొంది ప్రేకులనంతకు రాఁగా ఆ 'సాయంతనము'ను ఆ 'దేవ తత్త్వము'ను చిత్రోచ్ఛ్వాసముతోఁగూడ ఆయంకములకు అద్భుతావసానముం గూర్చినవి. మఱియుట అంకమున ఆరంభానంతరముననే ఈవస్తువు. వానిని 'శిరసా' 'మనసా' వహించువారే, సహృదయకులగురువులు లోచనాచార్య హైమసూరులు దీనిని ఆకాండచ్ఛేదమన్నారు. చాలును ఈ ప్రసక్తానుప్రసక్తము.

౨౨. బాభ్రవ్యవసుభూత్యాగమనము, రసానుసంధి.—మఱియొకటి, లోచనకార దర్పణకార హైమకార ప్రభృతి సాహితీసామ్రాట్టులు ఎల్లరు ఎచ్చరించినది. అట్లు విజయవర్మ తన వృత్తాంతముచే రసముం జాలీక కట్టికి వేసెగదా. తరువాత సైంద్రజాలికాగమనము, రాజకుతూహలము, కట్టరకంతతోలఁగుసు. గురుని మంత్రమహిమచే తనపిఞ్ఛికచే, ఎక్కడిదేనిసైనను సరే, రాజు దేనిం గోరినను సరే, తాను తెచ్చి చూపఁగలననుచు ఆకుతూహలకుం జెంచును— 'వీఁడు సాగరికను సయితము చూపఁగలఁడు'-'అని. వాఁడు బ్రహ్మాదిస్థానములం జూపఁగా అది మఱియుం బెరుఁగును. అంతట వసంతకుఁడు అపవారించి గారడీవానితో 'ఇదంతయు ఎందుకురా, సాగరికను చూపు, శక్తుఁడవేని, అప్పుడు చూచుకో నీకు బహుమానమును!' అనియు అనును. శృంగారప్రవాహమున ప్రకాంతప్రాయమున అద్భుతలవము ఇది చక్కఁగా కలిసిపోయినది. ఇంకను అది ఉద్దీపితమగునేని సహృదయుఁడు జొక్కొనును. 'అనుసంధి స్త్రీ సర్వస్వం సహృదయతాయాః' అన్నాఁడు హేమసూరి. రసమును ఏండ్రేని అక్కాంతము ఇనుఁగొట్టక అనుసంధానము నేయుట యఁట సహృదయత. అక్కడనే వసుభూతి బాభ్రవ్యులం దెచ్చినాఁడు కవి. వారి 'బూరగ' ముగియదు. సాగరిక ఆత్యంతవిస్మృతి కనుసను. ఇఁక నెప్పుడో గారడీనిప్పుడుంటానో ఈతెగిన కథకమ్మని కవి అరుకుట! అట్లు హృదయంగమము గాదు. బాభ్రవ్యాది ప్రవేశానంతరము, వారిని బూరగపట్టనీక, తోడ్తో గారడినిప్పు అంగ్యనుసంధాయకము లేయును కరుణాద్భుతంపులవములతో సాగరికం జేఁగా, రసోద్దీపనము చేసి, ఈఁతకు సుఖమగు నాసంభోగప్రాదమున నా ప్రత్యభిజ్ఞానాది కరుణాద్భుతములం గలిసియున్న ఎటువలె నుండెడినో! అట్లుగదా మాళవికకవి నిర్వాహము.

౨౩. వసుభూతి రాజు దేవి సాగరికల కూడలి—(క) వసుభూతి రత్నావళిం గోలుపోయినాఁడు. తాను ఎట్లో మునకఁ దప్పించుకొని అట్లట్లు ఇటకు రాజసదనమునకు వచ్చినాఁడు. సింహళమునుండి నాఁడు వాసవదత్తం దలంచుకొన్న దుఃఖముతో, అమ్మాయిని పురస్కరించుకొని ఏ మేమియాశలం బేర్చుకొని ఇక్క

డికి బయలుదేరినాఁడు! నేఁడు ఎటువలె పిరికిరొందుటకే వచ్చుచున్నాఁడు! ఆ యవస్థాయిదాహము వట్టిప్రవాదమయినది. లేమమునశ్శ్రయి, గాహము నిజమై, నీటం బూడిపోయినది. ఇక్కడి జనమునకు ఎటువలె తాను మొగము చూపును? మఱి కవి అరనిప్రవేశమున కలవరపాటును ఇంచుక యేని పలికింపఁడు! గంభీరుఁడేని మహామంత్రి ప్రకాశపఱుపఁడు గాక; అత్యాగతేమం బలుకఁడా? ఇంతకన్న భావముల కూడలియు నుండునా? ఇచ్చో యౌగంధరుని రాకుటనే లేచి యణఁగిపోయినదని యను కొను మనుట మందము. ఇట్టివానికోసమేకదా నాటక శిల్పారంభము. ఎటువంటి సంవర్ధనము నీమి చేసినాఁడు కవి! (బ) అట్లు కలవరపడి, తరువాత రత్నమాలం జూచియుండవలసినది; దాన నానాక సందేహమునకు ఉత్థానోపశమము లేకలిగియుండవలసినది. (ట) మఱియు, అకాండచిత్తప్రసాదాదిశనము తోఁచియుండవలసినది, ఈ హిందువునకు. అతావకాశమే లేకుండ నీటికాటి పాలైన రత్నావళి పునఃప్రాప్తికి ఇప్పుడు కానున్నదానికి ఇట్టిదల్ల సదృశముగను. (త) ఇందులకై ఎడము కల్పించుటకు జయకుంజరవల్ల భాత్వసంగీతాదిని మానియుండవలెను. ఆ ప్రద్ధర ఆమహాప్రభావుని గృహ వైభవమున విదూషకుని మెడకు ఇట్టి హారము అరుదనునా అను నిర్వహణాంగ బలాత్కారమునకే కదా. (మా. పు ౫౩-౩). నిపుణమతులు ఏవఁగుపాటల ప్రస్తావమున వత్సేశుని ఘోషవతీ గజహృదయ పాంక్తితులను సయితము తలంపింపఁగోరినాఁడు, కవి, మనపు పాతా భాధ్యానమున విశేషమింబోలె- అని యందురు; కాని వానితో ఇటం బనిలేమి?

> 'If music be the food of love, play on
> Give me excess of it; that surfeiting,
> The appetite may sicken, and so die.--
> That strain.....................................
> O it came o'er my ear like the
> sweet south
> That breathes upcn a bank of violets
> Stealing and giving odour.—'

అని యొక్కానొక యుగ్నకుఁడ నోట ఆబ్రహ్మయుద్ది కవిరాజు షేక్స్పియరు పలికినాఁడు; మఱి యీ ఘోషవతీ కాంతుని లలితోత్కంఠాఖ్యానమును నీ నాటకమున ఆ ప్రస్తావ మెందును లేదే, ఇట నీజ్ఞాపక మేల? అది యుండనీ. (ప) సాగరికం "గాదుటకే", అనఁగాఁ "గాంచుటకే", అట్లనఁగా "ఉద్వహించుటకే" తరలినరాజుకు, అగ్నింజొచ్చు మఱి తోడివానికైనను, దక్షిణబాహుస్ఫురణము తలంపరాని యకాండశుభాగమమును సూచించునది అంతగా నవసరము గాదు.

> 'విరోధి రససమృద్ధి విభావాది పరిగ్రహః,
> ......రసస్య స్యాద్విరోధాయ......'ధ్వని.
> '...విరోధిరసానుభావపరిగ్రహో యథా-ప్రణయకుపితాయాం ప్రియాయా మప్రసీదన్త్యాం నాయకస్య కోపావేశవివశస్య రౌద్రానుభావవర్ణనే'- ఆలోక.

అని యభియుక్తులు ప్రదర్శించిన దిక్కున, రసమును రక్షించుచు, వినీతి విదేశీ—'ఆ! ఎక్కడనే సాగరిక, తీసికొనిరా ఇక్కడికి ఏకాంతమునకు'- అని ధర్షింపనీ వందనంగని, అంతఃపురమును ధర్షింపనిమ్ము జేని, నీక్షణమునను సాగరిక తనకు కంటయింటి కుందేలేకదా, దీనికి భుజస్ఫురణాది నిమిత్తసూచన యేల? అట్టిది కాశ్యపాశ్రమ ప్రవిశింపు దుష్యంతునికి, ఆతనికే మారీచాశ్రమప్రవిశింపుపునకు, హానుమత్సందేశము వినఁబోవు వశోకవనికాసీతకు మేఘసందేశము వినఁబోవు నలకాయక్షికి - అట్టివారికిం దగును. అట్లే అట్టిది అట్లు దిక్కుమాలి సంకెలంబడి తన్నుం గబళింపుమని యగ్నిజ్వాలలం బిలుచుచున్న సాగరికకు, వాసవతోడి మేనసంబంధమును సయితమప్పటి కెఱుంగని దానికి (?), ఇట్లు పెండ్లి వసుభూతివర్ణనము మేనవదినెకూటమి అన్నియు తెలఁపని తలంపులుగా ఆపన్నమయి యున్నదానికి సుసదృశము, సుసంభావనీయమును అగును.

౫౪. గారడీవాని వృత్తాంతము:— చెప్పనుగదా యౌగంధరాయణుఁడు ఐంద్రజాలికవృత్తాంతమును తన ప్రయోగ మ.ని. శంబరసిద్ధి ఉజ్జయినివాఁడు. యౌగంధరాయణుని ప్రసిద్ధిప్రభావములు కౌశాంబియందట్లో ఆరాజువిద్యాల యుజ్జయినియందును అట్లే. కావున అతనిని వశము చేసికొని పనిగొనుట సరిదే.

ఉజ్జయినికిం బనుటచేతనే అసంబంధము బురస్కరించుకొని అతఁడు రాణిగారిని చూచుట. రాణిగారి పీఠారసు చేతనే రాజు అరని ప్రదర్శనమునకు అనుమతించుట. 'మీవాఁడే యితఁడు, నీవును రావచ్చును, రా' అనియే రాజు దేవిం బిలుచుట. ఇట్లు 'రాణి వాఁడవుగాఁ జొచ్చుకొ' మ్మని వానికి యౌగంధ రాయణుని రహస్యోపదేశము కాఁబోలును. అతఁడు ఆటయనంతరము సెలవుగొని పోవుటయు రాణియాజ్ఞచే కాంచనమాలతోడనే. (కాంచనమాలయు ఉజ్జయినిదే.) రాణి తనయింటికిగా అతనికి బహుమాన మిమ్మని కాంచనమాలతో అతనిం బంపును. అతఁడు రసవిద్య ఇంకొకటి చేసినవారు చూడవలయునని, అట్టే చూచెదములే అని తిరస్కరించుచుఁబోయి పోవును. ఇట్టి చొరవం గల్పించుకొన్న యితఁడు, సర్వనిర్వాహకుఁడగు మంత్రియాసరాను అయికొన్నవాఁడు, రాణియంతఃపుర ములోనైనను నిష్కలిడ్య జూపుటకు ఆటంక మేమి? దీనిచే యౌగంధరాయణుని రహస్యప్రయోగమున వాసవదత్తకు స్పర్శ ఇంచుకయు ఊహింపఁబడదు. స్వప్న తాపసములలో అట్లు 'పరీక్ష' అయినదే వాసవదత్త ఇందు లేశమేని అప్రసక్త గమనం బ్రసక్త కాలేదు. సాగరికను దేవికి అప్పగించినప్పటినుండియు మంత్రి వేసుదృష్టిని అంతఃపురముపై బూనం బఱపియున్నాఁడని తలంపఁదగును. ప్రతిజ్ఞావృత్తము అతనికి ఎఱుకవడు చున్నదనియు. మఱి యీ దెట్లో మఱకు రవంత సూచన చేసి యుండరాదా కదా? సూచనలేనందున సాగరిక చెఱలో నుండుటయు అంతఃపుర దాహోద్భూతమావశ్యకమగుటయు- అంతఃపురములోని యా 'కాముని పితూరీ' రహస్యము గదా- అతఁ డెట్లు ఎఱింగెను అనుసందేహము తీఱకయే పోవును. ఇది యొకింత అనిర్వ్యూఢకరమే.

౫౫. వసుభూతి కౌశాంబిలో నిలిచిపోవుట:— వసుభూతి యేమి, సింహళప్రధానమంత్రి, ఈ కౌశాంబిలో నిలిచిపోయినాఁడు! తాను పోవుదు ననఁడు! తన్నుఁ బంపు మనఁడు! దేవియు ఊరకుండును. విక్రమబాహువు, ఒకవేళ ఎట్లేని యానభంగమును విని దుఃఖమున్న ఆయెనో లేక యానభంగము కాకున్నను, ఇట్లు జరిగినది కుమారీప్రతిపాదనము అన్న మాటను విన కెరుగుమాఁడఁడా? ఎట్లును ఊఱటనో అభినందనముతో ప్రతీక్షింపకుండఁడు. రత్నావళియుం గోరదా, ఇప్పుడును యథాచారముగా తల్లిదండ్రులం దలంచుకొని యేడ్చినదే? రాజేని యౌగంధరాయణుఁడేని ఆమాటం దలంపరు. ఏమి సముదాచారము! ఏమి యౌదాస్యము! మాళవికలో కౌశికి తానిఁక ఊరికిఁ బోయెదనన్న, రాజు వలదనుచు 'నేను జాబు వ్రాయుదునులే, నీమాటలనుకూడ, అనుము. శాకుంతలమున కాశ్యపులవారికే త్రికాలత్రిలోకవేదులకు మారీచులవారు గాలవుని పంపుదురు, అపునఃసంయోగముం దెలుపుమని. స్వప్నమున రైభ్యుని అప్పుడే మరల్పఁడా ఈ యౌగంధరాయణుఁడే ఉజ్జయినికి? తాపసమున గోపాలదర్శకాది సభాజనమునకు రాజే కౌశాంబికిం దరలింపఁడా రుమణ్వంతుఁడు? సంవిధానమున ఈయలంకులయు నాకలింపు కవికి తగ్గఁగూడదు, మఱుఁగుపడకూడదు. ప్రతిభసర్వస్పర్శి, పారపడదు.

౫౬. రత్నావళి-భగినీ:—సింహళమురాజు విక్రమబాహువు వాసవదత్తకు మేనమామ. కాఁగా ఆయన కూఁతురు రత్నావళి ఆమెకు మేనమఱఁదలు. ఒండొరులు వదినెమరదండ్రు. రాజు ఆయుపచారితమున 'దేవి, ఏమి యిది, నీమామమంత్రి యిప్పుడు అన్నతముపలుకుచున్నాఁడు!' అని ప్రతిపదముగా 'నీ' అని నిర్దేశించును. రత్నావళికిని, ఆమె యపేక్షచే వాసవదత్తకును మూలమున 'భగినీ' 'భగినికా' 'బహిణిఅ' 'జ్యాయసీ భగినీ' అని కలదు. దానికి ఆంధ్రానువాదమున 'భగిని' అని తత్సమములం బ్రయోగింపని చోట్ల శ్రీశాస్త్రిలవారు 'చెల్లెలు' అని ప్రయోగించినారు, ఆంగ్లమున అనువదించినవారు బొంబాయి - బంగాళా దేశములవారు, మాతులదుహితకును వాచకమగు 'Cousin'ను ప్రయోగించినారు. ఆంగ్లమున అనువదించిన యాంధ్రులు 'sister' or more properly cousin sister అనుచు ఇట్లు విశేషముం జెప్పినారు. 'Vasavadatta calls Ratnavali her sister although they are cousins, the king of Simhala being the maternal uncle of Vasavadatta.'

అని. అనఁగా "మామకూఁతునైనను ఆదేమో వాసవదత్త 'చెల్లెలు' అనుచున్నది. అని. అనఁగా భగిని యనం జెల్లెలే యనియు సంస్కృతమున మామకూఁతునకు అవాచకమనియు.' మామ కూఁతురు చెల్లెలు ఎట్లగును అని ఆశంకించి కొందఱు సమాధానము చెప్పఁ బ్రయత్నించినారు. ఎట్లనఁగా- (క) విక్రమబాహువు వాసవదత్తకు కాదు, ఉదయనునికి మామ. పలుమారు 'నీ' 'నా' అని విశేషింపకయ 'మాతుల' శబ్దము ప్రయుక్తము. ఒక్కడ 'నీ' అనియున్నదే యెట్లనఁగా అది తనబంధువుల యెడ దేవికిఁగల సొంతదనమును 'మమకారమును' తోఁచుట కగును. కాదా, మగనిబంధువులను అమ్మను నాయనను అత్తను మామను అనావివరుసనే భార్యయుం జేర్కొనుట ఒక యాచారము. అది అఱవలలో ఇప్పటికిని కొంతకలదు. ఆంగ్లమున '—in-law' యోగమున సర్వమును అట్లే. బ్రహ్మవైవర్త బ్రహ్మఖండ దశమాధ్యాయమునం జెప్పఁబడిన కొన్ని యీవరుసలం గనఁదగును. 'శ్వశురుఁడు పిత; పత్నీ భ్రాత=భగినీకాంతుఁడు=శ్యాలుఁడు; పత్నీ భగిని=శ్యాలిక, శ్యాలీపతి=భ్రాత". ఇట్టివ్యవహారము చూపట్టుచున్నది. అట్లు ఉదయనమాతులుఁడు వాసవదత్తకును ఆచారార్థము మాతులుఁడై, ఆవిక్రమబాహుని భార్య (ఎవరో?) వేఱువగన, జన్మచే, వాసవదత్తకుం బినతల్లి వరుసది యగుచేని రత్నావళి చెల్లెలనగును అని. ప్రియదర్శన స్పష్టముగానే మాతృష్వసృదుహిత. అవరుసనే ఇందును అతిదేశింపఁబోలును. మామతనము చెల్లెలితనము ఉభయమును సిద్ధించును. (చ)అట్లు కాదేని, విక్రమబాహువు వాసవదత్తకే మామ. ఆయన భార్య(ఎవరో) ఎట్లో జన్మచేత వరుసకు పిన్నమ్మయు. కాఁగా అప్పుడును ఉభయసిద్ధి. మఱి మామనుమాత్రము చెప్పియుంటయు, అపినతల్లిం జెప్పమియుం జేసి ఈయుల్లిక సాధువుగా తోఁపదు; లేనిదానిం గల్పించుట, కోరిన దానిని ఎట్లేని లాగుట యగును. (ట)మఱి తత్త్వమేమనఁగా—

'వాస— (ససంభ్రమమ్) కంచుఇ ఇయం మమ బహిణిఆ రఅణావలీ!' అని. ఇట నీ'బహిణి ఆ'శబ్దము 'వదినియు' 'వదినె' శబ్దమునకుం బ్రకృతి, మేనమామ కూఁతుం గ్రహించునదికానోపును. మేనమామ కూఁతునకు వయసుచే పెద్దకు నేఁడును తెలుఁగున 'వదినె' యని వ్యవహారము కలదు. ఏదేమార్గముల ఆరూఢిం గన్నదో'. సంస్కృతప్రాకృతముల నిట్టిబంధు వ్యవహారము మనకు చాలదూరమయి అందకపోయినది. సంస్కృతమున ఎక్కడనో త్రవ్వియెత్త వలసియున్నది, సంవాదమును. ఈ రత్నావళిలోని 'భగినీ'చే ఆ వ్యవహారమునకుం బ్రమాణీకరింపవచ్చును. ఏలన, ప్రాకృతమునకు అట్లుగాక తద్విశేషముగానో తదపభ్రంశముగానో గానఁదగు, వ్యవహ్రియమాణములగు నరదుహిందీభాషలలో మామకూఁతునకును, పిన్నమ్మకూఁతునకును ఇంకను అట్లే మేనత్తకూఁతునకును 'బహిణి'వ్యవహారము సిద్ధముగా నున్నది. దానం బ్రాకృత 'బహిణి'ని, దాన సంస్కృత'భగిని'ని సిద్ధకల్పలంగాఁ గొనఁదగును. ఇదియుం గనఁదగును.—"పితృమాతృష్వసృదుహితరో, మాతులస్యసుతా ధర్మతో భగిన్యః"- పైఠీనసి. అమ్మకు ఆఁడుతోఁబుట్టువు(=పిన్నమ్మ)నకుం గూఁతురు 'భగిని' యయినట్లే (మా. ప్రియదర్శన), అమ్మకు మగతోఁబుట్టువు (=మామ) కూఁతురును భగినియే కాదా? కావున విక్రమబాహువు వాసవదత్తకే మాతులుఁడు; తదాత్మజ వాసవదత్తకు 'బహిణి ఆ' అనఁగా 'వదినె'యు అగును. (త) 'చెల్లెలు' అనునాంధ్రానువాదము, రసమునకుం బ్రకరణమునకు అంతగా విరుద్ధముకాకున్నను, నిజమునకు ఎడపి పొరపాటు కావచ్చును. కాదా, శ్రీశాస్త్రిలవారు మాళవికయుపోద్ఘాతమున 'రత్నావళి (=సాగరిక)... వత్సరాజు దేవేరియగు వాసవదత్తకు మేనమామకూఁతురు' అని స్పష్టముగా ఉదాహరించినారు కావున ఇటం 'జెల్లెలమట' అత్యంతస్నేహముం దెలుపుటకుఁగాని బాంధవమాత్రమును నిర్దేశించుటకుఁ గాదు అని సంతోషింపఁదగును. మఱిదనికిం బ్రకృతి అన్యము వెదుకఁదగును కాని అది ఇటం బ్రసక్తముకాదు. పిన్నకుం బెద్దకుం గూడ 'బహిణి' పేరు కలదు. మఱియు, వత్సేశుఁడు "సింహళేశ్వరునికి కుశలమా" అనియు, 'ఏమీ, ఉన్నతవంశమువాఁడైన సింహళరాజు విక్రమబాహునికూఁతురా' అనియు 'మామ' పూర్వకముగా నిర్దేశింపమియు, 'పరాయి' దొడ్డదొరంబోలె నిర్దేశించుటయు, 'ఉన్నతవంశమువా

దైవ' అనుటయు 'మా మామకూఁతురా' అని యనక పోవుటయు, 'నీమామ మంత్రి' అని వాసవదత్తతో ప్రతిపదముగా 'నీ' అనుటయు, 'కుశలమా' అన్న ప్రశ్నకు రాజుకన్నను ముందు, రాజుకన్నను ఎక్కువగా 'అమ్మో అమ్మో, ఏమిచెప్పనో గదా' అని స్త్రీభావమునకెంతో బాంధవనైరంతర్య మునకును అంతతగినట్లుగా దేవి, విశేషించి అత్యాదరముగా, పలవించుటయు; వసుభూతికి, మామమంత్రికి ముందుగా దర్శనమిప్పింపుమని దేవి రాజును ఎచ్చరించుటయు, వసుభూతికి ఒక దొడ్డమంత్రికిం దగినంతకన్నను దేవిపుట్టింటి 'సంబంధము'నకు సదృశతరముగు నట్లు, రాజు ఆప్తజనమును ఎదురు పంపుటంబోని యుపచారాదరము ననుష్ఠించుటయు; దేవి రత్నావళిని సవతిగా తానే రాజునకుం బ్రతిపాదించుటయు, అంతియకాక, రత్నావళికి శాకుంతలములోని 'బంధుజన శోచనీయ కాకుండునట్లుగా' నను శకుంతల చెలుల యభ్యర్థనము 'సామాన్యప్రతిపత్తి పూర్వక మియం దారేషు దృశ్యా త్వయా, భాగ్యాయత్త మతఃపరం' అను కణ్వులవారి దీనవాక్కును దలంపించునట్లుగా ఇట రత్నావళికై అట్టి యభ్యర్థనము తాఁజేయుటయు; సాగరికకు, అదే రత్నావళికి అడుగకయే 'దేవి'పదము నొసఁగుటయు, ఈగ్రంథమున సింహళమురాణి దేవిపినతల్లి యని చెప్పమియు—ఇవెల్ల ఇట్టి దేవి మేనసంబంధమునే ఏకాంతముగా సూచించుచున్నది. ఇంక నొకటి. సింహళేశ్వరుఁడువత్సదేవునితో తనకు 'సంబంధ'లోపము లేకుండును గాక (పు.౫౬)అనియాలోచించుటంబట్టియు,లోప పూరణమునకైన సంబంధము లుప్తముంబోలుట సమంజసమగుటం బట్టియు, సంబంధము విశేషముగా'వియ్యమున' రూఢమగుటం బట్టియు (చూ.— 'Matrimonial alliance'— Apte; 'వైవాహికః- ఇతి శబ్దకల్పద్రుమే— యథా- ఉత్తరచరితే- 'స సమ్బన్ధీ శ్లాఘ్యః' ఇత్యాది;స్వప్న వాసవదత్తే -'సమ్బన్ధిరాజ్య మిద మేతత్, ఇత్యాది; నాగానన్దే- విమాతృకం ప్రతి విటః- 'సంబంధి శ్రోత్రి కరిఅ=సమ్బన్ధిక ఇతి కృత్వా; మాళవికాగ్నిమిత్రే 'స ఇమాం... గతిభర్తృకాం... అపవాహ్య భవత్సమ్బన్ధ కాంక్షయా...) ఆ మేనసంబంధమే తిరమగుచున్నది. ఇందులకు ఇంకను విస్తరమేల? చాలును.

౨౭. వసుభూతికి దర్శనము, 'శోభనముహూర్తము'.—వసుభూతికి దారి చూపి రాజుకుం దెలిపి ప్రవేశపెట్టు మనిపంపిన వసుంధరతో యౌగంధరాయణుఁడు అదేవారికి దర్శనమొసంగను శుభముహూర్తమని నిర్దేశించినాఁడు. తానును కార్యశేషము ముగించుకొని వచ్చునఁట. ఇందు ఏమో రహస్యము దాఁచినాఁడు. 'ఈగారడివాఁడు సాగరికం జూపును, వసుభూతి ఆనవాలుపట్టును. అసమ్మేళనమే తనకు కార్యశేషము. అది ముగియునప్పటికి తానును అగపడును.అంతట కథయే ముగియును.' అని.


ఇది యొకవిధముగా శాకుంతలమున కాశ్యప ప్రవాసవాక్యమును, శకుంతలకు ప్రతికూలముగానున్న దైవమును అనుకూలము సేయుటకు సోమతీర్థమునకుం బోయినాఁడు అనుటను, తలంపించును. ఇట సాగరిక రత్నావళిగా ప్రత్యభిజ్ఞాతయగును; అట శకుంతల గాంధర్వవిధిచే వివాహితయగును. వానికి వాసి శాకుంతల రత్నావళులవాసి. ఒకటి సద్యోరసమును పాటించినది; ఒకటి రసమునకు కట్టవెట్టి అరికట్టి సహృదయుని అగట్టున పరాకుగాఁ గూర్చుండబెట్టినది. శోభనముహూర్తమున దాఁగినది రాజుకు తెలియలేదు. సోమతీర్థముచే ఆరాజు అప్పుడే శకుంతలం గాంచ నేఁగినాఁడు.

౨౮. ఉపసంహారము:-- ద్వీపోపక్షేపము మొదలు కార్య నిర్వహణమువఱకును యథావిధిగా కూర్పఁబడిన యాశృంగారకథలో 'ఉదయనా' యన్న పేరును విని, 'కాముఁడో' యన్న రూపముంగాంచి సాగరిక మరులుగొనుటయు, సారికమాట విని చిత్రఫలకం గాంచి రాజు మరులుగొనుటయుం దొడంగి ఆరామశృంగారము అరఁటియింటికడను, దంతతోరణ వలభియందును,బంగరువెండ మండపముచెంతను పటికరాతి యరఁగుమండపము లోపలను అద్భుత సంవిధానముం బొందినది. నాటికాగర్భము తద్భ్యాయిష్ఠము కావ నాటకలక్షణాను శాసితలు రసవిమర్శకులు రత్నావళిని అత్యంతము ఉపజీవించినారు. కాని ప్రతిభ, నాటకరచనకు వలంతి ఆపాటిదిమాత్రము గాదు. తియ్యనిపద్యమును తీయనైనమాట యుం బర్యాప్తములు గావు. మఱి ఇందు దైవము, శాశాంబిపెట్టి, శారికాసరమాలికా రత్నమాలల గతులు,

కోసలయుద్ధము, సాగరికా వసుభూతులు కవియిష్టము చొప్పున చెదరుట, వైశాలికుని యుదయన గ్రహణము, శారికపంజరము చేతులలో నుండుట, సాగరికసుసంగతల యతిమాత్ర చిత్రశిల్పనైపుణి, శారిక కవిరవంతయక్కఱ తీర్చి ఎగిరిపోయి మఱి దొరకకపోవుట, ఆవేషస్వీకరణ నైపుణి, విదూషకునిమాల, లావాణక దాహ వృత్తాంతము, ప్రవాదసింహాళము, వసుభూతినాఁడే కౌశాంబిం జేరుట, అంతఃపురములో ఐంద్రజాలికాగ్ని; రాజే సాగరికను అచటికే తేవలయుట; వసుభూతి కౌశాంబిలో నిలిచిపోవుట,-- ఇవియు ఇంకనిట్టివియు ఇతివృత్తమును ఉత్ప్రేక్షించుట యందును పొందుపఱచుట యందును తీఱని సందేహములను కలిగించునవియు పొరపాటులేక్కాఁబోలు నని తోఁచునవియు అగపడుచున్నవి. ఇట్టి వానికెల్ల అప్రయత్న సిద్ధముగానే ప్రతిభచే నాటకమున అమరిక కుదురవలయును. అమరిక కలిమిలేములు నిపుణముగాఁ బరికించిన రత్నావళి మాళవికల పౌర్వాపర్యమెట్లగును? ఈయన్నింటిని లెక్కసేసి యీకథా సందర్భమున కవిప్రతిభను కొలిచి నిర్ణయింపఁదగును.

కాలగమనము

విష్కంభము -	చైత్రపూర్ణిమ -	అపరాహ్ణము	౩-౪౫ గం.
౧ అంకము -	చైత్రపూర్ణిమ -	సంజప్రొద్దున	౪-౬.౩౦ గం.
ప్రవేశకము -	చైత్రకృ.ప్రథ -	పూర్వాహ్ణము	౭-౪౫ గం.
౨ అంకము -	చైత్రకృ.ప్రథ -	పూర్వాహ్ణము	౯-౧౧ గం.
ప్రవేశకము -	అదే -	అపరాహ్ణము	౪-౩౦ గం.
౩ అంకము -	అదే -	సాయంకాలం	౫-౭ గం.
ప్రవేశకము -	అదే-ద్వితీయ-	పూర్వాహ్ణము	౭-౩౦ గం.
౪ అంకము -	అదే-ద్వితీయ-	పూర్వాహ్ణము	౯-౧౧ గం.



అరుణోదయము

శ్రీ భీమన

పువుపువు లెక్కచూచి ఎవెవో మన సిచ్చిన పూలె ఏరి త్రుం
తువు ఒడినిండ ; ఏ కలిమి నోములు నోతురా యెవ్వరేమి యు
త్సవము ; సుహృద్వరా ! పిలుచు శారికనైన గణింప వెందు కే
పువ్వులును, పల్లవమ్ములను, పూవుల కొమ్మలు, మావిరెమ్మలున్ ?

తూరుపుకోటలో మొరయు దుందుభు లేవినరావొ ? మంజు సా
మీర వసంతగాయకులు వేణువనాగ్రము లెక్కిపాడుచు
న్నారు గదోయి ! చూతసుమనస్విను లాడుచు ముందు సాగ - శృం
గార నవారుణాంగణముఖంబయి వచ్చిన దుత్సవమ్మదే.

పిలుపులు వచ్చె—మీ భవనవీథుల వాకిళులైన చేరి ని
ర్మలహృదయారవిందమకరందము లిండని — కోతపూలు ధీ
రులు గయికోరు నిర్దయత త్రుంచిన వౌటను ; లేవలేని పూ
జల దమరేని కీయక, ప్రసన్నునిజేయక రాల్చవే విరుల్ !

పులకములు పూలవాసనల పుమ్మ విచ్చుటలేదె ఆశలన్
ప్రకటిత సుస్వరాజ్య పరిపాలన మెల్లెడ చాట బంపరో ?
వికలితుడైన శీతపృథివీపతి పశ్చిమవార్ధి గ్రుంకడో ?
ఇక అరుణోదయంబయి సుఖింపవో లోకము లెల్ల? నచ్చెలీ !

అపుము పూలకోత ; బరమాత్మ రథమ్మదె మ్రొక్కుమోయి ; ఈ
పూపయు, పిందె తీవలనె పూజ లొనర్పగనిమ్ము ; అంచు నే
నాపువుకోతవాని కన ఆతడు మూల్గుచు లేచిపోయె పెక్
కోపముతోడ—"గంట అదె కొట్టిరి, అర్చకు డేమి లిట్టనో !"

ఆంధ్రతేజము

(రెడ్డిరాజులకాలమునాటి యాంధ్రదేశచరిత్రాత్మక నాటకము)

శ్రీ నండూరి బంగారయ్య

ఈనాటకమున వచ్చు పాత్రములు :

స్త్రీలు

విజయాంబ — మాదానీని యభిమాన పుత్రిక ; కథానాయిక.

భ్రమరాంబ — అనపోతనాయని పుత్రిక.

పేదరాశి పెద్దమ్మ —

పురుషులు

ప్రోలయ వేమారెడ్డి — రెడ్డిరాజ్య స్థాపకుడు.

అనపోతారెడ్డి — ప్రోలయవేముని పుత్రుడు ; యువరాజు ; కథానాయకుడు.

రామాప్రెగ్గడ — ప్రోలయవేమన మంత్రి.

ఎఱ్ఱాప్రెగ్గడ — ప్రోలయవేముని యాస్థానకవి ; కవిత్రయములో నొకడు.

అన్నారెడ్డి — ప్రోలయవేమన తమ్ముడు ; చమూపతి.

అనపోత నాయడు — రాచకొండ సేలు నాయకుడు.

మాదానీడు — అనపోతనాయని తమ్ముడు.

పోతరాజు — మాదానీని మంత్రి.

కన్నమనీడు — మాదానీని కుమారుడు.

ఇంకను సందేశహారి, వందిమాగధులు హంతకుడు మున్నగు వారిని యథోచితముగ ఊహించుకొనునది.

మొదటి అంకము

[మొదటిరంగము—ప్రదేశము : అద్దంకిలో పోలయవేమారెడ్డి యభ్యంతరమందిరము.

ప్రవేశము : ఆసీనులయి పోలయవేమన, ఎఱ్ఱాప్రెగ్గడ.]

పో. వేమా — మహాకవీ !

ఉ. కాకతిరాజ్యవైభవము కన్నుల ముందట నాట్యమాడుచోఁ
జైకొను భారతాభ్యుదయ భావము లెల్లను స్వప్నగాథలై
చీకటిలోఁ బ్రతిధ్వనులఁ జేసి హసింపగ గ్రుంగిపోవుచున్
వ్యాకుల మొందు నాహృదయభారము దీరునె యెన్నఁడేనియున్ ?

ఎఱ్ఱాప్రెగ్గ — మొన్ననేకదా నాయకు లందరును ఏకమయి మరల నోరుగంటి సింహాసనమున ప్రతాపరుద్రసార్వభౌమునితనయునిఁ బ్రతిష్ఠించిరి ? ఇక నేమి ? మరల నొక యాంధ్రసామ్రాజ్యమును స్థాపించి యనంతరము భారతవర్షస్వాతంత్ర్యసంపాదనమునకై ప్రయత్నింపవచ్చును కదా !

పో. వేమా — ఏమి పునఃప్రతిష్ఠ ? శిథిలసౌధమునకు జీర్ణస్తంభము బోటుపెట్టినట్లయినది. చిరకాలము నిలుచునని నాకుఁ దోచదు. రాచకొండలో రేచర్లనాయడా? విద్యానగరమున హరిహరరాయలా ? కోరుకొండలో కూనపనాయకుడా ? ఇంటి కొక స్వతంత్రరాష్ట్రమాయెను. ఇక నెక్కడి యాంధ్రసామ్రాజ్యము ?

ఎఱ్ఱాప్రెగ్గ — నిజమే. నీవు చెప్పినట్లు ఆంధ్రతేజము ఛిన్నాభిన్నము లయినది.

పో. వేమా — శరీరమున జవసత్త్వము లున్నంతవరకుఁ బ్రయత్నలోపము చేయలేదు. కాని నాజీవితమున ఆంధ్రసామ్రాజ్యస్థాపనము సిద్ధించుసూచనలు గానరావు.

ఉ. వ్రాలెను బ్రొద్దు పశ్చిమపు వార్నిధిపజ్జకు; సాంధ్యరాగముల్
మాలిని దాల్చి రత్నమయమండనయై యలరారు రోదసీ
లాలితరూపసంపదకు లాస్యము నేర్పె శశాంకమౌళి; గో
పాలకదేవుఁ డీ యొసల వర్ణియులన్ గృపజూడఁబోయెడిన్.

ఇహము లేకున్న మానిరి. పరమయినను జూచుకొనవలదా ?

ఎఱ్ఱాప్రెగ్గ — నాకుఁ జూడ ఇహపరముల రెండింటియందును నీ కేకొదువయుఁ గానరాదు. ఇప్పుడు పరమునకయి చేయవలసిన నూతనప్రయత్నమే మున్నది ? శ్రీశైలమునకు సోపానములు నిర్మించియు, రామాయణ హరివంశాది పవిత్రగ్రంథములు నిర్మింపించియు శివకేశవులవాత్సల్యము నిదివరకే సంపాదించుకొంటివిగదా!

(ప్రవేశము ప్రతీహారి.)

ప్రతీహారి — జయము! జయము! మహారాజా! మహామంత్రులవారు దర్శనార్థము వేచి యున్నారు.

పో. వేమా — త్వరగా ప్రవేశపెట్టుము.

ప్రతీహారి — మహాప్రసాదము.

(నిష్క్రమించును.)

పో. వేమా — చూచితిరా? రవంత సాహిత్యగోష్ఠి నాశించిననాకు ఎన్ని యంతరాయములు తటస్థించుచున్నవో!

(ప్రవేశము రామాప్రెగ్గడ)

పో. వేమా — ప్రధానిశేఖరా! మోటుపల్లినుండి వార్త లేమైనఁ దెలిసినవా?

రామాప్రె — మహారాజా అంచెవేగు లింకను రాలేదు. అర్జునవిక్రముడయిన మల్లారెడ్డి విజయమునుగూర్చి నా కెంతమాత్రమును సందేహములేదు. ప్రస్తుత మంత కంటెను ముఖ్యమైన వేరొకయంశమునుగూర్చి ముచ్చటింపవచ్చితిని.—

పో. వేమా — ఏమది?

రామాప్రె — ఏమహామహుల తపోయజ్ఞాదులను నిర్విఘ్నముగఁ గొనసాగించుటకై మేమీ లౌక్యకూపమునఁ బ్రవేశింపవలసివచ్చినదో అట్టి వేదమూర్తుల యార్తరావము ప్రభువులకు విన్నవింపవచ్చితిని.

ఎఱ్ఱాప్రెగ్గ — వేముని రాజ్యమునఁ గూడ వేదమూర్తుల యార్తరావమా?

రామాప్రె — మనరాజ్యమునఁ గాదనుకొనెదను. రాజమహేంద్రవరప్రాంతములలో మహమ్మదీయులు సలుపు దుండగములకు మితిలేకుండ నున్నదని కోనసీమబ్రాహ్మణులు మొరపెట్టుచున్నారు.

పో. వేమా — కోరుకొండలో కూనపనాయకు డుండనేయున్నాడుగదా!

రామాప్రె — ఆతనికి సైన్యబలము చాలకుండ నున్నది. ఒకవంక మన్నెదొరలతోడను ఇంకొకవంక తురుష్కులతోడను బోరాడుట యాతనికిఁ గష్టముగ నున్నది.

పో. వేమా — విషమపరిస్థితులు వచ్చినవే! ఉన్నసైన్యములో కొంతభాగము మోటుపల్లి పోయినది గదా! ధరణికోటనుండి యువరాజు కదలినచో రేచెర్లవారు నిలువ నీయరుగదా? ఏమి చేయవచ్చును?

(ప్రవేశము ప్రతీహారి.)

ప్రతీహారి — జయము, జయము మహామంత్రీశ్వరులకు! ఇదిగో కమ్మ!

(అని చేతి కొలకమ్మ నందిచ్చి నిష్క్రమించును.)

రామాప్రె — (చూచుకొని) మహారాజా! మల్లారెడ్డి మోటుపల్లిని జయించిన శుభవార్త!

(అని లేఖను వేమారెడ్డి కిచ్చును.)

కో. వేమా — (చదివి ఎఱ్ఱాప్రెగ్గడతో) మహాకవీ! నే నింక నిశ్చింతగ మరణింపవచ్చును.

ఎఱ్ఱాప్రెగ్గ — కాదామరి! సప్తద్వీప వస్తుసందోహము గొనివచ్చి యిచ్చు సముద్రుడు నేడు నీకు మరింత నెచ్చెలియయినాడు.

(ప్రతీహారి ప్రవేశించును.)

ప్రతీహారి — మహారాజా! శ్రీమతు యువరాజులుంగారు దర్శనార్థమై వేచి యున్నారు.

కో. వేమా, ఎఱ్ఱాప్రెగ్గ, రామాప్రె — (ఒకరి నొకరు చూచుకొందురు)

కో. వేమా — ముందుగ వార్త బంపకుండ యువరా జింత తొందరగ వచ్చుటలో నేదో విశేష ముండితీరవలయును. సత్వరముగ బ్రవేశపెట్టుము.

ప్రతీహారి — మహాప్రసాదము. (నిష్క్రమించును.)

కో. వేమా — మానవజీవిత మెంత చిత్రమైనది! అంతలో హర్షము! అంతలో నాందోళనము!

(అనపోతారెడ్డి ప్రవేశించును.)

అనపోతా — మహాకవీ! నమస్కారము. సచివోత్తమా! నమస్కారము. తండ్రీ! నమస్కారము.

కో. వేమా, ఎఱ్ఱాప్రెగ్గ, రామాప్రె — వత్సా! చిరంజీవ!

కో. వేమా — కుమారా! "మోటుపల్లి" "మోటుపల్లి" యని నీ వహోరాత్రములు కలవరించుచుందువు కదా! ఇదిగో! ఈమహాకవి యాశీర్వచనబలముచే, నీసచివోత్తముని మంత్రాంగబలముచే, నీపినతండ్రి బాహుబలముచే నది నేడు మనకు వశమయినది.

(అని కమ్మ చేతి కిచ్చును.)

అనపోతా — (చూచుకొని) పరమసంతోషము. ఆంధ్రాభ్యుదయనాటకమున కిది నాంది.

పో. వేమా — కాని నీ వింత తొందరగా వచ్చుటకు కారణము దురూహ్యముగా నున్న దే?

అనపోతా — ఏ మున్నది? మరల యుద్ధము సిద్ధము. అనపోతనాయడు జీవించియు న్నంతదనుక మనకును, మనము జీవించియున్నంతదనుక ఆతనికిని మనశ్శాంతి యుండ దనుకొందును. "మాధరణికోట మా కీయవలసిన"దని మరల వర్తమానము.

రామాప్రె — ధరణికోటను వారి తాతలు తండ్రులు గడించిరి కాబోలును.

పో. వేమా — నాయనా! ఏమి సమాధానము పంపితివి?

అనపోతా — నాయనగారి యాజ్ఞ గైకొనకుండఁగనే సమాధానమా?

రామాప్రె — నా కొక యాలోచనము తోచుచున్నది. వెంటనే ప్రత్యుత్తరము బంపక పోయిన నెట్లుండునో.

పో. వేమా — అట్లయిన నొక పద్ధతి నవలంబింతము. ఇప్పుడు వచ్చిన వార్తాహారిని తూల నాడక "వారము దినములలో వర్తమానము చేసెద"మని చెప్పి పంపుము. వార ముదినములయిన వెనుక ఇం కొక వారము దినములలో నన్నచమూపతి వారికడకు మన రాయబారము గైకొని వచ్చునని వార్త బంపుము.

అనపోతా — రాయబార మేమని?

పో. వేమా — యుద్ధమువలన కలుగు స్వజనక్షయము ధనవ్యయము ప్రజాపీడ మున్నగు నష్టములను వివరించి మన యన్యోన్యకలహములు దేశమునకు క్షేమకరము కావని వారించుటకు.

అనపోతా — దానివలన ప్రయోజన ముండు ననుకొందురా?

రామాప్రె — తప్పు మనమీద నుంచుకొనక వారి మీఁదఁ బెట్టినవార మగుదుముగదా!

అనపోతా — సామోపాయము నవలంబించుట వారికి మరింత లోకువ యిచ్చునేమో! ఏమైనను పోయిన దూత సమయోచితమైన కౌశల్యము వహింపవలెను.

రామాప్రె — కొంత కాలవిలంబనము మన కెట్లును ఆవశ్యకముగదా.

పో. వేమా — గడియ కొకయుద్ధమైనచో నిక నెక్కడ? విద్యాపీఠము పేరు చెప్పకొ మాటిమాటికి మన యీ యాంధ్ర దేశమును రక్తసిక్తము గావింపవలసిన దేనా?

అనపోతా — ఇదివరకే దేశస్థితి బహుదుర్భరముగా నున్నది.

సీ. ఖండాంతరంబుల ఖ్యాతి గాంచుచునున్న తెనుగువాణిజ్యంబు వెనుకఁబడియె!
మణిహీరరాసుల మునిగి తేలుచునుండు నోడరేవులు గడ్డిబీడులయ్యె;
శ్యామల పరిధాన సస్యశోభను వీడి భూదేవి వెత్తుటఁ బొరలుచుండె;
శాంతిభిక్షాటన సలుపు ప్రాజ్ఞగణంబు లన్యదేశంబుల నాశ్రయించె;

గీ. వేణువీణాస్వనంబుల జెల్లివిరియు,
పట్టణంబులు హాహారవంబుతోడ
నిండిపోయెను; యుద్ధంబు గుండెఁ జీల్చి,
స్రావుచున్నది యాంధ్రుని రక్తమెల్ల.

పో. వేమా — "గోరుచుట్టుమీద రోకటిపో"టనినట్లుగ నున్నది. అటు కోనసీమ బ్రాహ్మణులయార్తరావమా! ఇటు ధరణికోటయుద్ధమా! ఏమి చేయవచ్చును? మల్ల రథినీనాథుని వెనుకకు రమ్మనిన మంచిదికాదా!

అనపోతా — వలదు. వలదు. క్రొత్తగా స్వాధీనపరచుకొనిన ప్రదేశమున మనజయము స్థిరపరచుకొనుటకు కొంతకాలము పట్టును. మోటుపల్లి మనరాజ్యమునకు శ్వాసకోశముగదా!

పో. వేమా — మోటుపల్లి శ్వాసకోశము! ధరణికోట హృదయకోశము! ఇందు దేనిని వీడుకొందుము?

అనపోతా — ధరణికోటకు నే నుండనేయున్నానుగదా! ఎటు వచ్చినను కోటలో నాహారపదార్థములను నిలువచేసి యుంచుకొనుట మంచిదని యాలోచించుచున్నాను.

పో. వేమా — ఇప్పుడు బొక్కసములో ద్రవ్య మంతగ నున్నట్లు లేదే? ఎంతసేపును మన బ్రదుకు యుద్ధములతోడనే సరిపోవుచున్నదిగదా!

రామామాత్య — ద్రవ్యమునుగూర్చి సంకోచింపఁబనిలేదు. మన బాల్యమిత్రుడు అవచి దేవయ్యశెట్టి యున్నాడుగదా! ఎంతద్రవ్యము కావలెనన్నను అతనియొద్దనుండి కొనిరావచ్చును.

పో. వేమా — బాగుగా జ్ఞప్తి చేసితిరి. వెంటనే ముప్పదివేలవరాలను బంపవలసినదిగ వార్తనంపుడు.

రామామాత్య — ప్రకృతము మన మీకోనసీమ బ్రాహ్మణులకార్యము నిలుపుచేయుదము.

పో. వేమా — సచివోత్తమా! వలదు. వలదు. త్యాగధనులును తపోనిష్ఠితులును అగు బ్రాహ్మణులయందేకదా విశ్వము సుప్రతిష్ఠితమైయున్నది. అట్టివారి యార్తరావమును పాలింపలేకున్నచో మనజన్మములు కాల్పనా?

అనపోతా — మామ నూకారెడ్డి యున్నాడుగదా.

పో. వేమా — అవును. అయిదువేల పదాతివర్గముతో నూకచమూపతిని కోనసీమకుఁ బొమ్మనుదు. ధరణికోటకు నీవు చాలుదువు కదా?

అనపోతా — చాలుదును.

పో. వేమా — సరే, నీవు ముప్పదివేలవరాలను గైకొని పొమ్ము. బహుజాగరూకతతో వర్తింపవలయును సుమా.

రామాప్రె — మహారాజా! నా దొక్కమనవి యున్నది.

పో. వేమా — అమాత్యశేఖరులు సెలవీయవలయును.

రామాప్రె — కాలము బహువిపరీతముగ గనవచ్చుచున్నది. ఈయుద్ధము ముగియువరకు నాకుగూడ ధరణికోటనివాసమున కనుజ్ఞ నీయవలయును. నా కిచ్చట కాలు నిలువకుండనున్నది.

పో. వేమా — కంటికి రెప్పవలె కుమారుని మీరు కాపాడెద మనినచో అంతకంటెనా?

రామాప్రె — అసహాయశూరుడగు యువరాజు కొకరిసాయ మక్కఱలేదు. కాని ఏదో నెపమువిూద ఆతని కీర్తిలో కొంత పంచుకొనవలెనని నా కాశ పుట్టినది.

పో. వేమా — మీ రింత చెప్పవలెనా! (కుమారునితో) అమాత్యశేఖరులు నీకడ నున్నచో నిక గావలసిన దేమున్నది?

అనపోతా — నాయనగారూ! నా కది వరముగాదా!

పో. వేమా — నా కిక పూజకు వేళ యగుచున్నది.

ఎఱ్ఱాప్రెగ్గ, రామాప్రె } మహారాజా! మాకు సెలవు దయచేయుడు.

అనపోతా — నాయనగారూ! నమస్కారము. నా కాజ్ఞ నిప్పింపుడు.

పో. వేమా — (అనపోతారెడ్డితో) నాయనా! నీవు ప్రాజ్ఞుడవు. నీకు చెప్పవలసిన దేమున్నది?

ఉ. నేవ రొమునర్చి యీ తెలుగునేలకు రక్తము ధారపోయగా
దీవనముఁ గడించుకొని దీక్ష వహించిన శాత్రవలంబు సం
భావనమై స్మరించుకొని భావిజనంబులు నాసమాధిపై
పూవులు జల్లఁగావలయు పుణ్యచరిత్రము నిర్వహింపుమా.

(నిష్క్రమింతురు.)

[రా—ప్రా—అనపోతా. అభ్యంతర మందిరమును గడచుటకు సూచకముగా కొంచె మీవలకు వచ్చి నిలుచుండగ వెనుకటి తెర దించవలెను]

రామా॥ప్రె — (అనపోతారెడ్డి బుజముపై చేయివైచి) పదునారేండ్ల పడుచుకూచికి అరువది యేండ్ల ముదివగ్గును ముడిపెట్టిన ట్లయినది. మన యిరువురి కాపురము ఎట్లు కడతేరునో తెలియకుండనున్నది.

అనపోతా — (చిరునవ్వుతో) ఇరువురును కోరి చేసికొనిన వలపుపెండ్లిమైనచో నిబ్బంది లేదుకదా ?

రామా॥ప్రె — ముసలివారి కనుమానము మెండు. పడుచువారికి సాహసము మెండు.

అనపోతా — పితృపాదులగు మీయాజ్ఞ నెన్నడైన నతిక్రమించితినా ?

రామా॥ప్రె — (అనపోతారెడ్డిగడ్డము పట్టుకొని) వత్సా ! నీయీడున నున్నప్పు డేర్పరుచుకొనిన యాశయములలో నావగింజంతకూడ మేము సాధింపజాలకపోయితిమి.

అనపోతా — అనుకొనుచున్నారు. రెడ్డిరాజ్యమునకు మీరేకదా పునాది వైచినది ?

రామా॥ప్రె — మహారాజును నేనును బాల్యమిత్రుల మయినందులకు ఆంధ్రసామ్రాజ్య స్థాపనమును సంకల్పించితిమి. ఇంకను శంకుస్థాపనమైనను గాలేదు. భావికర్తవ్య మంతయు యువకుడవగు నీ మీద నాధారపడియున్నది.

అనపోతా — అమాత్యశేఖరులు ఏదో చెప్పదలచుకొని చెప్పకుండనున్నారు. నాదగ్గర కూడ నింతదీర్ఘమైన యుపోద్ఘాత మావశ్యకమని తలచుట నాదురదృష్టమే.

రామా॥ప్రె — వత్సా ! అనుభవమును పురస్కరించుకొని యొకటి రెండు నిన్ను కోరుచున్నాను. అవియైన నీక్షేమము నాశించి కోరుచున్నవే. సాధారణముగ మీ రెడ్డివంశజులకు అనుగ్రహము జనించినను కష్టమే. ఆగ్రహము జనించినను కష్టమే. వెనుక ముందులు చూడరు. ఈయుద్ధసమయమునఁ గ్రొత్తవారి నెవరినయినఁ గోటలోనికి రానిచ్చుటగాని, సైన్యములోఁ జేర్చుకొనుటగాని ప్రమాదకరము గాదా ?

అనపోతా — మణులా ! మాడలా ! చివర కిదియా మీరు కోరినది ! మీయనుజ్ఞ గైకొనకుండ ఎవ్వరిని కోటలో నడుగుపెట్టనీయను. సేనలో జేరనీయను. సరియా !

రామా॥ప్రె — ఇప్పుడు నీవు వెనుకటివలెఁ బ్రతిదినము కృష్ణాతీరమున కొంటిగ సంధ్యా విహారమునకై పోవుచున్నావా ?

అనపోతా — దీనిలోమాత్రము మహామాత్యులు నాకు గొంత యాటవిడుపు సేయక తప్పదు. దినమున కొక్క పర్యాయమయిన కృష్ణాతరంగపంక్తులలో లిఖితమయిన యాంధ్ర దేశచరిత్రమును బఠింపకుండ నే నుండలేను.

రామాప్రె — ఇవి యుద్ధదినములుగదా యని ఆలోచించుచున్నాను. సింగమనాయని హత్యనుగూర్చి నీవు వినియేయున్నావు గదా!

అనపోతా — అట్లయినచో మన విరువురము నొక్క సమయము చేసికొందము. వార మున కొక్కసారి— అదిడైనను చీకటిపడకుండ మందిరముఁ జేరుకొనుపద్ధతిని— నా కనుజ్ఞ నీయవలయును.

రామాప్రె — పరమసంతోషము. ఇన్ని విధముల నిన్ని బ్బంది పెట్టవలసివచ్చుచున్న దిగదా?

అనపోతా — మా క్షేమమును యోజించి చెప్పుచున్నారుగాని మరియొకటి కాదుగదా? అన్నట్లు మరచితిని. అన్న చమూపతితో నేను కొన్ని యాంతరంగికవిషయములు ప్రస్తావింపవలసియున్నది. నా కనుజ్ఞ నిచ్చెదరా?

రామాప్రె — వత్సా! నీవు సర్వమును సంసిద్ధము గావింపుము. ఇంతలో నేను మహా కవులయొద్దనుండి సెలవుపుచ్చుకొని వచ్చి నిన్ను గలసికొందును.

అనపోతా — చిత్తము. సెలవు.

(అని యిరువురకు నమస్కరించి నిష్క్రమించును.)

ఎర్రాప్రెగ్గ — అన్వయైకపావనుడగు తండ్రి కీత డధికు డగునుగాని తక్కువ గాడు.

రామాప్రె — ఆంధ్రసామ్రాజ్యమును పందెముగాసి ఇప్పుడు మూడు గుర్రములు పరుగెత్తు చున్నవి.

ఎర్రాప్రెగ్గ — రాచకొండ, విద్యానగరము, నద్దంకియునా?

రామాప్రె — అవును. భగవంతు డీతనికి చిరజీవిత్వము ననుగ్రహింపవలయును గాని యీ తని బొందిలో ప్రాణ ముండగ సామ్రాజ్యాధిపత్యము అద్దంకి దాటిపోనేరదు. చక్రవర్తి లక్షణము లన్నియు నీతనికి సంపూర్ణముగ బట్టినవి.

ఎర్రాప్రెగ్గ — చిరకాలమునకు వినదగిన మాటలు వింటిని.

రామాప్రె — మీరు నా కొక్కయుపకృతి చేయవలసియున్నది.

ఎర్రాప్రెగ్గ — మీకోరిక నెన్నడైన నిరాకరించితినా?

రామాప్రె — వయసు ముదిరినకొలది పోలయవేముని కాముష్మికదృష్టి యధికమగుచు న్నది. దేశక్షేమము నాశించి మీరు దానివడి కొంత తగ్గింపవలయును.

ఎర్రాప్రెగ్గ — సాధ్యమగునా ?

రామాప్రె — కవుల కసాధ్య ముండునా? ఆంధ్ర సామ్రాజ్యస్థాపనమునిమిత్తము మీ రామాత్రము శ్రమపడకతప్పదు.

ఎర్రాప్రెగ్గ — శక్తివంచనములేక ప్రయత్నించి చూచెదను. భగవానుడా! ఆంధ్రసామ్రాజ్యస్థాపనమున కాటంకములు కల్పింపకుము.

శా. ఛిన్నాఛిన్నములైన యాంధ్రుల యశశ్శ్రీపర్వతాగ్రంబు నా
కన్నీటన్ బ్రతిబింబితంబయి నమస్కారంబు గావించెడిన్ ;
ఎన్నోమూర్తులఁ దాల్చి విశ్వకథలో నేకాత్మతన్ బొల్చు నో
యన్నా! ఛిన్నమహాంధ్రదేశమున కైక్యంబున్ బ్రసాదింపవే!

(ఇరువురును నిష్క్రమింతురు.)

స్విన్న శిల

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

మాతృ వాగ్దేవతా పద స్మరణ జనిత
మంజు కవితాసుధారస మధురిమమున
రసికమానసములఁ దన్పి యొసఁగు కవిని
నవయఁజేసిన యరసికునకు "ధిగస్తు!"

* * *

అతిశయ భక్తిబద్ధ హృదయమ్మున రేలు బవళ్లు వ్రాసి, యం
కిత మొనరింప నర్హుఁడని కోరుచు నాతనియొద్ద కంపఁగాఁ
గృతమతి సాతవాహనుఁడు గేలియొనర్చె; నిఁకేటి కీ తిర
స్కృతకృతి నగ్నిసాత్కృతిగఁ జేయుటయే కరణీయ మియ్యెడన్.

రాజధిక్కృత మీ గ్రంథరాజ మేని
యాలసింపక వహ్నిలో నాహుతింతుఁ
బ్రబల లోకాపవాద సంబంధవశత
ధరణిజాతయు మును బరిత్యాజ్య గాదె ?

అక్కటా! వ్రాత "రక్తమయ"మ్మనియును
"భాష పైశాచి" యని మాఱఁ బాడియగునె ?
చారచక్షుష్కమగు మహీజానితతికి
మధుర కావ్య ప్రశస్తి యెమ్మాడ్కిఁ దెలియు ?

ఉదయభాస్కర కిరణ మహోదయమున
విరియఁబాఱిన కెందమ్మి విరిని గాంచి
లలిత లలితము లైన రేకులను గినుక
నలిపివైచెడి కఠిన మానసుఁడు కలఁడె ?

ఎడనెడఁ జేతులార నిటు లీ జ్వలదగ్ని సమర్పణంబు నే
వడువునఁ జేయువాఁడ నిటువంటి బృహత్కథ, సత్కథాకళా
విలసిత ; మక్కటా! కఠిన వృత్తికిఁ దావల మీ గుణాఢ్యుఁడే
మడిసిన లేకపోవును బ్రమాదము, "హా! విధిచేత లెట్టివో ?

తుకతుక నుడుకు నెత్తురుచుక్కలైన యీ పద్యలతలు నీకు బలి యొసంగి,
విసువు విరామము విడిచి వ్రాసిన యీకథావళి నీ కుపహార మిచ్చి
ప్రతికథావిలసిత బహువిధాద్భుత చిత్ర కల్పనామణులను గానుకఁ జేసి
సహృదయహృదయ సంస్తవ్యమైన కవిత్వధోరణి నీ కిట్లు ధారవోసి

సప్త లక్షాత్మక ప్రశస్త ప్రబంధ
మీ "బృహత్కథ" నీక యర్పించుచుంటి
నందుకొనుమయ్య! వైశ్వానరా! నరకృతి
యీ యఖండ కావ్యము చిరస్థాయి యగుత!

*　　*　　*

ఇటు కటకటఁ బడి కనుఁగవఁ
బొటబొట జాల్వాఱు బాష్పములఁ గుత్తుకలో
గుటగుటఁ గ్రుక్కుచు మహితో
ద్భటధైర్య స్థైర్యబద్ధభావుం డగుచున్.

ఆకులపై విలిఖించిన
శ్లోకమ్ముల నొక్కటొక్కటె సుమహిత దుఃఖ
వ్యాకులుఁడై పఠియించుచు
నాకావ్యము నాహుతింప నారంభించెన్.

గలగల వేఁడి బాష్పములు కాలువలై ప్రవహింప, నాతఁ డ
గ్గలమగు శోకభారమునఁ గన్నులు వాయఁగ వెక్కి యేడ్చుచుం
దెలివి దొలంగి యిట్టు పరిదేవనముం బొనరించుచున్, సము
జ్జ్వలిత తదగ్నికుండమున భస్మము సేయఁ దొడంగెనాకృతిన్.
శిలలు ద్రవించి పాఱినవి చెమ్మగిలెన్ మృగరాజ నేత్రముల్
వలవల వెక్కి పొక్కినవి వన్య కిరాతుల రాతిగుండియల్
పలపల దుష్ట సత్త్వములు బాష్పముఁ గురిపించెఁ, దచ్ఛిఖా
జ్వలిత బృహత్కథామహిత చారు కథాశ్రవణ ప్రసక్తిచేన్.

తద్బృహత్కథా గ్రంథ సందహనవేళఁ
బ్రకృతిబాలిక పిచ్చి పిల్లవలె మాఱి
శూన్యదృక్కుల దిక్కులఁ జూచి చూచి
యా జ్వాలోద్వహ్ని లీన మైనట్లు తోఁచె.

మెట్టవేదాంతం

'వనఫూల్'

పిల్లలు ఇంత బాగా ఉంటారు, ఎందుకని ?

ప్రస్తుతం, నా మనమడు నా మనస్సులో ఈచింతనను రేకెత్తించాడు. వాడి కిప్పుడైదోయేడు. వాడి సేవలోనే నాకు పొద్దు కూకుతూఉంది. ఇంకో పని చూడటానికి తీరికలేదు ; కాయితాలతో పడవ చేయటమో, ఓడచెయ్యటమో, సిరాబుడ్డి చేయటమో గాలిపటం చేయటమో! ఇంతే కాదు, వాణ్ణి నాభార్యకు కాల్పనిక ప్రణయినిగా చేసి వాడితో ఉత్తుత్త పోట్లాట కూడా పోట్లాడతాను. కుర్రవాడు శిష్టుడు కాడు; శాంతుడు కాడని వేరే చెప్పడమెందుకు ?

వాడు ఈమధ్యనే హుక్కా బోర్లదోశాడు. చిలుము పగలగొట్టాడు కేసులోనుంచి కళ్లజోడు తీసుకోవాలని రోజుకు పదిసార్లన్నా ప్రయత్నిస్తాడు. దుమ్ములో పొర్లాడి వచ్చి నామెడలమీదా వీపుమీదా ఎక్కుతాడు. పక్కగుడ్డ లన్నీ ఖరాబు చేస్తాడు.

ఇన్ని చేసినా నేను వాడిమీద కోపించలేకుండా ఉన్నాను. మధ్యమధ్య ఎప్పుడన్నా గద్దించినా, అందులో పటుత్వం లేదని అప్పుడే తెలిసిపోతుంది. పోకిరీ వెధవ నవ్వుతాడు! నేను కూడా వాడితో కలుస్తాను.

న్యూస్ పేపరు రావటం భయం, భుక్తం చేసుకుంటాడు. కాస్తే కూస్తే చించుతాడు. పత్రికలో బొమ్మలు చూపుతూ, సంగతిసందర్భాలు లేకుండా ప్రశ్నలు వేసి నా దుంప తెంచుతాడు. వాడికి ఏదో వొకటి చెప్పి మైదుపుచ్చుతానే కాని, నాఅజ్ఞతకు నాలో నేను సిగ్గుపడుతూ ఉంటాను. ఈఅమాయక శిశువుల అమాయక ప్రశ్నలు ఎంత అమాయకంగా ఉంటాయో అనుభవజ్ఞులకే తెలుసు!

"పత్రికలో ఏముంటై తాతయ్యా ?"

"వార్తలు."

"వార్త లంటే ?"

దీనికి జవాబు చెప్పటం కష్టమయింది.— "నానాదేశాల శాస్త్రాలు (కథలు) ఉంటై. ఏదీ, ఇలా తే దాస్తాను పాడుచెయ్యకూడదు" అన్నాను.

"ఇందులోది ఒకశాస్త్రం చెప్పు తాతా!- చూడు, చూడు, అటు చూడు !"

అటు చూశాను. బల్లి పురుగును పట్టుకున్నది.

పురుగు గిలగిల కొట్టుకుంటున్నది.

కుర్రవాడు ఉత్తేజితుడై, పేపరు అవతల పారవేసి బాలీసు ఎక్కి నుంచున్నాడు.

"బల్లి మిడతను పట్టుకుని తింటున్నది" అన్నాను.

కుర్రవాడు ఆశ్చర్యంతో కళ్లు విప్పుకుని కాసేపు అలా చూస్తూ ఉండిపోయాడు తర్వాత—"బల్లి పాలు తాగదు కాదూ?" అన్నాడు.

"ఊహూఁ"

"అన్నం ?"

"ఉహూఁ.—అసలు దానికి ఎవరు వండి పెడతారో చెప్పు ?"

"దానికి అమ్మ లేదూ ?"

ప్రమాదం రావటానికి సిద్ధంగా ఉన్నదని గ్రహించి తెలివిగా ప్రసంగం మార్చాను.

"బాలీసుమీదనుంచి దిగు. మీ అమ్మ చూస్తే కోప్పడుతుంది."

"బాలీసుమీద నుంచుంటే అమ్మ ఎందుకు కోప్పడుతుంది ; మరి నువ్వు కోప్పడవేం ?"

బాలీసు మన్ను చేసినందుకు వాడిని కోప్పడదా మనుకున్నాను కాని ఈ జవాబు విన్నాక కోప్పడడం నావల్ల కాలేదు. అర్థం లేని వాడి తల్లికోపాన్ని అడ్డుపెట్టుకుని బాలీసును కాపాడటానికి ప్రయత్నించాను :

"మీఅమ్మకు బలేకోపం. చూసిందంటే నీకూ నాకూ మూడుతుంది. దిగు' బాలీసు మీదనుంచి."

"అమ్మ ఇప్పుడు పొయ్యింట్లో ఉంది గా !" అని, బాలీసుమీదనుంచి ఒక కాలు తీసి టేబిలుమీద పెట్టాడు—బల్లిని చూడటమే వాడి ఉద్దేశం.

టేబిలుమీద సిరాబుడ్డికి తిప్పలు వచ్చినవని గ్రహించాను. సిరా ఎలాగూ ఒలుకుతుంది. బుడ్డికూడా పగిలితే !

ఇక గత్యంతరం లేక శంఖుబావుడి శాస్త్రం ఎత్తి వాడి మనస్సును ఆకర్షించటానికి ప్రయత్నించాను.

పగ లంతా ఈవిధంగా గడుస్తుంది.

కుర్రవాడి కేమాత్రమూ సమాధానం చెప్పలేకుండా ఉన్నాను. చెప్పలేకపోతున్నందుకు నా కేమీ కోపం రావటంలేదు; పైగా ఆనందం గలుగుతున్నది! ఎందుకని?

* * *

ఒంటరిగా పండుకుని ఆలోచిస్తున్నాను.

బయటిగదిలో నేను ఒక్కడనే పండుకుంటూ ఉంటాను. ఇప్పటిదాకా వాడు నా దగ్గరే ఉన్నాడు; ఇంతకు ముందే వాడి తల్లి వచ్చి అన్నం పెట్టటానికి తీసుకుపోయింది. వెళ్లే ముందు, రాత్రికి నాదగ్గరే పండుకుంటాననీ, శేషించిన శంఖుబావుడి శాస్త్రం వింటాననీ చెప్పిపోయాడు.

వాడు వస్తే నాకు ఏమీ ఆటంకం లేదని వేరుగా చెప్పనక్కర్లేదు. కాని వాడి తల్లికి ప్రబల ఆటంకం. అసలు వాడు పక్కలో లేనిదీ ఆవిడకు నిద్రపట్టదు. ఆసంగతి ఒప్పుకోదు. వేరే కారణం చూపింది.

"వాడు రాత్రిపూట నిద్రలో ఊరక తన్నుతాడు. వాడిని పండుకోబెట్టుకుంటే కుంభకర్ణుడుకూడా జాగరణచేయవలసిందే!"

నేను కుంభకర్ణుణ్ణి కాకపోయినా భయపడలేదు. వాడు, రాత్రికి తప్పక వస్తాననీ, తలుపు తీసి ఉంచమని చెవులో చెప్పి పోయాడు.

తలుపు తీసి పండుకుని చింతనలో పడ్డాను: పిల్లలు ఇంత బాగా ఉంటారు ఎందుకని?

* * *

నిరపేక్షగా ఆలోచించి చూస్తే, పిల్లలంతా బర్బరులు, అనాగరికులు, నగ్నపశువులు అని, ప్రతి బుద్ధిమంతుడూ ఒప్పుకుంటాడు. కాని, మనం బర్బర, అనాగరిక, నగ్నపశు–స్వభావం కల పెద్దలను చూచి సహించకపోవటమే కాదు; ఈ అనాగరికత్వాన్నీ, పశుత్వాన్నీ అణచివేయటానికి మనం, అంటే నాగరిక సమాజం ప్రతి యుగంలోనూ అనేక కౌశలాలు అవలంబించాము. చట్టాలు, కోర్టులు, జైళ్లు, ఉరికంబాలు, శాస్త్రాలు, ఉపదేశాలు, నీతికథలు, నరక-భీతి వగైరాలు. వీటిలో ఏ ఒక్కటి గానీ, లేక అన్నీ కలిసిగానీ ఈ పశుప్రకృతిని అణచివేయటానికి ఉపయోగింపబడినవి మానవ మనస్సూ, మానవసభ్యతలో ఒక ముఖ్య అంగం ఇవే. కాని ఈ బర్బరత్వమే శిశువులలో ఉంటే మనకు ఆనందం కలిగిస్తుంది!

ఎందుకని!

కంబళి ముసుగు తన్ని హుక్కా పీలుస్తూ చింతనలో పడ్డాను. చాలాసేపు ఆలోచించినమీదట నేను యీ సిద్ధాంతానికి వచ్చాను:

శిశువులు అసహాయులు కావటంవల్లనే వాళ్లమీద ప్రతి సభ్యమానవుడూ అనుకంప చూపిస్తాడు; ఈ అనుకంపే క్రమంగా అనురాగం క్రిందికి మారుతుంది. ఒక్క శిశువుల్నే కాదు, మనం స్త్రీలనుకూడా ప్రేమిస్తాము–వాళ్లని మర్యాద చేయటానికి ఆదుర్దా కనపరుస్తాము. దీనిక్కూడా, బహుశా వాళ్లు అసహాయులు కావటమే మూలకారణ మనుకుంటాను. అసహాయులనూ అసమర్థులనూ ప్రేమించి, రక్షించి, సన్మానించి సభ్యపురుషులు తమ పురుషత్వాన్ని (పౌరుషాన్ని) సార్థకపరచుకుంటారు. శిశువులూ, స్త్రీలూ అసహాయులు కాకపోయినట్టయితే, మనం బహుశా వాళ్ల అసంగత ఉపద్రవాలను సహించేవాళ్లం కాము. స్త్రీ పురుషుడైనా, శిశువు పెద్దవాడైనా—ఇక మనస్సును హరించలేరు. వాళ్ల అసమర్థతే వాళ్ల అస్త్రం; కవచం!

కాబట్టి, వాళ్లు అసహాయులు కావడం మూలానే మనం వాళ్లకు సహాయం; అసహాయుల మీద ప్రేమ కనపరచటమే సమర్థ పురుషుల మనోవృత్తి. ఇంతకంటే వేరే రహస్యం లేదు!

* * *

ఎప్పుడు నిద్రపోయానో గుర్తు లేదు.

ఒకరాత్రివేళ దౌహిత్రప్రవరుడు పక్కలో పండుకున్నట్టు తోచింది. కాళ్లు పొట్టలో పెట్టుకుని, చుట్టచుట్టుకుని పండుకున్నాడనుకుంటాను – ఏమీ చడీ చప్పుడూ చేయలేదు. వాళ్లమ్మకు తెలుస్తే మళ్లీ పట్టుకు తీసుకుపోతుందనే భయంతో అరవకుండా పండుకున్నాడనుకున్నాను. నేనుకూడా నిద్రమత్తులో ఏమీ అనలేదు. కంబళి వాడిపైనకూడా వేసి పండుకున్నాను.

తెల్లవారినాక మెలకువ వచ్చింది. దొంగవెధవని ఇక లేపుదా మనుకున్నాను. శంఖుబాలుడి కథ ఇప్పుడే పూర్తి చేయాలి; లేకపోతే ఈపగలల్లా నాదుంప తెంచుతాడు. శాస్త్రం మొదలుపెట్టాను:

"లేవవోయ్!—శంఖుబాలుడు చెరువులో తామరతూళ్ళను తింటూ తిరుగుతున్నాడు. తెల్లవారింది—"

అబ్బాయి అతీపతీ చెప్పలేదు.

" ఏమోయ్, ఊఁ కొట్టవేం ? "

మనమడు మాట్లాలేదు.

ముసుగుతీసి చక్కలిగిలి పెట్టితేగాని వీడు లేవ డని నిశ్చయించుకుని ముసుగు తీశాను.

ముసుగు తీయగానే చెప్పు ఎత్తవలసి వచ్చింది.

పండుకున్నది మనమడు కాదు, జోసంగి కుక్క.

తలుపు తీసిఉందికాదూ, ఎప్పుడు వచ్చిందో, రాత్రంతా నా కంబళికిందనే పండుకున్నది.

* * *

బహుశా చెప్పుదెబ్బ బాగానే తగిలిందనుకుంటాను.

కుక్క శోకంపట్టుతూ బయటికి పరిగెత్తింది — అసహాయఆర్తక్రందనం! నా రాత్రి సిద్ధాంతం నన్ను వెక్కిరిస్తున్నట్టుగా తోచింది!

శివ, శివ!

కానేపు ఉన్నాక నామిత్రుడు త్రిపురాచరణుడు వచ్చి దర్శన మిచ్చాడు.

ఇతను ముసోలినీభక్తుడు. కానేపు పిచ్చాపాటీ మాట్లాడి ముసోలినీగుణగానానికి పూనుకున్నాడు. నాకు మార్గాంతరం లేక విన నారంభించాను. ముసోలినీ చరిత్రనిష్ఠను గురించీ, వీరత్వాన్ని గురించీ అనేక సంగతులు చెప్పి త్రిపురాచరణుడు సెలవు తీసుకున్నాడు. అతను వెళ్లిపోయినాక నా మనస్సులోని ప్రశ్న ఇంకోవైపుకు మళ్లింది. — ఈ ప్రబలపరాక్రమవంతులైన డిక్టేటర్లుకూడా ఒక విధంగా బర్బరులే. కాని వీళ్లను అసహాయులంటానికి వీల్లేదు అయినా, సభ్యమానవ సమాజం వీళ్ల చర్యలను స్వేచ్ఛగా సహిస్తూ వస్తున్నది. సహించటమే కాదు, సంభ్రమంతోనూ శ్రద్ధతోనూ మోకరిల్లుతున్నది.

ఎందుకని?

బాగా ఆలోచించినమీదట నాకు ఈ సిద్ధాంతానికి రాక తప్పలేదు:

ఏఏ కారణాలచేత మానవుడు ప్రాకృతిక ఉపద్రవాలను సహిస్తున్నాడో, మృత్యువును సహిస్తున్నాడో—సహించటమే కాదు, వాటిని కేంద్రం చేసుకుని కవిత్వాలు రాస్తున్నాడు, అవి ఏ కారణంచేత వస్తవో నిర్ధారణ చేయలేక, ఈ కనపడని భగవచ్ఛక్తిని ఆశ్రయిస్తున్నాడు—సరిగ్గా ఆ కారణాలచేతనే మనం శిశువులనూ, స్త్రీలనూ, ముసోలినీని సహిస్తున్నాము.

అంటే, గత్యంతరం లేక అన్నమాట.

నిజానికి అసహాయులు వాళ్లు కాదు, మనం. వాళ్ల స్వతస్స్ఫూర్తినీ, దుర్దమ ప్రాణశక్తినీ ఎదుర్కొనే బలం మనలో లేదు. లేకపోవటంచేతనే వాళ్ల ఉపద్రవాల్లో ఏదో లీలనూ, సౌందర్యాన్నీ సృష్టించి, మనం మనకు తెలియకుండానే మన అశక్తతవల్ల కలిగిన లజ్జను అణచివేసి, పైకి పులకితులౌతూఉంటాము. వాళ్ల అమోఘ శక్తికి లొంగిపోయినందువల్ల కలిగిన దుఃఖాన్ని, మనం వాళ్ల లీలలను చూస్తున్నా మన్న ఆనందంతో మరిచిపోవాలని చూస్తాము.

జోనంగికుక్కను చెప్పుతో కొట్టి వెళ్ల గొట్టటం తేలిక ; కాని శిశువుని—ముఖ్యంగా మనమణ్ణి— ప్రేయసిని, డిక్టేటర్ని ఇంత తేలికగా సాగనంపటానికి వీల్లేదు. అసలు, అసంభవం, మనకు సాధ్యాతీతం. అందుచేత నే మనం వాళ్లని ప్రేమిస్తాము, పూజిస్తాము.

"రాత్రి నువ్వు నన్ను పక్కలో పడుకో బెట్టుకోలేదేం ?"

కాళ్లను దుమ్మూ, చేతుల్ని బెల్లమూ పులుముకుని మనమడు వచ్చి మంచం ఎక్కాడు. నేను నవ్వుతూ వాణ్ణి చేతుల్లోకి తీసుకున్నాను.

(అను: 'చక్రపాణి'.)

'దాక్షారము అన్నసత్త్రర్వుగంట'

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

గవర్న్మెంటు ఓరియంటల్ లైబ్రరి (ప్రాచ్య లిఖిత పుస్తకశాల)లోని ౧౩-౭-౫ నెంబరు గల వ్రాఁత తాటియాకు పుస్తకములోని తాటియాకుమీఁది వ్రాఁత :—

"దాక్షారామ భీమేశ్వరస్వామి వారి గంట మీాది తారీఖు—"శాలివాహనశకాబ్దాలు ౧౩౫౮. ఆనందనామ సంవత్సర వైశాఖ బ ౧౩ బుధవారం. చేయించినవారు వీరారెడ్డి వేమారెడ్డి దొడ్డారెడ్డి, ఈముగ్గురు అన్నసత్త్రర్వ గంట సమర్పించ్చిన తారీఖు". ఇది ద్రాక్షారామంలో మన్యం కన్కయ్య బాగుచేస్తూవుండ్డంగ మంటపంకింద కనిపించింది. స్వభాను సం॥ మార్గశిరమాసంలో కనిపించ్చింది."

పయివ్రాఁతలోఁ జెప్పఁబడిన ఘంట యిప్పుడు భీమేశ్వరాలయమున గాని, ఆయూర మన్యంవారి యింటగాని యున్నదేమో తెలియఁదగినది. క్రీ. శ. ౧౪౩౬ సం॥ వీరభద్రారెడ్డి, వేమారెడ్డి, దొడ్డారెడ్డి భీమేశ్వరస్వామి కైంకర్యములు జరపుచున్నట్టును, వారు అన్నసత్త్రరువులో నుపయోగించుటకుగాను ఘంటను సమర్పించినట్లును, ఆఘంటమీాది పయిలిపి తెలుపుచున్నది.

దాక్షారామమున మన్యంవారిప్పటికి నుండవచ్చును. ఇప్పటి 'మన్యంవారు' ఈ మన్యం కనకయ్యనుగూర్చి తెలుపఁగలవారుగావచ్చును. పయికనకయ్యకు ఘంట దొరకినది. ఇప్పటికి ఏబదియారేండ్లకుఁ బూర్వము వచ్చిన స్వభాను వత్సరము గానేరదు; ఏలనగా ౧౮౮౦ నాటికే ఆ తాటాకుపుస్తకము లైబ్రరికిఁ జేరినది. కాన, గంట దొరికిన స్వభానుసంవత్సరము పూర్వతరపు స్వభానుపుగాని, అంతకీఁక నఱువదియేండ్ల పూర్వపు స్వభాను సంవత్సరముగాని కావచ్చును.

—

రాజయోగి: డబ్ల్యు. బి. యీట్స్ స్మృతి

శ్రీ కోవల్లె శివకామేశ్వరరావు

[ఐర్లండువాఁడును, నోబెల్ బహుమతిఁ బాత్రుఁడైనట్టియు, రాజయోగమార్గమునఁ గవితల్లజుఁడై కీర్తి గడించినట్టియు డబ్లు.బి. యీట్స్ అను మహాకవి కడచనిన జనవరి 20-వ తేదీన బరలోక భూషణ మయ్యెను.]

చివురుల రాగముల్, పువ్వుల స్మేరముఖంబులుఁ గేవలత్వ గౌ
రవమును చూర్చ నున్నతశిరస్కృత పీఠని గౌగిలింతలం
దవిలి ప్రమోద నిర్భరమదం బగు వృత్తిఁ బరస్పరంబుఁ గ్రొం
జవులను గూడుచున్నవులు సన్నిధిసేయుశక్తిఁ జనించితో.

భావచంద్రికాసారసంపదలఁ బాదలి
క్షేమబీజాలవాలకమా నీ మనమున
నెగడు వలవంతచిచ్చు కెంజిగురుఁజాయ
లలమ ముగ్గిలివి మమతాహంకృతులను.

ఆ విరహాజ్వాలలఁ బ్ర
ద్వీవియదంతరము నెల్ల వెదకి వెదకి స
ద్భావ శ్రీ మహితాకృతి
యా వలపుకవుంగిలిఁ గవివైతి యశస్వీ.

కార్యము వేళాకండు కనఁగానినియట్టి ప్రవృత్తి, నిత్యజా
గర్యఁ బ్రమోదసంభరిత క్రమపథంబులఁ బోవఁగా మనో
నిర్యదనంత తేజము కనీనిక నై వెలుఁగొందుచుండఁ బ్ర
జ్ఞార్యమకాంతి చుంబనసహస్రములన్ గవి కీర్తిఁ గాంచితే.

సకలకల్యాణగుణు కలయశోగీతమై ప్రపంచమ్ము తియ్యములఁ గులికియుఁ
బ్రత్యహ జీవయాత్రాసంచరణపథంబులు సురతరుల నీడయి వెలుఁగ
నున్నిద్రసద్భావనోన్మిషదప్సరోగణకాంతి ధ్యానమార్గమును జూప
శ్వాసమందానిల సౌరభమూర్తిమై నిరతంబు బ్రహ్మ సన్నిధి నొసంగ.

నిఖిల మార హేయ ప్రత్యనీకమైన
సుఖసుధాస్రవంతి యగుచు సొంపుఁ గూర్పఁ
దత్తరంగడోలాచల త్సారసార
సంబోలయ గాయనుఁడవై శుభంబుఁ గంటి.

భావమరందవీచికలు పర్వఁగ లౌకికవాసనా విష
జ్ఞావసథంబు వీడి, హృదయంగమ మోహావశంగతాత్మతే
జోవిలసత్ప్రథాప్తిని యశోమహనీయ కవీంద్రలోక సం
భావితమూర్తివై వెలసి పావనజన్ముఁడ వైతివే కవీ.

చలదాకారములన్ గనంబడుచు నష్టం బౌచు నానాత్వదు
ర్లలితంబైన పదార్థజాతమున జాగ్రత్స్నేహాభావం బొకం
డెలమిన్ నీ కుపలంభమయ్యెనొకొ యాత్మేశుండవై స్వస్వరూ
పలయానందము రాజయోగిగతిఁ గావ్యంబందు విన్పింపఁగన్.

పూదటి

"భార్గవ"

వేయి శిరసుల నెత్తి
నాసంత్తరము ఆడ -
వేయిగొంతుల నెత్తి
విహగలోకము పాడ-
ప్రతిజీవియును మారు,
గత యౌవనము చేరు;
-వయసు పైబడి నేనె
వడలి పోవుదునోయి!
(ఒక జపాను గీతమునకు—చదివి.)

హిట్లరు: జర్మను స్త్రీ ఉద్యమం

శ్రీ కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

("రామమ్మ, ఒకపతివ్రత, మరణానంతరం, అధికారి (దేవుని) యెదుట:)

పతివ్రత— మరి నేను చేసిన త్యాగాలు? ఎన్ని సౌఖ్యాలు వొదులుకున్నాను? నాభర్తకోసం, పిల్లలకోసం, ఎన్ని కష్టా లనుభవించాను?

అధికారి (దేవుడు)— త్యాగాలా?... విశాలమైన ప్రపంచం బాధలతో, రోగాలతో, నశించేజీవు లుండగా, కొవ్వి తిని కూచునేభర్తకూ పిల్లలకూ ఎందు కాత్యాగం? ఏమిత్యాగం? నీకాలమా, శక్తా? నీ స్వంతమా కాలమూ, శక్తీ? వాటివిలువ ఎంత? జ్ఞానం లేదు, సౌందర్యపిపాస లేదు, ఆత్మవికాసం లేదు. నీలో ఏమున్నది త్యాగం చేసేందుకు? సాధారణమైన ప్రేమైనా లేదే?

పతివ్రత—నాపిల్లల్ని ప్రేమించలేదా?

అధికారి (దేవుడు)—ప్రేమించావా? మృగముప్రేమకన్న ఏమైనా అధికమైనదా నీప్రేమ? ప్రేమ అనేపేరును అపవిత్రంచేయకు. సేవ చేశావు. అంతే. ప్రేమంటే, మోహమంటే, సహజసంబంధమంటే అర్థం తెలుసుకో. వేశ్యవై పుట్టు." —'చలం; మృత్యువు.'

నవనాగరికతపేర నేటి కాలంలో స్త్రీల యెడల ప్రజలదృష్టి ఏవిధంగా మారిపోతోందో సూచించడంకోసం 'ఉదయిని' అనే పత్రికలో ప్రచురింపబడ్డ 'మృత్యువు' అనే వ్యాసంలోనుంచి పై ఉదాహరణను ఇచ్చాను. నాజీలకు పూర్వం జర్మనీలో పరిస్థితులు కూడా ఇంచుమించు ఇదేవిధంగా ఉండేవి. ఈ ధోరణినుంచి తమ ప్రజలదృష్టిని పూర్వ పద్ధతులవైపుకు మరల్చడంకోసం నాజీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మనకంటికి కా ప్రయత్నం 'ఏటి కెదురీత'వలె అగపడితే అగపడవచ్చును.

జర్మనీలో నాజీప్రభుత్వం ఏర్పడేసరికి, అనగా ౧౯౧౮ తర్వాత, ౧౯౩౩ కు పూర్వం, వుండిన పరిస్థితులు కొంతవరకైనా తెలిస్తేనేగాని స్త్రీలనుగురించి నాజీఆదర్శాలు కార్యక్రమాలు మనకు సరిగా బోధపడవు.

౧౯౩౩ నాటికి జర్మనీదేశం అనేక విధాల క్లిష్టస్థితిలో పడిపోయింది. ప్రజలలో ఐకమత్యం లేదు. ఆనాటి జర్మను పార్లమెంటులో వుండిన పార్టీల (కక్షల) సంఖ్య ౩౮! తక్కిన దేశాలు రెండు మూడు పార్టీలతోటే ఇన్ని కొట్లాటలతో గందరగోళాలతో వేగుతూవుండగా, జర్మనీదేశం ఆ ౩౮ పార్టీలతో ఎంత క్షోభపడిందో ఊహించుకోవడంకూడా కష్టమే!

జర్మనువృత్తులు, వ్యాపారాలు, పరిశ్రమలు కుంగిపోతున్నాయి. పనివాళ్ల పనిపాటులు, వేతనాలు తగ్గిపోయాయి. వారిలో సమ్మెలు తిరుగుబాట్లు అధికమైనాయి.

ఆనాటి జర్మనీని గురించి మైకేలు ఫ్రై అను గ్రంథకర్త తన 'హిట్లరు: వండరులాండు' అనే గ్రంథంలో ఇట్లా వ్రాశాడు :

"ప్రపంచమంతటా వ్యాపించియున్న ఆర్థిక దుస్థితివల్ల మొట్టమొదట దెబ్బతిన్నది జర్మనీదేశం..............జర్మను అర్థోత్పత్తి తగ్గిపోయింది. పనివాళ్ల వేతనాలు సగం వరకూ తగ్గాయి. ౧౯౨౯ వేసంగిలో అవి జర్మనుపరిశ్రమలలో దామాషాయిని తల ౧ కి వారానికి ౪౪.౭౦ రెష్మార్కులచొప్పున ఉండేవి; ౧౯౩౨ ఆగస్టులో ౨౦.౬౦ వరకూ తగ్గాయి. ఆపిమ్మట ఇంకా తగ్గిపోయాయి."

అప్పటి అధికారుల లెఖ్ఖల ప్రకారం నిరుద్యోగుల సంఖ్య ౬౦ లక్షలుండేది. కాని అధికారుల లెఖ్ఖలలో నమోజు కాకుండా వుండి పనిపాటులకోసం వూరూరా తిరుగుతూ వుండిన వివిధవృత్తులవాళ్లు, అనాథలైన బిడ్డలు, విద్యాధికులైన నిరుద్యోగులు కలిసి ఈ సంఖ్య ఇంకా అధికంగా వుండేది అని చెప్పవచ్చును.

డాక్టర్లు, ప్లీడర్లు, ఉపాధ్యాయులు వగైరా వృత్తులలో జీవితప్రమాణం చాలా పడిపోయింది. డాక్టర్లలో నూటికి ౭౦ మంది తలవక్కొంటికి నెలకు నూరు రూపాయలు లోపుగా మాత్రమే సంపాదిస్తూ వుండిరి. ప్లీడర్లగతి ఉపాధ్యాయులగతి కూడా ఇంచుమించు అదేవిధంగా వుండేది.

ఒకప్పుడు పొడుపుకు, ఐశ్వర్యానికి పేరుపొందియుండిన జర్మనురైతాంగము, విప్లవాలకూ అరాజకానికీ అవినీతికీ అక్రమప్రవర్తనకూ ఎన్నడూ ముందంజవేసి యెరుగని జర్మను రైతాంగము తమ భూములను వదిలిపెట్టి, పట్నవాసాలు చేరుకొని సోషలిస్టులై తిరుగబడడం ప్రారంభించారంటే, జర్మను సంఘం ఎట్టి దుస్థితికి దిగిందో మనం ఊహించుకోవచ్చును. జర్మనీ దేశానికి వెన్నెముకయని చెప్పదగిన మధ్యతరగతి ప్రజ ఇంచుమించు ధ్వంసమైంది. అనాదినుంచీ మర్యాదతో పేరుప్రతిష్ఠలతో కాలక్షేపం చేస్తూవచ్చిన అనేక పూర్వకాలపు జర్మను రైతుల, వర్తకవ్యాపారస్థుల కుటుంబాలు దివాలాలుతీయడం సర్వసామాన్యమైపోయి, అది విపరీతమైన పరిస్థితియని ఎవరికీ అనిపించనేలేదు. జర్మనీలో పెద్దపెద్ద జీతాలు పుచ్చుకుంటూ "మడుగున కొక్కెర"లవలె నిరర్థకంగా "పడియుండిన" అర్థశాస్త్రపు పండితులు, ప్రభుత్వాధికారులు, ఊరూరా ఓట్లకోసం ముష్టియెత్తే జర్మను "ప్రజాప్రతినిధులు" రాజకీయ వేత్తలు ఆదుర్భరపరిస్థితినిగురించి ఆలోచించనే లేదు. జర్మను సంఘానికది యెంతటి ఉపద్రవకరమైన విషయమో ఆమహానీయులకు తోచనేలేదు. కలరా మొదలైన జాడ్యాలలో ఇరుగుపొరుగు ఇళ్లల్లోనుంచి శవాలు వెళ్లుతూవుండడం సర్వసామాన్యమై ఎవరికీ వింతకొల్పనట్లే ఈ దారుణపరిస్థితి కూడా ఆరోజులలో ఎవరికీ వింతకొల్పలేదు.

యుద్ధానంతరం జర్మనీదేశంలో ఎన్నో ప్రభుత్వాలు లేచాయి; జర్మనీని ఉద్ధరిస్తామని యెన్నో ఉత్తరకుమారప్రతిజ్ఞలు చేశాయి; కాని తుదకేకార్యమూ సాధించలేకుండా కుక్కగొడుగులవలె వెంటవెంటనే గతించాయి. ఇక ప్రజలకు నిరాశ నిస్పృహ

అశక్తత తిరుగుబాటు మాత్రమే గతులైనాయి.

ఈఅదును చూసుకొని సోషలిస్టులు జర్మను పనివాళ్లను ఇతరబీదసాదలను తిరుగుబాటుకు పురికొల్పారు. "లెండి! కూలీ లందరూ ఏకంకండి! పనులలోకి వెళ్లకుండా సమ్మెలుకట్టండి! భాగ్యవంతులే మీశత్రువులు! వారే మీకష్టా లన్నిటికీ కారకులు!" అని ప్రబోధించారు. అట్లా తిరగబడడమే, సమ్మెలుకట్టడమే, ఆ అరాజకమే, అదుపాజ్ఞలు లేకపోవడమే పనివాళ్లకు తిండీ బట్టా పెడతా యన్నారు. ఆవిధంగా వృత్తులు, పరిశ్రమలు, వర్తకవ్యాపారాలు స్తంభించి మూలబడిపోవడమే భావిభాగ్యోదయసూచక మన్నారు. సోషలిస్టులు, జ్యూజాతివారూ కలిసి ప్రజలలో అదుపాజ్ఞలు చంపివేసి, అరాజకం పురికొల్పి దేశాన్ని వకకడకు తెచ్చారు. సులభంగా అరిచేతిలో స్వర్గం చూపగలమన్న ఆసోషలిస్టు ఊరింపులకు జర్మనుప్రజ అవలీలగా లొంగిపోయింది. వాటి నెదుర్కొనగల నిబ్బరము, త్రాణ, ప్రజలలో నశించినందున సోషలిజము వక్కటే తమకు గతియని వారికి తోచింది.

ప్రజల ఆర్థికదుస్థితి, అధికారుల అసమర్థత, బైట మిత్రమండలివారి అసహానము— ఇవి 'జ్యూ'జాతివారి, సోషలిస్టుల ప్రచారాలతో కలియడం, అగ్ని దేవుడికి వాయు దేవుడి తోడ్పాటు లభించినట్లైంది.

"ఇకముందు జర్మనీని పరిపాలించవలసినది మనమా లేక సోషలిస్టులా ? ఈసంగతిని మనం ముందుగా నిశ్చయించుకోవాలి. ఇందుకు సోషలిస్టులు ఇదివఱకే తయారుగా ఉన్నారు. ప్రజల నడవడి బహువిధాల చిక్కుపడి వుంది. కాబట్టి మనమే ప్రజలకు సరియైన ఆలోచనలు చెప్పి, వారిని సరియైన మార్గాలలో నడపాలి"అని వక సందర్భంలో హిట్లరు అన్నాడు.

ఇదివరలో జర్మనీలో 'సోషలిస్టులు' '౧౮ మొదలు ౩౦ ఏళ్లు వయస్సు గల నిరర్థకులు, నిరుద్యోగులు, నిర్వ్యాపారులు, యూనివర్సిటీ విద్యార్థులు అయిన జర్మను యువకులు' అని అర్థం వుండేది కాని క్రమంగా ఆపదంయొక్క అర్థం మారిపోయింది. ఆర్థికంగా చితికిపోయిన రైతులు, వ్యాపారస్థులు, ప్లీడర్లు, డాక్టర్లు వగైరా లందరూ సోషలిస్టువర్గంలో చేరి ఆ ఉద్యమాన్ని బలపరిచారు. ఆదురదృష్టవంతు లందరినీ ఈ జన్మలోనే వైకుంఠానికి తీసుకొని వెడతామని సోషలిస్టులు ఆశకొల్పడంవల్ల వా రందరూ గంగవెర్రులతో సోషలిస్టులవెంట పడ్డారు. 'నేటి జర్మనీదేశం దుఃఖమయం! భూలోకనరకం. రేపటి సోషలిస్టు జర్మనీ ఆనందమయం; భూలోక స్వర్గం'— ఇవి వారి వెర్రినమ్మకాలు. 'ధనికులప్రభను అణిచి వెయ్యాలి' 'పనివాళ్లకు తిండీ బట్ట వుండాలి', అన్న పొలికేకలకు లక్షలాదిప్రజలు దాసులై నల్లమందు గంజాయి తాగి వారివలె మత్తులై తమకష్టా లన్నిటిని మరచిపోయి వీరావేశంతో సోషలిస్టులవెనుక మూగారు.

౧౯౩౨ జనేవరికి జర్మనీలో ఆరువేల సోషలిస్టు కార్యాలయాలు పనిచేస్తూవుండేవి. అవన్నీకూడా ప్రజలలో అసంతృప్తి అరాజకాన్ని వెదజల్లే విత్తనాల గంపలు ప్రజ లనుభవిస్తూవున్న కష్టనష్టాలే

కొన్నిటిని గోరంతలు కొండంతలు చేసి పెంచి వర్ణించడం వారి ముఖ్యలక్షణం. వారికి ప్రతిచోటా గ్రామసంఘాలు జిల్లాసంఘాలు వార్తాపత్రికలు మొదలైన తదంగాలకు లోటులేదు. అంతే కాదు. జర్మను పార్లమెంటులో ప్రత్యేకంగా ౭౭ మంది సోషలిస్టు సభ్యు లుండిరి. ౧౯౩౨ పార్లమెంటు ఎన్నికలలో వోట్లు ఇచ్చినవారిలో సోషలిస్టువోటర్లు మాత్రం ౬౦ లక్షలమంది వుండిరి. జర్మనుసామ్రాజ్యం క్రమంగా తమకు స్వాధీన మవుతోందని సోషలిస్టులు గంతులు వేశారు.

ఈ సోషలిస్టు పొలికేకలవల్ల గంగ వెర్రులెత్తినది ముఖ్యంగా స్త్రీలకు. ఈ ౬౦ లక్షలమంది వోటర్లలో చాలామంది స్త్రీ లుండిరి. జర్మను పార్లమెంటులో వున్న ౭౭ మంది సోషలిస్టు సభ్యులలో ౧౨ గురు స్త్రీలు. వారి ఎన్నికలలో రష్యను స్త్రీ సోషలిస్టు సంఘాలు ఎంతో సహాయంచేశాయి. కానుపులు రాకుండా చేసుకునే పద్ధతులను వర్ణించే వాఙ్మయాన్ని స్త్రీలలో పంచిపెట్టి ఆవిధంగా వారి సానుభూతిని వోట్లను సంపాదించేవారట! ఆవాఙ్మయం చాలాభాగం రష్యాదేశంనుంచి వచ్చినదే యని, చూసి వచ్చిన ఇంగ్లీషు గ్రంథకర్తలే వ్రాస్తున్నారు. ఏమంటే, అప్పటి ఆర్థికదుస్థితిలో ఆ బీదజర్మనుకుటుంబాలకు మరోకాన్పు రావడంఅంటే, మరోబిడ్డను కనడంఅంటే ఎంతో దుర్భరం అనిపించేది. ఎంతో బెంగగా వుండేది. ఈబెంగను, ఈ అసహాయతను సోషలిస్టులు తమప్రచారాలకు అవకాశాలుగా ఉపయోగించుకున్నారు.

యువజనులలోను బిడ్డలలోను ఈప్రచారం విరివిగా సాగుతూండేది. సోషలిస్టు ప్రచారకుల లెక్కలప్రకారం ౧౯౩౨ నాటికి సుమారు ౨ లక్షలమంది బిడ్డలకు ఈ విష గాలి సోకినట్లు తెలుస్తుంది. చిన్నబిడ్డలలో సోషలిస్టుప్రచారం చెయ్యడానికి వారిఆటల క్లబ్బులు ముఖ్యమైన రంగస్థలాలు. "ఈ ఆటలక్లబ్బుల ఉద్దేశం చిన్నపిల్లల ఆరోగ్యం అభివృద్ధిచేయడం కాదు. సోషలిస్టుప్రచారాలతో వారిమనస్సులను ప్రవర్తనను పాడు చెయ్యడమే" అని మైకేలు ఫైరి అనుగ్రంథకర్త వ్రాశాడు.

ఆచిన్నబిడ్డలకు నేర్పబడుతూవుండిన పద్యాలఅర్థం ఈవిధంగా వుంటుంది:—

(౧) "కూరులైన అధికారుల కొవ్వును ఉరిస్తంభాలకు పూయండి. మతపురోహితుల పక్కలనుంచి భోగంసానులను బైటికి లాగండి."

(౨) "సోవియటు రష్యా చిరకాలం వర్ధిల్లుగాక! ఏమంటే అది వర్ధిల్లిననాడే మనం ముందుకు నడవగలుగుతాము. ప్రజల తిరగబాటుకు చిహ్నంగా శత్రువులను ముట్టడివేద్దాము రండి! అడ్డుగోడలపై దూకి, అంతఃకలహాలను సాగిద్దాము రండి! అవును! యుద్ధమే! రక్తపాతంతో కూడుకొన్న మన గెలుపుకు గుర్తుగా సోవియటుజెండాను ఎగరవెయ్యండి!"

దేవుడన్నా మతమన్నా ప్రజలలో భక్తివిశ్వాసాలను ధ్వంసం చేయడంలో సోషలిస్టులు అసాధారణమైన ప్రజ్ఞను చూపించారు. మతాధికారులూ పురోహితులూ

దుర్నీతిపరులనీ, స్వార్థపరులైన భోగపరాయణులనీ విరివిగా ప్రచారంచేశారు.

ఇదేసమయంలో దేశంలో అసభ్యమైన అనేకశృంగార గ్రంథాలు ప్రచురింపబడుతూ వచ్చాయి. వాఙ్మయంలో దుర్నీతిని ప్రోత్సహిస్తూ ఎంతో ప్రచారం జరిగింది. బూతుకథలు బూతుబొమ్మలు విస్తారం అమ్ముడవుతూ వుండేవి వివాహ నియమాలలో, స్త్రీపురుష సంబంధంలో కట్టుబాట్లు సడలిపోతున్నాయి. జర్మను స్త్రీలకు తమపాతివ్రత్య ధర్మంమీద సత్ప్రవర్తనమీద భక్తిగౌరవాలు తగ్గుతున్నాయి. అందుకు సోషలిస్టులే బాధ్యులని నిశ్చయంగా చెప్పలేము గాని సోషలిస్టు జర్మనీలో ప్రజలకు తమ పూర్వసంప్రదాయాలయెడల, కుటుంబ మర్యాదలయెడల, నీతినియమాలయెడల, క్రమప్రవర్తనయెడల భయభక్తులు గౌరవ విశ్వాసాలు నశించి నాస్తికమతము, పొట్టకూటి వేదాంతాలు దుర్నీతిప్రబోధము ప్రబలంగా వ్యాప్తిలో వుండేవి.

బెర్లిను, కొలోను, హేంబర్గు మొదలైన నగరాలు ఇటువంటి ప్రచారాలకు పుట్టిళ్లు అనిచెప్పవచ్చును. అనేక పట్నాలలో స్త్రీపురుషసంబంధమైన "శాస్త్రీయ"సంస్థలు బైలుదేరి, "శాస్త్రీయ""చర్చల" పేరా, పరిశోధనల పేరా వచ్చి బూతుగ్రంథాలు, కథలు, బొమ్మలు ప్రకటించి డబ్బు సంపాదిస్తూవుండేవి.

" యుద్ధకాలంలో కామకలాపాలు "— ఇందులో యుద్ధం రోజులలో జర్మను సైనికులు తమలో తామున్నూ, ఆసుపత్రులలో ఆడదాదులతోటిన్నీ కలిసి తమ కామబాధలను నివారించుకున్న పద్ధతులు " శాస్త్రీయం"గా వర్ణింపబడ్డాయి. "రతిశాస్త్ర సంబంధమైన బొమ్మలు", "ప్యారిసు స్త్రీల శృంగారాలు", "స్త్రీబానిసలు" మొదలైన అనేక ప్రచురణాలు ఆరోజులలో వెలువడ్డాయి. "మేము సోషలిస్టుల" మని చెప్పుకుంటూ, పనీ పాటూ లేకుండా చొక్కా జేబులలో చేతులు పెట్టుకుని వీధులవెంట తిరుగుతూ వుండే "విద్యాధికులైన" జర్మను యువజనులను ఇట్టి బూతు ప్రచురణాలు, "కావ్యాలు", "కథలు" "బొమ్మలు", ఏ విధంగా ఆకర్షించేవో చదువరులే ఊహించుకోవచ్చును.

ఈ గ్రంథకర్తలు స్త్రీలను సైతము విడిచిపెట్టలేదు. స్త్రీలకు స్వేచ్ఛాప్రేమ, స్వేచ్ఛావిహారాలు, స్వేచ్ఛా ప్రవర్తన, కానుపులు రాకుండా చేసుకోవడం, వచ్చిన కానుపులను పోగొట్టుకోవడం మొదలైన విషయాలను గురించి అనేక"శాస్త్రీయమైన" గ్రంథాలు, కథలు, కావ్యాలు స్త్రీలలో విరివిగా ప్రచారం అవుతూఉండేవి. జర్మను స్త్రీలకు తమ మాతృధర్మంమీదా, సత్ప్రవర్తనమీదా విలువ తగ్గుతోంది. బిడ్డలను కనడం అవమానకరమైన "బాదరబందీ" అయింది. తాము బిడ్డలతల్లుల మని చెప్పుకోవడం జర్మను విద్యావతులకు తలవంపులైంది. బిడ్డలు తమ తల్లులవద్ద పెరగడం, తల్లులు స్తన్య మిచ్చి తమ బిడ్డలను పెంచుకోవడం అనాగరికతకు, మోటుతనానికి చిహ్నమయింది. తల్లులు విద్యావతులై ఉద్యోగాలు చెయ్యాలి. బిడ్డలను పోతపాలతో దాదులు పెంచాలి. విద్యావతులు, స్వాతంత్ర్యప్రియులు అయిన ఆనాటి జర్మను

స్త్రీల నాగరికతకు ముఖ్యలక్షణా లీవిధంగా వుండేవి.

భోగపరాయణులైన జర్మనుస్త్రీల ఉపయోగార్థం, నిరుద్యోగులైన జర్మను యువకులు పడుపువృత్తిలోకి దిగడం ప్రారంభించారు. ఆరోజులలో అనేక జర్మనునగరాలలో మగపడుపువృత్తిశాల లుండేవని చూసివచ్చిన ఒక ఆంగ్లేయ గ్రంథకర్త వ్రాశాడు.[1]

జుగుప్సాకరమైన ఈ వృత్తాంతాలను ఇప్పట్లో మనలో కొందరు నమ్మకపోవచ్చును గాని హిట్లరువంటి "నిరంకుశాధికారి" యొక్క "రాజదండము" చవిచూచి యెరుగకుండా "పరమపవిత్రమైన" వ్యక్తిస్వాతంత్ర్యంతో తులతూగుతూవున్న ప్యారిసు న్యూయార్కు మొదలైన నగరాలలో నేటికి సైతము విచ్చలవిడిగా చెలరేగియున్న వింత చర్యలను, విపరీతప్రవర్తనలను పరికించిన వారికిని అపూర్వ మనిపించవు.

హిందూదేశాన్ని నిరసిస్తూ గ్రంథాలు వ్రాసిన మేయో దొరసాని ధర్మమా అని "అంకులుసాము" మొదలైన గ్రంథాలలో అమెరికనుల జీవితం, వారి స్వాతంత్ర్యాలు, వారి నాగరిక ప్రవర్తనలు మనకు తెలుస్తున్నాయి.

ఆనాటి జర్మనీలో తప్పుదారులు పట్టి అల్లరులపాలైనది స్త్రీ పురుషుల నీతినియమాలు, క్రమప్రవర్తనలు మాత్రమే కాదు. ప్రజలలో లంచాలు మోసాలు సర్వసామాన్యమైనాయి. అధికారులు జాతీయపునరుద్ధరణ, సంఘపునర్నిర్మాణము, ప్రజాసేవ మొదలైన ఉన్నతాదర్శాలు, కార్యక్రమాలు యెరుగని స్వార్థపరులై, తమ ఉద్యోగాలు, తమజీతాలు, తమలంచాలు, తమభార్యాబిడ్డల సౌఖ్యాలు, తమబంధుమిత్రాదులకు ఉద్యోగాలు వగైరాలకోసం దొర్లాడుతూవుండేవారు. జనసామాన్యం నిత్యమూ అవమానకరమైన అట్టిపరిస్థితులకు అలవాటుపడి వుండడంవల్ల అది తప్పుడునడతయని వారికి తోచనేలేదు. అది చెడు ప్రవర్తన యన్న విచక్షణ జ్ఞానమే ప్రజలలో నశించిందిఅని చెప్పవచ్చును; ఏమంటే సంఘంలో వున్న గొప్పవా రందరూ కూడా అట్టిపదవులకోసం సౌఖ్యాలకోసం ఆశించి పరుగులెత్తుతూవున్నవారే కదా !

"యథా రాజా, తథా ప్రజా"! అధికారు లెంతటి నీతిపరులో ప్రజలుకూడా అంతటి నీతిపరులే అయియుండడంలో ఆశ్చర్యమేముంది? "తనయుడు దుష్టైన తండ్రితప్పు" అన్నట్లు రాష్ట్రపాపానికి రాజే కర్తా, బాధ్యుడూ కాదా ?

విషాదకరమైన ఇట్టి పరిస్థితులకు తూర్పు జర్మనీలో భూస్వాముల అల్లరిని ఒకఉదాహరణగా చెప్పారు. ఆప్రాంతంలో వుండిన పెద్దపెద్ద భూస్వాములు అప్పులలో పడిపోయి, తమ వ్యవసాయం మూలకు తోసి, భూములు పాడుపెట్టుకొని పట్నాల వెంట తిరుగుతూ వుండేవారు. వారికి సహాయం చెయ్యాలన్న ఉద్దేశ్యంతో అప్పటి జర్మనుప్రభుత్వం ఆ భూస్వాములకు విశేష ద్రవ్యం పెట్టుబడి పెట్టింది. ఆద్రవ్యంతో

---

1. Germany today & tomarrow: C. Cunningham, P, 22.

వారు తమ వ్యవసాయం అభివృద్ధి చేసుకోవ డానికిబదులు పారిసు, వియన్నా మొదలైన నగరాలలో దుర్వ్యసనాలకు దిగి ధనమంతా పాడుచేశారు. అందువల్ల జర్మను వ్యవసాయవృత్తికి గొప్ప దెబ్బ తగిలింది. జాతీయ జీవితంలో కుళ్లు బైలు దేరిందనీ, అది లోలోపల చాలావరకు వ్యాపించివున్నదనీ, ప్రజలలో గగ్గోలు బైలుదేరింది. "చూడండి! ధనికు లేమి చేశారో! వాళ్లకు నీతి నియమాలు లేవనీ, వాళ్లిట్లా చేస్తారని మే మిదివరకే చెప్పలేదా!" అని సోషలిస్టులు గంతులు వేశారు. జనసామాన్యానికి తమ ప్రభుత్వంయెడల నిస్పృహా, రాజశాసనమంటే ధిక్కారమూ, నిర్లక్ష్యమూ అధికమైనాయి. రాజద్రోహ నేరానికి జైలుకుపోయే యువజనుల సంఖ్య హెచ్చిపోయింది. వారిలో ఒక్కరైనా, ఈ జన్మలో ఒక్కనాడైనా, రెక్కలతో చెమటూడ్చి పని చేసి పొట్టపోసుకొని యెరుగరు. వారి కీజన్మలో అట్టిఅవకాశా లెన్నడూ లభించియుండ లేదు.

౧౯౩౩ జనేవరిలో హిట్లరు అధికారానికి వచ్చేసరికి జర్మను సంఘంలో పరిస్థితు లీవిధంగా దారీ, తెన్నూ లేకుండా అగమ్యగోచరంగా వుండేవి. స్త్రీ పురుషు లందరూ ఒక కార్యక్రమంగాని, సంఘాభివృద్ధికి సంబంధించిన సామాన్యలక్ష్యంగాని, ఉన్నతాదర్శంగాని లేకుండా వ్యక్తిస్వాతంత్ర్యం పేర యథేచ్ఛగా విచ్చలవిడిగా, స్వార్థపరులై సంచరిస్తూవుండిరి. "పరమపవిత్రమైన" వ్యక్తిస్వాతంత్ర్యమే జర్మనుప్రజను ఇట్టి అధోగతికి అరాజకానికి దిగలాగినది. ఇక స్త్రీలను గురించి హిట్లరుయొక్క అదర్శా లెట్టివో తెలుసుకోవడం అవసరం.

అతడిదృష్టిలో స్త్రీల ముఖ్యధర్మం బిడ్డలను కని, పెంచి, వారికి నాజీ ఆదర్శాలతో విద్యాబుద్ధులను నేర్పడం. ఆడుది ముఖ్యంగా మాతృదేవత. మాతృదేవతాస్వరూపమైన స్త్రీధర్మము భూధర్మముతో తుల్యమైనది. జర్మను ప్రజకు కావలసిన ఆహారసామగ్రిని పండించి జాతిని పోషించవలసినది భూమి; జాతిని కని పెంచవలసినవారు స్త్రీలు. జర్మను సామ్రాజ్యంయొక్క ఔన్నత్యం ఈ రెండింటిసారంమీాదా అధారపడి వుంది. భూమిని సారవంతంగా జేసి పాడిపంటలను అభివృద్ధి చెయ్యాలి. బాలికలను జాగ్రత్తతో సంరక్షించి, పెద్దవారినిచేసి, వివాహాలొనర్చి, బిడ్డల తల్లులుగాజేసి వారి సంతానం అభివృద్ధి చెయ్యాలి. పితృదేశ సంరక్షణార్థం నాగలిని కత్తిని చేబూని పోరాడి తమ ప్రాణధనాలను సైతము అర్పింప సంసిద్ధులై యున్న ధైర్య స్థైర్య బలసంపన్నులైన జర్మను పుత్త్రిలను కని పెంచి పెద్దవారిని చేయుగల వీరమాతలను తయారు చెయ్యాలి. ఇవి నాజీలఆదర్శాలు. వారి దృష్టిలో భక్తిశ్రద్ధలు, ఓర్పు, ఒళ్లు వంచి పాటుపడేస్వభావము గల కర్షకుడు జర్మనుజాతికి ఆదర్శపురుషుడు. అదేవిధంగా భక్తిశ్రద్ధలు ఓర్పు గలిగి వళ్లు వంచి పని చేయగల సంతానవతియైన రైతుభార్య జర్మనీదేశానికి ఆదర్శ స్త్రీ.

"రైతు తన ఆవును చూసుకుంటూ వున్నట్లే తాము తమస్త్రీలను చూసుకుంటు న్నా" మని నాజీలు గర్వపడుతున్నారు. ఆడుదీ, ఆవూ—ఈ యిరువురూకూడా తమ్ము

పెంచి పోషించినవారికి ఉపచర్యచేస్తారు. ఆవు పాలను, పశుగణాన్ని ఇస్తుంది; ఆడుది సంతాన మిస్తుంది; పరిచర్య చేస్తుంది"[2].

నాజీలదృష్టిలో భూమి, గోవు, ఆడుది ఈముగ్గురూ జాతియొక్క ఐశ్వర్యానికీ పాడి పంటల సమృద్ధికీ సంతానాభివృద్ధికీ కుదుళ్ల వంటివారు. జర్మనుస్త్రీ తనపురుషుణ్ని సేవిస్తుంది; పురుషుడు రాష్ట్రాన్ని సేవిస్తాడు. రాష్ట్రపు ఔన్నత్యం ప్రజలసేవమీద ఆధారపడివుంటుంది. జనసామాన్యాన్ని బాల్యం నుంచీ సక్రమమైన పద్ధతులమీద తర్ఫీతు చేయవలసినవారు స్త్రీలు. కాబట్టి జర్మను స్త్రీలను చిన్నప్పటినుంచీ రాష్ట్రసేవలో తర్ఫీతుచెయ్యాలి. జర్మను బాలికలు చిన్నప్పటినుంచీ తమఆటపాటలలో సైతమూ, మాతృధర్మాన్ని గ్రహించాలి.[3] ఇవి నాజీ నాయకుల ఆదర్శాలు.

స్త్రీలను గురించి తన పార్టీవారి ఆదర్శాలను హిట్లరు ఎన్నోసార్లు ఘంటాపథంగా, నదురు బెదురు లేకుండా, ముక్త కంఠంతో చాటించాడు. "స్త్రీల స్వాతంత్ర్యాన్ని గురించీ పురుషులతో వారికి సమాన హక్కులను గురించీ ప్రజాప్రభుత్వాలు ఎంతో తీవ్రంగా వాదిస్తున్నాయి. నాజీకార్యక్రమంలో వున్నది వక్కటే విషయం—చంటిబిడ్డ. మగవాడు యుద్ధభూమిలో తన సర్వస్వమూ అర్పిస్తున్నాడు. ఆడుది తన ఇంటిని కనిపెట్టుకొనియుండి బిడ్డలను కని, పెంచి, వారికి విద్యాబుద్ధులు నేర్పి, ఆవిధంగాం జాతీయ మహాసంగ్రామములో పాల్గొంటోంది"అని అతడు ౧౯౩౬లో, న్యూరెంబర్గులో జరిగిన స్త్రీలసభలో అన్నాడు. నాజీల అభిప్రాయంలో తన విధ్యుక్తధర్మాలను సక్రమంగా నెరవేర్చే జర్మనుమాత సంఘమర్యాదకు పాత్రురాలు అవుతుంది. జర్మనుజాతి ఆమెకు అర్హమర్యాదను ఇచ్చి మన్నిస్తుంది.

"పవిత్రమైన ఆర్యనురక్తము గల జర్మనుయువకుడు తనకన్యాత్వానికి భంగం కలుగని ఆర్యను కన్యను వివాహమాడాలి. భార్యాభర్త లిరువురు పవిత్రమైన ఆర్యసంతతివారై యుండాలి. ఎల్లప్పుడూ ఇల్లు విడిచి తిరగడానికి అలవాటుపడియుండి, ఆటపాటలు, సినిమాలు మొదలైన వేడుకలకు మరిగి తరుచుగా ఇంటికి బైట అగుపడే యువతిని (జర్మను యువకుడు) వివాహమాడరాదు.[4]"

నాజీనాయకుల ఆదర్శాలు ఈవిధంగా వున్నాయి.

ఉన్నతశాస్త్రాలు కళలు మొదలైన విద్యావిజ్ఞానాలలో స్త్రీలకు ప్రవేశం ఉండనక్కరలేదు అని నాజీల నమ్మకం. "యంత్రా

---

2 R. Brady, Nazi Germany, P, 186.

3. ఈ సందర్భంలో ఆంధ్ర మహాభాగవతంలో రుక్మిణీకల్యాణంలో, "వేర్వేరుబొమ్మల" అను పద్యంలో వర్ణింపబడ్డ బాలికల ఆటపాటలు వారిని అల్లరిపెద్దులుగా తయారు చేయడంకోసం కాక, వారికి ఉత్కృష్టమైన మాతృధర్మం నేర్పడం కోసం ఉద్దేశింపబడ్డాయనీ, జాతీయ నాగరికతా, సంఘప్రవర్తనా విచ్చలవిడిగా ధ్వంసం కాకుండా శాస్త్రపరిధి కాపాడడమే వాటి పరమోద్దేశమనీ, మనం ఊహించుకోవచ్చును గదా!

4. F. L. Schunnan; the Nazi Dictator ship, 1934.

లను నడపడం వర్తకవ్యాపారాలను నిర్వహించడం, శాస్త్రపరిశోధన, శాస్త్రచర్చలు మొదలైనవాటిలో శిక్షితు మగవాని కుండాలి. బిడ్డలను కని పెంచి విద్యాబుద్ధులు నేర్పడంలో శిక్షితు స్త్రీల కుండాలి. పురుషులు చేసేపను లన్నిటిని స్త్రీలుకూడా చేయగలరు. వారి కాసమర్థత కలదు. కాని వా రాపనులను చేయగూడదు. పురుషులను తయారుచేయడమే, వారిని సక్రమమైన పద్ధతులలో శిక్షితుచేయడమే స్త్రీలు చేయవలసిన పనులు. స్త్రీలు ఈవిధ్యుక్తధర్మాలను అశ్రద్ధ్యం చేసిననాడు స్త్రీజాతి నశిస్తుంది"[5]

"ఒక గ్రంథం వ్రాయడంకన్న, ఒక వ్యాపారం నిర్వహించడం కన్న, ఒక బిడ్డను కని పెంచడమే అంత నీచ మైన పనియా?" అని హిట్లరు అడిగాడు. అతడి ఉద్దేశంలో, బిడ్డలను కని, పెంచి, వారికి తగిన శిక్షణ నిచ్చే స్త్రీలుకూడా "జీవితసంగ్రామంలో యోధాగ్రేసరలే! "స్త్రీల దాస్యవిమోచనం అన్న పదాన్ని సృష్టించిన బుద్ధిమంతులు జ్యూజాతివారు. జర్మనుజాతియొక్క ఔన్నత్య దశలో జర్మనుస్త్రీలకు దాస్యమే వుండేది కాదు. స్త్రీలు తమ అర్హస్థానము లను ఆక్రమించుకోవడం చూసి పురుషులు భయపడవలసిన అవసరం వుండేది కాదు. స్త్రీ తన విధ్యుక్తధర్మాన్ని స్పష్టంగా గుర్తించుకోజాలనప్పుడే తన ఆత్మసంరక్షణార్థం పురుషుడిమీద తిరగబడడం ప్రారంభించింది. ఈతిరుగుబాటువల్ల ప్రకృతివిరుద్ధమైన పరిస్థితు లేర్పడ్డాయి. ఇప్పు డిప్పుడే స్త్రీలు ప్రకృతి సిద్ధమైన తమ యథాస్థానాలకు వస్తున్నారు" అని హిట్లరు ౧౯౩౪ లో న్యూరెంబర్గులో స్త్రీలమహాసభ యెదుట చేసిన ఉపన్యాసంలో అన్నాడు. ఆసందర్భంలో అతడు అన్నమాటలు : "ప్రకృతిచే నిర్దేశింపబడ్డ తమ తమ విధ్యుక్తధర్మాలను సరిగా గుర్తెరిగినంతకాలం స్త్రీ పురుషుల మధ్య వివాద ముండ నవసరంలేదు. మగవాడిస్థానం బైట విశాల ప్రపంచకంలో; ఆడుదాని స్థానం అంతకంటె చిన్నదైనప్పటికీ అంతే ముఖ్యమైన ఇంటిప్రపంచకంలో. మగవాడి ప్రపంచకం జర్మను రాష్ట్రము; ఆడుదానిప్రపంచకం తనభర్త, కుటుంబం, పిల్లలు, ఇల్లు — ఈ చిన్ని ప్రపంచకాన్ని పోషించి సంరక్షించగల దిక్కు లేనియెడల ఆ బైటి విశాలప్రపంచకం గతి యేమవుతుంది? ఆ విశాల ప్రపంచకానికి ఈచిన్న ప్రపంచకమే పునాది. ఈ రెంటికీ మధ్య పరస్పర విరోధం లేదు. భార్యాభర్త లొకరి కొకరు చెందియున్నట్లే అ రెండు ప్రపంచకాలు ఒకదాని కొకటి చెందిఉన్నాయి."

మరోసందర్భంలో అతడు అన్న మాటలు : "జర్మను స్త్రీ గృహమనే తన రాజ్యంలో నిశ్చింతతో రాజ్యం చేస్తుంది. అంతేగాని మగవాడితో సమానమైన హక్కులకోసం నిరర్థకమైన కొట్లాటలతో ఆదుర్దాతో బాధపడదు. తన భర్తయొక్క శక్తి సామర్థ్యాలను చూసి, తెలివితేటలను చూసి సంతోషించడం నేర్చుకుంటుంది. ధైర్యస్థైర్యాలతో ఆత్మత్యాగంతో

5. Ibid.

జాగ్రత్తతో, చురుకుగా తన భర్తకు సహాయం చేస్తుంది."

జర్మనుస్త్రీ ఈవిధంగా తన భర్తకోసం బిడ్డలకోసం పాటుపడుతూ జర్మనుజాతిని సేవిస్తుందని వారి నమ్మకం. అయితే ఆమె విద్యావిహీనురాలై, తెలివితేటలు ప్రపంచ జ్ఞానము లేకుండా కేవలం బిడ్డలనుకని పెంచే యంత్రంవలె ఇంట్లో పడివుండాలని నాజీ నాయకుల ఉద్దేశం కాదు. ఆమె తనభర్త యొక్క కష్టసుఖాలలో జీవితసంగ్రామంలో అతడికి తోడునీడై నిలిచియుండి, అతడి జీవితాన్ని పరిపూర్ణవంతం చేయ సమర్థురాలై యుండాలనియే వారి ఉద్దేశం.

నాజీనాయకుల అభిప్రాయాలను ఇంకా స్పష్టంగా విశదపరచడంకోసం ఆపార్టీతరఫు ప్రచురణాలలోనుంచి యీ క్రిందివాక్యాలను యెత్తి భాషాంతరీకరిస్తున్నాను.

(౧) "మా దృష్టిలో జాతియొక్క అవసరాన్నిబట్టి జర్మను స్త్రీ తన సౌఖ్యం సైతము త్యజించడానికి సంసిద్ధురాలై యుండాలి. ఆమె దైహికంగాను, మానసికంగాను పాటుపడి తనవారి జీవితాలను మనోహరవంతం చెయ్యాలి. జర్మను జాతిని ఆవరించియుండి దానిని కిందికి దిగలాగుతూవున్న ముష్కర పరిస్థితులను లోటుపాటులను గుర్తెరిగి తన విధ్యుక్త ధర్మాలను సంతోష పూర్వకంగా నెరవేర్చాలి. ఒక్కమాటలో —జర్మనుస్త్రీకి రాజకీయమైన పరిజ్ఞానం వుండాలి; ఆమె రాజకీయంగా ఆలోచించుకోగలిగినదైయుండాలి; జాతియొక్క రాజకీయ దృక్పథంతో ఏకీభవించి ప్రవర్తించాలి. జన సామాన్యం అందరితోబాటు తానుకూడా త్యాగానికి సంసిద్ధురాలై యుండాలి."

(౨) "స్త్రీధర్మము చాలా ఉత్కృష్టమైనది. యోధాగ్రేసరుని, వీరపురుషుని ధర్మంతో తుల్యమైనది."

నాజీలు వివాహాలను సంతానాభివృద్ధిని మిక్కిలి ప్రోత్సాహం చేస్తున్నారు. వారి ఉద్దేశంలో, ప్రతిస్త్రీకి వివాహమూ, సంతానమూ విధ్యుక్తమైన ధర్మాలు.

(3) "ప్రతిస్త్రీకి వివాహము విధిప్రేరితము; జాతీయ సామ్యవాద రాష్ట్రంలో అది అనుల్లంఘ్యమైన ధర్మం."

(౪) "వివాహవిషయంలో, స్త్రీపురుషుల మధ్య ప్రేమ అసలు ప్రధానమైన విషయం కానే కాదు. వివాహానినుంచి భార్యాభర్తలు తృప్తి పొందుతున్నారా లేదా అన్నది కూడా ప్రధానమైనవిషయం కాదు. వారి సంతానం పవిత్రమైన ఆర్యసంతతికి జర్మనుజాతికి చెందియున్నదా లేదా అన్నదే ప్రధానమైన విషయం."

స్త్రీల వివాహవిషయమై నాజీలప్రచురణాలలో ఎక్కడాకూడా, పెళ్లికి ప్రేమ ప్రధానము అన్న ప్రశంస లేనేలేదు. ప్రేమ ప్రశంస ఎక్కడైనా వచ్చినప్పటికీ, వారి దృష్టిలో అది అంత ప్రధానమైన విషయం కానేకాదు.

జర్మను చట్టప్రకారం సంతాననిరోధము, గర్భస్రావాలు శిక్షింపబడతగిన నేరాలు.

స్త్రీల ఉన్నతవిద్యకు, ఉద్యోగాలకు, నాజీలు అనేక ఆటంకాలను కల్పిస్తున్నారు.

ప్రజలలో వివాహాలను ప్రోత్సహించడం కోసం పెండ్లి చేసుకొన్న వారికి దీర్ఘకాలపు అప్పులిచ్చి ధనసహాయం చేస్తున్నారు. అదిగాక తలిదండ్రుల సాలుసరి ఆదాయము ౧౮౦౦౦ రెమ్మార్కులు, అనగా సుమారు రూ. ౨౨౦౦/- మించని కుటుంబాలలో నాలుగోబిడ్డ తర్వాత పుట్టిన ప్రతి బిడ్డకు నెల ౧ కి రూ. ౧౨ చొప్పున ఈనా మిస్తున్నారు.

కఠోరమైన ఈ ఆదర్శాలు, పద్ధతులు స్వాతంత్ర్యప్రియులైన నవ్యజర్మనుస్త్రీల కంగీకారమేనా? తమహక్కులను, స్వతంత్రాలను స్వంతసంపాదనలను వదులుకొని ఒకరిమీద ఆధారపడి వుండడం వారి కిష్టమేనా? స్వల్పప్రతిఫలంతో తృప్తిపడి మగవారికి ఒదిగివుండడానికి వా రొప్పుకుంటారా? బిడ్డలను కనడం, ఆబిడ్డలకూ తమ భర్తలకూ చాకిరి చేయడం, ఇంటిని కనిపెట్టుకొని వుండడం— ఇవియే ఉత్కృష్టధర్మా లని బోధించే నాజీ సిద్ధాంతాలు స్వసౌఖ్యం కోసం, స్వార్జితంకోసం, స్వతంత్రంకోసం, సమానహక్కులకోసం దోర్లాడే నవ్య జర్మను స్త్రీలకు రుచిస్తాయా?

పూర్వం ఏ ఆర్యావర్తంలోనో, ఏ సనాతన హిందూ యువతులలోనో రాణీ లక్ష్మీబాయి, రాణీసంయుక్త, ఖడ్గ తిక్కన భార్యవంటి యోధవనితలు, వీరపత్నులు, వీరమాతలు ఉంటే ఉండవచ్చును గాని నవ్య జర్మనుస్త్రీ, రక్తం కరడు కట్టుకొనిపోయే ఈ క్రింది నాజీసిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి అంగీకరిస్తుందా?

"చంటిబిడ్డయొక్క లేత మెదడుసైతము తేజోవంతమైన ఈప్రార్థనతో నిండియుండాలి. 'సర్వశక్తిమంతుడవైన ఓ భగవానుడా! మా ఆయుధాలను, యుద్ధపరికరాలను దీవించు. మాయుద్ధాలను ఆశీర్వదించు' అని."

నాజీ పక్షంవారు ఈ సమస్యలను ఏవిధంగా సాధించగలుగుతున్నారు? జర్మను స్త్రీలను ఏవిధంగా తమ కార్యక్రమాల యెడల సుముఖులుగా చేసుకొంటున్నారు?

ఈ సంగతులను ముందు సంచికలో చర్చిస్తాను.—[6]

6. ఈ వ్యాసంలోను, ఇంతకు పూర్వపు వ్యాసాలలోను నేను వర్ణించిన విషయాలన్నీ నిష్పాక్షికమైన అమెరికను, ఫ్రెంచి ఇంగ్లీషు గ్రంథకర్తల గ్రంథాలలో నుంచి ఎత్తి వ్రాయబడినవి. పక్షపాతంతో నిండియున్న 'రూటరు' వార్తలకు, హిగ్గింబాతము వారి రైల్వే పుస్తకాలకు మాత్రమే అలవాటుపడివున్న మనదృష్టికి ఈ వ్యాసాలలో వివరింపబడ్డ సంగతులు సరియైనవేనా అనిపించవచ్చును. జర్మనీకి వ్యతిరేకంగా ప్రతిదినమూ మన వార్తాపత్రికలలోను, వాఙ్మయంలోను, జరుగుతూవున్న ప్రచారమే ఇందుకు కారణము.

ఈ వ్యాసాలలో వర్ణింపబడ్డ పరిస్థితులకు మనదేశంలోవున్న పరిస్థితులకు చాలాపోలికలు అగపడవచ్చును. జర్మనీకి సంబంధించిన వృత్తాంతంలో మన దేశానికి ఉపయోగపడే విషయాలను మాత్రమే ఉదాహరణార్థంగా తీసుకొని నేను చర్చిస్తున్నాను; మన కుపయోగంలేని మిగతా విషయాలను వదిలిపెడుతున్నాను. కాని నేను వర్ణించేవి జర్మనీ దేశపరిస్థితులేగాని, హిందూదేశ పరిస్థితులు కావు. ఆవిషయం చదువరులు మరువలాదని నామనవి. రోగశాస్త్రం చదివేటప్పుడు అందులో వర్ణింపబడ్డ రోగాలన్నీ మనకు కూడా ఉన్నాయని తోచడం సహజమే.

హైదరాబాదు సంస్థానము: విద్య

ఒక పరిశీలనము

శ్రీ యస్. రామాచార్

అంకెలను నోరుండి; అవి మాట్లాడతాయి. విడి విడి ప్రత్యేకోదాహరణాలు అనేకాల కంటె వాటి భావ తెలిసినవానికి అతిసిసలయిన, విస్పష్టమయిన చిత్రాన్ని తెలుపుతాయి. ఈ వ్యాసములో హైదరాబాదు సంస్థానమువారి విద్యావిషయకనీతి (ఎడ్యుకేషనల్ పాలిసీ)కి సంబంధించిన అంకెల అర్థమును వివరిస్తాను. ఈ యంకెలన్నీ సంస్థానప్రభుత్వ ప్రచురణాలలో ఇచ్చినవే.

నాకు ఏ సంఘంమీద కాని, ఏ తెగమీదకాని ఏవిధమయిన దురభిప్రాయము, దురుద్దేశము లేదన్నే విషయము ప్రారంభములో స్పష్టముచేయవలసి ఉంది. నాకు లభించిన అంకెలను, అంశములనుబట్టి మహోన్నతవహించిన నైజాము వారి ప్రభుత్వము వారు ఒక ప్రత్యేక భావ రెండల, సంఘము నెడల పక్షపాతము చూపుతున్నారనే తీర్మానానికి రాక తప్పనిసరి అయితే అది నాతప్పు కాదు. విద్యావిషయములో ఒక ప్రత్యేక సంఘము అభివృద్ధి పొందుతున్న దంటే నే వనూయ పడను. నిజంగా అల్పసంఖ్యాక సంఘంవారు సాధించిన విషయాలయినా అంత గర్వపడదగ్గవిగా లేవు. అవి ఏవయినా కావచ్చుకాని అభివృద్ధికరము లైనవి మాత్రం కావు. నాయీతీర్మానాలు తప్పని చూపిస్తే నేను దిద్దుకొంటాను.

విస్తీర్ణమునుబట్టి చూచినా, జనసంఖ్యనుబట్టి చూచినా హిందూదేశం అంతటిలోనూ హైదరాబాదు మొట్టమొదట వచ్చే సంస్థానమయినా అక్షరాస్యుల సంఖ్యనుబట్టి చూస్తే అది కట్టకడపటిది. ౧౯౪౧-వ సంవత్సరం నాటికి హైదరాబాదులో ప్రతి వేయిమందికీ ౩౭ గురు అక్షరాస్యులుండేవారు. విద్యావిషయంలో నేడు చేసే ఖర్చు ౧౯౩౧ లో చేసేదానికంటె ఏభయి రెట్లు పెరిగింది. కాని అక్షరాస్యులు ప్రతి వేయిమందికి ౪౯.౫ మాత్రమే ఉన్నారు ఈ విషయాన్ని జనాభా లెక్కలలో నుంచి తీసిన ఈ ప్రక్కపుటలోని (౧-వ) పట్టికే ధ్రువపరుస్తుంది. ఈ పట్టికలో అన్నిటికంటె వెనుక వచ్చేది హైదరాబాదు.

హైదరాబాదులో పాఠశాలకు వెళ్లే యీడు వచ్చిన బాలురలో నూటికి దాదాపు ౨౫.౬ మందిన్ని, బాలికలలో నూటికి దాదాపు ౪.౭ గురున్న పాఠశాలకు వెడుతున్నారు. నేడు ఆ సంస్థానంలో వున్న మొత్తం పబ్లికు పాఠశాలలు ౪౭౯౦; వాటిలో చదువుతున్న మొత్తం విద్యార్థులు ౩,౬౨,౧౬౦ మంది. ఇక ఇతర సంస్థానాలు చూస్తే – మైసూరులో వున్న పాఠశాలల మొత్తం ౭౪౯౦, వాటిలో చదువుతున్న విద్యార్థులు ౩,౩౯,౬౯౬; తిరువాన్కూరులో ౩౦౬౨ పాఠశాలలున్నాయి; వాటిలో ౭,౫౫,౧౩౯ మంది విద్యార్థులు చదువుతున్నారు; బరోడాలో ౨౫౪౨ పాఠశాలలున్నాయి; వాటిలో చదివే విద్యార్థుల సంఖ్య ౨,౯౦,౭౩౫ గురు. ఈ సందర్భంలో హైదరాబాదు సంస్థానము తిరువాన్కూరుకంటె వైశాల్యములో పదకొండురెట్లు పెద్దదనీ, జనసంఖ్యలో మూడింతలు గొప్పదనీ మనం మరచిపోకూడదు. అది మైసూరు కంటె కూడా వైశాల్యంలో రెండింతలు పెద్దది; మైసూరులోకంటె హైదరాబాదులో రెండున్నర రెట్లు ఎక్కువమంది జనం ఉన్నారు ఇక బరోడా విషయం చూస్తే అది వైశాల్యంలో హైదరాబాదు

౧-వ పట్టిక

రాష్ట్రములు	అయిదేండ్లుగల, అంతకుమించిన వయస్సుగల ప్రతి పదిలక్షలమందికి అక్షరాస్యులు							
	మగవారు				ఆడవారు			
	౧౯౩౧	౧౯౨౧	౧౯౧౧	౧౯౦౧	౧౯౩౧	౧౯౨౧	౧౯౧౧	౧౯౦౧
బెంగాలు ...	౧౮౮	౧౮౧	౧౬౧	౧౪౭	౨౨	౨౧	౧౩	౯
మద్రాసు ...	౨౧౯	౧౭౩	౧౭౧	౧౩౭	౨౫	౨౪	౨౦	౧౧
మధ్యపరగణాలు, బేరారు ...	౧౧౦	౮౭	౬౨	౧౦౩*	౧౧	౮	౩	౮
బొంబాయి ...	౧౪౯	౧౩౮	౧౩౯	౧౩౧	౨౩	౨౪	౧౬	౧౦
తిరువాన్కూరు ...	౪౦౮	...	౨౪౮	౨౧౫	౧౬౮	...	౫౦	౩౧
మైసూరు ...	౧౭౪	౧౪౩	౧౧౨	౧౧౭*	౩౩	౨౨	౧౩	౮*
బరోడా ...	౩౩౧	౨౭౭*	౨౨౯*	౧౯౯*	౭౯	౫౧*	౨౫*	౯*
హైదరాబాదు ...	౮౫	౫౭	౫౧	౨౧	౧౨	౮	౪	౫

కంటె పదోవంతు చిన్నది; బరోడా జనసంఖ్య హైదరాబాదు జనసంఖ్యలో ఆరవవంతు మాత్రమే.

నైజాంప్రభుత్వమువారు విద్యావిషయంలో ఎంత ఖర్చు చేయడానికైనా జంకరు. వారు విద్యావిషయంలో చేసేవ్యయం ౧౮౮౧ నుండి క్రమంగా హెచ్చుతోంది.

సంవత్సరము	విద్యావిషయకవ్యయము
౧౮౮౧	రు. ౨,౨౯,౨౨౦
౧౮౯౧	,, ౩,౦౩,౨౯౨
౧౯౦౧	,, ౭,౪౮,౬౬౫
౧౯౧౧	,, ౧౦,౧౯,౭౮౭
౧౯౨౧	,, ౬౮,౨౯,౯౦౨
౧౯౩౧	,, ౯౦,౭౭,౦౮౩.
౧౯౩౮	,, ౧,౦౩,౭౫,౭౫౫

హైదరాబాదుసంస్థానంలో పాలుసరివిద్యావిషయక వ్యయం ఇంచుమించుగా కోటిరూపాయలదాకా ఉంటే, అది మైసూరులో ౬౬ లక్షలు; తిరువాన్కూరు, బరోడాసంస్థానాలలో ౪౦ లక్షలకూడా లేవే. హైదరాబాదులో విద్యనిమిత్తం బడ్జెట్ అల్లాట్ మెంటు బరోడా, తిరువాన్కూరు: లోకంటె కొన్నైతే రెండింతలకంటెనూ ఎక్కువే, కాని విద్యావిషయకస్థితి ఆ రెంటిలోనూ ఉన్నదానిలో సగమంత తృప్తికరంగా నైనా లేదు. ఇట్లని, మైసూరు, తిరువాన్కూరు, బరోడాలలోని విద్యావిషయక యోగ్యతలు గర్వపడదగిన వని నే ననను. అయితే నే నసేది ఇంతే—వారిది చెడ్డగా ఉంటే, హైదరాబాదుది అంతకంటె చెడ్డగా ఉంది. ౩,౬౨,౧౬౦ మంది విద్యార్థులు చదువుకుంటూవున్న తన ౪౭౯౦ సంస్థలమీదా హైదరాబాదు దాదాపు ఒక కోటిరూపాయలు వ్యయం చేస్తోంది. ఇక మైసూరిలో ౩,౩౯,౬౯౬ మొత్తం విద్యార్థిబలంకల తన ౭౮౯౦ సంస్థలమీదా వ్యయపరిచేది ౬౬ లక్షలు. ఉజ్జాయింపున చూస్తే ప్రతిబాలకునికోసం మైసూరు దాదాపు ౧౯ రూపాయలు ఖర్చుపెడితే హైదరాబాదు ౨౭ రూపాయలు ఖర్చుచేస్తోంది. అందులోను, మైసూరిలో హైదరాబాదులోకంటె దాదాపు రెట్టింపు పాఠశాల లున్నాయనీ, అందువల్ల ఎస్టాబ్లిష్మెంటు ఛార్జీలు హైదరాబాదుకుకంటె మైసూరుకు ఎక్కువ వవుతాయనీ మనం

* పదేళ్లు, అంతకుమించిన వయస్సువారు.

సర్దుకోవాలి. అయినప్పటికీ మైసూరు 'ఏవరేజి' కంటె హైదరాబాదుది చాలా తక్కువ. ఇది ఎందు వల్లనంటే పెద్ద ఆఫీసర్ల జీతాలు మరీ హెచ్చు, కింది వారివి మరీతక్కువా అయిపోయినవి.

కడచిన జనాభా నివేదిక (౧౯౩౧) ప్రకారం హైదరాబాదు జనాభా ౧,౪౪,౩౬,౧౪౮. భాషా విషయకంగా చూస్తే హైదరాబాదును తెలింగానా (ఆంధ్ర), మహారాష్ట్ర, కర్ణాటకాలని మూడు రాష్ట్రాలుగా విభజించవచ్చును. సంస్థానంలోని ఈ అన్ని భాగాలలోను, స్థానికమైన 'ఉర్దూ'కు భిన్నమైన మాతృభాషగలవా రున్నారు. ఈ సంస్థానంలో తెలుగు మాట్లాడేవారు ౯౯,౭౨,౫౩౪ నురు; మహారాష్ట్రం మాట్లాడేవారు ౩౭,౮౬,౮౩౬ నురు; కన్నడం మాట్లాడేవారు ౧౬,౨౦,౦౯౪ నురు. ఉర్దూమాట్లాడేవారు ౧౫,౦౭,౨౭౨ నురు. ఈ విధంగా జనసంఖ్యనుబట్టి చూస్తే మొదట లెక్కకువచ్చేది తెలుగు; తరువాత వచ్చేది మహారాష్ట్రం, తరువాత కన్నడం; అన్నిటి కంటె కట్టకడపట వచ్చేది ఉర్దూ. సంస్థానం అంతటిలో ఉర్దూమాట్లాడేవారు నూటికి పదిమంది చొప్పున ఉన్నారు. ఇంత తక్కువగా ఉన్నా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్య గరిపేభాష ఉర్దూ. విద్య ఉర్దూలో గరపడంవల్ల మహమ్మదీయులకు నిస్సందేహంగా గొప్ప ఉపకారం జరిగింది. కాని హిందువు లత్యధిక సంఖ్యాకులకు అది పరభాష అవడంవల్ల వారి పురోభివృద్ధికి అడ్డుకట్టయి నిలిచింది. నేను చెప్పే దానిలోని సత్యం ఈక్రింది (౨-వ) పట్టిక నిరూపిస్తుంది:

ఈ పట్టికవల్ల ౧౮౮౧ లోనే హిందువులలో కంటె మహమ్మదీయులలో అక్షరాస్యత ఎక్కువగా ఉందని తెలుస్తుంది. కాని ౧౮౮౧, ౧౯౩౧ సంవత్సరాల నడుమ, అనగా కడచిన ఏభయి సంవత్సరాలలో మహమ్మదీయులలో అక్షరాస్యులు రెండింతలకన్న అధికం కాగా, హిందువులలో అక్షరాస్యత నూటికి ౦.౪ చొప్పున మాత్రమే వృద్ధి అయింది.

౨-వ పట్టిక

సంవత్సరం	మొత్తం జనసంఖ్య	మొత్తం హిందూ జనసంఖ్య	మహమ్మదీయ జనసంఖ్య	హిందూ అక్షరాస్యులు	మహమ్మదీయ అక్షరాస్యులు	హిందువులలో ప్రతి వెయ్యింటికి అక్షరాస్యులు	మహమ్మదీయులలో ప్రతి వెయ్యింటికి అక్షరాస్యులు
౧౮౮౧	౯౮,౪౫,౫౯౪	౮౮,౯౩,౧౮౧	౯,౨౫,౯౨౯	౨,౬౪,౫౦౭	౪౫,౭౫౨	౨౯.౮	౪౯.౪
౧౮౯౧	౧,౧౫,౩౭,౦౪౦	౧,౦౩,౧౫,౨౪౯	౧౧,౩౮,౬౬౬	౩,౪౬,౪౭౫	౭౦,౧౪౭	౩౩.౭	౬౧.౬
౧౯౦౧	౧,౧౧,౪౧,౧౪౨	౯౮,౭౦,౮౩౯	౧౧,౫౫,౭౫౦	౨,౫౦,౨౬౭	౬౩,౧౧౦	౨౫.౪	౫౪.౬
౧౯౧౧	౧,౩౩,౭౪,౫౭౬	౧,౧౬,౨౬,౩౭౫	౧౩,౮౦,౯౯౦	౨,౬౭,౦౪౧	౮౧,౨౬౦	౨౩ ౦	౫౯.౦
౧౯౨౧	౧,౨౪,౭౧,౭౭౦	౧,౦౬,౫౬,౪౫౩	౧౨,౯౮,౨౭౭	౨,౭౭,౦౫౬	౧,౧౫,౫౨౨	౨౬.౦	౮౯.౦
౧౯౩౧	౧,౪౪,౩౬,౧౪౮	౧,౨౧,౭౬,౭౨౭	౧౫,౩౪,౬౬౬	౪,౦౫,౬౧౪	౧,౫౮,౮౫౯	౩౩.౩	౧౦౩.౫

సంస్థానంలో ఉన్న మహమ్మదీయ జనసంఖ్య పదిహేను లక్షలయితే, హిందూజనసంఖ్య ౧౨౨ లక్షలు. హిందువులు మహమ్మదీయులకంటె ఎనిమిదిరెట్లధికంగా ఉన్నారు. ఈక్రింద పొందుపరిచిన పట్టికలవల్ల ప్రైమరీ తరగతులలో చదివే మహమ్మదీయ విద్యార్థులసంఖ్య వారి మొత్తం జనసంఖ్య తరబడికి ఉండవలసినదానికంటె అధికంగానే ఉన్నప్పటికీ హిందూవిద్యార్థుల సంఖ్య

కంటె తక్కువేఅని తెలుస్తుంది. కాని సెకండరీవిద్యా, కళాశాల విద్యావిషయములకు పోయి చూస్తే మొత్తం సంస్థానం జనసంఖ్య అంతలోను మహమ్మదీయులు పదోవంతు మాత్రమే ఉన్నప్పటికీ మహమ్మదీయ విద్యార్థులు హిందూ విద్యార్థులకంటె సంఖ్యలో అధికంగా ఉన్నట్టు తేలుతుంది.

ప్రైమరీవిద్యకు చదివే విద్యార్థులు

సంవత్సరం	హిందువులు	మహమ్మదీయులు
౧౯౦౦	౨౫,౩౪౩	౧౫,౩౨౮
౧౯౦౫	౨౬,౮౧౭	౧౬,౫౧౬
౧౯౧౦	౨౯,౩౫౯	౧౪,౬౮౫
౧౯౧౭	౨౦,౩౦౯	౨౦,౪౮౪
౧౯౨౫	౧,౩౭,౩౧౪	౬౪,౭౧౪
౧౯౩౦	౧,౭౦,౭౩౩	౯౯,౭౨౪

సెకండరీవిద్యకు చదివేవారు

సంవత్సరం	హిందువులు	మహమ్మదీయులు
౧౯౦౦	౬,౮౧౭	౫,౮౯౬
౧౯౦౫	౬,౦౦౨	౬,౧౦౪
౧౯౧౦	౬,౨౬౧	౪,౯౭౫
౧౯౧౭	౧౦,౫౦౦	౧౨,౫౮౬
౧౯౨౫	౧౭,౦౦౭	౧౭,౯౪౮
౧౯౩౦	౨౧,౫౦౬	౨౧,౬౨౮

కళాశాలలలో చదువుతున్నవారు

సంవత్సరం	హిందువులు	మహమ్మదీయులు
౧౯౦౦	౨౨	౧౨
౧౯౦౫	౨౮	౭
౧౯౧౦	౮౯	౩౦
౧౯౧౭	౯౭	౨౦౪
౧౯౨౫	౩౯౧	౬౦౪
౧౯౩౦	౮౭౩	౬౬౪

ఈ పైపట్టికలనుబట్టి చూస్తే పాఠశాలలలోని— హిందూ జనాభా కనుగుణంగా ఉండవలసిన హిందూ విద్యార్థుల తరబడికంటె మహమ్మదీయ జనాభా కనుగుణంగా ఉండవలసిన మహమ్మదీయ విద్యార్థుల తరబడి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. మహమ్మదీయులు ముఖ్యంగా ౧౯౧౭ నాటినుంచి, అనగా విద్య ఉర్దూలో గరపే నిర్ణయంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం వచ్చిననాటినుంచీ ఉరకలువేస్తూ అభివృద్ధి చెందుతున్నారు. నైజాము ప్రభుత్వమువారు ఉర్దూను జాతీయ భాషా పదవికి లేవనెత్తడానికి చేసే ప్రయత్నాలవల్ల సంస్థానంలో అత్యధికసంఖ్య జనానికి హాని కలిగింది. ౧౯౨౯లో ఇర్విన్ ప్రభువు ఈక్రింది విధంగా చెప్పినప్పుడు ఈ విషయమే ఆయన మనస్సులో ఉండేమో అనిపిస్తుంది.

"మహోఘనత వహించిన మీ మహమ్మదీయ ప్రజలనే విధంగానో ఆ విధంగానే హిందూ ప్రజలను కూడా బలంగా ఆకర్షించేటట్లు విశ్వవిద్యాలయ నీతి (policy)ని సరిదిద్దడమే రాజ్యపరిపాలనదక్షులు చేయవలసిన పని."

ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించడంకూడా విద్యావిషయకమయిన ఉన్నతాదర్శాలవల్ల ప్రేరితులై కాదేమోనని నా అనుమానము. హిందూదేశంలో మెకాలే ఏవుద్దేశంతో ఇంగ్లీషువిద్య ప్రవేశపెట్టాడో ఆ వుద్దేశంతోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపితమయినట్లు తోస్తుంది; అంటే ఏమిటి,—గవర్నమెంటు ఉద్యోగాల నిమిత్తం ఉర్దూ తెలిసినవారిని తయారుచేయడమే అసలు ఉద్దేశం. హైదరాబాదులో ఆసఫ్‌జాహీ వంశం స్థిరంగా నిలబడిపోయిన తరువాత అది ఉర్దూను రాజభాషచేసింది. సంస్థానంలో చాలినంతమంది ఉర్దూ వచ్చినవారు దొరకకపోవడంవల్ల చాలామందిని పంజాబునుంచీ, సంయుక్తరాష్ట్రాలనుంచీ దిగుమతిచేయవలసి వచ్చింది. తరువాత ప్రభుత్వంవారు స్థానికులే ఉర్దూ తెలుసుకోవలసిన ఆవశ్యకతను గమనించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపకుడని నిజంగా చెప్పవలసిన సర్ అక్బర్ హైదరీగారికి విద్య ఉర్దూలో బోధించడంవల్ల కలిగే కష్టనష్టాలు తెలియకపోలేదు. కాని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగారయిన హెచ్. ఏ. ఆన్సారిగా రన్నట్లు ఈవిధంగా ఆయన ఆక్షేపణలకు జవాబిచ్చారు.

"పెట్టబోయే విశ్వవిద్యాలయంలో విద్యాబోధ నిమిత్తం ఉర్దును వాడడం విషయంలో రెండాక్షేపణ లుండవచ్చునని ఆయన (సర్ అక్బర్ హైదరీగారు) సూచించాడు; అవేవంటే, ఒకటి, సగంకంటె ఎక్కువమంది జనం ఇతర భాషలు మాట్లాడుతారు; రెండు, ఉర్దులో మంచిపుస్తకాలు లేకపోవడం. మొదటి ఆక్షేపణవిషయంలో ఉర్దు మాతృభాషగాగలవారు కొద్దిమందే ఉన్నారనేది నిజమయినప్పటికీ అది (ఉర్దు) సంస్థానంలో రాజకీయ వ్యవహార భాష, సంస్కృతి (Cultural) భాష, మర్యాదస్తుల (Polite society) భాషానుదానిని సాధారణంగా కళాశాలా విద్యను అభ్యసించడానికి ఆ విద్యార్థులు ఏతరగతులనుంచి వస్తారో తరగతులవారు మాటాడుతారు. (మారుమైపు నేను పెట్టించితిని)

ఉర్దు మాట్లాడేటటువంటిన్ని, విశ్వవిద్యాలయానికి వెళ్లేటటువంటిన్ని, అటువంటి గవర్నమెంటు ఉద్యోగాలకు వెళ్లేటటువంటిన్ని ఒక్కతరగతివారికి విద్యనిచ్చే ఉద్దేశంతో విశ్వవిద్యాలయం స్థాపించారని తోస్తుంది. ప్రజాసామాన్య ప్రయోజనాన్ని గురించి ఎంతమాత్రమూ ఆలోచించినట్టు కనబడదు. అయితే, సెకండరీ స్కూళ్లలోను, ప్రైమరీ స్కూళ్లలోకూడ విద్యను ఉర్దులోనే బోధించడం ఈ తరగతివారి లాభం కోసమేనా అని అడగవలసి ఉంటుంది.

సంస్థానం అంతలోనూ పట్టణాలూ, గ్రామాలూ కలిసి ౨౧,౮౩౦ దాకా ఉన్నాయి. వీటిలో ౫౦౦౦ లకు తక్కువ జనసంఖ్యగల గ్రామాలు ౨౧,౭౩౨. సగటున చూస్తే హైదరాబాదు సంస్థానంలో ప్రతి ౪౬ గ్రామాలకు ఒక్క పాఠశాల ఉందన్నమాట. తిరువాన్కూరులో మొత్తం జనసంఖ్యలో ప్రతి ౧౩౨౦మందికి ఒక్కొక్క పాఠశాల ఉండగా హైదరాబాదులో ౩౦౧౨ గురికి ఒక పాఠశాలచొప్పున ఉంది. ఈ సంస్థానంలో ౫౦౦ లు మొదలు ౧౦౦౦మంది జనసంఖ్యగల గ్రామాలు అధమం ౩౦౦౦ ల వరకు ఉన్నాయి. వీటిలో ఏ విధమయిన పాఠశాలాకూడా లేదు.

ఇటువంటి పరిస్థితులలో తమతోడి ప్రజలకు విద్యనిచ్చే విషయంలో ప్రైవేటు సంఘాలకు, వ్యక్తులకు ప్రోత్సాహమిస్తా రనుకోవడం ఉచితం. కాని హైదరాబాదు ఒక విచిత్రమైనదేశం. హైదరాబాదులో ఉండే మాదిరి పరిస్థితులు ప్రపంచంలో మరెక్కడ నయినా కనబడడం కష్టం. నైజాము ప్రభుత్వమువారు ప్రత్యేకం విడివిడి వ్యక్తులుకాని, సంఘాలుకాని ప్రైవేటుస్కూళ్లు పెట్టడమంటే కిట్టదు. ప్రైవేటు పాఠశాలలు పెట్టకూడదని గవర్నమెంటు హుకుము. ప్రభుత్వంవారి అనుమతి లేకుండా ఎవరైనా ఒక వ్యక్తిగాని, ఒక సంఘంగాని విద్యాశాల స్థాపిస్తే "జిల్లా మొదటి తాలూక్దారుగారి ద్వారానో, హైదరాబాదు పోలీసు కమీషనరుగారి ద్వారానో అటువంటి విద్యాలయాలను మూయించి వేయడానికి" పబ్లిక్ ఇన్‌స్ట్రక్షను డైరెక్టరుగారో, స్కూళ్ల డివిజనలు ఇన్‌స్పెక్టరుగారో అవసరమైన చర్య తీసుకొంటారు. ఈ పద్ధతి నవలంబించడంవల్ల ఎంతనష్టం కలిగిందో ఈ యంకెలే తెలుపుతాయి: ౧౯౨౫ నాటికి హైదరాబాదులోవున్న ప్రైవేటు విద్యాలయాలు (ప్రభుత్వం వారివికానివి) ౩,౧౮౭ ఉండేవి; వీటిలో ౭౬,౯౫౮ గురు చదువుతుండేవారు. పైని చెప్పినపద్ధతి అలవంబించిన పిదప, ౧౯౩౭నాటికి అవి ౬౯౦ కి తగ్గిపోయినవి; వాటిలో చదివేవారి సంఖ్యకూడా ౨౫,౨౬౭ కు పడిపోయింది. ప్రైవేటు విద్యాసంస్థలంటే నైజాం ప్రభుత్వంవా రెందుకు భయపడతారో నాకు తెలియటం లేదు. ఈవిషయంలో, ప్రస్తుతం, హైదరాబాదు హైకోర్టు జడ్జీలలో ఒకరయిన రామచంద్ర నాయకు గారు ఇట్లు అన్నారు:

"ప్రైవేటు పాఠశాలలు స్థాపించరాదనే యీహుకుము విద్యావ్యాపనానికి చాలా గొప్ప ఆటంకంగా ఉంది. దీనివల్ల చిక్కులేర్పడి, అందుమూలంగా పాఠశాలలసంఖ్య బాగా తగ్గిపోయింది. సంస్థాన ప్రజలు ఈ హుకుము తమ రాజభక్తికి, తెలివితేటలకీ ఒకకళంకంగా ఉందని న్యాయంగా భావిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలపు పాఠశాలలసంఖ్య వృద్ధిచేయడమూ, ఇందుకు ఈయుపాయము ఎంత అనుకూలమయినదో ప్రభుత్వము వారికి చూపటమూ– ఇదే ఆహుకుము పరమోద్దేశంగా కనబడుతుంది. ప్రైవేటుపాఠశాలలను ప్రజలు

చక్కగా నిర్వహిస్తారనే నమ్మకం చాలదని పైకి చెప్పేకారణం. ప్రపంచంలోని ప్రతిదేశమూ ప్రజల విద్యావిషయం మీరే సొంతంగా చూచుకోండని చెప్పి ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సాహిస్తూంటే ఈ ప్రముఖ సంస్థానమో అటువంటి కార్యాలలో జోక్యంకలిగించుకోకుండా ప్రజలను వారిస్తోంది."

సంస్థానంలోని హిందువుల మొత్తంసంఖ్య ౧,౨౧,౭౬,౭౨౭; మహమ్మదీయుల సంఖ్య ౧౫,౩౪,౬౬౬. సంస్థానంలో ఉర్దు మాట్లాడేవారి మొత్తం సంఖ్య ౧౫,౦౭,౨౭౨. అందరు మహమ్మదీయుల మాతృభాష ఉర్దు అనడం కాని, అందరు హిందువులది తెలుగో, మహారాష్ట్రమో, కన్నడమో అనడం కాని పొరపాటు. సంస్థానంలో ఉర్దు మాతృభాషగా గలవారు ౪౯,౫౯౨ రు బ్రాహ్మణ హిందువులు, ౨౧,౦౦౧ రు ఆదిహిందువులు, ౩౬౧ మంది జైనులు, ౧౪౦౦ ల మంది సిక్కులు, ౩౩౦౫ గురు క్రైస్తవులు, ౩,౨౬౧ రు ట్రైబల్సు, ౨౩౪ గురు ఇతరులు ఉన్నారు. ఈ విధంగా మహమ్మదీయులు కాని ౧,౧౯,౧౬౧ మందికి ఉర్దు మాతృభాషగా ఉంది. అందువల్ల, అది మహా అయితే ౧౩,౮౮,౧౧౧ మంది మహమ్మదీయులకు మాతృభాష కావాలి; అంటే ఏమిటి, మహమ్మదీయులలోనే ౩,౪౬,౫౫౫ గురు ఉరుదు మాట్లాడడమయినా తెలియనివా రన్నమాట. ఈవిధంగా చూస్తే విద్య ఉర్దులో బోధించడం అధిక సంఖ్యాకులయిన హిందువులకే కాకుండా మూడున్నరలక్షల మంది మహమ్మదీయులకు కూడా అనర్థకమే. మాటాడేభాషకే పైనిచ్చిన అంకెలు వర్తిస్తాయి. కాని ఉర్దులో అక్షరాస్యతను గురించి తీసుకొంటే, మొత్తంజనాభా అంతలోను నూటి కొకరు చొప్పున, లేదా వేయిమందికి ౧౩౩ గురు చొప్పున మాత్రమే ఉర్దులో చదువను, వ్రాయను నేర్చినవారు.

సంవత్సరం	జనాభాలో ప్రతివేయిమందికి		
	మొత్తం	పురుషులు	స్త్రీలు
౧౯౩౧	౧౩౩	౨౧౪	౪౫
౧౯౨౧	౧౦౮	౧౮౦	౩౬

ఈ ప్రక్క నిచ్చిన పట్టికనుబట్టి ౧౯౨౧ నుంచి ౧౯౩౧ వాటికి ఉర్దులో అక్షరాస్యులసంఖ్య ఎంత అభివృద్ధిచెందిందో తెలుస్తుంది. ఉర్దును ముందుకు తోయడానికి చేసిన బ్రహ్మాండమైన ప్రయత్నాలను బట్టి చూస్తే అది అంత ఆశ్చర్యకరమైన దేమీ కాదు.

ఎవరైనా సాహసించి, విద్యాబోధ ఉర్దులో చేయడమేమిటని ఖండిస్తే జాతీయభాష (National language) అనేమాట తీసుకువచ్చి నవదేశాభిమాన భావాలను సాంత్వనపరచడానికి ప్రయత్నాలు జరుగుతాయి. ఒక సామాన్యభాషను — హిందూదేశానికంతకూ హిందూస్తానీని — ఏర్పాటుచేసుకోవాలనిన మేము వారిలో నేనొకణ్నని ఒప్పుకొంటాను. ఒకసామాన్యభాషను ఏర్పాటుచేసుకోవడమంటే రాష్ట్రీయభాషలను అణచివేయాలనికాదు దాని అర్థం. అదటుండ, ప్రతి సామాన్యమానవుడూ మాటాడేభాషఅనీ, నాగరి లిపిలోనూ, ఫారసీ లిపిలోనుకూడా వ్రాసేదనీకూడా హిందూస్తానీకి నిర్వచనం చేశాను. ఉస్మానియావిశ్వవిద్యాలయంలో నేర్పే ఉర్దుభాష హిందూస్తానియే అని ఎవరయినా అంటే వారు తమ అజ్ఞానాన్ని వెల్లడించుకోవడమే. ఉస్మానియావిశ్వవిద్యాలయంలో నేర్పేభాషలో అరబ్బీ, ఫారసీపదాలు పూర్తిగా ఉన్నాయి. వాటిలో కొన్నిటిని హిందూవిద్యార్థులు ఎంతో కష్టంమీదకాని ఉచ్చరించడంకూడా ఉచ్చరించలేరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం "ట్రాన్స్లేషన్ బ్యూరో"(అనువాదకసంఘం)వారు ప్రకటించిన పుస్తకాలొక్కమారు చూస్తే నేను చెప్పేదానిలోని యాథార్థ్యం బోధపడుతుంది. హిందూవిద్యార్థులు తమ మాతృభాష కాని రెండుభాషలను తప్పని సరిగా నేర్చుకోవలసి వస్తోంది. ఈ సందర్భంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు నిర్బంధంగా నేర్చుకుతీరవలసిన రెండవ భాష అనే విషయం మరవకూడదు. ఇటువంటి పరిస్థితులలో, రెండుభాషలూ నేర్చుకోడానికి చేసే ప్రయత్నంలో వారికి ఒకటీ అంటటంలేదంటే ఆశ్చర్యమేమీ లేదు.

పండిత జవహరులాలుగా రన్నట్లు రాష్ట్రీయభాషలు అన్నీ "గొప్ప సంప్రదాయంగల పురాతన

భావలు; ప్రతిభావను లక్షలకొద్దిజనులు మాటాడుతారు; ప్రతిభావ ఉన్నతతరగతులవారియొక్క, జనసామాన్యముయొక్క జీవనము, సంస్కృతి, భావాలతో విడదీయ వీలులేనంత ఎక్కువగా పెనవేసుకొని పోయింది. జనసామాన్యానికి తమ భావద్వారా చెబితేనే వారు విద్యావిషయకంగానూ, సాంస్కృతికంగాను వృద్ధిపొందుతా రనేది గ్రంథసిద్ధాంతము."

ఇందువల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అందరికీ ఉర్దులోనే విద్యాబోధచేయడం తప్పని ఖండించడానికి నేను వెనుదీయను.

నేను కొంతవరకు వివరంగా ఇచ్చిన (ఈ ప్రయత్నం ఇంకా చాల దశేవిషయం నాకు తెలిసినప్పటికి) విద్యకు సంబంధించిన అంకెలను, లెక్కలను సూక్ష్మంగా పరిశీలించి చూస్తే తప్పని సరిగా ఈ క్రింది తీర్మానాలకు వస్తాము:

(౧) విద్యకోసం ఎక్కువగా వ్యయంచేసే సొమ్మును పొదుపుగా వాడటంలేదు; ఖర్చు చేసేదానికి తగిన ఉత్తమ ప్రతిఫలం కలగటంలేదు; పైవారికి జీతాలు హెచ్చు; పనిచేసే క్రిందివారికి జీతాలు తక్కువ.

(౨) నైజాము ప్రభుత్వంవారి ప్రస్తుత విద్యావిధానము ఏ కొద్దిమందికో మాత్రమే కాని జనసామాన్యం అందరికీ విద్యాలాభం విరివిగా అందజేయాలని అవలంబించినట్లు తోచదు.

(3) పరస్పరమూ మహావిభిన్నాభిప్రాయాలు కల సర్ తేజ్ బహదూర్ సప్రూ, డాక్టరు రవీంద్రనాథ టాగోరువంటి వారెంత పొగడుతున్నా ఉర్దుభాషను విద్యాబోధక భాషగా నియమించడంవల్ల జనబాహుళ్యానికి ప్రయోజనంలేకుండా పోయింది. హైదరాబాదులో అక్షరాస్యత నూటికంత బాగా తక్కువ తరబడిని ఉండడం దాని ఫలితమే.

మహోఘనత వహించిన లెఫ్టినెంట్ — జనరల్ అసిఫ్ జా ముజఫరుల్ ముల్క వల్ ముమలిక్ నిజాముల్ ముల్క నిజాముద్ దౌలా, నవాబ్ సర్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్, ఫతేజంగ్, బ్రిటిషు గవర్నమెంటు వారి విశ్వసనీయమిత్రులు, జి. సి. యస్. ఐ, జి. బి. యి., హైదరాబాదు నిజామువారు గొప్పదయిన "సుల్తాన్-ఉల్ – ఉలుమ్" బిరుదమును ధరించినవారు కూడాను. అటువంటి "సుల్తాన్ – ఉల్ –ఉలుమ్" బిరుదాంచితుల ప్రజలలో ఇరవైమందిలో ఒక్కరయినా చదువను, వ్రాయను లేకపోవడం నిజంగా గ్రహచారమువాలి.

తలపు

శ్రీపతి త్ర్యంబకరావు

తారనై వెలుగొందుతానా ?
నే నొక్క-
తారనై పే రందుతానా ?

భారతాంబికపాదబంధంబు లూడ్వగా
ఘోరాహవమునందు వీరుండ నై నిల్చి
తారనై......

పులకితంబగుభావపుంజంబులో తళ్కు-
నెలరాలగుములచే నిలుగట్టి నిలుకడగ
తారనై......

సత్యదూరంబైన జగతిచాయల బాసి
స్తుత్య స్వతంత్రైక శుభ్రాభ్రవీధిలో
తారనై......

తెలిమొయిళ్లపథాల తేలిపోయి రయాన
కలధౌతశిఖరాల కట్టకడ నిలువంగ
తారనై......

విలయకాలంబైన బాలివోని కళలతో
లలితద్యుతిక దిశా, వలుల వెల్గింపంగ
తారనై వెల్గొందుతానా
నేనొక్క-
తారనై పే రందుతానా?

—

ప్రాచీనాంధ్రులు: వారి వలసరాజ్య చిహ్నాలు*

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు

మన పూర్వులచారిత్ర వైభవం తలుచుకున్నప్పుడు ఆకాలమంతా స్వప్నంలాగుంటుంది. ప్రాచీనాంధ్రులు సముద్రాలు దాటి వలసరాజ్యాలు స్థాపించారు అంటే అందులకు ప్రబలమైన తార్కాణాలు నేటికి మనభాషలో, సారస్వతంలో నిలిచి ఉన్నాయి, చూడండి. ఒక ఉదాహరణం: సముద్రయానం చేసేవారికష్టాలు తెలియచేసే మాటఒకటి మనభాషలో నిలిచిపోయింది. "ఈ ఓడ ఈతవాయి దాటితే చూద్దాము." తవాయికి నేడు ఇట్లా ఇంకో అర్థం వచ్చింది కాని అసలు తవాయి సముద్రం అవతల, బర్మాలో ఉండే ఒక రేవు పట్నం. అక్కడకు సముద్రం దాటి వెళ్లడం, తరువాత తవాయి రేవు దాటివెళ్లడం పూర్వకాలంలో చాలా చిక్కులతోకూడిన ఓడ ప్రయాణం అయిఉండేది.

మన దేశం సముద్రతీరాన్ని చేరిఉండడం, కృష్ణా గోదావరిలాంటి మహానదులు ఉండడం ఆంధ్రులకు పూర్వము సాహసం, శక్తి, ఉత్సాహం కలిగించాయి. అదిగాకుండా ఆనాడు మహాసామ్రాజ్యాలు వైభవంతో విస్తరించి ఉండడంచేత ధనానికి, ధనికులకు లోటులేకుండాఉండేది. పూర్వం మనవాళ్లు తూర్పునఉన్న సముద్రాన్ని మహోదధి అని పిలిచేవారు. దానికి దక్షిణంగా ఉండే సముద్రాన్ని రత్నాకరం అనేవారు. ఈ రెండుపేర్లు అన్వర్థకమైన పేళ్లేసుమండీ. రత్నాకరంలో పగడాలు, ముత్యాలు దొరికేవి. రత్నాకరానికి అవతల సింహళద్వీపం ఉండేది. అక్కడ రత్నాలకు అప్పటికి ఇప్పటికి కొదువలేదు. భయంకరమైనది కాబట్టి తూర్పుసముద్రాన్ని మనవాళ్లు మహోదధి అన్నారు.

భరతఖండంలోఉన్న అన్ని ప్రాంతాలవారిలోను మొదటినుంచి చాలానాగరికులయినవారు ఆంధ్రజాతీయులు.

క్రీస్తునకు పూర్వం చాలా శతాబ్దాలనుండి ఆంధ్రులు నాగరికులై ధనవంతులై యుండడంచేతను, వారికి సాహసం ఉత్సాహం ఎక్కువగా ఉండడంచేతను సముద్రాన్ని అంటి వారిదేశం వ్యాపించి ఉండడంచేతను సముద్రయానానికి ప్రాచీనాంధ్రులే మొదట దారితీశారు. ఇది క్రీ.పూ. ౭, ౮, వందల సంవత్సరములనాటిమాట. ఇంకా ప్రాచీనమయితే అయియుండవచ్చును. అటు అరాబి

* ఆల్ ఇండియా రేడియో (మద్రాస్)వారి అనుమతిని.

యా దేశము మొదలుకొని తూర్పున చీనా దేశమువరకుఉండే సముద్రతీరాన్ని అంటి వుండే రాజ్యాలనీ సీమలనీ ఆంధ్రవ్యాపార ముఖ్యులు పెద్దపెద్ద ఓడలలో వెళ్లి, అక్కడ దొరికే వస్తుసామగ్రిని కొనితెస్తూ, ఇక్కడ దొరికే వస్తువులను అక్కడికి తీసుకొనిపోతూ వ్యాపారం సాగించేవారు. అయితే తూర్పు సముద్రతీరము ననుసరించిఉండే ద్వీపాలు, దేశాలు ఆంధ్రులను, వారితరువాత ఇతర భారతీయులను ఆకర్షించినట్లు పశ్చిమదేశములు ఆకర్షించలేదు.

వర్తకం చేసుకోవడానికి బయలుదేరిన సాహసికులతో ఆయాకొత్త ద్వీపదేశాంతర పట్టణములుచూచి, అక్కడ వీలుగా ఉన్నచో వలసపోయి ఉండామని ఆవేశం ఆంధ్రులకు మొదట కలిగింది. ఆంధ్రుల అధినివేశ రాజ్యస్థాపనము ఒక్కసారిగా, ఒక్కనాడు సాగలేదు. అది క్రమంగా, నెమ్మదిగా, కొన్ని శతాబ్దములపాటు సాగింది; కాని రాజులదృష్టి ఆకర్షించకుండామాత్రం సాగింది. వారిపోషణ అసలేలేదు. కాని ఐచ్ఛికంగా సాగింది.

బౌద్ధం వెల్లివిరిసి బ్రాహ్మణధర్మాన్ని ఈదేశమునుండి వెళ్లగొట్టిననాడు బ్రాహ్మణులు, తాపసులు సముద్రం దాటి వ్యాపారులు చూచి వచ్చిన దూరదేశాలకు వలస పోయారు. అందుచేతనే వలసరాజ్యాలలో బౌద్ధంకంటె ముందు బ్రాహ్మణమతమే వ్యాపించినట్లు కనబడుతుంది. ఈ దేశంలో బ్రాహ్మణధర్మం మళ్లీవిజృంభించి, బౌద్ధ మతాన్ని దేశంనుండి తరిమివేసిననాడు బౌద్ధ మతం ముందుగా బ్రాహ్మణమతం వలస పోయినదేశాలకే పోయి తలదాచుకొన్నది. ఆంధ్రదేశంనుండి పోయిన బ్రాహ్మణ, బౌద్ధ మతాలు జవ, బలిద్వీపాలలోను, సయాం, కాంబోడియా, అన్నాందేశాలలోను నేటికి కూడా కనిపిస్తున్నవి. అంతెందుకు, సయాంలో కనపడే బ్రాహ్మణ సంప్రదాయములు, అన్నాం లేక చంపా దేశాలలో కనపడే మహాయానబౌద్ధ సంప్రదాయాలు, జావా, సుమత్రా బలిద్వీపాలలో కనపడే బ్రాహ్మణ సంప్రదాయాలు, దేవాలయాలు, శిల్పము, సంగీతము, నృత్యం, నాట్యం మొదలయినవన్నీకూడా ప్రాచీనాంధ్రుల సాహసకృత్యాలని తలపునకు తెస్తున్నాయి. మనదేశంనుండి మననగరాలపేర్లు— అమరావతి, శ్రీవిజయపురం, సింహపురం, మహేంద్రగిరి—ఇత్యాదులు ఆయావలస రాజ్యాలకు పోయి వెలిశాయి. మనదేశంనుండి శిల్పము, చిత్రలేఖనం, సంగీతం, దేశభాషలు, సంస్కృతం, లిపి, ఆచార వ్యవహారాలు— ఒకటేమిటి, అన్నీ ఆదేశాలకు ద్వీపాలకు పాకిపోయినవి. ఆదేశాలు నేడు మనం చూడబోయినట్లయితే ప్రాచీనాంధ్ర వైభవం స్మరణకు వస్తుంది.

ప్రాచీనాంధ్రులు మహోదధిని దాటి, తవాయి దాటి, సువర్ణభూమిఅనే పెగు చేరి, కొన్ని శతాబ్దము లయినతరువాత అక్కడ ఒకరాజ్యంకూడా స్థాపించారు. ఆరాజ్యం స్థాపించిన రాజవంశమువారిని తలైంగులంటారు బర్మాదేశచరిత్రలో. తలైంగులంటే తెలుగుదేశమువారే! కృష్ణాగోదావరీ తీరవాసులే! ఎప్పుడు వలసపోయినారో మాత్రం తెలిపే ఆధారాలు లేవు గాని, బర్మాచరిత్ర తలైంగులు చాలా గొప్పవారని మాత్రం తెలుపుతుంది.

త్రైలింగులు రాజ్యంస్థాపించడానికిపూర్వం ఆంధ్రులు తవాయి దేశం దాటి, మలయద్వీప కల్పం దాటి, సుమత్ర, జవ, బలిద్వీపములు దాటి, అచ్చటచ్చట వర్తక స్థానములు ఏర్పాటుచేసుకొని, సముద్రతీరాన్ని అంటుకునేఉన్న సయాం, కాంబోడియా, అన్నాంమొదలైన దేశాలలో వలసలు స్థాపించుకోగలిగారు. ఇందులో విశేషం ఏమిటంటే, ఈ ద్వీపాంతర దేశాలలో వలసరాజ్యాలు స్థాపించింది మొట్టమొదట ప్రాచీనాంధ్రులనిమాత్రం స్పష్టమవుతున్నది.

ప్రాచీనాంధ్రులు ఆయాద్వీపాంతర దేశములలోఉన్న అనాగరక ప్రజలకు తమ విజ్ఞానం, నాగరికత, మతము మొదలయినవి అలవరిచి, అక్కడ దొరికే మంచివస్తువులు, భోగ్యవస్తువులను మనదేశానికి తీసుకువచ్చారు. ఇతరరాజ్యాలకు వ్యాపారార్థమై తీసుకొనిపోయి, లాభాలు గడించి దేశానికి అఖండమైన ధనకనకవస్తువాహన సంపత్తిని చేకూర్చారు. వలసరాజ్యాలు ఇంచుమించుగా ఆంధ్రభూఖండములను చేశారు. ఆంధ్రులు అధినివేశ భూఖండాల నుండి బంగారము, సుగంధ ద్రవ్యములు, ఏనుగులు, దంతము, రత్నాలు, పవడములు, ముత్యాలు, గంధసారము, కర్పూరము, చీనిచీనాంబరములు— ఇంకేవేవో అమూల్యము లయినవాటిని తెస్తూవుండేవారు. ఈ అన్నింటికేమిగాని, ఆంధ్రులకు నేటివరకు మిక్కిలి ప్రీతికరములయిన రెండు వస్తువులు ఆ వలసరాజ్యాలనుండి తేబడినవి కలవు. ఆంధ్రులలో దనాసరిగోంగూర రుచి మెరుగనివా రుండరు. ఈదనాసరిగోంగూర ఎక్కడిదో తెలిస్తే మీా రాశ్చర్యపడతారు. పెగూ దేశమునకు తూర్పుగా, సయాంకు పశ్చిమంగా తెనాస్సరిం అనే ఒక దేశం ఉంది. మాపు చూస్తే కనబడుతుంది. ఈ తెనాస్సరిం నుండి వచ్చినగోంగూరయే దనాసరీగోంగూర అని తోస్తుంది. మనం అప్యాయంగా వాడుకునే అల్లం, శొంఠి మలయద్వీపకల్పము దాటినతరువాత కనిపించే సముద్రాంతరద్వీపములనుండి కొనిరాబడినవే. చూడండి. ఈ లాగే జాళువ, బంగారు, కుందనము, హేమం—ఇత్యార్థ స్వల్పభేదములుగల బంగారంకూడా ఈవలస రాజ్యాలనుండి కొనిరాబడినదా అని తోస్తూ ఉంటుంది. ఈ వలసదేశాలతో సంబంధం పూర్తిగా వదలిపోకపోయినా ఆంధ్రులు పదునాలుగు, పదునైదు, పదునారు శతాబ్దాల వరకు సముద్రయానంచేస్తూ, సముద్రాంతర ద్వీపదేశాలతో వర్తకంచేస్తూ అక్కడనుండి సరకులు తెస్తూఉండేవారని శ్రీనాథుని హరవిలాసంలోని ఉపోద్ఘాత పద్యాలుచాటుతూనే ఉన్నాయి.

నేడు జవ, బలి ద్వీపాలకు పోయి, మనం చూచివచ్చినట్లయితే ప్రాచీనాంధ్రులప్రతిభ అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. మనదేశం నుంచి ఆవలసరాజ్యాలలోకి క్రీ. పూ. రెండు మూడు వందల సంవత్సరములకు పూర్వము ఆంధ్రులు తమనాగరికతను, విజ్ఞానాన్ని తీసుకొనిపోయి, అక్కడ పాదుకొల్పినట్లు కనబడుతుంది. మనపురాణాలు అందులో ముఖ్యంగా ఆంధ్రులకు ప్రీతికరములయిన రామాయణ, మహాభారతాదులు జవ, బలి ద్వీపాలలో జనులను ఆకర్షించి నేటిదాకా నిలిచిపోయినాయి. మనప్రాచీన వేంగీలిపి ఆ దేశంలోకి ప్రాకింది. మన ప్రాచీన పౌరా

నికి బ్రాహ్మణమతం ఆ దేశంలోకి వ్యాపించింది. మన ప్రాచీనరాజుల పేర్లవంటి పేర్లు ఆ రాజ్యాలలో కనిపిస్తాయి. అంతే కాదు, మన ప్రాచీనాంధ్రుల సంగీతాది లలితకళలన్నీ మనం అయితే మరచిపోయినవి ఆ దేశంలో నేటివరకు ప్రాచీనరూపాలతోనే వైభవంగా వెలుగుతున్నాయి. మన ప్రాచీన సంగీతంలో ఉపయోగించిన వాయిద్యాలు కొన్ని వాళ్ల దేశంలో కనబడతాయి. మన యక్షగానాలవంటి వీథినాటకాలు అక్కడికి ప్రాకిపోయాయి. మన ప్రాచీనులనాట్యం—చూడండి—గొండ్లి, గంతు, చిందు, కురవంజి మొదలయిన నృత్యవిశేషములు కొద్దిపాటి భేదాలతో ఆద్వీపాలలో నిలచివున్నాయి. అక్కడ 'వయాంగ్' అంటారు తోలుబొమ్మలాటను. ఆతోలుబొమ్మలాటలో రామాయణ, భారతకథలు ఆడుతారు—మన దేశంలో పాటలు పాడినట్లు పాడి; అంతా మన దేశంలోలాగే. ఆ తోలుబొమ్మలాట మన దేశంనుంచి అక్కడికి పోయింది. అక్కడ నూత్నశోభ గడించింది. మన తోలుబొమ్మలాటకీ, వాళ్ల తోలుబొమ్మలాటకీ చాలా సంబంధం వున్నది. ఇక్కడ పాడేరాగాలకీ అక్కడి రాగాలకీ ఏమయినా సంబంధమున్నదేమో పరిశోధన చేయాలసివుంది.

జవద్వీపమునకు మన పూర్వులు సువర్ణద్వీపం అనేవారు. సువర్ణ ద్వీపములోను, దానిని చేరియున్న బలిద్వీపములోను ప్రాచీనాంధ్రుల వలసరాజ్యముల ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నవి. ఈ ద్వీపాలు దాటిపోతే కనిపించేది సయాందేశము. దీనిని మనవారు శ్యామ అని అనేవారు. ఈ శ్యామదేశానికి తొలుత వచ్చిన ఆంధ్రులు మంజీరనదియొడ్డుననున్న ప్రాంతమున నుండిన నాగులు. మంజీర దీవితాలూకాలో కృష్ణానదికి సమీపంగా పూర్వం ప్రవహించిన ఒకచిన్న ఉప్పుటేరుపాయ. దానివడ్డున వుండిన పట్నాన్ని కూడా మంజీర అనేవారు. మంజీరనది నేడు మురికికాలవ అయిపోయింది. మంజీరపట్టణము నేడు మాజేరు అయింది నేటివరకు మాజేటివారు సుప్రసిద్ధ వైశ్యకుటుంబము వారేకదా!

శ్యామదేశములో నిలిచియున్న బ్రాహ్మణమతము మనదేశమునుండి గొనిపోబడినదే. దీనికి ఉత్తరంగా కాంబోజదేశ మున్నది. ఈ దేశానికి ఆంధ్రభూమికి ఉండిన సంబంధం కాంబోజరాజు చరిత్రములో ఉన్నట్లు కనిపిస్తుంది. కాంబోజానికి నేటిపేరు కాంబోడియా. అక్కడవున్న ఆంకోరువాటు దేవాలయం చూస్తే మన అమరావతీశిల్పము ఇక్కడ మళ్లీ వెలసి, సౌరభం వెదజల్లిందా అని అనిపిస్తుంది. అమరావతీశిల్పానికి, ఆంకోరువాటు దేవాలయశిల్పానికి ఎంతో సామ్యం ఉంది. ఆంధ్రులశిల్పం సముద్రాలు దాటి వచ్చి నూతనశోభ గడించింది యీ ఆంకోరువాటు దేవాలయములందు. ఇది ఒక్కటే చాలు ఆంధ్రదేశానికి, కాంబోజదేశానికి కొన్ని శతాబ్దాలు ఎడతెగని సంబంధం ఉండిందని ఋజువుచేయడానికి. కాంబోజదేశానికి ఉత్తరాన్ని అన్నాం, ఇండో-చైనారాజ్యా లున్నాయి. వీటికి పూర్వపు పేరు చంపాదేశం. ఇచ్చట మొదట వలస స్థాపించింది ఆంధ్రదేశీయులు. క్రీ.శ. ౨౮౮లో చండవర్మ అనే రాజు ఆంధ్రదేశాన్నుంచి వచ్చిన ఒక వర్తకునివలన మాతృభూమిగురించి అంతా విని, ఆంధ్రదేశం

ఏలుతూవుండే రాజుకు రాయబారం పంపించాడు. ఈ రాయబారం వెళ్లిరావడానికి నాలుగేండ్లు పట్టింది. ఆరాయబారం వచ్చేటప్పటికి ఆంధ్రదేశంలో ఇక్ష్వాకువంశీయుడైన వాసిష్ఠీపుత్ర బాహుబల శాంతమూల మహారాజు రాజ్యంచేస్తూ ఉండేవాడు. అతని రాజధాని ఇపుడు నాగార్జునికొండదరిని శిథిలావస్థయందున్న విజయపురి అనే మహాపట్నం. అక్కడ దొరికిన శాసనం వొకటి బౌద్ధఉపాసిక బోధిశ్రీ అనే ఆమె వ్రాయించినది చూస్తే చీనాదేశంమొదలుకొని కాశ్మీరంవరకుఉండే నానాదేశాలవారు వర్తకులు, మతవ్యాపకులు, తీర్థవాసులు ఆంధ్రదేశానికి తరచుగా వస్తూపోతూ ఉండేవారని స్పష్టమవుతుంది. అంతే కాదు, చంపాదేశంలో కనబడే ప్రాచీనలిపి, ఆంధ్రదేశంలో ఆకాలంలో, అనగా క్రీ. శ. ౧. ౨. శతాబ్దాల నాటి ప్రాచీన బ్రాహ్మీలిపి.

చంపాదేశానికుత్తరంగాఉండే రాజ్యానికి పూర్వపుపేరు యువనదేశం. ఈదేశంలో కూడా ప్రాచీనాంధ్రులు వలసస్థాపించారు, మహాయానబౌద్ధం వ్యాపింపచేశారు. చంపా, యువనదేశాలలో నేటివరకు నిలిచియున్న మహాయాన బౌద్ధానికి ప్రాచీన ఆంధ్రదేశంలో వెలిగిన మహాయాన బౌద్ధానికి ఎంతో సన్నిహితమైన సంబంధం కనిపిస్తుంది.

ప్రాచీనాంధ్రుల వలసరాజ్యస్థాపన చరిత్ర వ్రాయడానికి చాలా ఆటంకాలున్నాయి. అసలు గ్రంథం అంతా పరాసుభాషలో ఉన్నది. కాబట్టి ముందు పరాసుభాష రావాలి. ఆగ్రంథాలు చదవాలి. తరువాత వలందుభాషాజ్ఞానం సంపాదించాలి. అందులో వ్రాయబడిన జవ, బలి, సుమత్రా మొదలయిన ద్వీపాల ప్రాచీన వైభవమంతా తెలుసుకోవాలి. బర్మా మొదలు అన్నాం వరకువున్న సముద్రద్వీపాలను దేశాంతర పట్టణములను అక్కడి వాటి ప్రాచీనశోభను చూచిరావాలి. అప్పుడు గ్రంథాలు మన భాషలో వ్రాయాలి. ఆభాగ్యం ఎన్నడయినా కలిగితే బాగుండును.

ఇంకోవిషయం చెప్ప మరచిపోయాను. ఫిలిప్పైను దీవులలో మాట్లాడే భాషలో తెలుగుమాటలు - ఇంచుమించుగా నేడు తెలుగు దేశంలోఉన్న వ్యవహారంలోనే - ౧౯౦ వరకు ఉన్నాయట. ఫిలిప్పైను భాషానిఘంటువు దొరికితే బాగుండును పరిశీలించడానికి.

ప్రాచీనాంధ్రులు తాము ఇతరజాతుల దగ్గరనుండి నేర్చుకోదగిన విజ్ఞానం లేకపోవడంచేత, తమవిజ్ఞానాన్ని నాగరికతను వ్యాపింపచేశారు వారు. తమభూమివంటి కమ్మని భూమి, తమవిజ్ఞానంవంటి గొప్పవిజ్ఞానం, తమమతంవంటి మతం తమనాగరికతవంటి నాగరికత ఆకాలంలో లేవని నిరూపించారు. వాటి చిహ్నాలు నేటికి తూర్పు సముద్రపు దేశాంతరములందు, దీవులందు నిలిచి ఉన్నాయి. వారు సృష్టించిన మహాసామ్రాజ్యమును మనం తలుచుకొని ఆనందించగలము కాని, ఆవైభవం అంతా కాలగర్భంలో లీనమయిపోయింది. కాలమంతా తారుమారయిపోయింది. ఆంధ్రజాతిని ఆనాడావేశించిన ఉత్సాహ, సాహస, శక్తులు నేడు కానరావు. వాటి నన్నిటిని కదలించివేసిన కాలప్రభావాన్ని ఎవరు గుర్తించగలరు? దాని కొక నమస్కారము. ప్రాచీనాంధ్రుల సత్కీర్తి కొక నమస్కారము.

విప్లవగానం

శ్రీ శింగంపల్లి రామమూర్తి

[హిందీభాషలో యువకవులకు చాలా ప్రాధాన్య మివ్వబడుతోంది. క్రిందిగీతం ఒకప్రసిద్ధ యువకవి నిప్పులు కురిసే లేఖినినుంచి వెలువడినది.]

మండేపాటర్ పాడవోయి కవి!
  అల్లకల్లోల మౌనట్టుల భువి.

కల్లోలం బౌక టావైపునుంచి
కల్లోలం బౌక టీవైపునుంచి
ముంచి వేయుతర్, లోకం బెల్లర్
'త్రాహి, త్రాహి' యంచుర్ ఘోషిల్లర్ -
నాశం, నాశం, సర్వనాశనం
  నాట్యం చేయర్ మహాభీషణం
కురియించు మగ్ని, విరియర్ కొండల్
  భస్మంబై చన మబ్బులదండల్
పాపపుణ్యసద్భావపుంజాల
  ధూళి ఎగయుతర్ మింటికిం జాల.
నభోవక్ష మది 'ఫట్ట'ని ప్రిదులర్
  చుక్కల్ పేలాలట్టుల్ చెదురర్
పాడవోయి యిల్లాటిపాట కవి!
  అల్లకల్లోల మౌనట్టుల భువి.

మాతృదుగ్ధముల్ నాశకరంబుగ
  మారిపోవుతర్ హాలాహలంబుగ
కంటివెంట నీ ళ్లారిపోవుతర్
  రక్తబిందువుల్ కారుగావుతర్

గడగడ షండల్ వడకుచు మ్రందర్
  గతానుగతికుల్ హతంబునొందర్
అంధమూఢవిశ్వాసా లనియెడి
  అచలపర్వతాల్ విచలితమౌనర్.

అవే భయదవిప్లవగర్జనధ్వను
  లత్యుత్సాహాసర్ జృంభించును
సూచించెడి నయ్యదె ఆకాశం
  తర్జనభర్జనలతోడ నాశం—
    పాడవోయి యిల్లాటి...
నియమా లుపనియమాల బంధనాల్
  ముక్తలై, అగుర్ విప్లవేంధనాల్
విశ్వంభరపోషకవీణాతం
  శ్రీధ్వనినిశ్శబ్దం బౌగాతర్.
నాశం! నాశం అంతానాశం
రానీ ప్రళయంకరి కావేశం —
    పాడవోయి...
ఎండిపోయెదర్ నాగళ మియ్యెడ
  నాశగీతంబు రుద్ధంబయ్యెడి
నిప్పంటుకొనర్ నిమేషంబులో
  క్షుబ్ధపంగరం నామనంబులో

["చయనిక" నుంచి.]

సినీమానటుడుగా తయారవాలంటే-

శ్రీ యస్ జగన్నాథ్

ఆశయాలు అనేకవిధాలు. డెర్బీ పందెములో డబ్బు రావాలనీ, ఏదైనా మహారాజాకి ప్రైవేటు సెక్రటరీ అయినా అవాలనీ, (ఐ. సి. ఎస్. అయి కలెక్టరు కాకపోతే) ఇదివరకు యువకులు ఆశపడుతూండేవారు; ఈరోజుల్లో మంచి 'క్రికెటరి' అవాలనీ, లేకపోతే గొప్పసినీమాస్టారు అవాలనీ— (డైరెక్టరవాలనే ఉద్దేశ్యమే తప్పిజారి లేకపోతే.—) చాలామంది కాంక్ష.

మిగిలిన కోర్కెలు ఎంతవరకు సఫలమయినా కాకపోయినా సినీమానటుడవాలనే కోర్కెమాత్రం కొంచెం సులభంగా తీరేదని అనుకోవచ్చు. ఇదివరలో స్టేజిమీద వేషాలు వేసినవారికీ, వేయనివారికీ, చాలామందికి ఈ సంకల్పము ఉండిగనుక సినీమా నటుడికి కావలసిన గుణగణము లెటువంటివో తెలిసికోవటం ఉత్తమము, పరిశ్రమకీ, వ్యక్తులకీ కూడాను.

సినీమాకీ, నాటకానికీ చాలా తేడా వుందనీ అసలు ఒకదాంట్లో రాణించేవ్యక్తులు రెండోదాంట్లో ఎందుకు పనికిరారనీ అనేకాభిప్రాయాలున్నాయి. కాని నిష్పక్షపాతంగా స్టేజిమీద వేషము వేసే నటునికీ, సినీమాలో పాత్రధారికీ ఏయే లక్షణాలు ఎంతెంతవరకూ అవసరమో తరిచి చూస్తే ఈ రెండు శాఖలకీ ఏ సంబంధము ఏ విభేదమూ ఉందో సులభముగా తేలిపోతుంది.

ఈవివరణకి పూనుకునేముందు ప్రజలలో చాలామందికి ఉన్న తలంపులలో కొన్ని కేవలమూ పునాది లేనివని నిరూపించవలసివస్తుంది.

వీటిల్లో మొదటిది - సంగీతం రాకపోతే సినీమాలో 'ఛాన్సు' లేదనీ, రెండవది 'స్క్రీన్ ఫేస్' (సినీమా మొఖము) అనే తెగలో పడనివ్యక్తి ఏకుపుటాలు వేసినా ఎందుకూ పనికిరాదనీ.

ప్రస్తుతము దక్షిణ ఇండియాలో ప్రతిఫిల్ములోనూ ప్రతిపాత్రచేతా కొద్దో గొప్పో సంగీతం పాడించటం అలవాటవటమే ఈ మొదటిఉద్దేశము ప్రజల్లో ఏర్పడటానికి కారణము. కాని సాంఘిక చిత్రాలు బయలుదేరినకొద్దీ - ప్రతిపాత్రా పాటలు పద్యాలు పాడవలసిఉంటుందన్న నియమమేకాక, ప్రధానపాత్ర అంటే నాయికా నాయకులైనాసరే సంగీతముసంగతి తలపెట్టకుండా పాత్రలను పోషించవచ్చునని తేలుతోంది. ప్రస్తుతఫిల్ములో సంగీతముయొక్క ఔచిత్యము అనౌచిత్యము విషయము చర్చించకుండా సమర్థులగు నటులతో, చక్కని కథఅయితే, కొద్దిపాటి పాటలతో (ప్రస్తుతపు జనబాహుళ్యము బొత్తిగా పాటలు లేకుండా వుండటానికి ఇంకా అలవాటవలేదు కనుక) చాలా ఉత్కృష్టమయిన ఫిల్ము తయారుచేయవచ్చని చెప్పవచ్చును.

రెండవవిషయమై: స్క్రీన్ ఫేసు అనేది ఒకటి క్రొత్తగా నాటి కొకటిచొప్పన సృష్టింపబడదు. ఏ వ్యక్తినయినాసరే ఫిలిమ్సులో ఉపయోగించవచ్చు. అయితే ఆవ్యక్తి అతనికి ఇవ్వదలచుకొన్న పాత్రకి సరిపోతాడా లేదా అనేవిషయము ఆలోచించడమే ముఖ్యము. ఈ కాస్టింగ్ (పాత్రలకు తగిన నటులని ఏరటము)లో ఉన్న తేడాలు టైప్స్-కారెక్టర్స్ తెలుసుకొని ఆచరించడము; అంటే ఏదో ఒకసీనులోనే రావలసిన చేతపనివాడో, కమ్మరో కావలసివస్తే ఆయావృత్తిపనివాళ్లనే ఆసీన్లుకి వాడుకోవడం 'టైప్ కాస్టింగ్' అంటారు. అవిధంగా గాక సాధారణవృత్తి, జాతి ఏమయినా, వాటికి సంబంధంలేని పాత్రని సమర్థతతో నిర్వహించే వ్యక్తికి ఆవేషము వేయించటం 'కారెక్టరు కాస్టింగ్' అంటారు. ఈ పద్ధతికి చేరేవాళ్లు అసమానులయిన నటులయి ఉండాలని వేరే చెప్పనక్కరలేదు.

ఇటీ, జనబాహుళ్యంలోనూ, నటులవాలనుకొన్న వాళ్లల్లో కొంతమందిలోనూ కూడా ఉన్న ఉద్దేశ్యాలు. ఈతప్పు ఊహలలో పడి అసలు నటు డవవలసివస్తే ఉండవలసిన ముఖ్య గుణాలు ఏవో తెలుసుకోవటం లేదు చాలామంది.

స్టేజిమీదయినా సినీమాలోనయినా పాత్ర ధరించ వలసిన వ్యక్తికి భావప్రకటన అత్యవసరము; అంటే ఈ భావప్రకటన అన్నమాటలో రెండు నిర్ణీతమయిన భాగా లున్నాయి. మొదటిది-పాత్రయొక్క భావము గ్రహించి, ఆక్షణలో ఆపాత్రయొక్క మనోభావాన్ని నటుడు అనుభవించటం. ఇది నటులకేకాక, నాటకంకాని మనో రసప్లవమయిన నవలగాని చదివేవారికి చాలా మందికి ఉండవచ్చు — అంటే ఆపాత్రస్థానే చదువరి ఊహించుకుని ఆపాత్రయొక్క కష్టసుఖాలు తనకష్ట సుఖాలుగా అనుభవించటం. ఇది నటుల్లో స్టేజివారి కయినా సినీమావారి కయినాసరే భేదములేకుండాఉండ వలసిననిబంధన. అయితే ఈఅనుభవించగలిగే 'సెన్సిటివ్ -నెస్' ఒకటే నటుణ్ణి చేయదు. నటు డవడానికి ముఖ్యమ ఎన నిబంధన ఈభావాన్ని ప్రకటించగలిగే శక్తి. ఈప్రకటనశక్తిలోనే సినీమాకి నాటకానికి తేడా కనిపిస్తుంది. ఇంతవరకూ తెలుసుకొన్నదాన్ని బట్టి, నటుడు పాత్రయొక్క సుఖదుఃఖాలని తనవివలె ధరిం చటం. అంతేకాక కవి ఏవో కొన్ని గుణగణసంప్రదా యాలు ఇచ్చి సృష్టించినపాత్ర ఆసుఖదుఃఖాలను అను భవిస్తూ ఏపద్ధతిగా సంచరిస్తాడో అలా సంచరించటం - అవసరమని తేలాయి. ఈ భావాలని ప్రకటించటంలో_ స్టేజి ఎక్కే_నటుడు కొన్ని సులువులు నిపుణత నేర్చుకో వాలి. - చూపరులకి పృష్ఠభాగం ప్రదర్శించకూడదని, సంభాషణలలో సహజముగా ప్రవర్తించేకంటె స్వరము హెచ్చించాలనీ, ఎక్కువగా ఆంగికాభినయము ప్రద ర్శించాలనీ ఇలాగే ఎన్నో. సినీమానటుడికికూడా అదే మాదిరిగా నిబంధన లున్నాయి ఉచ్చారణలో, ఆంగిక భావప్రకటనలో ముఖభావాల్లో, ఏసమయంలో ఏది అవసరమో డైరక్టరు నిర్ణయించి చెప్పినట్లు చేయాలని. రెంటికీకూడా నటుడు కొంతవరకూ పాత్రలో లీన మవటం, కొంతవరకూ ప్రేక్షకులను తను పాల్గొం టూన్న పరిశ్రమనీ మనసులో ఉంచుకొని అందుకు తగినట్లు తన ముఖకవళికలనూ, ఆంగికాభినాయాన్ని, ఉచ్చారణనీ, అంతనీ మారుస్తూండాలి. ఇది చాలా కష్టమైనపని, ఎటువంటి నటునకైనాసరే. కాని అలవాటుచేసుకుంటే కష్టంగా నున్నది సులభ మవుతుంది. ఈ అలవాటు చేసుకోవడమే రిహార్సలు.

నాటకంలో రిహార్సలు రసపోషణకి, భావోద్రేకా లని రంగములు దాటినకొద్దీ వృద్ధిపొందించుకొని చక్కటి ఉచ్చస్థితికి తీసుకురావటానికి తోడ్పడుతుంది. సినీమానటునికి సరిగా నడపబడిన రిహార్సలుయొక్క ఉపయోగము అపరిమితము. సినీమాకు కావలసినట్లు నట్లు ఏరంగములోని అంశమైనా ఎప్పుడు కావలసివస్తే అప్పుడు నటించగలిగేలాగా చేయుటమే దీని ముఖ్య ఉద్దేశ్యము.

కాబట్టి సినీమాలో నటులకికూడా పాత్రలయందు అత్యంత సానుభూతి కావాలి (ఏనటుడు కూడా తనకు సానుభూతిలేని పాత్రని ధరించి జయప్రదముగా నిర్వ హించలేడు; అందుకే కాస్టింగ్ పాత్రధారణ నిర్ణయిం చటములో జాగ్రత్త కావాలి.) అంతేకాక మానసి కంగా ఈపాత్రయొక్క భావపరంపరలు కథానుసర ణతో వృద్ధిపొందించుకుంటూ, ఏ అంశాన్ని అయినా విడిగా అవసర మయినప్పుడు ప్రదర్శింప గలిగేశక్తి కావాలి.

సినీమాలో ముఖ్యముగా కావాలిసినవాటిల్లో రెండవది: సహజంగా ఉండేలాగున అభినయించటం — నాటకంలో లాగున గొంతెత్తి అరవడం, చిన్నచిన్న అభిప్రాయాలుకూడా చేతులతోటీ తలతోటీ కలిపుచ్చ టం లేకుండా ఈవిషయంలో కొంచెము కృషిచేయుటం, చాలామట్టుకు పరిశీలన అవసరము. సహజంగా ప్రతి రోజూ మనం చూస్తూన్న మనుష్యులు ఎలా ప్రవర్తిస్తు న్నారో, గమనించటం చాలా ఉపయోగము — ముఖ్యంగా సాంఘికచిత్రాల్లో.

ఇక తరువాతివిషయం — నటులకి డైరక్టరుకి ఉండవలసిన (**Understanding**)-డైరక్టరు ప్రతిపాత్ర ధారికీ ప్రతిరంగములోని అంశములు నటించి చూపించ

వలసి ఉంటుం దని చాలామంది అభిప్రాయము. దీని యొక్క ఫలిత మేమవుతుందో ఆలోచించుకుంటే ఈ అభిప్రాయానికి ఏమీ తావుండదు.

ప్రతిపాత్రకూడా దాన్ని ధరించేనటుడు అర్థం చేసుకుని ఆరసభావాలని, తనకు సహజముగా వచ్చే అభినయముతో ప్రదర్శించాలి అంటే ప్రేక్షకులు చూసేది, ఆయానటులకు ఆ పాత్రల విషయమై, ఉన్న భావన. ఈ భావన నటునియొక్క అభిరుచిమీద ఆదర్శము మీద, కృషిమీద ఆధారపడి వుంటుంది. పాత్ర ఒకటే అయినా, సంభావణ ఒకటే అయినా, నటులలో తేడా ఈ గుణములమీద తేలిపోతుంది. బళ్లారి రాఘవగారు హిరణ్యకశిపుడు వేశినదానికి - మరొకరు వేశినదానికి భేదము ఈ విషయములో నే వస్తుంది.

ఇక అటువంటప్పుడు - డైరక్టరు - గొప్ప నటుడే అయినప్పటికి అతను ప్రతీపాత్ర నటించి చూపించి నట్టయితే, నటులు అతన్ని అనుకరించడానికి ప్రయత్నిస్తారు. కాని డైరక్టరుకి సహజంగా వచ్చిన భావ ప్రకటన వాళ్లకి సహజము గాదు. అందుచే వాళ్లు వచ్చీరాని అనుకరణ (Imperfect imitators) చేసిన వాళ్లు అవుతారు. ఈ విధముగా తయారయిన చిత్రము కొంచెము హెచ్చుతగ్గుగా సర్కసులో కోతుల ప్రదర్శనంలాగా ఉండవచ్చు.

ఇక ఇది లేకపోతే నటులవిషయములో డైరక్టరు చేయవలసిన పనేమిటి అని ప్రశ్న.

సినీమాలో - నాటకంలాగా, కథ అంతా ఒక వరుసని జరుగదు. అంతేకాక, ప్రేక్షకులకి ఒకటే దూరము నుంచి జరగదు; అంటే కొన్ని పాత్రలూ దృశ్యాలు దగ్గరగా, ప్రేక్షకుడి ముక్కుచివర నున్నంత దగ్గరగాను మరికొన్ని మైళ్ల కొలది దూరంగాను జరిగినట్లు తీయబడతవి - ఇలా ఎందుకు తీస్తారో విచారించటం మరోసారికి వదిలేసి - ఇది సినీమాకి అవసరమని ఒప్పుకుని డైరెక్టరు చేసే దేమిటి అని విచారిద్దాము. ప్రతిరంగమూకూడా ఏదూరములో ప్రదర్శించాలో నిర్ణయించేవాడు డైరక్టరు. ప్రదర్శించేవాళ్లు నటులు. కనుక డైరక్టరు ఎలా నటించాలో చెప్పనవసరంలేదు. కాని ఎంతవరకు, ఏయే అంగాలు ఎంతెంత భాగము, నటుడు ప్రేక్షకులకు ప్రదర్శించగలడో చెప్పి దానికి తగినట్టు భావప్రకటన — నటుడికి సహజంగా వుండేలాగునవే, మార్చుకోమంటాడు. ఇది ఒకముఖ్యాంశము. చాలామందికి తెలిసినవిషయమే కూడాను. ఇంతకన్న ముఖ్యాంశము ఒకటి ఉంది. అది ప్రస్తుతము అందరూ తెలుసుకోలేదు.

నాటకంలో — నటుడికి ప్రేక్షకులు అద్దం లాంటివాళ్లు. వాళ్ల ఆనందాన్ని తను ఊతగా తీసికొని తనపాత్రను ఎక్కువ రసవంతంగా పోషిస్తాడు. కాని సినీమాలో ఎటుచూచినా లైట్లూ,యంత్రాలు,అనేకమైన అనుత్సాహకరములైన వస్తువులూను. ఈ సందర్భంలో నటుడికి, డైరక్టరు — కెమెరా దగ్గరగాఉన్న అవ్యక్తి ఒకడే — సకలప్రేక్షకులూ; అతని సంతోషమే నటుడికి ఉత్సాహము. మానసికంగా డైరక్టరు ఒక్కడే తన యావత్తుశ్రమకు భోక్త. అతనే వేలకొలది ప్రేక్షకులు. ఈవిషయాన్ని ప్రతినటుడు గ్రహించితే, తనకు కావలసిన ఉత్సాహానికి డైరక్టరుమీద ఆధారపడి ఉంటాడు. ఇంతేకాక నటుడు గొప్ప పేరెన్నికగన్నవాడయినా డైరక్టరుని నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. చేస్తే తనపాత్రేకాక చిత్రాన్నంతటినీ చంపేస్తున్నాడన్నమాట. ఇది కేవలమూ డైరక్టర్ల కర్రపెత్తనము చేయడానికి ఏర్పాటుచేసిన నియమముకాదు. దీనికి సూత్రము ఏమిటంటే నటుడు — సినీమాలో నటించేటప్పుడు కథలోని ఒక్కొక అంశము విడివిడిగా ప్రదర్శించుకున్నాడు. అంతేకాదు, కథానుక్రమంగా కాకుండా, కావలసినంత తలక్రిందులైన ఆర్డరులో. కాని డైరక్టరుకి ఒక్కడికే చిత్రములో వాటియొక్క స్థలము ప్రతిక్షణము లోను మనసులో ఉంటుంది. దానినిబట్టే ఆనటుడు ఎంతవరకు తనభావప్రకటన విస్తరించాలో కుదించాలో అతను చెబుతాడు. అంతేకాక, డైరక్టరు అందరు నటులని గమనిస్తుంటాడు. అంచేత ప్రాముఖ్యత చెడకుండా ఎవరు ఎంతెంతవరకూ నటిస్తే చాలో అతను నిర్ణయిస్తాడు. ఇది ప్రతినటుడూ అనుసరించకపోతే చిత్రము యొక్క రసము చెడిపోతుంది.

తరువాత, మనదేశంలోనూ, కొద్దిసంవత్సరాల క్రితంవరకు అన్నిదేశాల్లోనూ కూడా విస్తరించిఉన్న

అభిప్రాయము - ఫిలింలో నటించే వాళ్లందరూ అందంగా ఉండాలని. అందంగా ఉండటం కొంతవరకు తోడ్పడినప్పటికీ నిజంగా ఫిలిములో పెద్దపేరు తెచ్చుకోవాలంటే అందము ఒక్కటే ఎక్కువసహాయం చేయదు.

ఇంతేకాక 'అందము' అంటే చాలా విపరీతమయిన అభిప్రాయా లున్నాయి. అందము ముఖవైఖరినిబట్టే కాక, అంగసౌష్ఠవాన్ని కూడా అనుసరించి ఉంటుంది. చక్కని అజంతా రాతిచెక్కడములాంటి మనిషి అయినప్పటికీ మాటలలో నడకలో ప్రతిచిన్న కదలికలోనూ సౌకుమార్యం ఉన్న వేరొక మనిషికంటె ఏమాత్రమూ ఆకర్షణీయముగా ఉండడు. అంచేత అందముకంటె ఎక్కువ పనికివచ్చేది సౌకుమార్యము.

ఇవి రెండూ లేనప్పటికీ కూడా ఇదివరలో చెప్పిన నిపుణత భావప్రకటనలోనూ, రసానుభవములోనూ ఉన్నవ్యక్తి చాలా పేరుపొందుతాడు. మన మంచినటులలో అందము ఎంతమందికి ఉంది చెప్పండి- కాంతా ఆప్టే అందమయినదా - కాదు; అయితే ఏం - గొప్ప భావప్రకటన ఉంది రత్నప్రభ అందమయిందా- అయితేనేం ప్రతిపోకడలోనూ లాలిత్యము ఒలుకుతుంది. అలాగునే వేల్లెస్ బీరీ, విక్టర్ మేక్లగ్లన్, పాల్ ముని, అందమయినవాళ్లా కారు. మంచి గంభీరమయిన భావోద్రేకముగలవాళ్లు. అంచేత అందము తక్కువయితే ఫిలిములోకి పనికిరా రనుకోవటం పొరబాటు.

ఇక ఇవన్నీ--అంటే భావప్రకటన,రసానుభవము ముఖ్యముకాని, సంగీతము, కేవలమూ కను ముక్కుతీరూ — సౌకుమార్యము లేకుండా, ఎక్కువ ఉపయోగముకావనీ తెలుసుకొన్న తరవాత సినీమాలో ప్రవేశించే నటులుకూడా నేర్చుకోతగిన అంశములు ఒకటి రెండున్నాయి.

మొదటిది — తను ఎంత గొప్పనటుడని (అనుకుంటున్నా — లేక స్టేజిమీద పెద్దనటుడని పేరుగలిగి ఉన్నా) ఈ పరిశ్రమలో, డైరక్టరూ ప్రొడ్యూసరూ తనకు నిర్ణయించిన పాత్రను — ఒకటి, రెండురంగాల్లో మాత్రమే అగుపించేపాత్ర అయినాసరే, ధరించటానికి అభ్యంతరం పెట్టకపోవడం— లోగడ చెప్పినట్లు ఆపాత్రయందు తనకు సానుభూతి లేకపోతేతప్ప. సరిగా ఉత్సాహముతోటి కృషిచేసి పోషించినట్లైతే ఒక చిన్నపాత్రని తీసికొన్ననటుడైనా ముఖ్యపాత్రలను మించినపేరు తెచ్చుకోవచ్చునని ముఖ్యంగా ఈ పరిశ్రమలోకి రావాలని కుతూహలమున్న నటులందరూ తెలిసికోవాలి. దీనికి దృష్టాంతరాలు చాలా ఉన్నాయి, మనదేశపు ఫిల్ముల లోనూ, దేశపు ఫిల్ములలోనూ. పిలూయియా స్టోక్, వసంత దేశాయి మొదలయినవాళ్లు ఎంత పెద్ద పేరెన్నికగన్న నటులతో పనిచేస్తున్నాసరే తమపాత్రలని అత్యంత నిపుణతో పోషిస్తారు. పాత్రయొక్క గొప్పదనము అతను చెప్పవలసినమాటల సంఖ్యనిబట్టిగాని పాడేపాటల పొడుగును బట్టిగాని లేదు. ఆ పాత్రను ధరించే నటుడి చాకచక్యములోనూ నిపుణతలోనూ ఆపాత్రకి గౌరవ మేర్పడుతుంది.

ఇక రెండవది - తెలిసీతెలియని మాటలతో టెక్నికల్ గా డైరక్టరుతోటి తగాయిదాలు పెట్టుకోకపోవడం. తనకు 'క్లోసప్'లు ఇవ్వలేదని విచారించటం తగదు. తను నటించే రంగములో ఎన్నిపాట్లు తీసుకునేదీ డైరక్టరుయొక్క బాధ్యత; అంతేకాని అతనిపనిలో జోక్యము కలుగచేసుకొని, నిరాశపడటం నిష్ఫలము. 'క్లోసప్' ఇచ్చినంత మాత్రాన నటుడికి ప్రాముఖ్యత రాదని క్రొత్తగా సినీమాలో దిగదలచుకున్న నటులంతా తెలుసుకోవడం మంచిది.

అందుచేత నేను సినీమాలో నటిస్తే! అని ఉవ్విళ్లూరేసుందర తన ఇమోషనల్ కెపాసిటీని, రసానుభవ సమర్థతను, భావప్రకటనని పరీక్షించుకుని, (కావలిస్తే అద్దము ముందర వేసకొని, తనకు వచ్చిన నాటకాలలో తను ధరించాలనుకున్న పాత్రలమాటలు చదువుతూ తనశక్తిని పరీక్షించుకోవచ్చు.) మిగిలిన విషయాలు గూడా గమనించుకుని ఏ పాత్ర అయినా ధరించడానికి తయారుగా ఉంటే నటులకీ చిత్రాలకీ కూడా చాలా ప్రయోజనము కలుగుతుంది.

కన్నీరు

శ్రీ వేమూరి వేంకటరామనాథం

పాడులోకంపు టీర్ష్యాగ్ని పాలపడిన
మా బ్రదుకు దివ్వెకాఱుటమాసినిశయె ;
సుషమచంద్రిక మాబీదసొత్తుకాదు,
భానుదేవుడు మాసత్తువనె హరించు.

మలయసమీరుడే సతము మాపయి ప్రేముడిచేతనేమొ, ని
ప్పుల చెఱుగంగ ప్రాణముల పోసుక జీవసు బుచ్చు మాదు క
న్నుల ప్రవహించు బాష్పఝరి నూయెల లూగుచు తేలియాడుచున్
సొలియు నెడందలో గలదె సుంతయు శాంతికి తావు సోదరా.

కన్నుల నీర్వల్ శ్రమ సుఖభ్రమ నావిరిసైన, వెన్నెలన్
కన్న నిగారపుం శిశువు కన్నులు తెర్వక నేత్రబిందువుల్
సన్నగజార్వ, చూచుధృతి సన్నగిలన్ తమయంత తామె మా
కన్నులు మూతలౌ; నిక వికాసము కూర్చు నమాసరాత్రులే !

కన్నుల గారు బిందువులఁ గాంచి యొకండనె ముత్తియంబు లం
చన్నది సత్యమేని, అకటా, యవి యన్నియు మాకు వద్దు, సం
పన్నుల హేమభాండములపైననె ఇయ్యవి పేర్వనిండు, మా
కన్నుల దాల్పనిండు తెగ క్రాగెడు మాహృదయాల బింబముల్.

చిఱుతతనంపు మా శిశుల చేరి ముదంబున ముద్దు లీయున
త్తఱిని పురాతనార్జితనిధానము మాకడగండ్ల సొత్తునున్
విరచన చేయబోవు గిననేరని కన్నుల తెప్పలందునన్
చిఱుముగ నిల్చు దుర్భరవిశేష దరిద్రవిషాద రేఖలన్.

చిరంజీవ, సౌభాగ్యవతి

శ్రీ తూపురాణి వెంకట చూడమ్మ

శ్రీ వుక్రేవు సూర్యనారాయణరావు

చిరంజీవిని సౌభాగ్యవతి యను నీ బాలికపేరు తూపురాణి వెంకటచూడమ్మ. ఈమె వయస్సు ౧౨ వత్సరములు. ఈమె నివాసము రాజమహేంద్రవరమున కనతిదూరమందలి కోరుకొండ యను గ్రామము. ఈ బాలిక శ్రీమాన్ తెలికిచెర్ల కందాళై గోపాలాచార్యులుగారి కొమరిత. ఈబాలిక తనతండ్రిగారికడ కావ్యనాటకాలంకారములను సాలంకషముగా నభ్యసించి తన పూర్వజన్మ సుకృతపరిపాకమున ననన్య సామాన్య మగు సాహిత్యమును గడించినది. పలువురు భాష్యకర్తల యభిమతములను జక్కగ సమన్వయించి యసాధారణ ప్రతిభా



విశేషమున భగవద్గీతారహస్యములను మృదుమధుర ఫణితిని సహృదయ హృదయంగమంబుగా నుపన్యసించుటలో నీమె కీమెయే సాటి. ఇంతటి చిన్న వయస్సునందు పండితైకవేద్యంబులగు నుపనిషత్తులందు నకలంక మగు పరిశ్రమము సల్పి ఇహపర సాధనంబగు వేదాంతోపన్యాస మొసంగనేర్చి శ్రోతల కచ్చెరువు గొల్పి యెల్లర పొగడ్తల గనిన నీమెను గన్న తల్లిదండ్రులు ధన్యులు. ఈమె స్త్రీలోకమున కలంకారము. ఇంతటి యఖండపాండితీ మండితురాలగు బాలికను భారతి ప్రసాదించుట యాంధ్రులకు గర్వింపదగిన విషయము. ఈమెకు సర్వేశ్వరుడెల్లవేళల సకలాయురారోగ్యైశ్వర్యము లొసంగి రక్షించుగాత.

ఆరోగ్యాదర్శముల క్రమ వికాసము

శ్రీ దండా వెంకటసుబ్బారెడ్డి

"The History of Hygeine begins therefore with the Primeval History of Mankind. Our subject is a part of the history of Culture and a part of the history of the Human Spirit similar to and yet different from the History of Medicine itself............ The relations between Medicine and religion are for the most part of a hygeinic nature. Over the whole world, the historians of Hygeine must deligently and faithfully follow up the researches of the historian of Culture and the work of Archaeologists, with that same sense of Values which the modern Hygeinist cannot be without."

Karl Sudhoff.

౧

ఆదిమానవు లందరకును స్వాభావికమై యుండిన అనుభవములు, అలవాటులు క్రమముగా పెరిగి గాథలుగను, అద్భుతకథలుగను, మంత్రతంత్రములుగను, గాఢవిశ్వాసములుగను, మతములుగను ఏర్పడెను. ఆకాలమున వ్రాయుటకు "లిపి" లేకుండెను. తరతరముల ప్రజావాక్కు (Folk-lore) శ్రుతిమూలమున విజ్ఞానము పెరుగుచుండెను. మొదట నిర్హేతుకముగ నున్నను ఆదికాలక్రమమున కొంతమట్టుకు సహేతుకము కాజొచ్చెను. అట్టి "ప్రజాసామాన్యవాక్కుల" యాధారముపై అనేకవిశ్వాసములు, సిద్ధాంతములు ప్రబలుచుండెను. ఈ నమ్మకములనే ఆరోగ్యశాస్త్రాంకురము లనవచ్చును. అనాదినుండియు ఏదేశమునగాని, ఏకాలమునగాని మానవసంఘసంస్థ లన్నిటిలోను భిన్నపరిస్థితు లుండినను జీవేచ్ఛ (Instinct of Survival) భూత వర్తమాన మానవు లందరికిని సర్వసామాన్య సహజలక్షణము. నేటికిని నవనాగరికప్రపంచమును భూకంపమువలె నూగించుశక్తియు నిదియే. ఈ జీవేచ్ఛ బహుముఖముల గలది; అనగా పలువిధములగు భావములందును కర్మలందును అది ప్రకటమగుచుండును. కాని వాని యన్నిటియందు ముఖ్యముగా నాలుగింటిని చేర్కొనవచ్చును:

(౧) ఆహారతృష్ణ
(౨) మైథునేచ్ఛ, వివాహేచ్ఛ, సంతానేచ్ఛ
(౩) జనసంఖ్యాభివృద్ధి
(౪) సమాజసంప్రదాయములు

ఆదిమానవసంఘములోను, ఆధునిక నాగరికుల లోను స్వాభావికముగనుండు ఈనాలుగు మనోవృత్తుల వలన ఆరోగ్యశాస్త్రాంకురములు ఏర్పడెనని పండితుల అభిప్రాయము.

ఆదిసంఘములలో రోగకారణములుగ పరిగణింపబడిన నమ్మకములను రివర్సుపండితుడు మూడు శీర్షికల క్రింద విభజించెను: (౧) ఆగ్రహపరవశుడైన, మాంత్రికుడు జీవించిగాని మరణించిన తర్వాతగాని విరోధులకు వ్యాధులు కలుగజేయుట; (౨) జంతువులు, అమానుషిక, భూతపిశాచములు కోపిష్ఠి దేవతలు అనాయచే, ఆగ్రహముచే ప్రజలకు పీడలు కలుగజేయుట; (౩) ప్రకృతిమార్పులవలన రోగములు కలుగుట.

ఈనాటికిని మనదేశమున నిట్టినమ్మకములు మూఢప్రజలలో గాఢముగ నాటుకొనియున్నవికదా! ఇట్టి రోగకారణములందు నమ్మకముండు సమాజములలో మంత్రములు, బలులు, శక్తిపూజలు, దేవతారాధనలు, గ్రహపూజలుతప్ప రోగనివారణమునకు మరియేమి ఉపాయము లుండును? వనచరుడైన మనుజుడు జంతువుల జీవితవిధానమును గమనించి కొన్ని ఆరోగ్య సూత్రములను సులభచికిత్సలను నేర్చుకొనెను. విశ్రాంతి పొందుట, ప్రసవదశయందు ఉపయోగించు పద్ధతులు, సూతికాచికిత్సలు, శిశురక్షణమును మనుజులు చతుష్పాద

ప్రాణులనుండి నేర్చుకొనిరని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. అంతేగాక గాయములకు చికిత్స, విరేచనములకు మాలికలు తినుట, విరిగిన కాళ్లుచేతులకు విశ్రాంతినిచ్చుట, శిరోవేదన (Venesection), కండ్లకలకకు మందు మొదలగునవి యిట్లే గ్రహింపబడినవట. ఇందువలననే ఈజిప్టులోను, హిందూదేశములోను, గ్రీసులోను సర్పము వైద్యదేవతగా నెంచబడి, దాని ప్రతిమ పూజాగౌరవములకు పాత్రమయ్యెను. అనేక ఓషధులు మానవునకు తెలిసెను. ఋగ్వేదములో అనేకవందల ఓషధులు పేర్కొనబడినవి. ఖనిజములు, రత్నములు, ముత్యములు, గవ్వలు, లోహములు తాయెతులుగను, శ్రవణాభరణములుగను, అందెలుగను, కంకణములుగను, ఉపయోగింపబడుచుండెను. ఆకాలమున "మందులమనిషి" చేయు చికిత్సలు యివి:— దయ్యమును కఱ్ఱలతో, తప్పెటలతో భయపెట్టి పారదోలుట; విషమును నాలుకతో చప్పరించి లాగివేయుట; మాలికల నిచ్చుట; రోగనిరోధకశక్తిగల తాయెతులను, యంత్రములను నొసగుట.

మానవాతీతుడైన దేవు డున్నాడనియు, అతని అనుగ్రహసంపాదనవలన వ్యాధి రాకుండ నుండగలదనియు, వచ్చినను సులభముగా నివారణ మగుననియు గాఢవిశ్వాసము ప్రాచీనులలో ప్రబలియుండెను. రోగులు మంత్రములతో అర్చకుల సహాయమున దేవతలను ఆరాధించి, దేవాలయములలో నిద్రపోయి, స్వప్నములలో దైవానుగ్రహము పొంది, దేవాలయ సన్నిధి నుండు జంతువులను తాకియు, అర్చకు లొసగు ఓషధులను, జలమును గ్రహించియు, పునరారోగ్యము పొందుట ఈజిప్టు, హిందూదేశములలో ప్రాచీనాచారము. నవనాగరికులు ఈ పద్ధతుల చులకనగా హేళన చేయవచ్చును; కాని మన ప్రాచీను లందరికిని, ఇప్పటికిని గూడ కొందరికిని పై పద్ధతులు కొంత మేలుచేసినట్లు కొందరు పండితుల అభిప్రాయము.

౨

చారిత్రకయుగములలో శాస్త్రపద్ధతులప్రకారము ఆరోగ్యశాస్త్రప్రారంభము నెరుంగవలెనన్న ఈజిప్టు, అస్సీరియా, హిందూదేశముల ప్రాచీననాగరికతల సావధానముగ పరిశీలింపవలెను.

ఈజిప్టుదేశము సమశీతోష్ణముల కలిగియుండుటవలన అచటిప్రజలు చాల ఆరోగ్యవంతు లనియు, ఆకస్మిక వాతావరణపరిస్థితులవలననే అచట రోగములు కలుగుచుండె ననియు హెరోడోటస్ (Herodotus, ౪౮౦-౪౨౫ B. C) వ్రాసెను. ఈజిప్టులో వారి చికిత్సలకన్న ఆరోగ్యవిధులు మిక్కిలి ప్రశస్తములని "న్యూబర్గర్" వ్రాసెను. అనుభవముల యాధారముపై వారు సాంఘిక ఆరోగ్యమును స్థాపించిరి. వారి సాంఘికారోగ్యసూత్రములలో యీ క్రిందివి ముఖ్యములు. అనేకవ్యాధులు అమితభోజనము, చాలని భోజనమువలనను, జీర్ణకోశముయొక్క అశుద్ధతవలనను కలుగునని నమ్మి తత్సిద్ధాంతములకు తగినట్లు నియమముల నేర్పరచిరి. ఆహారము తేలికగాను, అనపాయకరముగను, పుష్టికరములుగను ఉండవలెను; చెడి యుండరాదు, శుభ్రముగ నుండవలయును. వంటయు శుభ్రముగ చేయవలయును. జంతుమాంసము చక్కగా పరీక్ష చేయవలయును. మతగురువులు త్రాగు నీరు కాచినదిగను వడియగట్టినదిగ నుండవలెను. అప్పుడప్పుడు వమన విరోచన వస్తికర్మలు, ఆరోగ్యరక్షణకై చేయబడుచుండెను. వారి జీవితవిధాన మంతయు వైద్యపండితులచే ఆరోగ్యసూత్రానుసారముగ కుదర్చబడునట్లు తోచునట. మతాధికారులు ప్రజలు త్రాగకూడ దనియు, అతిసంభోగము చేయకూడ దనియు, గర్భనిరోధము, గర్భస్రావము పనికిరా దనియు బోధించుచుండిరి. లింగమునకు ముందుభాగపుతోలును కత్తిరించుట శుచికర మనిరి. బట్టలు శుభ్రమైన నేతవస్త్రములు, దైనికస్నానము విధి. సంపన్నులలో మైచాయకును వెంట్రుకలకును కన్నులకును పండ్లకును పూతలు వాసనలు వాడుకలో నుండెను. కొంతపారిశుధ్యమునకును పాటుబడిరి. పట్టణములలోను పల్లెలలోను గృహములు శుచిగా నుంచమనిరి. మురికి, కసవు ఇంటనుండి దూరముగా పోయవలెననిరి. అంటువ్యాధులు తీవ్రముగా వ్యాపించునపుడు ఇండ్లలో పొగవేసి వాసనలతో నింపుచుండిరి. పల్లపుప్రదేశములలో నివసించువారు కీటకములబారినుండి తప్పించుకొనుటకై యెత్తైన గోపురములమీద పరుండువారు, లేదా పడకమీద ఒకవలతెరను అమర్చి పరుండువారు.

అస్సీరియా రాజ్యములో మంచి జలధారిమార్గములును, పారిశుద్ధ్యము ఆరోగ్యపద్ధతులు నుండెను. హీబ్రూసంఘశాసనములు క్రీ. పూ. ౧౪౦౦-౧౨౫౦ లోపల కూర్చబడినవి. వానిని మోసెస్ (Moses) ౬౨౦ B. C ప్రాంతముల ప్రజాసామాన్యవిధులుగ శాసించెను. ఇవన్నియు బైబిలులో చూడనగును. ఆ శాసనములు మతవిషయములనేగాక, ప్రజలలో ఆరోగ్యమును, పారిశుధ్యమును స్థాపించుమార్గములనుకూడ విధించెను. వీరిశాస్త్రవిజ్ఞానములో ఎనిమిదిముఖ్య సూత్రము లుండెను.

(౧) వారమున కొకదినము విశ్రాంతి.

(౨) దేహపారిశుద్ధ్యము, శవమును తాకినను సూతికలైనను, సుఖరోగములు కలిగినను అశుచియని నిర్ణయించిరి. శుచియగుటకు మార్గములు పేర్కొనిరి.

(౩) శుభ్రమైన ఆహారమును తినుట, రోగముతో నుండునట్టియు, మురికియగునట్టియు జంతువుల నెత్తురును, పందిమాంసమును తినకూడ దనిరి.

(౪) నీరు, ఆహారము శుభ్రముగా నుంచుయత్నములు చేసిరి.

(౫) వలసలలో నున్నప్పుడు శుభ్రత, చక్కని మలమూత్రవిసర్జనపద్ధతులు గమనించిరి.

(౬) లింగముమీది తోలును కోసి శుచిగా నుంచదలచిరి.

(౭) లైంగికజీవనవిధులు నిర్ణయించిరి. అస్వాభావిక, అమానుష సంభోగములు నిషేధించిరి.

(౮) అంటువ్యాధులు రాకుండుటకును, వచ్చినను వానిని అణచుటకును ప్రయత్నములు చేసిరి. కుష్ఠరోగుల పరీక్షించి ప్రత్యేకించుటయు, వారిబట్టలను, ఇండ్లను ధూపములచేతను, మసలెడు నీళ్లచేతను క్రిమిరహితముగా నొనర్చుటకు ప్రయత్నించిరి. వీరివలననే తర్వాతికాలమున ప్రజలు అనేకరోగములు రోగిని తాకుటవలన సంభవించునని యెఱిగి అట్టిరోగుల దూరముగ నుంచుటకు నేర్చుకొనిరి. ౩౦౦౦ సంవత్సరముల క్రిందట దేశదిమ్మరులుగ నుండిన హీబ్రూజాతి ప్రజల ఆరోగ్యసూత్రములు మానవసంఘమునకు చాల మేలుచేసెను.

౩

ఆర్యావర్తమున ప్రాచీనకాలమునుండియు రోగనివారణకేగాక, ఆరోగ్య రక్షణకును, ఆరోగ్యాభివృద్ధికిని సర్వప్రయత్నములు జరుగుచుండెను. వేదములలో రుద్రుడు వైద్యనాథుడు. ప్రార్థించిన బలమును, వ్యాధినిరోధమును ప్రసాదించువాడు. సూర్యుడు ఆహార, శక్తుల నిచ్చువాడు. ఇంద్రుడు రసాయనముల (Tonics) నొసగినవాడు. సరస్వతీ, రాకలు? ప్రసవకాలమున తోడ్పడు మంత్రసానులు. ఇక రోగకారణ విమర్శలును పెక్కులు కలవు. సోమపానమే ఆరోగ్యానారోగ్యములకు కారణ మని కాశ్యపుడును, మనసు రోగకారణమని పరోలోమ ఋషియు, వంశపరంపరగా వచ్చునని సానకుడును, ప్రకృతివలన కలుగునని భరద్వాజుడును వాదించియుండిరి. కొందరు తాపసులు, రాబోవు చెడువాయువుల గురించియు, రోగముల గురించియు ముందుగా తెలియజెప్పి ప్రజలకు నివారణోపాయముల దెలుపుచుండిరి.

కాలక్రమమున, శాస్త్రదృష్టి హెచ్చినకొలది, మతాధిపతులయు, వేదాంతముల యొక్కయు హడావుడి తగ్గి, శాస్త్రీయ పరిశోధనపద్ధతులు ప్రాబల్యమునకు వచ్చెను: ఆత్రేయ సుశ్రుతులు వేదములందలి వైద్యవిజ్ఞానమును క్రోడీకరించి, శిష్యవర్గమునకు గరపిరి. రోగకారణములు బాహ్యములనియు, అభ్యంతరము లనియు, బాహ్యకారణములలో, పంచజ్ఞానేంద్రియ వైపరీత్యములు, గ్రహణ శక్తిలోపములు, దేశకాల పరిణామములు ముఖ్యము లనియు వీరు బోధించిరి. ఆయుర్వేదమునందు బీజకణములనుండా అంటువ్యాధులు గలుగుననియు, తల్లిదండ్రుల రోగములు బిడ్డలకు గలుగుననియు, రోగములు కొన్ని క్రిమిజనితము లనియు, ఆగంతుకవ్యాధులలో, ఘాతలు, విషములతోబాటు క్రిములనుకూడ రోగకారణములుగ గమనించి రనియు, పండితోత్తముల అభిప్రాయము. క్రిములు గోచరములు, అగోచరము లనియు, అనుమానపద్ధతిని ఎరిగిరట. క్షేత్రమగు శరీరమును రోగక్రిములు నాటుకొనలేనియట్టి సంపూర్ణారోగ్యస్థితిలో నుంచిన, ఏవ్యాధియు కలుగదని వారిమతము. ఇది ఆధునిక సిద్ధాంతముల పోలుచున్నది.

ఆయుర్వేద శాస్త్రోద్దేశము రోగ నివారణమే గాక, ఆరోగ్య సంరక్షణమువని ధన్వంతరివాక్కు. మానవుని జీవితము శరీరేంద్రియ మానసాత్మల సంయోగమనియు, ఆయుర్వేద శాస్త్రము జీవితతత్వమును, దానికుపకరించు విషయములను గమనించునదియనియు చరకాచార్యునిమతము. చరకసంహితయందు, దేశకాలభేదములు, వయస్సు, వివిధప్రకృతులు మొదలగు వానివలన మనుష్యుని ఆరోగ్య మెట్లు మారునదియు, పాలు, తృణధాన్యములు, ఘృతములు, పండ్లు, మాంసములు, మధుపానములవలన దేహమునకు సంభవించు కీడు మేళ్లును, ఆరోగ్యాహారసూత్రములును వర్ణింపబడినవి. చరకుడు విమానస్థానమున అంటువ్యాధుల గురించియు, ఇంద్రియస్థానమున ఆయుర్వృద్ధికర మార్గములగురించియు నుడివెను. నాసికారోగములు రాకుండుటకు నస్యములు, గొంతుకకు ధూమపానములు, కనుల కంజనములు, దంతధావనకై దినమునకు రెండుమారులు పుల్లలను బహులంగా నుపయోగించుటయు తెలిపెను. సుశ్రుతుడు సూత్రస్థానమున ఆయుర్వృద్ధికర పద్ధతులు పేర్కొనెను. మశూచి రాకుండుటకు, వచ్చినను తీవ్రముగా నుండకుండుటకును ప్రస్తుతకాలమున వాడుకలోనున్నట్టి టీకాలవంటి చికిత్సను పేర్కొనెను. విషూచి వ్యాధి రాకుండుటకు కొన్ని ఆరోగ్యాహార పానీయ విధులు సూచించెను. ఆహారవిధానముల నెరుగనివైద్యుడు రోగనివారణ చేయలేడని సుశ్రుతుని భావము. ఆహారమువలన నెత్తురు చెడు ననియు, అతిభోజనము క్షారములు, పులుసులు, చేదుభోజనములు, క్రుళ్లిన, పాసిపోయినఆహారములు, జలచరఆహారము అనారోగ్యకర మనియు వ్రాసెను. చెడినమాంసమును నిషేధించెను. ఆహారమువలన అంధత్వము రాకుండ రక్షించుకొనవచ్చు ననియు, రేచీకటి మేకలకార్జము, దిసురుటాకులు, పండ్లు, వెన్న, పాలు ఇందులకు మంచి వనియు వ్రాసెను. అతిభోజనమువలన ననేకరోగములు మధుమేహము, దురద, వాతము దాపరించు ననియు, మనశ్శక్తి వికలమగుననియు, త్రాగునీరు శుద్ధముగను, కాచినదిగను ఉండవలెననియు, నోరు శుద్ధముగ నుంచవలెననియు, మ్మదిగ భుజించవలె ననియు, మానసికోద్రేకములు ర్ణమున కడ్డుకలిగించు ననియు, అప్పుడప్పుడు దేహము నంతయు, ఔషధములద్వారా శుద్ధముచేయవలె ననియు విచిత్రముగ వ్రాసెను.

ఋతుచర్యను, దినచర్యను ఆరోగ్యరక్షణకై నియమించెను. తుమ్మునప్పుడు ముక్కు నోరు గుడ్డతోనో చేతితోనో కప్పికొనవలయు ననియు, కోపమువలన, అలసటవలన, దుఃఖమువలన రక్తము చెడు ననియు, ఎక్కువ సూర్యరశ్మివలన నెత్తురు విరుగవచ్చు ననియు ఆధునికులవలె, వ్రాసెను. తుదకు, సాంవత్సరిక శారీర పరీక్షయు బోధించెను. ఆయుర్వేదమందు గర్భిణీనియమములును, ఆహారవిధులును, ప్రసవమునకు పూర్వము చేయవలసిన యేర్పాట్లును, కాన్పుసమయమున తోడ్పడు స్త్రీల లక్షణములు, ప్రసవానంతరకృత్యములు, సూతికాచికిత్సలు, సూతికాపోషణయు, గర్భిణీరోగములును విపులముగ వ్రాసియున్నారు. కౌమారభృత్యమున శిశురక్షణము, చనుబాలు పుష్కలముగ నుండుటకు, చెడినచనుబాలను చక్కచేయుటకు, శిశురోగముల మాన్పుటకు సూచన లివ్వబడినవి. తల్లి పాలివ్వలేనప్పుడు చనుబాలు ఇయ్యనర్హతగల స్త్రీలపరీక్షానిర్ణయములును, ఆవుపాలు ఇచ్చువిధమును, అన్నప్రాశనము, ఆహారలోపములవలన కలుగురోగములును వర్ణింపబడినవి.

భారతీయుల ఆయుర్వేదమునుగురించి వ్రాయుచు, సర్ జార్జి న్యూమెను ఇట్లు పల్కియున్నాడు: "ఆయుర్వేదము క్రీ. పూ. ౧౫౦౦ సంవత్సరముల క్రిందటనే ప్రశస్తమై యుండెను. అందలి యెనిమిది భాగములలో యేడవదానియందు దేహశక్తుల కాపాడుకొనుటకు, యౌవనపునరాగమమునకు (rejuvenation) రోగనిరోధమునకు సూత్రములు చికిత్సలు వ్రాయబడి యున్నవి. దీనినే మనము ఆరోగ్యశాస్త్ర మందుము. ఆయుర్వేదమున ఆరోగ్యసూత్రములు మత వేదాంత విషయములతో మిళితమైయున్నను, హైందవజాతీయ జీవితములో అవి చాల ప్రత్యక్షలాభముల ప్రసాదించెను."

డాక్టరు కోంబ్రిగారు హైందవ ఆరోగ్య సూత్రములసార మిట్లు సంక్షేపించిరి.

(౧) పరిశుభ్రత. నిత్యస్నానము, మూత్రపురీష విసర్జనాపద్ధతులు, పుడకలతో దంతధావనము, ముఖశుచి, కన్నుల కంజనము, దేహము శిరస్సు అరికాళ్లు అనుదినము నూనెతో రుద్దుట, కేశములు గడ్డములు నఖములు సరిగా కత్తిరించియుంచుట.

(౨) ఆహారము. దినమునకు రెండుమారులు భోజనము, ఆహారగుణదోషములు పదార్థములు తినవలసిన క్రమములు, భోజనానంతరము కొంతదూరము నడచుట.

(౩) దేహపరిశ్రమ, విశ్రాంతి, అంగమర్దనము, స్నానము, కసరత్తులు ఆరోగ్యదాయకములుగ నెంచబడెను. శుభ్రవస్త్రములు విధింపబడెను. హారములు నగలు బలమునిచ్చి దుశ్శక్తుల పారదోలు ననిరి.

(౪) లైంగికజీవనమున అనేకతిథులయందును, పర్వదినములందును, కొన్ని కాలములందును సంభోగమును నిషేధించిరి.

(౫) ఆరోగ్యరక్షణకు, రోగనిరోధమునకు, ప్రతివారము వమనము, ప్రతిమాసము విరేచకౌషధము, ఆరుమాసముల కొకసారి 'శిరావేధన' మొదలగు వాడుకల ప్రవేశపెట్టిరి.

పారిశుధ్యము, దేహమునకు వెలుపటనేగాక, అంతర్భాగమునను ఉండవలెననియు వైటమినులు కల భోజనము, శరీరవ్యాయామ, విరామములును అవసర మనియు ఆయుర్వేద ఆరోగ్యవిధులు. డాక్టరు హారిసన్ గారు ఆరోగ్యశాస్త్రజ్ఞానము వ్యక్తిశరీరపారిశుధ్యముతో తృప్తినొందలే దనియు, అనేక ఆయురారోగ్యసాధనముల తెల్పె ననియు పల్కిరి. మశూచికి టీకాలు, ఎలకలలో ప్లేగుఉండుట, దోమలవలన మలేరియా వ్యాపించుట, దోమలవలలు, పాముకాటు విషమించుకుండుటకు మందు చికిత్సలు ఆయుర్వేదవిజ్ఞానమున గలవు. చరిత్రకారుల పరిశోధనల వలనను ప్రాచీన భారతీయ ఆరోగ్యరక్షణదక్షత వెల్లడియగుచున్నది. మొహెంజొదారో, సింధప్రాంతములలో ౫౦౦౦ యేండ్లకు పూర్వ ముండిన జనస్థానములు త్రవ్వగా, కనిపించిన స్నానఘట్టములు, కోనేరులు, ఆవిరిస్నానగృహములు ఆకాలమున ప్రజలలో దేహపారిశుధ్య మెంత యమూల్యముగ పరిగణింపబడెనో తెలుపుచున్నవి. ఆనగరమున చక్కని త్రాగుడునీటివసతులు, జలదారియేర్పాట్లును, ప్రతియింటికి పాయిఖానాలును, తడిఅంటని యిటుకబిళ్లల మంగిళ్లును ఉండెనని దృష్టాంతరములు దొరకెను. అశోకుడు మానవులకును, పశువులకును ఔషధాలయములు నిర్మించుటయేగాక విదేశములనుండి అనేకవృక్షములను, దుంపలను, ఫలవృక్షములను తెప్పించి నాటించి, ఆహారముల పెంపొందించెను.

చంద్రగుప్తునిరాజ్యమున నగరాధికారశాఖలు ఆరు. వానిలో నొకటి, ఎవరికి, ఎచ్చట, ఎట్లు జననమరణములు సంభవించుచుండునదియు విచారించి వ్రాసియుంచవలసియుండెను. ఈకాలమున, ప్రవీణులగు వైద్యు లుండి రనియు, జలదారిమార్గములు చక్కగ నమర్చబడియుండె ననియు మెగాస్తనీసు వ్రాసెను. కౌటిలీయార్థశాస్త్రమున గృహవాస్తుకమును, ఆహారపరిమితినిగురించియు, సూనాధ్యక్షుడు ఎట్టిమాంసమును ప్రజలకు విక్రయింపరానిదియు, రథ్యలయందు చెత్త పోసినను, ఉదకస్థానముల పురీషోత్సర్జనముచేసినను ఎట్టి దండనలు విధింపబడు నదియు ప్రతియింట నూయి, సూతికాశాల, అవస్కరము (పెంటపోయుటకు చోటు) జలదారి కాలువలు ఎట్లు ఉండవలసినదియు వ్రాసియున్నది.

ఆంధ్రభృత్యులు (క్రీ॥ పూ. ౨౭ మొదలు క్రీ॥ శ. ౪౩౦ వరకు) దేశమంతట స్నానఘట్టములు, కోనేరులు, ధర్మశాలలు, నూతులు ఏర్పాటుచేసియుండిరి. హిందూదేశమున పర్యటన మొనర్చినపుడు, ఫాహియాన్ (క్రీ. శ. ౪౦౦) మధ్యదేశీయులు మధుపానము చేయరనియు, హ్యూయెన్ త్సాంగు (క్రీ. శ. ౭-వ శతాబ్దము) శిలాదిత్యునికాలమున అనేకవైద్యశాల లుండె ననియు, అనేక చికిత్సకు లుండిరనియు వ్రాసిరి. ఆల్బెరునీ వచ్చునప్పటికి శాస్త్రజ్ఞానము ప్రజలలో నశించి రేకొద్దిమంది హస్తగతమోరై భూతపిశాచిక విషయమయమై యుండెను. ఇదియే ఆయుర్వేద శాస్త్రక్షీణదశ.

౪

పాశ్చాత్యవిజ్ఞానమునకు పుట్టినిల్లు గ్రీసుదేశము. ప్రాచీనగ్రీకులు ఈజిప్టు అస్సీరియా, హిందూదేశముల నుండి తమ శాస్త్రజ్ఞానమును నేర్చుకొనిరని పలువురు పండితుల నమ్మకము. క్రీ. పూ. సుమారు ౫౦౦ సంవత్సర ప్రాంతములలో జన్మించిన హిపోక్రటీసు పాశ్చాత్య వైద్యసంప్రదాయములో ప్రథమచికిత్సకుడు, హిందువులకు ధన్వంతరివలె. ఇతడు ఆకాలమున అల్లుకొని యుండిన మాంత్రిక అమానుష సిద్ధాంతముల నిగ్రహించి సహేతుక పద్ధతుల ననుసరించెను. రోగిశరీరమును, లక్షణములను పరీక్షించియు, దేశకాలాచార ఆహారముల వలన కలుగుమార్పులు పరిశీలించియు, వైద్యము చేయ దొడంగెను. వాని అనంతరము డయోకిల్స అనువైద్య పండితు డుండెను. ఆరోగ్యశాస్త్ర వాచకపుస్తకమును మొదట వ్రాసినవాడు ఇతడే. ఆరోగ్యరక్షణకు మితత్వము, సరియైన ఆహారము, పరిశ్రమ, విశ్రాంతి, స్నానములు అవసరమని, శారీరశక్తు లన్నియు సమగ్రముగ వృద్ధిపొందునట్లు జీవితవిధాన మేర్పరచెను. ఇల్లు చల్లగాను, వాయువంతముగను, దుస్తులు, ఋతువుల కనుగుణముగాను, త్రాగునీరు పరిశుభ్రముగాను ఉండవలెననియు, అపరిశుద్ధపరిసరములవలన చాలకీడులు వాటిల్లుననియు బోధించెను. ఇతడే పాశ్చాత్యులకు, 'హైజీను' అనుభావమును, పేరును నేర్పినవాడు.

గ్రీసు సంఘముయొక్క విద్యాభ్యాసము, పెంపకము, ఆదర్శములు, ఆరోగ్యరక్షణ సూత్రబద్ధమై యుండెను. అందు ముఖ్యమైనవి గమనింపుడు: (౧) శరీర శాస్త్రానుకూలముగ బాలబాలికలకు దేహపరిశ్రమ గరపుట. ఇది క్రమముగా వ్యాపింప, యౌవనులు, వృద్ధులును ఆరోగ్యరక్షణకై వ్యాయామము చేయుచుండిరి. ఆరోగ్య రక్షణయేగాక, దేహశక్తులు, హస్తలాఘవము, అందము, ఆనందము ఆదర్శముగా నుంచికొని ఆదేశ ప్రజ లందరును శాస్త్రీయ వ్యాయామము నవలంబించిరి; (౨) పారిశుద్ధ్య పద్ధతులు గరపబడెను. స్నానము, చర్మము శుభ్రముగా నుంచుట, అంగమర్దన, కేశములను వస్త్రములను శుభ్రముగ నుంచుట బోధింపబడుచుండెను; (౩) లోకమున బ్రదుకుటకు అనర్హులగు జనుల సంఖ్యను తగ్గించుట; (౪) స్త్రీల ఆరోగ్య రక్షణకై, మిక్కిలి శ్రద్ధ వహించిరి; (౫) వైద్య శాస్త్రాభివృద్ధికి పాటుపడిరి.

రోమను రాజ్యకాలమున ఆరోగ్య సూత్రములే గాక, ప్రజారోగ్య రక్షణాధికారులును, పారిశుద్ధ్య పద్ధతులును ఉండెను. వైద్యులు, ఈకాలపు హెల్తు ఆఫీసర్లవలె, అంటురోగముల పోకడను గమనించుచు, నగర పారిశుద్ధ్యమును గాపాడుచు, నగర నిర్మాణమునందు, గృహనిర్మాణమునందును శాస్త్రజ్ఞానమును వినియోగించుచుండిరి. రోమునగరమున నీటివసతులను భద్రపరచిరి. గృహశ్రేణులనుండి జలదారి మార్గముల నేర్పరిచిరి. రోడ్లు వేయించిరి. విశాలమైన బురదకుంటల నుండి నీటిని తోడివేసి, మలేరియా పోగొట్టజూచిరి. ఆహారపరీక్షలు ఏర్పరచిరి. గృహములు వేడిగా నుంచుటకు, వివిధ రకముల స్నానములకు గదులను ఏర్పాటు చేసిరి. వీధు లూడ్పించుచుండిరి. చీటవారి క్రుంగిన సౌధములు అపాయకరములని కూలద్రోయించిరి. అసహ్యకరమగు వాసనల తీసివేయించిరి. చెడినధాన్యమును నాశనము చేయించిరి. మంచిధాన్యమును, నిరంతరము అందజేయుచుండిరి. స్నానఘట్టములు, త్రాగుడు ఇండ్లు, వ్యభిచారగృహములు, ఆరోగ్యాధికారుల పరిశీలనలో నుండెను. వైద్యశాలలు నిర్మించిరి.

రోమనురాజ్యము ఛిద్రమయినతర్వాత, అరబ్బీ దేశస్థులు ప్రాచీనవిజ్ఞానమును ఆదరించి, వైద్యశాస్త్రమును కొంత సంస్కరింపసాగిరి. వీరికాలముననే పదునొకండవ శతాబ్దమువరకు అజ్ఞానాంధకారమున, మూఢమతావేశమున మునిగియుండిన ఐరోపాదేశము, తిరుగ పూర్ణవిజ్ఞాన సముదాయమును పొందగలిగెను. అట్లు మొదట శాస్త్రపరిచయలాభము నొందినది ఇటలీలోని సాలర్నో నగరవిద్యాసంస్థ. పండ్రెండవ శతాబ్దాదిని ప్రాగ్దేశీయుడగు కాంస్టెటిల్ ద్వారా అరబ్బీయులు గ్రీకు వారివద్దనుండి గ్రహించిన శాస్త్రసంచయ మంతయు సాలర్నోకు చేరెను. ఇచటి వైద్యకళాశాలలో నేర్పబడిన ముఖ్యవిషయములలో ఆరోగ్యశాస్త్ర మొక్కటి. విద్యార్థుల యుపయోగముకొరకు వీరు ఒకగ్రంథమును

ప్రకటించిరియుండిరి. శుభ్రమైనగాలి, శరీరశుభ్రత, మిత భోజనము, మితపానము వీరి ఆరోగ్యసూత్రములు.

కాని, మధ్యయుగములో యూరోపు కేశీయుల దృష్టియంతయు పరలోకముమీదనే యుండెను; ఇహ లోకమును తూలనాడుట వాడుకగా నుండెను. రోమనులు దేహసుఖము, శరీరశుభ్రత, అందము గర్హించుట క్రమముగా శరీర నిరాదరముగా మారెను. ఉపవాసములు, చాలనిభోజనము, చింపిగుడ్డలు గౌరవాస్పదములుగ పరిగణింపబడెను. ఒక్కవిషయముమాత్రే మాకాలపు ప్రభుత్వముల దృష్టిని ఆకర్షించెను. అదియే అంటురోగ నిరోధకపద్ధతి. యూరపుదేశమున విరివిగా కుష్ఠు వ్యాపించెను. ఆపాదమస్తకము కప్పుకొని, యానదపేనుగులు గంటలు వాయించుకొనుచు, ప్రజల దూరముగ పొమ్మని హెచ్చరించుచు, దేశమున గ్రుమ్మరుచుండిరి.

పండ్రెండు పదమూడవ శతాబ్దములలో కుష్ఠు వ్యాధి భయంకరముగ విజృంభించుచుండగా ప్రభుత్వము వారు కన్నుదెరచి, కుష్ఠురోగులకు ప్రత్యేకవలసలు ఏర్పాటుచేసిరి. ఈ కుష్ఠుశరణాలయములవలన రోగవ్యాప్తి కొంచెము తగ్గెను. కాని, రోగుల ప్రత్యేకించు పద్ధతియొక్క సుగుణమును ప్రజలు గ్రహించినందున కాలక్రమమున ఆరోగ్యపద్ధతులలో నిది అనుల్లంఘనీయమైనది.

కుష్ఠురోగముయొక్క తీవ్రత కొంచెము తగ్గముఖముగ నుండునపుడు ప్లేగుజాడ్యము ఐరోపాను కలవరపెట్టజొచ్చెను. భయకంపితులై ప్రతినగరవాసులును ప్లేగు సోకిన ప్రయాణికులను, నావలను అందలి సామానులను తమ నగరములోనికి రానీయకుండిరి. అందులకై 'క్వారంటైను'శాలలు స్థాపించబడెను. నావలను అనుమానాస్పదులగు జను లందరును ఈ ప్రదేశములయందు ౪౦ దినములవరకు ఉంచబడి, పరీక్షింపబడుచుండువారు. రోగి తాకినమనుజులను, వస్తువులను క్రిమిసంహారక పదార్థప్రయోగములవలనను, సూర్యరశ్మి, శుభ్రమైనగాలిచేతను పరిశుభ్రము గావించుచుండిరి.

ఇట్లామధ్యయుగములో క్షామములు, కుష్ఠురోగము, ప్లేగు ప్రబలుట మొదలగు అనుభవములవలన క్రమముగా ఇంగ్లాండు అంటువ్యాధుల వణచుటకు కొన్ని సాధనోపాయములను, సూత్రములను ఎరింగెను. క్రీ. శ. ౧౮౪౮ సంవత్సరమున ప్రజలు తమయింటి ముందరి స్థలమును శుభ్రముగా నుంచవలె ననుశాసనము ఏర్పడెను. ౧౮౫౮ లో, థేమ్సునదిలోనికి వచ్చు కశ్మలములవిషయమై ప్రభుత్వమువారు ఆలోచింప దొడగిరి. ౧౫౫౨ లో షేక్స్పియర్ తండ్రి రోడ్డుమీద చెత్తపోసినందుకును, జలదారికాలువల శుభ్రముగా నుంచనందునకును జుల్మానా కట్టెను. ప్రజలును అంటురోగములకు ప్రతికూలపరిస్థితుల దెలిసికొనుచుండిరి.

ఇంతలో ఐరోపాదేశమందు మహత్తరమగు మార్పు ప్రారంభమయ్యెను. పదిహేను పదునారు శతాబ్దములలో పాశ్చాత్యప్రజలలో నూతనోజ్జీవనము, విజ్ఞానపునరుద్ధరణము కలిగినందున మానవుని యుత్సాహము, కార్యదక్షత, ఆదర్శములు విచిత్రముగ పెరుగుచుండెను. వేదాంతవాఙ్మయ, కళా ప్రపంచములందే కాక, రాసాయనిక, పదార్థవిజ్ఞానశాస్త్రములయందును, తర్వాత శారీరనిర్మాణ శారీరపరిణామ విజ్ఞానమందును నూతనపద్ధతులు ప్రకృతిరహస్యముల మనుజునకు వెల్లడిచేయుచుండెను. వెసేలియస్ శారీరనిర్మాణమును బట్టబయలుచేసెను. హార్వే జంతువుల శరీరమందలి పరిణామముల ప్రత్యక్షప్రయోగపద్ధతిని పరిశీలించి ప్రాచీనభావములను, వాదములను నిర్మూలించి నిజస్థితుల నిరూపించెను. రక్తచక్రచంక్రమణ రహస్యమును లోకమునకు విదితముచేయుటయేగాక వైద్యశాస్త్రాభివృద్ధికి మహోపకారముగ పరిణమించిన నూతన పద్ధతి - ప్రత్యక్ష ప్రయోగ పరిశీలనాపద్ధతిని - వైద్యులకు అనుసరణీయమార్గముగ చాటెను. తదనంతరము వైద్యశాస్త్రము, ఆరోగ్యశాస్త్రము, నూత్నపథముల బట్టినవి. ఆరోగ్యరక్షణకు జలదారులు, క్రిమిహరౌషధములు మాత్రమేగాక, సంపూర్ణశారీరకజ్ఞానము అగత్యమని తేలెను.

పదునెనిమిదవ శతాబ్దమున నింగ్లాండులోని వైద్యులు, తత్కాలశాస్త్రజ్ఞానము సూచించిన ఆరోగ్యవిధుల నాచరణలో పెట్టిరి.

(౧) ఆకాలమున ప్రబలుచుండిన అంటువ్యాధుల వ్యాపకమునకు హేతువుల నరయుచుండిరి. పిడక్‌హోసు అనుసుప్రసిద్ధాంగ్లేయవైద్యుడు ఈసమస్యలను శ్రద్ధతో పరిశీలించి, మార్గదర్శకు డయ్యెను.

(౨) రోగము ఒకనికి సోకిన దని ప్రకటించుట, రోగిని ప్రత్యేకించుట, రోగియింటిని శుభ్రపరచుట.

(౩) వైద్యులే కాన్పులసమయమున స్త్రీలకు తోడ్పడసాగిరి.

(౪) శిశుమరణములసంఖ్యను తగ్గింపయత్నించిరి.

(౫) ఆరోగ్యకరమగు వివిధాహారపదార్థములను, పండ్లు, ఆకుకూరలు తినుడనియు, మద్యపానము కూడ దనియు బోధించిరి.

(౬) కూలివాండ్ల ఆరోగ్యరక్షణయందు శ్రద్ధ చూపిరి. పసిబాలురు కూలిపనికి తగ రనిరి. ఎక్కువ గంటలు పనిచేయరా దనిరి. పరిసరములు అనారోగ్యములుగ నుండరా దనిరి. హౌస్ ఆఫ్ కామన్సుకు గాలి వసతు లేర్పరచిరి.

(౭) ఆసుపత్రుల స్థాపించుటకు తోడ్పడిరి.

(౮) రోగము రాకుండ, దేహశక్తులకు హెచ్చింగా టీకాలువేయుపద్ధతిని ప్రారంభించిరి. జెన్నరు మశూచికపుబాధ తగ్గించుటీకాల వాడుక చేసెను.

౫

పందొమ్మిదవ శతాబ్దారంభమున ఐరోపాలో కలిగిన సాంఘికపుమార్పులవలన ప్రజలలో పరిశుద్ధతాభిలాష మెండయ్యెను. ప్రజాబాహుళ్యమునం దుద్భవించిన శాస్త్రజ్ఞానాభిరుచియు, క్రొత్తగా కనిపించుచుండిన మనుష్యాదరణయు నూటముప్పదియేండ్లక్రిందట ఆరోగ్యరక్షణోద్యమమునకు చేయూత నొసగినవి. శరీరశుభ్రతయు మరల గౌరవింపబడెను.

౧౮౩౭ – వ సంవత్సరమున విక్టోరియారాణి సింహాసన మెక్కినప్పటికి ప్రభుత్వమువారు ఆరోగ్యరక్షణమునకై యొనర్చుచుండినకార్యములు రెండు. అనుమానాస్పదులైన ప్రయాణికుల పరిశీలనశాలలలో నుంచుట; టీకాలమందుకై సంవత్సరమునకు ౨౦౦౦ పౌను లొసగుట. తర్వాత, ఛాడ్విక్ అనారోగ్యకారణముల విచారించి, నీటివసతులను జలదారులను గూర్చి ఒకరిపోర్టు వ్రాసెను. ఆరిపోర్టు ఆంగ్లేయుల కన్నుల విప్పెను. ౧౮౪౮ లో సైమను లండనునగ రారోగ్యశాఖాధికారిగ నియమింపబడెను. ఇతడు ఆరోగ్య రక్షణావశ్యకతను నలుదిశల చాటెను. ౧౮౫౫-వ సం. లో సైమను ఇంగ్లాండు దేశమున ఆరోగ్య పరిపాలనావర్గముయొక్క ముఖ్యాధికారి యయ్యెను. వరుసగా శాసనముల తయారుచేసెను. ప్రజాసామాన్యమున ఆరోగ్యాభిరుచిని వెదచల్లెను. ౧౮౭౦ ప్రాంతమునాటికి, దేశమంతయు వెదజల్లబడిన ఆరోగ్య సూత్రబీజములు మొలకలెత్తెను. అయితే, ఆకాలపు నాయకులదృష్టి యంతయు మనుజుని పరిసరముల శుభ్రముగా నుంచుటయందే కేంద్రీకృత మయ్యెను. అంతకంటె నెక్కువగ వారి మనోనేత్రములు చూడజాలవయ్యెను. ౧౮౭౧లో, రాయల్ కమీషన్ ఆరోగ్య జీవితమునకు అత్యావశ్యకములు అని పేర్కొనిన పదునొకండు విషయములు ఇవి:—

(౧) త్రాగుటకు స్నానమునకు కావలసినంత పరిశుభ్రమైన జలము అందవలెను.

(౨) నీళ్లలో మురికి, కల్మషము చేరకూడదు.

(౩) జలదారిమార్గములు ఏర్పరుచుట, మురికి నీళ్లను సేద్యమున కుపయోగించుట.

(౪) వీధులు, గృహములు సరిగా కట్టునట్లు చూచుట.

(౫) గృహములు ఆరోగ్యవంతములుగ నుండుట.

(౬) చెత్త, మొదలగునవి దూరముగ తీసుకొనిపోవుట.

(౭) ఆహారపదార్థ పరీక్ష.

(౮) రోగకారణముల వెదకుట అంటువ్యాధులు వ్యాపకములో నుండునపుడు అనుసరించవలసిన శాసనములు.

(౯) బ్రదికియున్న వారికి హానికరము గాకుండ చచ్చినవారిని పూడ్చుటకు ఏర్పాట్లు.

(౧౦) బజారులను నియమితరీతుల నుంచుట రాత్రివేళల వీధులలో దీపములు పెట్టుట.

(౧౧) రోగుల యొక్కయు, మరణముల యొక్కయు లెక్కల నుంచుట.

ఇదేకాలమున, మనుజుని విజ్ఞానమును పెరుగు చుండెను. కవులు, మానవతత్వవేత్తలు క్రొత్తభావముల వెల్లడించుచుండిరి. డార్విన్ ౧౮౫౯లో, 'ప్రాణి కోటుల ప్రారంభము' (Origin of species) అను మహద్గ్రంథమును ప్రకటించెను. మానవుడు ఇతరప్రాణుల వలె, సంజనితలోపములకు, మార్పులకు లోనగునవనియు, తనశరీరము, ప్రకృతియు, అతని పరిసరములమీద నాధారపడియుండు ననియు, మనుజుడు ప్రకృతిలోని చిన్నభాగ మనియు బుద్ధిమంతులు గ్రహింపగలిగిరి. ఇం దుతోబాటు పాశ్చాత్యవైద్యులు, అద్భుత పరి శోధనలు గావించి, సూక్ష్మక్రిముల రహస్య ముల కనుగొనసాగిరి. క్రిములు, కీటకములు, ఎట్లు రోగ కారణములుగ వ్యాపకసాధనములుగ నుండునదియు క్రమముగ తెలియవచ్చెను. ఇందులకు సూక్ష్మదర్శినీ యంత్రము, రంగులు, క్రిముల పెంచుటకు తగినపదార్థ ములు, రాసాయనికపరీక్షలు, జంతువులలోనికి క్రిముల సూదిగుండా ఎక్కించుట మొదలగు వివిధోపాయములు పరిపూర్ణత నొందసాగెను. పాశ్చ్యర్ (౧౮౨౨-౯౫) అంటువ్యాధులకు నిజకారణము క్రిముల పరిశీలింప దొడగెను. పులియుట క్రిములవలన గలుగు నని నిర్ణయించెను. ద్రాక్షతీగెలకు, పట్టుచెట్లకు కలుగు చీడల కారణముల పరిశీలించుచు, ఆన్త్రాక్సు (Anthrax) మొదలగు జంతుజాడ్యములను గురించి పరిశోధ నలు సల్పి వ్యాధులు రాకుండ టీకాలును, పిచ్చికుక్క కాటుకు సూదిమందులును మానవసంఘ రక్షణాను కూలముగ కుదిర్చెను. కాక్ (౧౮౪౩-౧౯౧౦) క్షయ, కలరారోగక్రిముల గుర్తించెను. ఇతరక్రిములును త్వరలో గుర్తింపబడెను. లిస్టరు క్రిమిరహిత శస్త్రవైద్యమును ప్రతిష్ఠించియు, సింపసన్ నొప్పి తెలియకుండ స్మృతి తప్పించు 'క్లోరోఫారం'ను కనిపెట్టియు, మెట్ చ్నికాఫ్ మొదలగువారు నెత్తురులోని రక్షకశక్తుల పెంపొందించుమార్గములను ఏర్పరచియు మానవసంఘ మున కుపకారముచేసిరి. లేవరాన్, మెన్సన్, రాస్ మొదలగువారు ఉష్ణమండలములందలి క్రిమికీటజనక వ్యాధులనుగురించి పరిశోధముచేసి మలేరియా రక్తభేదులు మొదలగువానిని మనుజునిశాసనమునకు లోబడునట్లు చేసిరి. ఈ ఆరోగ్యరక్షక వీరవర్యుల చరిత్రల నెంత వర్ణించినను తనివితీరదు. ఆధునికకాలమున పఠింపతగిన పురాణములు క్రిమికీటకరోగవిధ్వంసుల సచ్చారిత్రములే.

వైద్యుల చికిత్సాక్రమమును చాల అభివృద్ధి నొందజొచ్చెను. క్రొత్తసాధనోపకరణములు, కొలతలు, నెత్తురుపరీక్షలు 'ఎక్సరే' కిరణములు, దేహరక్షక శక్తుల పెంచు సూదిమందులవలన ప్లేగు, టైఫాయిడ్, కలరా మొదలగువానిబారినుండి తప్పించుకొను అను కూలము లేర్పడెను. ఈకాలపువైద్యుడు రోగచికిత్స కుడుమాత్రమే గాదు, ఆరోగ్యరక్షకుడును. అంటురోగ ములు వ్యాపించుమార్గముల ప్రభుత్వమువారు భద్రముగ కనిపెట్టి నిరోధించుచున్నారు. తాకుడువలన, నీటివలన, ఆహారమువలన, వృత్తులవలన, బడులలోను, అనారోగ్య గృహములవలన, అపరిశుభ్రపరిసరములవలన రోగములు విజృంభించకుండ రక్షణ చేయుచున్నారు. ఆహారము, జీవితవిధానము, ఆరోగ్యదాయకముగ చేయబడుచున్నవి. శరీరశాస్త్రసూచనల ప్రకారము, కార్మికుల ఆరోగ్య రక్షయు జరుగుచున్నది. గర్భిణీస్త్రీరక్షణయు, శిశు సంరక్షణయు ప్రజాధర్మముగ నెంచబడుచున్నది. ప్రభు త్వనివేదికలలో సర్ జార్జి న్యూమేను, ౧౯౩౧ సంవత్స రమున ఆరోగ్యాదర్శములుగ నీక్రిందివానినికూడ జేర్చెను—

(౧) నగరములను, గ్రామములను సరిగా నేర్ప రుచుట, ప్రజలకు అనువగువసతుల నేర్పరుచుట.

(౨) కూలిపనివాండ్ర ఆరోగ్యమును గమనించుట, కర్మాగారములు ఆరోగ్యకరములుగా నున్నవో లేదో పరీక్షించుట.

(౩) గర్భిణీస్త్రీల ఆరోగ్యరక్షణ.

(౪) శిశువులయు, బాలబాలికలయు ఆరోగ్య మును గమనించుట. శిశురక్షణాధికారులను, బడిపిల్లలను పరీక్షించుడాక్టర్లను ఏర్పరుచుట.

(౫) సామాన్య అంటురోగములకు శాస్త్రీయ చికిత్స.

(౬) దేహజాడ్యములకు చికిత్స:—క్షయ, సుఖ రోగములు, రణము, కీళ్లనొప్పులు, అంగవిక్షేపము, ఉన్మాదము.

(౭) ఈచికిత్సలకు ఏర్పాట్లు— ఆసుపత్రులు, సేవటోరియములు, ప్రత్యేకపాఠశాలలు, శరణాలయములు.

(౮) జాతీయ ఆరోగ్యభివృద్ధిపద్ధతి. ప్రజల వప్పుడప్పుడు పరీక్షించి ఆరోగ్యక్షీణతను, ప్రారంభదశయందే జబ్బును గుర్తించుట.

(౯) అంతర్జాతీయ పారిశుద్ధ్యపు ఒడంబడికలు.

(౧౦) రోగకారణములను, రోగనిరోధకోపాయములను అరయుటకు నిరంతరపరిశోధనలు.

(౧౧) ఆరోగ్యవిషయములను ప్రజాసామాన్యమునకు బోధించుట, నిర్బంధప్రాథమికవిద్య, తదనంతరము ప్రజాబోధను— ఇందుకు ప్రథమసోపానములు. విద్యాభివృద్ధియే ఆరోగ్యాభివృద్ధిని కలుగ జేయును.

ఆరోగ్యరక్షణకార్యక్రమమున ప్రభుత్వమువారు స్థానికసంస్థలు, ఐచ్ఛికసేవాతత్పరులు ఎంతెంతపాలు ధరింపవలయునో నిర్ణయించుట కష్టము.

ఒకసంఘముయొక్క ప్రథమావశ్యకత పరిసరములనుసరించినవి:— గృహములు, గాలి, నీరు, ఆహారము, కర్మాగారము, జలదారి, మురుగుడు ఉపయోగించు పద్ధతులు, చెత్త తీసుకొనిపోవుపద్ధతులు మొదలగునవి. రెండవయావశ్యకము వ్యక్తిఆరోగ్యమును పెంచుట: తల్లిదండ్రుల బీజకణములు సంయోగమునొంది పిండ మేర్పడుటకు పూర్వమునుండి జీవితాంతమువరకు ఆరోగ్యమును రక్షించు జీవితవిధానము. సత్సంతాన ప్రయత్నము, గర్భిణీరక్షణ, శిశురక్షణ, విద్యార్థి ఆరోగ్యరక్షణ, అంటువ్యాధులు, ఆహారలోపమువలన కలుగువ్యాధులు రాకుండ భద్రపడుట, కార్మికుల ఆరోగ్యము, జాతీయారోగ్యవృద్ధి, దేహరక్షకశక్తుల మందులవలన పెంచుట, మానసికఆరోగ్యము, అంతర్జాతీయారోగ్యసహకారము, పత్యాన్వేషణము.

ప్రభుత్వవర్గమునగాని, ఆంధ్రరాష్ట్రమున ప్రజలలోగాని ఇట్టియున్నతాదర్శములు కలవా?

పురోభివృద్ధి

90 సంవత్సరాలక్రిందట "ప్రజారోగ్య"మంటే అంతా బాగా తెలియదు. అప్పుడు క్విబెక్ రాష్ట్రమందు హ్యాగ్రహాం అను బాలుడు జన్మించెను ఆతనే అతిల్‌స్టాన్ ప్రభువయ్యెను. "మాంట్రీల్ స్టార్ పత్రికను" ప్రచురించెడివాడు. కెనడాలో వార్తాపత్రికరచన రంగమందు నైటుహుడ్ గౌరవము పొందిన వారిలో ప్రథముడు అతడే.

ప్రజారోగ్యమునందు ముందు యెక్కువ శ్రద్ధ తీసికొనెడివాడు. అతిల్‌స్టన్ ప్రభువు 1885 వ సం॥ మాంట్రీలులో మశూచి వ్యాధి ప్రబలినపుడు ప్రజారోగ్యమందు దీనికిగల శ్రద్ధ విశదమయినది అప్పుడు ప్రజలు టీకాలు వేయించుకొనటానికి యిష్టపడలేదు. అతిల్‌స్టన్ ప్రభువు ఒక కమిటీవారి సహాయముతో ప్రతి యింటికి వెళ్లి టీకాల యుపయోగమును నచ్చచెప్పి, ప్రజల విశ్వాసమును పొందగోరి, మశూచివ్యాధి నలుగడల వ్యాపింపకుండ కట్టుదిట్టాలు గావించాడు.

మందంటే ఉండే గొప్పభీతిని తిరస్కరించి పారద్రోలి, ప్రజారోగ్యము కొరకు ఉత్సాహముతో కృషిసల్పాడు అతిల్‌స్టన్ ప్రభువు. నేడు భారతదేశమందు సింహళమందు మలేరియా జాడ్యముచే అనేకమంది బాధపడుచున్నారు. వారిలో ప్రబలియున్న మూఢత్వమును నశింపు చేయుటకు డాక్టర్లనేకమంది కృషి సల్పుచున్నారు. మలేరియా నివారణకు 5 లేక 7 రోజులు, రోజుకు 15 మొదలు 20 గ్రెయినులు క్వైనైను తింటే జాడ్యము మాయమగునను విషయమును యీ దేశాలలో ప్రజలకు చెల్పుట కనేక ఆటంకములను డాక్టర్లు ఎదుర్కొనుచున్నారు.

మలేరియా రాకుండ అనుదినము 6 గ్రెయినులైనా క్వైనైను తినటము ఆవశ్యకమని జాతిసమితియొక్క మలేరియా కమీషనువారు చెల్పుచున్నారు. M. E. 65.

కాంచనమాల*

శ్రీ అ. సీతారాముడు

తళుక్కుమన్నది
పాడైపోయిన చీకటింటిలో
పరంజ్యోతి ఏదో !
అదిగో ! అదిగో !
కనబడ లేదా
తేజశ్శక్తులు ?
వినబడ లేదా
నాదబ్రహ్మము ?
అన్నిదిక్కులా
అలముకొన్న వే !
అన్నిదిక్కులూ
మారుమ్రోగెనే !
కనబడ కెట్లుండు ?
వినబడ కెట్లుండు ?

* * *

కోయిలము
తుమ్మెదువులా !
కొమ్మలపందిట్ల
ఆకులసెజ్జను
బారులుదీరుచు
ముక్తకంఠమున
పాడుచున్నయవి
స్వాగతగీతులు !
చూచితివే మఱి
బదులుపలుక వేలా ?
చిగురులవిందులు
పుష్పాక్షతలూ
నల్లలపేరులు
పసుపుకుంకుమలు
తాంబూలమ్ములు
మంగళారతులు
సిద్ధపఱుచుకొని
కాచుకొన్న వవిగో !
చూచితివే మఱి
స్వీకరింపవేలా ?

* * *

నిత్యసౌందర్యలక్ష్మి ఆతిథ్య మిచ్చి
ఆదరించిన దొక్క భాగ్యవతి నిపుడు
ఆమహాతల్లి మాయింటి ఆడుబిడ్డ
ప్రకృతి తారుమారాయె నాపదముచెంత
నశ్వరములుగా సృష్టిసౌందర్యములును !
యౌవనవసంతు నాధ్వర్య మంతరింప
రాలిపోవును చైత్రపల్లవవిభూతి !
తనప్రశాంతదీప్తులకు హృదంతరంబు

---

* "విప్రనారాయణ"లో 'దేవదేవి'గను, వందేమాతరమ్"లో 'జానకి' గను అత్యద్భుతముగ నటించిన కళోపాసిని తెలుగుచెల్లెలు.

అమృతవాహిని నల్లతూగాడునేమొ!
క్షణములో లేవె ఆ ఉషఃకాంతు లకట!

* * *

పండువెన్నెల చిల్కు పాలమీగడలు
ప్రాభాతి వడ్డించు పాయసాన్నములు
సెలయేరు వెదజిమ్ము చలువపన్నీరు
జలధిగర్భము చిందు జాతిముత్యాలు
అమ్మచూపులు చల్లు అమృతతుంపురులు
ప్రియురాలి హృద్వీణె మీటు గీతికలు
కవిగుండెలోని బంగారుదొంతరలు
కలిసినవి చైతన్యఫలముగా
నిలిచినవి
తెలుగుచెలి పున్నెంపు మొలకగా
వెలిసినవి
మానససరసిలో ఆనందహంసి
ఆడుతూపాడుతూ ఆశీస్సు చదువు
అందుకోవమ్మ మహాలక్ష్మివగుదు!

పుస్తక సమీక్ష

ప్రాక్టికల్ రీజువినేషన్ ఇన్ మెన్ అండు విమెన్

Practical Rejuvenation in Men and Women. By Dr. K. V. Mathew, *Published by Mrs. Anie Mathews, Travancore.*

(ఆంగ్లగ్రంథము)

గ్రంథకర్త: డాక్టరు కె. వి. మేథ్యూ. గ్రంథము లభించుతావులు: హిగ్గిన్‌బోథమ్స్, మదరాసు, ఎ. హెచ్. వీలర్ అండు కంపెనీ, బొంబాయి, అలహాబాదు, కలకత్తా. వెల, రు. ౩-౧౨-౦.

ఆరోగ్యవృద్ధి, ఆయుర్వృద్ధి అను ఆశయములను దృష్టి నిడుకొని డాక్టరు కె. వి. మేథ్యూగారీ గ్రంథము వ్రాసిరి. శారీరక మానసిక ఆరోగ్యముల అవార్య సంబంధమును పరిశీలించిరి. వీర్యవృద్ధివలన నీ యాశయము లెట్లు నివ్వటిల్లునో వివరించిరి.

సర్వతోముఖమైన మానవాభ్యుదయము దీనివలన చేకుఱునని ప్రాచీనులు గుర్తించిరి. బ్రహ్మచర్యదీక్షను నియమించిరి. ఆత్మోన్నతికి చేదోపను విద్యను గఱపిరి. ఆత్మసంయమముకలిన వీర్యవృద్ధి గావించుకొనువారే విజయులు కాఁగలరని దృష్టాంతీకరించిరి. భగవద్గీతలోని శంఖప్రకరణ మిందులకు తార్కాణము. శంఖమును పూరించుటలోని యంతరార్థము వీర్యవృద్ధిగావించుకొనుటయే! శ్రీకృష్ణుడును, పాండవులును మాత్రము శంఖములు పూరించిరని ఆధ్యాత్మికమైన విజయమునందిరని యెఱుంగుదుము. కౌరవులలో నెవ్వరును శంఖములు పూరింపలేదని యెఱుంగుదుము. ఆధునికవిద్యావిధానములో మతవిద్యకు చోటులేదు. బ్రహ్మచర్యదీక్షకు, ఆత్మసంయమమునకు అవకాశములేదు. కావున ఆరోగ్యమునకు, ఆత్మాభివృద్ధికి చెఱుపులు ఘటిల్లుచున్నవి.

ఈ కొఱతను దెట్టికో ప్రస్తుత గ్రంథకర్తగారు వివరించిరి. ఆకాలమున నారోగ్యమును గోల్పోయి, సాంసారికసుఖమునకు దూరస్థులైన అభాగుల చరిత్రల నుల్లేఖించిరి. స్త్రీపురుషావయవగ్రథనావిధానమును దెలిపి, యౌవనమును పునరుద్ధరించుటకై అవలంబింపబడు ఆంగ్ల ఆయుర్వేద చికిత్సాపద్ధతులను వివరించిరి. ఆంగ్లచికిత్సవలన తామును, అన్యాన్యమున్న సుప్రసిద్ధ వైద్యులును అనేకులకు యౌవనమును చేకూర్చిన వివరములను దెలిపిరి. కాయకల్పచికిత్సావిధానమును విశదీకరించి, యీ చికిత్సయందలి మహత్వ మెట్టిదో దృష్టాంతములతో పేర్కొనిరి. బ్రహ్మరసాయన, చ్యవనప్రాసరసాయన, అమలకకల్పరసాయనములను తయారొనరించు విధానములను వీనివలన చేకుఱు ప్రయోజనములను ఎఱిగించిరి. సక్రమసాంసారికజీవితమును గడపుటకై పాటింపవలసిన విధులను దెలిపి సంసారనిరోధమందలి తమునమ్మకమును, నిరోధవిధానమును వ్యక్తీకరించిరి.

ఇట్టి గ్రంథములు తఱచుగా వెలువడుటగాని, పఠింపబడుటగాని యెఱుంగము. ఉత్కృష్టోద్దేశ నిర్వహణమునకై నిర్దేశింపబడిన మానవశరీరమును కాపాడవలసిన అక్కఱ యెట్టిదో చే డెందఱో యెఱుంగరు. అవిద్యవలన, అజ్ఞానమువలన చెప్పరాని చేటులు తలయెత్తును కావున నిట్టి గ్రంథములను చదువకపోవుటవలన చెఱుపు వచ్చునని తెలుపజెల్లును. చదువుటచే చేటు వాటిల్లునని యోచించువారి యభిప్రాయము లోపభూయిష్ఠమైనదని నేను బహుశముగ నోచు ప్రత్యక్షదృష్టాంతములే చెప్పక చెప్పుచున్నవి. గ్రంథము వివిధభాషల లోనికి అనువదింపబడు నెడల, అనేకులకు మేలు చేకుఱును.

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి.

ఆంధ్రదేశ గ్రంథాలయముల పట్టిక

ప్రకాశకులు: ఆంధ్రదేశగ్రంథాలయసంఘము, బెజవాడ. వెల రూపాయి.

ఆంధ్రదేశగ్రంథాలయసంఘమువారు ఈ గ్రంథమును ప్రకటించి, గ్రంథాలయోద్యమమునకును, గ్రంథ,

పత్రికా ప్రకాశకులకును ఎక్కువ ఉపకారముచేశారు. ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము బయలుదేరి నాలాకాల మైనను ఆరంభకాలము నాటికి, ఇప్పటికి అది అనేకవిపర్యయములను పొందినది. అనేక గ్రంథాలయాలు ఆరంభకాలములో వెలిశాయి; వాటిలో కొన్ని అటుతరువాత మాసిపోయినాయి. ఇటీవల మరికొన్ని బయలుదేరినాయి. మొత్తంమీద ఆంధ్రదేశ గ్రంథాలయాలసంఖ్య ఎంత, అవి ఎక్కడెక్కడ ఉన్నవి అని తెలుసుకోవాలంటే ఈ గ్రంథాలయాలపట్టికలు ౧౯౧౯-వ సం॥రపు ఆంధ్రసంవత్సరాది సంచికలోను, ౧౯౩౬-వ జూలై మాసపు సర్వగ్రంథాలయసంచిక లోను ప్రకటితమైనవి చూడవచ్చును; కాని ఆ సంచిక లందరికీ సులభములు కావు. ప్రస్తుతం గ్రంథాలయాల పట్టికను గ్రంథరూపంగా ప్రకటించడం చాలా ఉపకారకమైనపని. మొత్తంమీద—తెలుగుదేశంలో (నిజాంరాజ్యమును కలుపుకొని), ఇతరప్రాంతముల (అరవజిల్లాలు, బొంబాయి)లోను కలిసి — ౭౭౯ గ్రంథాలయములు ఉన్నాయి. ఈ గ్రంథాలయాలవారు ప్రకటితమయ్యేపుస్తకం ఒకొక్కటిచొప్పున తీసుకొన్నా, గ్రంథప్రకాశకులకు ప్రోత్సాహము కలగడమే కాకుండా, ఉత్తమగ్రంథప్రకటనానికికూడా ఎంతో అవకాశం కలుగుతుంది.

ఆంధ్రదేశగ్రంథాలయములు గ్రంథాలయోద్యమాభివృద్ధికిని, గ్రంథప్రకాశనమునకున్ను, ఆంధ్రభాషాభ్యుదయానికిన్ని తోడ్పడాలని కోరుకున్నాను.

కీ. శే. శ్రీ సూరి వేంకటనరసింహశాస్త్రిగారికి ఈ గ్రంథమును ఆంధ్రగ్రంథాలయసంఘమువారు అంకిత మివ్వడం ఎంతో సమంజసంగా ఉన్నది.

మానసబోధామృతము

శ్రీ సమర్థ రామదాస స్వాములవారు మహారాష్ట్రి భాషలో పద్యాత్మకంగా వ్రాసిన గ్రంథానికి పి. వి. మాధవరావుగారు తెలుగున తాత్పర్యము వ్రాసి ముద్రింపించియున్నారు. ప్రతి పద్యముక్రిందను దాని తాత్పర్యార్థ మున్నది. ముముక్షువులకూ, భక్తులకూ అవశ్యం పఠనీయం. ఇందులోని పద్యాలన్నీ మరాఠీభాషలో వున్నా అంత్య ప్రాసనియమము కలిగి చదవడానికీ, వినడానికీ చాలా సొంపుగా వుంటాయి. కొన్ని పద్యాల్లో జ్ఞానదేవ, తుకారాం భక్తసందేశాలును గలవు. మరియు అనేక పద్యాలలో భగవద్గీతయందలి భావములు ఇమిడియున్నవి. అట్టి భావములు గల పద్యాలక్రింద గీతలోని అసలు శ్లోకాలను సైతం అర్థసహితంగా వ్రాసియున్నారు. మొత్తం ౨౦౫ పద్యాలు. పద్యముల తరువాత వచనరూపంతో రామదాస స్వాములవారి అద్భుత లీలలని, వారు గావించియుండిన అలౌకిక సమాచారములను సంగ్రహపరచియున్నారు. ఇవి అణిమాద్యష్టసిద్ధులం బొందిన యోగీశ్వరులు కావింపదగినవి కాని సామాన్యులకు గురూహ్యములు. చిట్టచివర సమర్థ సంప్రదాయంవారు భజనచేసే రామనామావళి పొందు పరుపబడియున్నది. దీనినంతను పఠించిన రామాయణ మంతయు స్మృతి గోచరమగును. మొత్తం పేజీలు ౧౬౩. ఈ గ్రంథము భక్తులకు సులభంగా అందవలెనని మాధవరావు గారు జిజ్ఞాసులకందరికీ మూల్యరహితంగానే పంచిపెట్ట సంకల్పించారు. దూరమున నున్నవారు కేవలము పోస్టేజీ రెండు అణాలు పంపిన పుస్తకము పడయగలరు. దగ్గరలో నున్నవారు శ్రీ పేరిం ఆనందం శెట్టిగారు, నెం. ౩౩ వరసయ్యవీథి, చాకలపేట, మదరాసు; శ్రీ పి.వి. మాధవరావుగారు, నెం. ౨౫ హనుమంతరాయని వీథి, పార్కుటవున్, మద్రాసు, లవద్ద ఉచితంగా పొందగలరు.

మాయలోకం

ఇందు తొమ్మిది జీవితతరంగాలు కలవు.

కర్త: ముద్దావిశ్వనాథం. ప్రకాశకులు ది సౌత్ ఇండియన్ పబ్లిషర్సు లిమిటెడ్ ౩౩, జోన్సువీథి— జి. టి. మద్రాసు.

వెల ౬ అణాలు.

విశ్వనాథంగారిపేరు 'టాలుస్టాయ్ కథలు' మొదలైన పుస్తకాలు చదివినవారికి కొత్తది కాదు.

ఈ 'మాయలోకం'లోని కథలు సంఘానికి సంబంధించినవి. సాంఘికపరిస్థితులు చక్కగా వర్ణింపబడినయి. ప్రతికథలోనూ ఒకలక్ష్యం, ఒక ఆదర్శం కనబడుతుంది. కేవలం 'ఖులాసా'కొరకే కాదు. సంఘానికి కూడ కొంతమేలు చేసేగుణం ఈకథలలో కనబడుతుంది. పోకడలో ఒకకొత్తదనం కనిపిస్తుంది. కథలు కొంచెం పెద్దవి అయినా మొదటినుంచి చివరివరకు కథకుని వాక్చమత్కారం చదువరులకు విసుగు కలుగనీయదు. ఈ పొడవువల్లనే (Short - story) యొక్క సొగసు కొంత తగ్గినట్టు కనపడుతుంది. అంగాలను కుదిమట్టంగా సవరిస్తూ, కొన్ని భావాలను, ఘట్టాలను వ్యంగ్యంగా వదలి కథను ముందుకు నడిపే కళాకౌశలం తెలుగు కథల్లో తక్కువ కనిపిస్తుంది. వర్ణన ప్రారంభిస్తే తూచాలు తప్పకుండా చాలాదూరంవరకు లాక్కుపోవడం అలవాటయిపోయింది. ఇందువల్లనే కథ స్వయంగా తనంత తాను ముందుకు పోలేక, కథకుడు ముందుకు తోస్తేనేతప్ప కదలలేదు. ఈగుణం విశ్వనాథంగారి కథల్లో తక్కువవుంది. ఇందుకు వారిరచనా కౌశలాన్ని మనం మెచ్చుకోకతప్పదు. అయినా ఆవాసనలు కనుపిస్తూనే ఉంటాయి మధ్యమధ్య.

పోతే, 'ఈకలిమికోసం' అనేకథలో రామంఅనే యువకుడు అత్తవారింటికి ఇల్లటం వెళ్తాడు. అతని భార్య లలిత. ఆవిడ కొంచెం పెళుసరి. రామం తనతల్లిని చూట్టానికి వెడదా మంటాడు. అత్తమామలు తృణీకరిస్తారు. రాత్రి పడకగదిలోకి పోయి,ఒకకుర్చీలో కూలబడి ఆలోచిస్తూంటాడు. అప్పుడు లలిత చూడండి ఏమంటుందో— "గట్టిగా బుకాయిస్తున్నారేమిటి? మీఅమ్మ మిమ్మల్ని మా కమ్ముకున్నప్పుడు ఈమరతు లేమీ లేవే?.. మీరు నాసొమ్ము నాఅధీనం. తెలిసిందా? మానాన్నగారు సంచులుపోసి కొనుక్కొని మీకు చదువుచెప్పించిం దెందుకు? చీటికీ, మాటికీ మీయెదాన్న డబ్బుకొడుతూండడ మెందు కనుకున్నారు?తివగాతివగామాసొమ్ము

మీకు వివమైపోతూంది కాబోలు!" ఈభావాలు లలిత హృదయంలో రేగవచ్చు. కానిఆమెనోటిసుండా చెప్పించడంకంటె ఇంకోమార్గాన పెడితే బాగుంటుందేమో. పురుషుడు తనదేహజన్య తాపోపశమనంకోరకు వేశ్య నుంచుకొన్నట్లు, లలితకూడా రామాన్ని దాసుణ్ణి చేసుకొన్నదని బోధపడుతుంది. రాముడు అస్వతంత్రుడు కావచ్చు; అయినా పతి, లలితలో ముందు రాబోయే మార్పును ఘట్టిపరచటానికి అలాంటి పరుషవాక్కులు అవసర మని కొంతమంది వాదించవచ్చు. అయినా ఆభావాలను వ్యంగ్యంగానయినా చెప్పిస్తే కొంతవరకు బాగుంటుందని మాతలపు. అలాగే 'నేరంలేని శిక్ష'లోని దీర్ఘచర్చ చూచి పాఠకుడు 'ఇకనయినా వదలితే బాగుండునే' అనే భావంలోకి దిగుతాడు.

మొత్తంమీద కథలు చదువతగ్గవి. ధారాళమయిన పోకడ, భావాలకు తగినభాషయొక్క సొగసైన మేళనం ఈకథల్లో కనిపిస్తుంది.

యు. వెంకటేశ్వరరావు.

ఆడమళయాళం

రాడికల్ పబ్లికేషన్స్, తెనాలి. వెల నాలుగణాలు.

ఇందులో గోపీచంద్, కృష్ణరావు, సుబ్బారావుగార్ల కథలు సంగ్రహించబడినయి. గోపీచంద్‌గారి కథల్లో రచయితయొక్క స్వానుభవాలే వర్ణించినట్టు కనబడుతూంటుంది. కథలలోని నాయకుడుకూడ 'గోపీ'యే. మళయాళం ఆడవాళ్లజీవితాన్ని, వాళ్ల ఆచారాలను, వాళ్ల స్వేచ్ఛావిహారాలను ఆధారంగా తీసుకుని ఆడమళయాళం, మళయాళం అనే కథలు రాశారు. వాటిల్లో చిత్రించిన మళయాళీ ఆడవాళ్ల జీవితాన్ని చదువుతూంటే ఇంకా చదవబుద్ధి అవుతుంది. మిగిలిన రచయితల రచనలుకూడ మొత్తంమీద బాగానే ఉన్నాయి.

పుస్తకపు ప్రింటింగుపైఖరి చూస్తే కేవలం రైలుబళ్లల్లో అమ్మకం ప్రచారంకోరకు అచ్చువేయించారేమో ననిపిస్తుంది.

సూర్యనారాయణమూర్తి కథలు

కర్త: అత్తిలి సూర్యనారాయణమూర్తిగారు. ప్రకాశకులు: నమ్మళ్వార్స్, పోస్టుబాక్సు ౨౫౧ మద్రాసు. వెల ౦-౬-౦.

ఇది తొమ్మిదికథలసంపుటి. యానాది పత్తి, రవిగాంచనిచో కవిగాంచునేగాదా, కొత్తమాపు మొదలయినకథలు బాగా నిర్వహింపబడినవి. 'రవి గాంచనిచో కవి గాంచునేగాదా' కథలోని సంభాషణలో చక్కని పరిహాసం కనిపిస్తుంది.

'కొత్తమాపు'కథ నిజంగా సారస్వతప్రపంచానికి ఒక 'కొత్తమాపే!' 'తెగినదాకా లాగితే', 'పూజారి' ఇవి రెండూ నాటకరూపంలో ఉన్నాయి. పూజారి ఆంధ్రరాష్ట్రసిద్ధికోరకు నాయకులు వార్ధా వెళ్లి తిరిగి వచ్చిన ఘట్టం. ఈ పుస్తకంలో కథావస్తువులు ఎక్కువగా పల్లెటూళ్లనుండి గ్రహింపబడినవి. అందుకని కొంత పల్లెటూరిజీవితం మళ్లీ పాఠకులు ఈ కథల్లో చూస్తారు.

గ్రంథ స్వీకారము

జాతకకథాగుచ్ఛము—గ్రంథకర్త: శిరోమణి, సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు. ఆంధ్రకావ్యమాలా పుష్పము ౧. పుస్తకములు వలయువారు గ్రంథకర్త గారి పేర, గోకులము, సికింద్రాబాదు (దక్కన్) కు వ్రాయవలెను.

సురబోధనశృంగభంగము అను ఘోషయాత్ర (నాటకము)—రచయిత: మల్యాల జయరామయ్యగారు; ప్రతులు దొరకేచోటు: మల్యాల జయరామయ్యగారు, కోటలాజ్జి, రాజమహేంద్రవరము.

శ్రాద్ధము లెందుకు పెట్టవలెను?—గ్రంథకర్త: చివుకుల అప్పయ్యశాస్త్రిగారు. ప్రకాశకులు: శ్రీరామా బుక్‌డిపో, 4000 మార్కెట్ స్ట్రీటు, సికింద్రాబాదు, దక్కను. వెల 6 అణాలు.

లలిత(నాటకము)—గ్రంథకర్త: శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారు, ప్రకాశకులు: సాహితీ గ్రంథమండలి, పూర్ణానందంపేట, బెజవాడ. వెల ఒకరూపాయి.

అహల్య(నాటకము)—గ్రంథకర్త: మట్టిబోయిన రామసుబ్బయ్యగారు, కడప. పుస్తకములకు గ్రంథకర్తగారికి వ్రాయవలెను:

బ్రహ్మసూత్రములు (త్రిభాష్యలఘు టీకాతాత్పర్య సహితము)— గ్రంథకర్త: భద్రగిరి నంబెరుమాళ్లుగారు, బి. యె; యల్. టి. ప్రకాశకులు: రంగా అండ్ కో ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్, ఏలూరు, ప॥ గోదావరిజిల్లా. వెల, ౦-౮-౦ లు.

పత్రికా స్వీకారము

యువ—మాసపత్రిక. మూడవసంపుటి, మొదటిసంచిక. ప్రతి నెలా ౧౫-వ తేదీని వెలువడుతుంది. సంవత్సరచందా రూపాయిన్నర. విడిపత్రిక రెండణాలు. కావలసినవారు యువకార్యాలయం పేరిట తెనాలికి వ్రాయాలి.

"యువ" ప్రస్తుతపద్ధతిని వెలువడ్డ క్రొత్తరికంలో మనం ఆంధ్రసభాభవనంవద్ద కలుసుకున్నప్పుడు పత్రిక చాలా బాసుం దని నే ననడం జ్ఞాపకం ఉందా, కొడవటిగంటి కుటుంబరావుగారూ! ఆమాటే మళ్లీ అందరూ వినేటట్లు ఇక్కడ అంటున్నాను.

ఔను. ఈ మాసపత్రిక నాకు నచ్చింది. ఇందులో ఇంకెక్కడా లేని అమూల్యరత్నాలు ఉన్నాయనికాదు, పత్రిక సర్వాంగసుందరంగా ఉన్నదనికాదు (నిజానికి ఆకృతిలోను, అంతస్సులోను తీరవలసినవి ఎన్నోలోపాలు ఇందులో లేకపోలేదు. సంపాదకుడు కొడవటిగంటి కుటుంబరా వన్న సంగతి నాకు అట్టవెనుక అడుగుభాగం చూస్తేనేగాని తెలియలేదు.) కాని దీనిని చదువుతూఉంటే ఒకహాయి కలిగింది. చల్లని నీరు తాగితే దాహం తీరినట్లయింది.

తను మనస్సునే దాపరికంలేకుండా ప్రసంగించేవారిని నేను చాలా ఎన్నికచేస్తాను. ఇతరులను ప్రతిధ్వనించడం, సహజత్వాన్ని కప్పిపుచ్చడం, భోజులతో మాయచెయ్యడం ఎవ్వరిలోనూ భరించలేను. "స్వవిషయం"లో సంపాదకుని ఈ స్ఫాటికస్వచ్ఛమైన ఋజుత్వం నన్ను ఆకర్షించింది. అందలి అభిప్రాయా లన్నిటితో నేను ఏకీభవిస్తున్నాననికాదు. ఉదాహరణకు: "కొద్దిమంది రచయితలు సాహిత్యపరిణామం నిర్ణయించే రోజులు గతించిన వని నా నిశ్చితాభిప్రాయం" అని అంటూ డతడు. ఏమో నా అభిప్రాయం అంత "నిశ్చితం"గా లేదు. ఇక పత్రికల చలామణీ గురించి ఇతడు చేసిన "ఎనాలిసిస్" అసమగ్రంగా ఉంది. యువపత్రికమాటనే ఆలోచింపుదాం. ప్రతినెలా ౧౫-వ తేదీని వెలువడుతుందన్న ప్రతిజ్ఞకు నెల్లాళ్లలోనే భంగం కలగడమా? ఇట్టి వ్యాపారంవల్లనే ఎంత మంచిపత్రికలూ అల్లకోవడం కష్ట మవుతూఉంటుంది.

ఇప్పుడు సమీక్ష్యమాణ మవుతున్న సంచికలో వివిధరుచులను సంతృప్తిపరచే రచనలు కనబడుతున్నవి. గుడిపాటి వెంకటాచలంగారి Musings కీనలోనుండి యువలోనికి అతిసహజంగా దాటుకువచ్చాయి. కానిబాల్ కార్నివాల్ అనువాదం సరళంగా, సరసంగా ఉండి, తాము ఆక్రమించిన పేజీలు వ్యర్థంకాలేదని అనిపించుకో దగిఉన్నది. గద్యరచనలలో మల్లాది అవధాని గారి "గంగిగోవుల"కు గౌరవస్థానం ఇవ్వడం సమంజసంగానే ఉన్నది. ఇందలి రచన లన్నింటిలో సులువుగా అది మొదటిస్థానానికి అర్హమవుతున్నది. అయితే మల్లాది అవధాని అత్యుత్తమ రచనలలోకూడా నాకు ఫీట్స్‌కంటె కౌంటర్ ఫీట్సు ఎక్కువగా కానవస్తాయి. ఏదో మారుగొంతుకతో అతడు మాట్లాడుతున్నాడనిపించుతుంది. శేకుమళ్ల కామేశ్వరరావు

గారు ఆంధ్రుండా అనీ, కోయిలా అనీ రెండు కథ నాలు చేశారు. వీటిని ప్రకటించడం చాలా అనవసరమైనపని.

సాహిత్యానికి బజారుఉందని నిరూపించే ఆతుర్దాలో యువపత్రిక బజారుసాహిత్యంగా మారిపోయే ప్రమాదంనుండి తప్పించుకొని తిర గాలని నా హెచ్చరిక. శ్రీ. శ్రీ.

చిత్ర—శ్రీ కే. వి. సుబ్బారావుగారి సంపాదకత్వాన సినీమా పరిశ్రమ అభివృద్ధినిమిత్తం వెల్వడిన ఈ మాసపత్రికారత్నం మొదటి సంపుటం మొదటి సంచిక (జూలై నెలది) మా కార్యస్థానం చేరింది. ఇంగ్లీషులో సరే, పలురంగుల మిరుమిట్లు గొలిపే ఇట్టి మాసపత్రిక లెన్నోవున్నాయి. కాని హిందూస్థాన మంతటిలోనూ ఢిల్లీనుంచి వెలువడే 'చిత్రపట'మను మాసపత్రిక తప్ప యావద్భారత సినీమాకళాభివృద్ధిని గురించి తెలిపేపత్రికే లేకుండేది ఆంధ్రదేశంలో. ఇప్పుడు ఈ తిరంగీ చౌరంగీ చిత్ర ఆలోపాన్ని దీర్చి కళాభిలాషులకు ఆమోదం కూర్చిం దనడంలో సందేహం లేదు. ఒక విధంగా ఇది సినీమా విశ్వరూపం వంటిది. ఆ కాలంలో అర్జునిడికి ఒకేచోట సమస్తవిశ్వాన్నీ చూడగల భాగ్యమబ్బిన లాగే, ఈ కాలంలో ప్రతియాంధ్రుడికీ – ఒక్క యాంధ్రుడే ఏం, చూడగల ప్రతిమానవుడికీ, సమస్త సినీమాప్రపంచాన్ని దర్శించే భాగ్యం కల్గుతుంది. స్వకీయ విషయోద్ఘాటనంతో ప్రధాన డైరెక్టరు లిచ్చిన ఆశీర్వాద వాచక పుష్పాంజలులతో మిగుల రమణీయంగా వుంది చిత్ర. సినీమావిముఖులను సైతమూ సుముఖులచేసి తమపై పుటలు ఆకర్షించుకొంటున్నాయి ఇందులోని చిత్రపటాలూ, విషయాలూను. ఇదేప్రకారం వివిధాలంకారాలను గూర్చుకొని ప్రతి నెలా సర్వాంగసౌష్ఠవంగా ఆంధ్రు లందరిహృదయాలకు ఆనందం సమకూరుస్తూ వుండాలని మా హార్దికాభిలాష. ఈశ్వరు డందుల కనుగ్రహించుగాక. పత్రిక దొరికేచోటు: 1/8 ఆలీవర్ రోడ్, మైలాపూర్, మదరాసు.

గ్రామోద్ధరణ— మాసపత్రిక. రాజమహేంద్రవరమునందలి గ్రామోద్ధరణ కార్యాలయము నుండి వెలువడినది. జూన్ నెల ప్రథమ సంపుటపు ప్రథమ సంచిక మా కందినది. సంపాదకులు రా. సా. గోటేటి జోగిరాజు గారు. సమయానుకూలాలైన వ్యాసాలతో వెలువడింది ఈ పత్రిక. ఇందలి విషయాలన్నీ ప్రత్యేకంగా గ్రామోద్ధరణకు సంబంధించినవైనా సమస్త జనోద్ధరణకును సంబంధించినవి. వ్రాసినవారు ఆయా విషయాల్లో ఆరితేరినవారు, స్వానుభవంతో వ్రాసినవారు. ముందు ముందు ఈ పత్రిక బాగుగ వర్ధిల్లగలదని మా ఆశయము. సంవత్సరం చందా రెండు రూపాయలుమాత్రమే.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.